RNI No. APTEL/2003/12253

# భావ వీణ

తెలుగు సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Telugu Literary, Culture & Language Study

Vol : 16 Issue No. 4 Monthly April 2019 ISSN No. : 2456-4702 Rs. : 15/-

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Approved Journal
No. 42500



## శ్రీ.. శ్రీ..

శ్రీరంగం శ్రీనివాసరావు

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



# BHAVA VEENA (భావ వీణ)

**Journal of Telugu Literary, Culture & Language Study**

(తెలుగు సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 16 - Issue. 4 - April 2019 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



## EDITORIAL BOARD

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

## ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Puttur, Chittor Dist.

## ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Asst. Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Dr. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr.D.ESWARA RAO,** M.A.,
Associate Professor, Dept.of English,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, CIIL, Mysore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**COVER PAGE & PAGE SETTING**

**TENALI PRAKASH**, G.L.S. ENTERPRISES, Guntur. 9494 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar,
Guntur - 522 002. Ph. 9703301698.

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# శ్రీ శ్రీ

## (శ్రీరంగం శ్రీనివాసరావు)

'శ్రీశ్రీ' చూసేందుకు రెండు అక్షరాలైనప్పటికీ చదివితే నరనరాల్లో ఉత్తేజం ఉప్పొంగుతుంది. తెలుగు సాహితీ వినీలాకాశంలో సూర్యచంద్రులవలె ఈ రెండు అక్షరాలు ఎప్పటికీ నిలిచి వెలుగుతూనే ఉంటాయి. ఇరవయ్యో శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి శ్రీశ్రీ. అసలు పేరు శ్రీరంగం శ్రీనివాసరావు అయినప్పటికీ శ్రీశ్రీగా సుప్రసిద్ధుడైనాడు.

అభ్యుదయ కవిత్వానికి చిరునామా శ్రీశ్రీ. కేవలం అభ్యుదయ కవిగానే కాకుండా విప్లవకవిగా, సాంప్రదాయ ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించినవాడిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘస్థాపకుడిగా, సినీపాటల రచయితగా ఇలా చెప్పుకుంటూపోతే ఆయనొక బహుముఖ ప్రజ్ఞాశాలి.

చిన్నవయస్సులోనే "ప్రభవ" అనే కావ్య సంపుటితో తన రచనా వ్యాసాంగాన్ని ప్రారంభించిన శ్రీశ్రీ 'మహాప్రస్థానం' 'మరో ప్రస్థానం' వంటి రచనలతో తెలుగు సాహిత్య గమనాన్ని దశదిశలను మార్చివేసిన ప్రజ్ఞాశాలి శ్రీశ్రీ. సాంప్రదాయ ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించినవాడిగా కనబడిన శ్రీశ్రీ. ఆధునిక సాహిత్యానికి నూతన మార్గాన్ని ఏర్పరచిన మార్గదర్శి. ప్రాసకు, శ్లేషకు శ్రీశ్రీ పెట్టింది పేరు. అల్పాక్షరాలతో అనల్పార్థాన్ని సృష్టించడంలో ఆయనకు సాటి మరొకరు లేరనటంలో అతిశయోక్తి లేదు. "వ్యక్తికి బహువచనం శక్తి" అనేది ఆయన లేఖని నుంచి వెనువడిన మహోత్తర వాక్యమే. "తెలుగువీర లేవరా..." అంటూ తన సినీగీతాల ద్వారా కూడా తెలుగువారిని జాగృతం చేసిన దార్శనికుడు శ్రీశ్రీ.

- సంపాదక వర్గం

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | శారదా అశోకవర్ధన్ నవలలు-ఇతివృత్త వైవిధ్యం | - అల్లు గణేష్ | 6 |
| 2. | గోదావరి నదీ తీరాలలో కోయ జీవన శైలి | - డా॥. బూసి వెంకటస్వామి | 9 |
| 3. | ఉప్పలధడియం కవిత్వంలో "నగర చిత్రీకరణ" | - డి. ప్రమీల | 13 |
| 4. | కాటమరాజు కథలలో - కథనఘటకాలు | - డా. దాసరి విజయకుమారి | 16 |
| 5. | మహావీర చరితం - భవభూతి వర్ణనా వైచిత్రి | - డా॥ దోనేపూడి రామాంజనేయ శర్మ | 20 |
| 6. | పులిముగ్గు - ఒక క్షుద్రవిద్య | - డా. సింగుపురం నారాయణరావు & - డా. సుసర్ల ఇందిర | 24 |
| 7. | హాస్య చరిత్ర | - ఇంద్రకంటి శ్రీనివాస్ | 27 |
| 8. | పెద్దన - మనుచరిత్ర - పర్యావరణ వర్ణన | - డా.. జూారెడ్డి నిర్మల | 30 |
| 9. | తెలుగు సాహిత్య మాస పత్రికలు - సామాజిక సేవ | - డా. జరుపుల రమేష్ | 34 |
| 10. | తెలుగు కథ - శ్రామిక వర్గ ఉద్యమం | - డా॥ కె.వెంకటరమణ | 40 |
| 11. | పత్రికా భాష - నవీకరణ | - డా॥ కె. కరుణశ్రీ | 43 |
| 12. | "మూడో మనిషి కవితా సంపుటి - మాతృ హృదయం" | - యం. ప్రభావతి | 46 |
| 13. | సన్నపురెడ్డి కథల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ కోణాలు | - మల్లెం శివప్రసాద్ | 48 |
| 14. | "యానాది" తెగ-సంస్కృతి-సంప్రదాయాలు | - డా॥ ముడావత్ వెంకటేష్ | 51 |
| 15. | వన రక్షణే - జనరక్షణ (వృక్ష గాథ తాత్త్వికత) | - మూడే నాగేంద్ర నాయక్ | 55 |
| 16. | బోయి భీమన్న వచన కవిత్వం - దళిత దృక్పథం | - డా॥ ఎన్. భీమన్న | 59 |
| 17. | రాసాని కథలు - కళాకారుల జీవితం | - డా॥ పి. జయచంద్రుడు | 62 |
| 18. | అర్నాద్ కథలు - మానవ సంబంధాలు | - డా॥ పప్పుల వెంకటరమణ | 66 |
| 19. | జాతీయోద్యమ సాహిత్యం | - డా॥ పి. విజయకుమార్ | 69 |
| 20. | జాషువా ఆత్మీయతాపతాక గబ్బిలం | - ఎస్. బయారెడ్డి & -డా॥ వి. రవి శంకర్ | 72 |
| 21. | ఆంధ్ర మహాభారతం - వివిధ రాజు పాత్రల విశ్లేషణ | - డా॥ యస్. చిన్నరెడ్డయ్య | 75 |
| 22. | గోరటి వెంకన్న పాటలు - శ్రమ సౌందర్య తత్త్వం | - యం. ఆదిశేషయ్య, | 82 |
| 23. | మహాభారతంలో గాంధారి స్వభావచిత్రణ | - డా॥ గుమ్మనూరు ఉషారాణి | 87 |
| 24. | పాటలో కులవృత్తుల చిత్రీకరణ | - డా. కసప నరేందర్ | 91 |
| 25. | ప్రబంధ సాహిత్యం - చారిత్రక ఆనవాలు | - డా. విస్తాలి శంకరరావు | 101 |
| 26. | తెలుగు సాహిత్యంలో సేద్యం - కర్షకుడు | - జి. సుకన్య | 104 |
| 27. | సమకాలీన తెలుగు నవలలలో 'తాండా' - సామాజిక దృక్పథం | - డా॥ హెచ్. కిషన్ | 109 |
| 28. | గుఱ్ఱం జాషువా "తెరచాటు" నాటకం - సామాజిక దృక్పథం | - డా॥ చుక్కా శ్యామల కుమార్ | 115 |
| 29. | దళిత స్త్రీ - చారిత్రక నేపథ్యం | - కె.వి. పద్మావతి | 118 |
| 30. | మానవ జీవితంలో తెలుగు సామెతలు - సాంఘిక నేపథ్యం | - డా॥ పులపర్తి శ్రీనివాసరావు | 122 |
| 31. | అక్క మహాదేవి వచన ప్రాశస్త్యం | - డా॥. మఠపతి మాంతయ్య | 130 |

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# శారదా అశోకవర్ధన్ నవలలు - ఇతివృత్త వైవిధ్యం

- అల్లు గణేష్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఆంధ్ర విశ్వకళా పరిషత్, విశాఖపట్టణం.

ఆధునిక సాహిత్య రంగంలో శ్రీమతి శారదా అశోక వర్ధన్‌కి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఎందుకంటే, ఆమె నిర్వహించినన్ని సాహిత్య ప్రక్రియలు మరొకరెవరూ నిర్వ హించలేకపోవడమే. కవిత, కథ, కథానిక, నవల, నాటిక, నాటకం, గేయం, నృత్యనాటిక-ఇలా ఎన్నో ప్రక్రియలు నిర్వహించి అద్భుతమైన వైవిద్యాన్ని ప్రదర్శించిన శారదా అశోకవర్ధన్ ఆధునికాంధ్ర కవయిత్రులలో అగ్రగణ్యులు అనడంలో అతిశయోక్తి లేదు. సమాజ గమనం తెలిసి, సమాజాన్ని అవలోకనం చేసుకుని అభ్యుదయ దృక్పథంతో విశ్లేషించే ప్రతిభ ఉన్న రచయిత్రి శారదా అశోకవర్ధన్. ఎనిమిది కథాసంపుటాలు, పది కవితా సంకలనాలు, పదహారు నవలలు, ఏడు నాటకాలు, నాలుగు నృత్య నాటకాలు, రెండు బుర్రకథలు, వైవిద్య ప్రక్రియలతో కూడిన బాలసాహిత్యం, అనేక పత్రికలలో వచ్చిన వ్యాసాలు, పొందిన అవార్డులు శారదా అశోకవర్ధన్ బహుముఖమైన ప్రతిభకు నిదర్శనం. ఈమె ఏ ప్రక్రియ చేపట్టినా సామాజిక స్పృహ తొణికసలాడుతుంది.

### ఇతివృత్త వైవిధ్యం :

నవలా రచనలో కీలకమైన అంశం ఇతివృత్తం. రచయిత నవలారచనకు స్వీకరించే ముడిపదార్థమే ఇతివృత్తం రచనకు కేంద్రం. ఇతివృత్తం నవలా రచయిత-జీవిత సమస్యావగాహన తెలిపే 'బెరామీటరు' వంటిది. కాబట్టి రచయిత రచనా దృక్పథం, సామాజిక సమస్యలపట్ల అవగాహన ఇతివృత్తంలో తప్పక ప్రతిఫలిస్తాయి.

సాధారణంగా ఏ రచయితైనా జీవితాన్ని పరిశీలించడం ద్వారానో లేక వినడంద్వారానో నవలలో ఇతివృత్తానికి అంకురార్పణ చేస్తాడు. రచయిత తాను రాయదలచుకొన్న భావాలకు మనసులో ముందుగానే ఒక నిర్దిష్ట స్వరూపాన్ని ఏర్పరచుకొంటాడు. హైనే (Heine) అన్న రచయిత తన బాధలలోనుంచే పాటలు రాసాడంటారు. అలాగే జీవితంలోని అనుభవాలే సాధారణంగా నవలలకు ఇతివృత్తాలవుతాయి అన్నట్లుగా ఆధునికకాలంలో రచయితలంతా తాము చూసిన, పరిశీలించిన జీవితానుభవాల్ని ఇతివృత్తాలుగా తీసుకోవడం కనిపిస్తుంది.

శారదా అశోకవర్ధన్ నవలల ఇతివృత్త స్వీకారం విషయం గురించి పరిశీలిస్తే రచయిత్రి రాసిన నవలలన్నీ మౌళికంగా సాంఘికనవలలు. అయితే కుటుంబ జీవనం గురించిన అంశాల్ని ఎన్నుకోడంలో కానీ, సమాజ సంబంధమైన అంశాల్ని ఇతివృత్తాలుగా ఎన్నుకోడంలో కానీ తనదంటూ ఓప్రత్యేకత కనబరచారని చెప్పవచ్చు. వీరిది మొట్టమొదటి నవల 'రాగబంధం'. కుటుంబజీవన విషయంలో ప్రేమవివాహాన్ని ఇతివృత్తంగా తీసుకున్నారు. ప్రేమవివాహంవిషయంలో అందరిలా సాధారణ యువతీ యువకుల మధ్య ప్రేమ కాకుండా ఓ పరిణతి చెందిన వయస్కులు, మనసులమధ్య ప్రేమ చిత్రించి, దానికి అనువైనరీతిలో పాత్రచిత్రణ చేశారు. కుటుంబ పరిస్థితులకు అనుగుణంగా తమ ప్రేమ వివాహాన్ని వాయిదా వేసుకున్న తీరును దీనిలో రచయిత్రి చిత్రించారు. ఉమ్మడి కుటుంబాల్లోని మంచిఅంశాల్ని ఇతివృత్తంగా తీసుకొని 'వెన్నెలవాకిళ్ళు' నవల రాశారు. ఉమ్మడి కుటుంబాల్లో కుటుంబసభ్యులమధ్య ప్రేమానురాగాలు, ఆప్యాయతలు ఎలా ఉంటాయో పాఠకసమాజానికి సోదాహరణంగా చిత్రించి చూపారు. నేటికాలంలో ఉమ్మడి కుటుంబాల స్థానంలో వైయక్తిక కుటుంబవిధానం ఎలా వచ్చిందో కూడా తెలియజేశారు. కొంతమంది యువతీ యువకులమధ్య ప్రేమ, వాళ్ళకుటుంబ సభ్యుల సహకారం లేమివల్ల వాళ్ళమధ్య ప్రేమ శాశ్వతంగా ఉన్నా పెళ్ళికి మాత్రం ఎలా ఆటంకాలు సృష్టించబడుతుంటాయో అన్న అంశాన్ని ఇతివృత్తంగా తీసుకొని 'చీకటిగోడలు' నవల రాశారు. పెళ్ళిగురించి నేటి యువతీ

యువకుల ఆలోచనా సరళిని ఇతివృత్తంగా తీసుకొని 'కలవరమాయేమదిలో' అన్న నవల రాశారు. ఈ నవలలోనే కొంతమంది యువతులు పెళ్ళివిషయం వచ్చేసరికి తమ ఆలోచనలకూ, నిర్ణయాలకూ విలువనిచ్చే వ్యక్తులు కనిపించేవరకూ వేచి వుంటారు. ఒకరకంగా అది వాళ్ళ ఆలోచనల్ని సఫలం చేసుకునే అంశమే అయినప్పటికీ అలా వెయిట్ చేయడంలో ఒక్కోసారి వయస్సు మీదపడిపోతుంటుందని రచయిత్రి తెలియజేస్తున్నారు.

సామాజిక జీవితానికి సంబంధించిన ఇతివృత్తాల గురించి పరిశీలిస్తే రచయిత్రికి చాలా ముందుచూపు, మరియూ నిశిత సామాజిక పరిశీలనా లక్షణాలు ఉన్నట్లు కనిపిస్తుంది. గ్రామాభ్యుదయం దాని ద్వారా రాష్ట్రాభి వృద్ధిని ఇతివృత్తంగా తీసుకొని 'లీడర్' నవల రాశారు. ప్రజలచే ఎన్నుకోబడే నాయకుడు ప్రజాసేవ ఎలా చేయాలో ఈ నవలలో చక్కగా తెలియజేశారు. దేశరక్షణలో ప్రాణాలు కోల్పోయిన కొంతమంది వీరజవాన్ల కుటుంబాలు ఎదుర్కొనే ఆర్థిక, సామాజిక సమస్యల్ని ఇతివృత్తంగా తీసుకొని, దానికి కార్గిల్ యుద్ధఘట్టాన్ని జోడించి 'ఉషోదయం' నవల రాశారు. ఈ నవల ద్వారా అటు సమాజానికి, ఇటు ప్రభుత్వానికి ఒక మంచి సలహానిచ్చారని చెప్పవచ్చు. నేటి సినిమారంగంలో జూనియర్ ఆర్టిస్టులు మరియూ నాయికలు ఎదుర్కొంటున్న కొన్ని రకాల సమస్యల్ని ఇతివృత్తంగా తీసుకొని 'జూనియర్ ఆర్టిస్ట్' నవల రాశారు. సినిమా రంగంలో స్త్రీలపై జరిగే లైంగిక, ఆర్థిక దాడులను ఈ నవలలో చిత్రించారు. ఇటీవల సినిమారంగంలో నాయికలు ఎదుర్కొనే కొన్ని రకాల సమస్యలగురించి టీవీలలో కొన్నాళ్ళపాటు చర్చలు జరిగిన విషయం పాఠకలోకమంతా గమనించే ఉంటారు.

స్త్రీలలో దేశాన్ని దేశసంస్కృతినీ, కాలాన్ని బట్టి రాదగిన కొన్ని చైతన్యాంశాల్ని ఇతివృత్తంగా తీసుకొని 'కుంతీపుత్రిక', 'ఆమె జీవితాన్ని జయించింది', 'ఈ జీవితం నాది' నవలలు రాశారు. సమాజంలో ఎక్కడైనా స్త్రీ మగవాడి చేతిలో మోసపోతే ఆ స్త్రీ సమాజంలో 'పురాణకుంతిలా' బతకకూడదని, ధైర్యంగా తలెత్తుకుని తిరగాలని తెలియ జేస్తూ 'కుంతీపుత్రిక' నవల రాశారు. సమాజంలో స్త్రీ తన జీవితంలో తన భవిష్యత్తు గురించి ప్రణాళికలు ఎలా అమలు చేసుకొంటూ జీవితంలో ఉన్నత శిఖరాలు ఎలా అధిరోహించవచ్చోనన్న విషయాన్ని తెలియజేస్తూ "ఆమె జీవితాన్ని జయించింది" నవల రాశారు. కుటుంబ జీవనంలో ముఖ్యంగా వివాహం విషయంలో స్త్రీకి కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలుంటాయని, అలాంటివాటిలో కొన్నింటిని ఇతివృత్తంగా తీసుకొని 'ఈజీవితంనాది' నవల రాశారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, పేదలను పీడించే దోపిడీ విధానాలపై మహిళల వ్యధామయ గాథలను 'స్త్రీ' అనే నవలలో చిత్రించారు. ఈ నవల దూరదర్శన్‌లో ధారావాహికగా రావడం విశేషం.

రచయిత్రి శారదాఅశోకవర్ధన్‌గారు సమాజంలో కొన్ని ప్రత్యేక అంశాల్ని కూడా ఇతివృత్తంగా స్వీకరించి కొన్ని నవలలు రాశారు. సమాజంలో కొంతమంది వ్యక్తులు విపరీత మనస్తత్వంతో ప్రవర్తిస్తుంటారు. మానసికశాస్త్ర వేత్తలు అలాంటి విపరీత ప్రవర్తన కలిగిన మనుషుల మనసుల్ని అధ్యయనం చేసి వాళ్ల ప్రవర్తనలకు తగిన కారణాల్ని తెలుసుకుంటారు. అలాంటి అంశాన్ని ఇతివృత్తంగా తీసుకుని 'మనసుపొరల్లో' అనే నవల రాశారు. చిన్నప్పుడు తాను అనుభవించిన బాధల్ని ఇతరుల్ని హింసించడం ద్వారా ఆనందించే 'పానకాలు' అనే పాత్ర ప్రవర్తన ఈ నవలలో కనిపిస్తుంది. సమాజంలో అరుదుగా కనిపించే అంశం వైద్యులమధ్య కనిపించే వృత్తిపరమైన వైరం. ఇది అన్నిచోట్ల కాకపోయినా కొన్ని చోట్ల కనిపిస్తుంది. పోటీ ఆరోగ్యకరమైన పరిస్థితుల్లో ఉంటే పరవాలేదు. అదే అనారోగ్యపరిస్థితులకు చేరితే పరిణామాలు ఎలాఉంటాయో అనే అంశాన్ని ఇతివృత్తంగా తీసుకొని 'వెన్నెలవేట' నవల రాశారు. ప్రస్తుతం సమాజంలో హాస్పిటళ్ళ మధ్య నడుస్తున్న పోటీ వాతావరణం ఈ నవలలో కనిపిస్తుంది. కొంతమంది వ్యక్తులకు జీవితంలో కొన్ని తీరని సరదాలుంటాయి. ఏదో వయసు మీదబడుతుంది కదా అని వాటిగురించి మర్చిపోరు. సందర్భం వస్తే ఆ కోరికల్ని ఎలాగైనా తీర్చుకోవాలని అనుకుంటారు. దానివల్ల

ఎలాంటి సమస్యలు వస్తాయో ముందు ఆలోచించరు. అనుభవం మీద తెలుసుకుంటారు. అలాంటి అంశాన్ని ఇతివృత్తంగా తీసుకుని 'దోబూచి' నవల రాశారు. సమాజంలో కళకు అంతం లేదు అని ఎంతోమంది పెద్దలు వక్కాణించారు. కానీ కళను నమ్ముకున్న వారి జీవితాలు ఎలా నాశనం అయిపోతున్నాయో, వారి పిల్లల భవిష్యత్ ఎలా తయారవుతుందో అనే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని రచయిత్రి నాట్యకళను ఇతివృత్తంగా తీసుకొని 'గజ్జెఘల్లుమంటుంటే' నవల రాశారు.

## ముగింపు :

సమాజ చిత్రణ, పాత్రపోషణ, నేటి పరిస్థితులకు, వ్యక్తుల మనోభావాలకు దర్పణం పట్టే విధంగా శారదా అశోకవర్ధన్ నవలల్లో ఇతివృత్తాలుంటాయి. ఈమె కుటుంబ జీవనం గురించి ఇతివృత్తాలు తీసుకొన్నా, సమాజ జీవనం గురించిన ఇతివృత్తాలు తీసుకున్నా స్త్రీ చైతన్యం గురించి ఇతివృత్తాలు తీసుకున్నా ఇతర ప్రత్యేక విషయాలపై ఇతివృత్తం తీసుకున్నా తనదంటూ ప్రత్యేక ముద్ర వేసుకొన్నారని పైన పేర్కొన్న నవలల ఇతివృత్తాల్ని పరిశీలిస్తే అర్థమౌతుంది.

ఇద్దరి మనసులు ఉల్లాసంగా ఉన్నాయి. అని చిత్రించడం చూస్తే వాళ్ళిద్దరు చేసే సరదాలు కొంతవరకు మనభారతీయ సంస్కృతీసంప్రదాయాలకు విరుద్ధంగా ఉన్నాయి. ఈ సన్నివేశం తరహా సంఘటనలు మనదేశంలో చాలాచోట్ల జరగుతుంటాయి. ఇవాళ కొంతమంది యువతీయువకులు సమాజంలో నాగరికత పేరుతో ఇలానే ప్రవర్తిస్తున్నారు.

పైన పేర్కొన్న రీతిలో రచయిత్రి కథాకథనంలో సందర్భానుసారంగా చిత్రించిన సన్నివేశాలు మచ్చుక్కు కొన్ని. మరికొన్ని సన్నివేశాల్ని నవలావిమర్శ సందర్భంలో పొందుపర్చడం జరిగింది. ఏది ఏమైనా రచయిత్రి రసవత్తర సన్నివేశాల్ని సృష్టించడంలో మంచి లోకపరిశీలనాసక్తి కనిపిస్తుంది.

## ఆధార గ్రంథాలు:

1) నవల స్వరూప సమాలోచన-మాదిరాజు రంగారావు
2) నవలా శిల్పం-వల్లంపాటి వెంకటసుబ్బయ్య
3) తెలుగు నవల-సామాజిక చైతన్యం-డా॥ పి. సంజీవమ్మ
4) బలివాడ కాంతారావు నవలలు-పరిశీలన-ఆచార్య జి.యోహాన్‌బాబు

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# గోదావరి నదీ తీరాలలో కోయ జీవన శైలి

- డా॥. బూసి వెంకటస్వామి, శాఖాధిపతి, తెలుగు విభాగం, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు, గుంటూరు జిల్లా.

"వేదంలా ఘోషించే గోదావరి
అమరధామంలా శోభిల్లే రాజమహేంద్రి"

అనే పాటలో దక్షిణ గంగగా పేర్కొనబడ్డ గోదావరి ఘోష ఒకవైపు రాజమహేంద్ర వరశోభ మరోవైపు సాక్షాత్కరిస్తున్నాయి. ప్రకృతి శోభ గోదావరికి అందాలనివ్వగా గోదావరి రాజమహేంద్రానికి అందాలనద్దింది. ఎక్కడో పశ్చిమ కనుమలలో నాసికా త్రయంబకంలో ఉదయించి, మహారాష్ట్రలో చాలాదూరం ప్రయాణించి ఆదిలాబాద్ జిల్లా బస్తర్ దగ్గర ఆంధ్రదేశంలో ప్రవేశించిన జీవనది గోదావరి. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, ఉభయ గోదావరి జిల్లాలను పునీతం చేస్తూ కొండల్లో కోనల్లో, రాళ్ళల్లో, రప్పల్లో, క్రీకారణ్యాలను అధిగమించి ప్రవహిస్తూ పరీవాహక ప్రాంతాన్ని సస్య శ్యామలం చేస్తుంది. రాజమహేంద్రవరం దాటాక మూడు పాయలుగా చీలి 'ఆకాశాత్ పతితంతోయం యధాగచ్ఛతి సాగరం' అన్నట్లు బంగాళాఖాతంలో కలుస్తుంది. గోదావరి మూడు శాఖల్లో తొలి శాఖను గౌతమి గోదావరి అంటారు. ఇది యానాం వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. రెండవ శాఖను వశిష్ఠ గోదావరి అంటారు. ఇది నరసాపురం వద్దనున్న అంతర్వేది వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. ఇక మూడవ శాఖను వైనతేయ గోదావరి అంటారు. ఇది కొమరగిరి పట్నం వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. గోదావరి నది మొత్తం పొడవు 1548 కి.మీ. ఆంధ్ర ప్రదేశ్‌లో 770 కి.మీ. ప్రవహిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ భూభాగం వాయువ్యం నుండి ఆగ్నేయానికి ఏటవాలుగా ఉంటుంది. అందువలన నదులన్నీ వాయువ్యం నుండి ఆగ్నేయానికి ప్రవహిస్తుంటాయి. ప్రపంచ నాగరికతలలో ఏ నాగరికతైనా నదీ పరీవాహక ప్రాంతాలలోనే ఉదయించి విస్తరిల్లాయనడం వాస్తవం. అలాగే గోదావరి పరీవాహక ప్రాంతం పలు నాగరిక అనాగరిక జాతులకు జవజీవాలనందించింది. ఒకవైపు నాగరికత నేర్పిన వారికి మరొకవైపు నాగరికతా వాసనలు జీర్ణించుకోలేక తమదైన ప్రత్యేక శైలిలో మనుగడను సాధిస్తున్న పలు కొండ జాతులకు గోదావరి నదీ తీర ప్రాంతం ఆలవాలమయ్యింది. సహజ ప్రకృతి వనరులతో విలసిల్లుతున్న ఈ ప్రాంతం ప్రకృతి కన్నె తన అందాలను ఆరబోసినట్లుంటుంది. ఆ కొండ జాతులలో ముఖ్యులు వాల్మీకులు, కొండరెడ్లు, లంబాడీలు, కోయలు.

### కోయజాతి జీవన విధానం :

కొండజాతుల జీవన విధానం భారతదేశంలో దక్షిణాదినే కన్పిస్తుంది. ఉత్తర భారతంలో ఆ ఛాయలు ఎక్కడా కన్పించవు. గోదావరి నదీ తీర ప్రాంతంలో నివసించే కొండ జాతులలో కోయలు ముఖ్యులు. వీరు ఆ నదీతీర ప్రాంతాలలో స్వేచ్ఛా విహంగాలు. వీరి ముఖ్యవృత్తి వ్యవసాయం. జొన్నలు, రాగులు, సజ్జలు మొదలగు ఆహార పంటలను పండిస్తారు. అటవీ ప్రాంతాలలో ఉన్న సమతల సారవంతమైన భూముల సమీపంలో నివాసాలు ఏర్పరచుకొని జీవనం సాగిస్తుంటారు. వీరు స్థిర నివాసులు కారు వలస పక్షులు. గోదావరి నదీ తీర ప్రాంతానికే వీరి వలస పరిమితమౌతుంది. అడవులలో దొరికే దుంపలు చెన్నగడ్డలు, కందమూలాలు త్రవ్వి ఆహారంగా ఉపయోగిస్తారు. దొగ్గలికూర, గుమురు కూర, తోటకూర, మొడ్డుకూరలను ఆహారంలో కూరగా ఉపయోగిస్తారు. అడవి జంతువులైన లేళ్ళు, దుప్పులు, కణుజులు, కుందేళ్ళ వంటి వాటిని వేటాడతారు. కోయలలో కొన్ని తెగలు మాంసాహారులు. ఒకటి రెండు తెగలు శాఖాహారులు. మొత్తం జనాభా 1991 లెక్కల ప్రకారం 4,56,946. వీరిలో చదువుకున్న వారి శాతం కేవలం 17.83 శాతం మాత్రమే. వీరు త్రాగడానికి నీటిని సొరకాయ బుర్రలలో తీసుకువెళ్తుంటారు. వీరు నృత్య సమయంలో డోలు వాయిస్తూ కొమ్ము ఊదుతూ ఉం

టారు. దానిని బట్టి వారికి డోలీలని, కొమ్ము వారని పిలుస్తారు. భగవద్గీతలో చెప్పినట్లు 'చాతుర్వర్ణం మయాస్పష్టం గుణకర్మ విభాగశః' అనే గీతాకారుని మాటలకు దగ్గరగా వీరిలో కుల వేధాలు కనిపిస్తాయి. భద్రాచల అటవీ ప్రాంతంలో నివసించే కోయ జాతులు మరికొన్ని ఉన్నాయి. వారిలో రాచకోయ, కమర కోయ, అరితికోయ, లింగాద్రికోయ జాతులు ముఖ్యం. వీరి ఆహార విహారాలలో కొంత వ్యత్యాసం కన్పిస్తుంది. లింగాద్రి కోయలు శాఖాహారులు. వీరు ఇతర కోయ జాతులతో ఏ విషయములోను సంబంధము పెట్టుకోరు. రాచ కోయలు గ్రామ పరిపాలకులుగా పనిచేస్తారు. కమర కోయలు వ్యవసాయం చేస్తుంటారు. అరితి కోయలు మంచి పాటగాళ్ళు. మంచి సంప్రదాయ వాదులు కూడా. వీరు పురాణ గాధలను గానం చేస్తుంటారు. వీరు తమను తాము గౌరవించుకోవడమెలాగో తెలిసినవాళ్ళు. కోయ దొరలని (దొరల సత్తం) పుట్టదొరలని నిజమైన ప్రభువలవలే పిలుచుకుంటారు. వీరిని మాండలికములో కైతూర్ అని పిలుస్తారు. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, తూర్పుగోదావరులలో నివసిస్తున్న కొన్ని కోయ జాతులు తమ మాతృభాష కోయను వదిలేసి తెలుగుభాషను మాతృభాషగా చేసుకొన్నారు. ఖమ్మం జిల్లాలోని భద్రాచల ప్రాంతంలోనూ, పశ్చిమ గోదావరి లోని పోలవరం ప్రాంతంలోనూ ఉన్న కోయలు వారి స్వభావ కోయభాషనే మాట్లాడతారు. ఈ భాషను వారు చెట్టు భాష, గాలి భాష అని వ్యవహరిస్తుంటారు.

**ఆచార వ్యవహారములు :**

వీరిలో పెళ్ళి వ్యవహారాలు చాలా విచిత్రంగా ఉంటాయి. ఆడా, మగా, చిన్నా, పెద్దా అందరు సంతలకు వెళ్తారు. ఆ దారిలోనే ప్రేమాయణం మొదలవుతుంది. నచ్చిన పిల్లను ఎత్తుకుపోవడం వీరిలో తప్పు కాదు. తర్వాత కులపెద్దలు చేరి వారికి వివాహము చేస్తారు. ఆటవిక తెగలలో ఒక తెగవారు మరొక తెగవారిని వివాహము చేసుకోవడముంది. మేనమామ బిడ్డలను వివాహమాడే ఆచారం వీరిలో కన్పిస్తుంది. వీరిలో వివాహాలు నాలుగు విధాలుగా జరుగుతాయి. 1. ప్రేమించిన వారితో లేచిపోవడం, 2. ఇష్టపడిన యువతిని ఎత్తుకుపోవడం, 3. తల్లిదండ్రుల ఇష్టంతో జరిగే వివాహాలు, 4. పట్టింపులేని వివాహాలు.

ఏకపత్నీ వ్రతం అమలులో ఉన్న బహుభార్యత్వం అంగీకార యోగ్యమే. కోయ యువతులు స్త్రీ, పురుషులను అనుసరిస్తూ అన్ని పనులలో సహాయకారులుగా ఉంటారు. వారు కష్టించి పనిచేసి కుటుంబ ఆర్థిక పరిస్థితి గతులకు ఆధారంగా నిలుస్తారు. సంప్రదాయమైన ఆచార వ్యవహారాలను కాపాడటానికి కుల పంచాయితీలుంటాయి. దీని పెద్దను 'పోయీ' అని పిలుస్తారు. అతనికి సహాయకునిగా ఉండే వానిని పినపెద్ద అని వ్యవహరిస్తారు. వీరిద్దరికీ తోడుగా వ్యవహారాలను నడపటానికి వ్యాపారి అనేవాడొకడుంటాడు. వీరు ముగ్గురూ విడాకుల విషయంలోనూ, కుల వివాదాల విషయంలోనూ, తెగల మధ్య ఎటువంటి గొడవలు వచ్చినా సర్దుబాటు చేస్తుంటారు. వివాహాలను, పండుగలను జరిపించడంలో వీరికి అధిక ప్రాధాన్యత ఉంటుంది. వీరిలో కట్నం ఆచారం ఉంది. అది కన్యాశుల్కంలాగా అన్పిస్తుంది. ఆడపిల్ల తరుపు వారికి ఓలీ ఇవ్వడం వీరి ఆచారం. ఓలీగా గాడిదలను, పందులను ఇస్తారు. వీరు సంచార జీవులు కాబట్టి వారి సామానులు మోయడానికి గాడిదలను, ఆహారంగా వినియోగించుకోవడానికి పందులను పెంచుతుంటారు. వీరిలో విడాకులు పొందడం చాలా తేలిక. తమకు ఇష్టం లేనపుడు గూడెం నాయకుల వద్ద తగువు పెట్టుకుంటే సరి. విడాకులు వచ్చినట్లే. ఆ పెద్దే దంపతుల ఇరువురకు తప్పు చేసి విడాకులు ఇప్పిస్తాడు. తప్పుగా ధనాన్ని, సారాయిని, ఆ దంపతుల దగ్గరనుండి వసూలు చేసి గూడెం పెద్దలందరూ మజా చేసుకొంటారు. ఆ తరువాత దంపతులిద్దరూ వారి వారికిష్టమైన వారిని తిరిగి వివాహం చేసుకొంటారు. వీరిలో వ్యభిచారం తప్పు కాదు. అందుకని ఈ జాతిలో అత్యాచారాలు, హత్యాచారాలుండవు. వీరి దృష్టిలో రాత్రి సంభోగము లేదు. దానిని వారు శవసంభోగముగా భావిస్తారు. పెళ్ళి విషయాన్ని

వీరు ఒక సంబరముగా భావిస్తారు. విందులు, వినోదాలు అధిక ప్రాధాన్యతను సంతరించుకొంటాయి. పెళ్ళి కొడుకు ఇంట్లోనే వివాహము జరుగుతుంది. పెళ్ళి ఖర్చు అంతటినీ పెళ్ళి కుమారుడే భరించాలి. విందుతోపాటు మందు ఈ రెండిటితోపాటు వినోదము తప్పనిసరి. వివాహ విషయంలో పూర్వకాలములో ఒక విధాన ముండేదట. యుక్త వయసు వచ్చిన ఆడపిల్లలు వారి చేతి గాజులను, ఏదో ఒక వస్త్రాన్ని రాశిగా పోసేవారు. యువకులు తమకు ఇష్టమైన దానిని తెచ్చుకునేవారు. ఆ వస్తువు ఏ యువతిదైతే ఆ యువతి ఆ యువకుణ్ణి వివాహం చేసుకోవాలి. ఇతర తెగలతో వివాహాలు వీరిలో తక్కువే. ఒకవేళ జరిగినా వారిని మరల వారిలో కలుపు కొనేవారు కాదు.

## కోయల ఆధ్యాత్మిక భావనలు, పండుగలు :

కోయల దేవత కొండమ్మ. నాలుగు పుల్లలను నిలబెట్టి పైన నాలుగు పుల్లలను పరచి వాటి క్రింద కొండ దేవత కొండమ్మను నిలబెట్టి సంబరాలు చేస్తుంటారు. వీరి దైవంగా భీయుని, కొర్రరాజులను, మమిలిని, పోతరాజు లను పూజిస్తారు. వీరి పండుగలు దేవతా కొలుపులతో ముడిపడి ఉంటాయి. ఏ పండుగలోనైనా జంతుబలి తప్పనిసరి. వీరి పండుగలలో ముఖ్యమైనది 'భూమి పండుగ'. దీనిని వారు విజ్జి పండుగ అని వ్యవహరిస్తారు. ఈ పండుగ కాలములో కోయ మహిళలు పాటలు పాడుతూ ప్రయాణికుల వద్ద నుండి కానుకలను గ్రహిస్తారు. ఒక మాటలో చెప్పాలంటే రహదారులలో కాపుకాసి ప్రయాణికులపై పడి డబ్బు దండుకుంటారు. అలా ప్రయాణికులపై పడి డబ్బు దండుకోవడం వారికి ఒక సరదా. వీరు పాడే పాటలలో 'రేలా' పదం చోటుచేసుకొంటుంది. ఈ పదం శృంగారపరమైన అర్థాని స్తుంది. దీనిని వారు ఒక కథను చెపుతారు. భారతంలో భీముడు అడవులలో హిడింబితో ప్రేమాయణం సాగించినప్పుడు ఆ రాసక్రీడలను చూసిన కోయ యువతులు శృంగార పరిహాసమాడేటప్పుడు రేలా పదమును ఉపయోగిస్తుంటారు. ఇది వారి మాండలిక పరిభాషలో రతికార్యము తాలూకూ కవ్వింపు బూతు మాట. వీరు చేసే పండుగలలో మరొకటి కొండ దేవతల అనుగ్రహము కోసం చేసే పండుగ. మత విధానములో వీరికి స్పష్టమైన భావనలు లేవు. వీరి ముఖ్య జాతరలలో సమ్మక్క, సారాలమ్మ జాతర అతి వైభవంగా జరుగు తుంది. ఇది రెండు సంవత్సరములకొకసారి వచ్చే పండుగ. మాఘపౌర్ణమి రోజున ఈ జాతర ఆరంభ మవుతుంది. దీనినే మేడారం జాతర అని కూడా పిలుస్తారు. పూర్వము ఆటవిక జాతికే పరిమితమైన ఈ పండుగ ప్రస్తుతము నాగరికులకు కూడా విశేషమైన పండుగగా మారింది. ఈ పండుగ దినాలలో మేడారం ప్రాంతము జన సముద్రమే అవుతుంది.

## నృత్యాలు :

వీరు చేసే నృత్యాలలో వాయిద్యాలుగా డప్పు, ఫ్లూట్లు ఉంటాయి. తలపై కొందరు కొమ్ములు కట్టుకుంటారు. దీనిలో ఆడ, మగా కలిపి 20 మంది వరకు పాల్గొంటారు. తలకు కొమ్ములు మెడలో రంగు పూసలు వేసుకొని కోడి ఈకలను, నెమలి పించాలను ధరించి డోల్ వాయిస్తూ నృత్యం చేస్తారు. ఇలాంటి సంస్కృతి ఆఫ్రికా దేశాలలో కన్పిస్తుంది. ఇక్కడ మరొక ఆలోచన కూడా మనకు స్ఫురిస్తుంది. భౌగోళిక పరిస్థితులలో వచ్చిన మార్పుల వలన దక్షిణ భారతదేశం, శ్రీలంక ప్రాంతాలు ఆఫ్రికా దేశ భౌగోళిక స్థితిగతులనుండి విడివడి భారతదేశంలో కలిసిందేమోనని అన్పిస్తుంది. రంగులోనూ, ఆచార వ్యవహారాలలోనూ, ఆలోచనలోనూ ఆఫ్రికన్‌లకు మనకు దగ్గర పోలిక కనిపించడమే దీనికి ఒక ఉదాహరణ. ఈ నృత్యములో జంతువులు ఎలా వేటాడతాయో ఇతర జంతువుల నుండి తమను తాము ఎలా కాపాడు కుంటాయో కళ్ళకు కట్టినట్లు చూపెడతారు. మగవారు డోలు, డప్పు, ఫ్లూటు వాయిస్తుంటే ఆడవారు వలయ కారంగా తిరుగుతూ లయానుగుణంగా నాట్యం చేస్తారు. సహజమైన దుస్తులతో వీరు ఈ నాట్యములో పాల్గొం టారు. వీరు చేసే మరొక నృత్యం 'ధింసా' ఇందులో ఆడా, మగా ఒకరి నడుము ఒకరు పట్టుకొని

వలయాకారములో నిల్చొని లయానుగుణముగా అడుగులు వేస్తూ ముందుకు వెనుకకూ నడుస్తూ ఒకరు పట్టుకొని జట్లు జట్లుగా రకరకాల విన్యాసాలు చేస్తూ ఆనందిస్తారు. ఇది వారిలోని సమైక్యతకు నిదర్శనం.

వీరి సంస్కృతిలో అన్ని విషయాలలోనూ విందులు, మందులు సర్వసాధారణం. చనిపోయిన వారిని వీరు దహనం చేయడం, పూడ్చిపెట్టడం కూడా చేస్తారు. కోయజాతివారిలో ఈ విధానం చాలా విచిత్రంగా ఉంటుంది. ఒక కోయ చనిపోతే ఎద్దులు బలిస్తారు. ఆ ఎద్దు తోకను కత్తిరించి చనిపోయిన వ్యక్తి చేతిలో పెడతారు. ఆ ఎద్దు గుండెను అతని నోట్లో ఉంచుతారు. ధనవంతులైతే డబ్బును కూడా పెడతారు. ఖననం చేసిన ప్రాంతంలో గుర్తుగా ఒక కర్రను పాతుతారు. ప్రస్తుత పరిస్థితులలో వారిలో కూడా విపరీతమైన మార్పులు చేసుకొన్నాయి. నాగరిక సమాజంలో వారు కలిసిపోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఎక్కడెక్కడో ఉన్న కోయ గూడాలలో పాఠశాలలు వెలుస్తున్నాయి. ప్రభుత్వము కూడా వారి అభివృద్ధికి దోహదపడే పథకాలను అమలు పరుస్తోంది. ఏదేమైనా భిన్న సంస్కృతుల నిలయం భారతదేశం అనడానికి వీరి జీవనశైలి ఒక ఉదాహరణ.

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# ఉప్పలధడియం కవిత్వంలో "నగర చిత్రీకరణ"

**- డి. ప్రమీల,** పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగం, ప్రెసిడెన్సీ కళాశాల (రాజధాని), చెన్నై, తమిళనాడు.

గత మూడు దశాబ్దాలుగా తమిళనాడులో ఉంటూ తెలుగుభాషౌన్నత్యానికి సదా కృషిచేసే ఉప్పలధడియం వెంకటేశ్వర కవిత్వం గురించి చెప్పేముందు అతని గురించి తెలుసుకోవాలి. . తన 16వ ఏట నుండే కవిత్వ వ్యవసాయంలో ఉన్న కవి. ప్రముఖ కథా రచయిత పులికంటి కృష్ణారెడ్డి ఉప్పలదడియం వేంకటేశ్వర గురించి చెబుతూ "ఒక సంస్కారయుతుడైన మానవతావాది. అంతకుమించి ఆశావాది. అకారణంగా అతని కవిత్వంలో వాదాలకు, నినాదాలకు, ఇజాలకు తావులేదు. అలం కారిక ఆర్భాటాలకు, అవ్యక్త అభివ్యక్తులకు దూరంగా ఉంటూ సూటిగా అర్థాటిగా క్లుప్తంగా అనలదీప్తంగా కవిత్వం చెప్పాలనే తపన ఉన్నవాడు" అని అంటాడు.

అనేక సంవత్సరాలుగా చెన్నై (మదరాసు) నగరం లో ఉన్న వెంకటేశ్వర ఆ నగర జీవితంలోని అన్ని పార్శ్వాలనూ స్పృశించారు. వీటిలో వచన కవిత, పద్యకవిత, ముత్యాల సరాలు, పాటలు, గేయాలు, హైకులు, నానీలు, కూన లమ్మ పదాలు, దీర్ఘ కవితలు, మినీ కవితలు అనే ప్రక్రియ లతో కొన్ని సంకలనాలు వచ్చాయి. వాటిలో పాఠం కవితా సంకలనంలోని 'నగర' జీవితాన్ని తెలుసుకుందాం. ఈ కవితా సంపుటిలో నగరాన్ని అన్నికోణాల్లోనూ దర్శించి వర్ణించారు.

"నిర్ణిద్ర నగరం" అనే శీర్షికతో రాసిన కవితలో ఇలా అంటారు.

"ధారావాహికలో
లయిస్తూ
క్రీడావీక్షణంలో
తరిస్తూజి
వరుస ఆవలింతలుగా
నిద్రకు వాయిదా"

నగర జీవితంలో అందరూ ఆలస్యంగా పడుకుని ఆలస్యంగా నిద్రలేచే వారే! మరునాడు ఎన్నో పనులు ఉన్నా.. "సీరియల్స్" చూడడం మానరు. "క్రికెట్" అంటూ ఆవలిస్తూ... చూస్తూ ఉంటారు.

"భళ్ళున తెల్లారిపోతుంది
పాలప్యాకెట్టు ఒలికినట్టు"

అనడంలో ఎప్పుడు పడుకుంటామో తెలీదు. ఎప్పుడు తెల్లారుతుందో తెలీదు అన్న భావన ఉంది.

"ఒంటరి నగరానికి
ఒంటికంటి నిద్రే
ఆమాటకొస్తే
మెలకువ కూడా ఒట్టి పర్రే!"

అనడంలో సరిగా నిద్రపోని నగర జనులు అని చెప్పడం. మెలకువను పఱ్ఱతో పోలుస్తున్నాడు కవి. పఱ్ఱ అంటే చవిటి భూములు. ఏమీ పండనివి అని అర్థం. మెలకువ కూడా అలాంటిదే అని వ్యంగ్యంగా చెప్పడం.

"నగరంపై ప్రేమగీతం" అన్న కవితలో

"నానాజాతి గోత్రికుల్నీ
అక్కున చేర్చుకునే
అవ్యాజ ప్రేమకు ప్రతిరూపం
ఈ మహానగరం" అంటారు.

చుట్టుపక్కల ఎన్నో పల్లెలనుండి జనం పొట్టచేత బట్టుకుని వలస వస్తూ ఉంటారు చెన్నై మహానగరానికి. అందరినీ అక్కున జేర్చుకుని ఎవరికి తగ్గ జీవనాన్ని వారికి ప్రసాదిస్తుంది. రోజుకూలీ అయినా, వెయ్యిరూపాయల జీతగాడైనా, లక్షాధికారైనా, కోటీశ్వరుడైనా... ఏమాత్రం బేధం అనేది లేకుండా... కన్న తల్లిలా అక్కున జేర్చు కుంటుంది.

"ఒక స్వప్నంలోకీ
ఒకానొక స్మృతిలోకీ

ఏకకాలంలో మేల్కొలిపే ఇంద్రజాలం
ఈ మహానగరం" అంటాడు.

మనిషి కలలను కనడం ఎంత సహజమో, స్మృతులను అనుభూతులనూ నెమరువేసుకోవడం కూడా అంతే సహజం. జీవితంలో ఒక దశదాటాక అన్నీ స్మృతులే! కొన్ని బాధను కలిగించేవి. కొన్ని బోధను కలిగించేవి. ఇవన్నీ ఏక కాలంలో ఏదో సాధించగలమన్నా నమ్మకాన్ని బాధల తాలూకు గాయాలను ఒకేసారి హరివిల్లులా సాక్షాత్కరింప జేస్తుంది ఈ మహానగరం అంటాడు.

"నగరంలో నేను" అన్న మరో కవితలో కవి
"ఈకొసనుంచీ ఆ కొసదాకా
అన్ని దారుల్తో అనుబంధం కదా
నగరం నాదనుకుంటాను"

అనేక సంవత్సరాలుగా నగరంతో అనుబంధం చెప్తూ...
"అయినా
అడుగు బయట పెట్టగానే
అపరిచిత పార్శ్వాలతో
హడలగొడుతుంది నగరం" అంటాడు.

వీధులు, గోడలు, గొందులు అన్ని సుపరిచితాలే! రోజూ చూస్తున్న, రోజూ మాట్లాడుతున్న మనుష్యులే, అపరిచిత పార్శ్వాలు. నగరంలో ఎవరికివారే యమునాతీరే రీతిలో ఉంటుందని చెప్పడం గమనించదగ్గ విశేషం.

అందుకే చివరగా ఇలా అంటాడు
"నాలో
అణువణువునా
అల్లుకున్న నగరం కదా
మరి ఇన్నిపొరలు
ఎప్పుడు ఏర్పడ్డాయోనని
ఆశ్చర్యపోతాను"

అనడంలో తనకు తెలీకుండానే తాను పరిచితులకు అపరిచితుడిని అయిపోతున్న భావన ఉంది. అందుకే "అనుకోవడంవేరు...అనుభవం వేరుకదా" అని ముగిస్తాడు.

"వర్షంలో నగరం" కవితలో
"బంగాళాఖాతం
పాయలై పారుతున్నట్టు
వీధులన్నీ జలమయం!"
"వానరాదా!
ఈ ఉక్కబోతనుంచీ
ఒకింత ఉపశమన మీద
అనితపించిన వాళ్ళే తీరా
నాలుగు చినుకులు రాలేసరికి
శాపనార్థాలు పెడుతున్నారు."
మట్టినీ, చెట్టునీ
మింగేసిన మహానగరం"

ఎంత ఎండైనా భరిస్తారు కానీ ఒక్క చుక్క చినుకు పడితే చాలు. జనం విల విలలాడిపోతారు. ఉక్కపోత భరించలేక వానపడితే బావుండు అని అనుకున్నవాళ్ళు సైతం తిట్లు లంఘించుకుంటారు. హోర్డింగులు పడిపోతూ..చెట్లు నేలరాలుతూ..ఇటు చెట్లనూ..అటు మట్టినీ మాయం చేసే నగరంగా అభివర్ణిస్తున్నాడు కవి.

చివరిగా "మెరీనా" కవిత గురించి చెప్పి ముగిస్తాను.
"పోతపోసిన పుత్తడిలా
మెరుస్తుంది కడలిగట్టు
నింగిని కొలిచే పిట్టల గుంపుల్లా
ఎటుచూస్తే అటు కేరింతల పిల్లలు
తెలి మబ్బు తునకల్లా
ఎగురుతాయి గాలిపటాలు
చేరువనిపించే దూరంలో
కదిలీ కదలని పడవ
సాయంత్రాన్ని రాత్రిగా మార్చుతుంటే
స్థలకాలాల స్పృహలేని
మహా సౌందర్యంలో లీనమైపోతాను"

ఎంత సుందరమైన కవిత. సాగర సౌందర్యాన్ని సదా గుర్తుండిపోయే సాధికారిత కవిత ఇది. నగర వైభవాన్ని ఎంత శోభాయమానంగా వర్ణించాడో అంతే సౌందర్యంతో కడలిని వర్ణించాడు కవి. నేడు నగర జీవితం వేగమయం.

ఉపాధికోసం పరుగులు తీస్తూ, కాలుష్యంతో ఆరోగ్యాన్ని పాడు చేస్తూ, జనాభా పెరుగుదలతో, అనేక సమస్యలు సృష్టిస్తూ, ప్రతినిత్యం సామాన్య జీవికి సవాలుగా మారుతోంది. ఈ సామాన్య జీవితాన్ని కవితగా చిత్రించడంలో ఉప్పలదడియం వారు సాఫల్యత సాధించారు. పోతపోసిన పుత్తడిలా మెరుస్తోందట కడలి. ఏదైనా మన చూపులోనే ఉంటుంది. తెలిమబ్బు తునకల్లా గాలిపటాలు ఎగురుతున్నాయి అంటున్నాడు. తెల్లని నిర్మలమైన మబ్బు తునకల్లా ఉన్న గాలిపటాల సందడిని చెప్తున్నాడు. సాయంత్రం రాత్రిగా మారిపోతుంటే అసలేమీ పట్టనట్టు కూర్చుని కడలి సౌందర్యాన్ని కన్నులారా తిలకించే వీక్షకులను వర్ణిస్తున్నాడు కవి.

**ముగింపు :**

పై నగర చిత్రణ కవితలు గమనిస్తే... కవితల్లోని పదాల పోహళింపు కేవలం లయముద్రలతో మాత్రమే మన నాడీమండలం మీద దాడిచేయదు. ఒక ప్రియ వాక్యంలా మన ఆంతర్యంలోకి చేరుతుంది. మన వివేచనను మేల్కొల్పుతుంది. అవగాహన అన్న మనోఫలకంపై వివిధ ఇంద్రియ అనుభూతులకు సంబంధించిన సమన్వయ చిత్రాల్ని రూపొందించుకుంటూ.. ఒక్కోసారి 'మాచింగ్' వల్లా ఇంకోసారి 'కాంట్రాస్ట్' వల్లా కవిత్వం హృదయంలో నెలకొల్పవలసిన సమ్మోహనత్వాన్ని తప్పని సరిగా పాదుకొలుపు తుంది అదే వేంకటేశ్వర కవితలోని ప్రత్యేకత.

**ఆధార గ్రంథాలు:**

1. సాహిత్యంలో వస్తు శిల్పాలు - త్రిపురనేని మధుసూదన రావు
2. అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు - పేర్వారు జగన్నాథం

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# కాటమరాజు కథలలో - కథనఘటకాలు

- డా॥. దాసరి విజయకుమారి, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, కేంద్రీయవిశ్వవిద్యాలయం, హైదరాబాదు.

**కథనఘటకం :**

కథముందుకు నడవడానికి తోడ్పడే అంశాన్ని కథన ఘటకం అంటారు. కథన ఘటకాన్ని ఆంగ్లంలో Motif అంటారు. దీన్నే కొంతమంది 'కథనచోదకం' అని కూడా అంటారు. కన్నడంలో 'ఆశయ', 'ప్రేరక', కథన ఘటక అని పిలుస్తారు. Motif అనగా The Smallest element in a tale having the power to persirt in oral tradition అని Stith Thampson నిర్వచించారు. Motifను మూలాంశం అని కూడా చెప్పవచ్చు. (మోహన్ జియస్ - 2010, 94)

Motif కథావస్తువుని తెలియజేస్తుంది. సామాన్య విషయాలు కథన ఘటకాలుకానేరవు. జానపదకథల్లోను, కథాగేయాల్లోనేకాక, రామాయణం, మహాభారతం, భాగవతాలలో కూడా కథన ఘటకాలను గుర్తించవచ్చు.

కాటమరాజు కథలలో అనేక కథన ఘటకాలున్నాయి. వాటిని పరిశీలించినపుడు ఆ సంఘటన జరిగి ఉండక పోతే కథ వేరుగా ఉండేదేమో అనే భావన కలుగుతుంది. ఆయా సంఘటనలవల్ల కథ ముందుకు సాగిందని చెప్ప వచ్చు. వాటిని ఆధారంగానే కాటమరాజు కథలు ప్రాచుర్యం పొందాయి. అవి ఈ వ్యాసంలో పరిశీలించ బడ్డాయి.

కాటమరాజు కథలోని కథన ఘటకాలు (1) బసవన్న పూజలు (2) బ్రాహ్మణుల జోస్యము (3) పెంపుడు చిలుక (4) గంగ (5) దేవతాబొంగరాలు (6) శకునములు (7) సహగమనం (8) సంతాన ప్రాప్తికి దేవుడు ప్రత్యక్షమై ఒక పండు ఇవ్వడం.

**1. బసవన్న పూజలు :**

ఆవుల వలురాజు వల్లమ్మలకు కొమరక్క అనే కూతురు, పెద్దిరాజు, సింహాద్రిరాజు, యరనూకరాజు, నలనూకరాజు, పోలురాజు అనే ఐదుగురు కుమారులు కలరు. పెద్దిరాజు భార్య పెద్దమ్మ. సింహాద్రిరాజు భార్య సింహాద్రిసీత. యరనూకరాజు భార్య యరనూకసీత. నలనూకరాజు భార్య నలనూకసీత. పోలురాజు భార్య సింహాద్రిసీత. ఈ కథలో యాదవకాంతలందరు బసవన్నను పూజిస్తారు. పెద్దమ్మ బసవన్నను ఈ క్రింది విధంగా పూజిస్తుంది.

పెద్దమ్మ ఈ విధమున ప్రియము తోడుతను
హద్దుగా బసవన్నకు హరతులు పాడి
నెగడి హస్తముల నివాళిపట్టంగ
బేగడంపు దేవుడు పెద్దమ్మను చూడక
పగవాని వలె పరముఖమాయె
.....................................
.....................................
పాపసంహరుడు పరముఖమాయె
పాలు నెయ్యి పెరుగు బసవన్నకు పెట్టగా
కాలకంధరుండు కన్నులు మూసె

**- సుబ్బారావు టి.వి 1976, 110-111**

అపుడు బసవన్న సంతానం లేని పెద్దమ్మ పూజను తిరస్కరిస్తాడు. అపుడు పెద్దమ్మ ఎంతగానో దుఃఖించి నిద్రిస్తుంది. ఆమెకు కల్యాణ సోమేశరుడు కలలో కనిపించి, కల్యాణ నగరానికి వచ్చి తనను పూజిస్తే సంతానం కలుగుతుందని చెబుతాడు. ఆవిధంగా పెద్దమ్మ సంతాన కాంక్షతో కల్యాణ నగరానికి వెళ్లి, అక్కడ కల్యాణ సోమేశ్వరుణ్ణి పూజించి సంతానం పొందుతుంది. ఆ తరువాత ఆర్లపెంట రణంలో పెద్దిరాజు మరణిస్తాడు. పెద్దమ్మ సహగమనం చేస్తుంది. ఇక్కడ పెద్దమ్మ పూజను బసవన్న తిరస్కరించకపోతే కథ వేరుగా ఉండేది.

**2. బ్రాహ్మణులజ్యోస్యము :**

పెద్దిరాజు, పెద్దమ్మలకు కాటమరాజు అనే కుమారుడు, పాపనూక అనే కుమార్తె జన్మిస్తారు. పెద్దమ్మ సహ

గమనం చేస్తూ వారిరువురిని సిరిదేవికి అప్పగిస్తుంది. సిరిదేవి, పాపనూకకు యుక్త వయస్సు వచ్చిన తరువాత వివాహం చేయాలని నిర్ణయించుకుంటుంది. అపుడు సిరిదేవి బ్రాహ్మణులను పిలిపించి పాపనూక గురించి అడుగుతుంది. అపుడా బ్రాహ్మణులు పాపనూక ఇల్లు వదలి వెళితే సిరిసంపదలు పోతాయని, నాచకూళ్ల నాయునికి, పాపనూకకు వివాహం కుదురుతుందని చెబుతారు. నాచకూళ్ళ నాయుని ఇల్లరిక ముంచమని కొమరక్క నడుగుతుంది. కొమరక్క అందుకు అంగీక రించదు. అపుడు బ్రాహ్మణులు వయసొచ్చిన ఆడపిల్లలు ఇంటిలో ఉండరాదని వేరే మేడలో పెట్టించమని చెబుతారు. ఆ విధంగా సిరిదేవి పాపనూకను ఒంటి స్తంభపు మేడ కట్టించి, అందులో ఉంచుతుంది. బ్రాహ్మ ణులు ఈవిధంగా జోస్యం చెప్పకపోతే, పాపనూక గురించి కథ వేరుగా ఉండేది. ఈ విధంగా పాపనూక జీవితమంతా ఒంటిస్తంభం మేడలోనే కడతేరుతుంది.

### 3. పెంపుడు చిలుక :

కాటమరాజు నల్లసిద్ధిరాజు పుల్లరి ఒడంబడిక చేసు కుంటారు. నల్లసిద్ధిరాజు రాజ్యంలోని భూములలో ఆవు లను మేపుకున్నందుకు బదులుగా కాటమరాజు ఆవులకు పుట్టిన లేగదూడలను నల్లసిద్ధిరాజుకి ఇవ్వాలి. కుందమా దేవి నల్లసిద్ధిరాజు రెండవభార్య. ఆమె ఒక చిలుకను పెంచుకుంటుంది. ఆమె ఆ చిలుకను కాటమరాజు ఆవుల మందపైకి వదులుతుంది.

చెలగియా కౌలావులు మెరునడియుండగాను
ఆమ్రమద్య దుందు ఆ చిలుక నిలచి
కాకిపలుకులు చిలుక గుబ్బటీలు గూసెను
గువ్వపలుకులకు ధేన్వలు కల్లుగా చెదరెను

**- సుబ్బారావు టి.వి. 1976, 138**

ఆ పెంపుడు చిలుక వింత శబ్దాలను చేస్తూ కాటమ రాజు ఆవుల మందను చెదర గొడుతుంది. ఆవులు బెదరి లేగలను తొక్కుతాయి. అపుడా లేగ దూడలు మరణి స్తాయి. ఆ కోపంతో కాటమరాజు చిలుకను చంపిస్తాడు. దానికి ప్రతీకారంగా కుందమాదేవి ఆవులను చంపిస్తుంది. నల్లసిద్ధిరాజే తన ఆవులను చంపించాడని కాటమరాజు పుల్లరి కట్టడం మానేస్తాడు పర్యవసానంగా యుద్ధం జరుగుతుంది. ఇలా కాటమరాజు, నల్లసిద్ధిరాజుల మధ్య యుద్ధానికి పెంపుడు చిలుక కారణమవుతుంది. కుందమాదేవి పెంపుడు చిలుకను ఆవుల మందపైకి వదలకుండ ఉంటే కథ వేరుగా ఉండేది.

### 4. గంగ :

పెద్దమ్మ అగుమంచి మొదలైన స్త్రీలకు గంగ కలలో కనిపించి వారి భర్తలు యుద్ధంలో మరణించినట్లు చెబు తుంది.

కాటమరాజు, భట్టావులరాజు మొదలైనవారు, వారి తండ్రులు ఆర్లపెంట రణంలో మరణించినపుడు కళేబరా లను తీసుకురావడానికి యుద్ధరంగానికి వెళతారు. అపుడా యుద్ధభూమిలో గంగ వాళ్ళ తండ్రుల శవాలను గుర్తించి చూపిస్తుంది. పెద్దమ్మకు కలలో గంగ కన్పించి కొన్ని వివరాలను చెప్పినపుడు ఆమె ఆ కల గురించి కల్యాణ నగరంలోని స్త్రీలకు చెబుతుంది. అపుడు వారు ఆమెకు ఆ కలనుబట్టి జరగబోయే సంఘటనలు చెబుతారు.

అలాగే అగుమంచికి కూడ గంగ కన్పించి కల చెబు తుంది. ఆమె ఆ కల వీరగంగకు చెబుతుంది. అప్పుడు ఆమె దాని వలన జరగబోయే సంఘటనలను చెబు తుంది. ఈవిధంగా ఇలవేల్పు అయిన గంగ కూడ తన పాత్రను నిర్వహిస్తుంది.

**- సుబ్బారావు టి.వి. 1976, 614**

### 5. దేవతా బొంగరాలు :

దేవతా బొంగరాలు మహిమ గల బొంగరాలు. ఆ బొంగరాలతో ఆడిన రాజులందరు యుద్ధంలో మరణి స్తారు. సిరిదేవి కుమారుడు అయిన ముమ్మయ్య. అగు మంచి పెంపుడు కొడుకు అయిన పోచయ్య దేవతా బొంగ రాలను అడుగుతారు. సిరిదేవి ఆ బొంగరాలను వారికి ఇవ్వడానికి భయపడుతుంది. కాని అగు మంచి ధైర్యం చేసి ఆ బొంగరాలను వారికి ఇచ్చినట్లే ఈ క్రింది పద్యం వల్ల తెలుస్తుంది.

అతివేగ దీవించి ఆగుమంచి ఇచ్చె
ప్రతివాదించక బాలల్లారా
వోడు గెల్పులు లేక ఉర్వి పై మీరు
ఆడుడి బొంగరాలు హరిహరులు బోలి
పుచ్చుకొండి బాలల్లారా పుత్తడి బొంగరాలు

**- సుబ్బారావు టి.వి. 1976, 266**

ఆ బాలురు దేవతా బొంగరాలు ఆడుతుండగా అవి కోమటి అచ్చమ్మ కాలికి తగులుతాయి. అపుడు మీ అన్నలకు పట్టిన గతి మీకు కూడా పడుతుందని ఆమె శపిస్తుంది. ముమ్మయ్య, పోచయ్యలు సిరిదేవి దగ్గరకు వచ్చి అన్నల గురించి తెలుసుకొని యుద్ధానికి వెళతారు. ఈ విధంగా దేవతా బొంగరాలు కథా గమనానికి తోడ్పడతాయి.

**6. శకునములు :**

కాటమరాజు కథలో పురుషులు యుద్ధంలో మరణించి నపుడు వారి భార్యలకు కొన్ని శకునాలు కనబడతాయి. అగుమంచి తలంటడానికి సిరిగిరమ్మ గిన్నెలో సంపెంగ నూనె తీసుకొని వస్తుండగా ద్వారబంధం తగిలి నూనె వలుకుతుంది. ఆ విషయం ఈ క్రింది పద్యంలో జాన పదులు వర్ణించారు.

రవణచు అగుమంచికి రమణి శిరస్సంట
సంపంగి నూనెలో చెలగి గిన్నెలలోను
సంపుతో నిడుకొని సుధతి సిరిగిరమ్మ
కరమున గాంచక రాగా కొంత తానప్పుడు
దాల చింద్రము దాకి తలచ మొగుచింద్య

**- సుబ్బారావు టి.వి.1976, 463**

అపుడు సిరిగిరిమ్మ తన భర్త యుద్ధంలో మరణిస్తాడని శకునం చెబుతుంది. అగుమంచి స్నానం చేసిన నీరు నిమ్మలకు పనసలకు ప్రవహిస్తుంది. అది చూచిన కొమరక్క, అగుమంచి సోదరులు పాలేటి యుద్ధంలో మరణిస్తారని శకునం చెబుతుంది. అగుమంచి శివుణ్ణి గంగను పూజించినపుడు అపశకునాలు కలుగుతాయి. దానికి కారణం చెప్పమని స్త్రీలందరు ఆమెని అడుగు తారు. అపుడు తన సోదరులు యుద్ధంలో మరణిస్తారని అగుమించి జరగబోయే సంఘటనలు చెబుతుంది.

**7. సహగమనం :**

కాటమరాజు కథలలో భర్తలు మరణించినపుడు భార్యలు సహగమనం చేయడం ఒక విధి. అది ఒక పవిత్రకార్యం. ప్రధాన పాత్రలైన పెద్దమ్మ, అగుమంచి మొదలైన స్త్రీలందరు సహగమనం చేస్తారు.

పెద్దమ్మ సహగమనం
కుంకుమ వసంతము కొల్లలుగాను
కుడిచేయి లోనుగా గుణ్ణము చుట్టూ
వలంపూరి తిరిగి వచ్చెను వేగ
...................................
...................................
అందము నిమ్మపండ్లు అగ్ని కట్టించె
గుప్పున గుణ్ణాన దుమికె పెద్దమ్మ

**- సుబ్బారావు టి.వి.1976, 283**

ఈ ఆచారం కాటమరాజు కథలలో స్త్రీ పాత్రపరంగా ఎంతో ప్రభావాన్ని చూపించింది. పెద్దమ్మ సహగమనం చేయకుండా జీవించి ఉంటే పాపనూకను తన ఇష్టం వచ్చినట్లు పెంచుకునేది. స్త్రీలందరకు నిండు జీవితం ఉండేది. యుద్ధంలో తండ్రి చనిపోయినా తల్లి బ్రతికి ఉన్నట్లయితే పిల్లల జీవితాలు మరొక విధంగా ఉండి ఉండేవి.

**8. సంతాన ప్రాప్తికి దేవుడు ప్రత్యేక్షమై ఒక పండు ఇవ్వడం:**

సంతానం లేని పెద్దమ్మ బసవన్నను పూజిస్తుంది. బసవన్న పెద్దమ్మ పూజను తిరస్కరిస్తాడు. పెద్దమ్మ దుఃఖించి నిద్రిస్తుంది. అపుడు ఆమె కలలో కల్యాణ సోమేశ్వరుడు కనిపించి కల్యాణ నగరానికి వస్తే సంతానాన్ని ఇస్తానని చెబుతాడు. అపుడు పెద్దమ్మ పెద్దిరాజు కల్యాణ నగరానికి వెళ్ళి కాటకోటేశ్వరుని పూజిస్తారు.

ఈ క్రింది వాఖ్యాలలో పెద్దమ్మ పెద్దిరాజు కళ్యాణ స్వామేశ్వరుణ్ని పూజించినట్లు తెలుస్తుంది.

ఓ కాట్రాయుడా కాటా కోటేశ్వర
కాంతిసోమప్ప తమ గర్భమునందు
పరగంగ బాలలు జన్మించితేను

నీ పేరు పెట్టుదుము నీఖిలంబు ఎరుగ
..............................................
కాటకేటేశ్వరుడు అపుడు తామెచ్చి
కాయును పండును దోసిట రాల్చెను
కాయపండేమి అని కలలోన అడిగితే
కాయే కాటమరాజు పండే పాపనూక
అని సెలవిచ్చెనపుడు శంకరుడు దయతో

**- సుబ్బారావు టి.వి.1976, 156**

కాటకోటేశ్వరుడు వారి పూజకు మెచ్చి ఒక కాయను పండును ఇస్తాడు. వారిరువురు ఆ పండ్లను భుజించగా కాటమరాజు, పాపనూకలు జన్మిస్తారు. ఈ విధంగా కథా గమనానికి ఈ పండ్లు తోడ్పడినాయి.

ఈ విధంగా కాటమరాజు కథలలో స్త్రీ పాత్రలను ఆధారంగా చేసుకొని కథన ఘటకాలను పరిశీలించవచ్చు. ఇదేవిధంగా అనేక కథలలో కావ్యాలలో కూడ కథన ఘటకాలను పరిశీలించదగినవి ఉండవచ్చు.

**ఉపయుక్తగ్రంథాలు :**

1. కృష్ణకుమారి, నాయిని : 1990. తెలుగు అకాడమీ, హైద్రాబాద్.
2. మోహన్ జి.యస్ : 2010. ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.
3. సుందరం ఆర్వీయస్ : 1996. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైద్రాబాద్.
4. సుబ్బారావు టి.వి. : 1976. నాగలక్ష్మి ఆర్ట్స్ ప్రింటర్స్, హైద్రాబాద్.

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# మహావీర చరితం - భవభూతి వర్ణనా వైచిత్రి

- డా॥ దోనేపూడి రామాంజనేయ శర్మ, రీజనల్ డైరెక్టర్, ఇగ్నో ప్రాంతీయ కేంద్రం, విజయవాడ, కృష్ణా జిల్లా.

## సంక్షిప్త పరిచయం :

సంస్కృత సాహిత్యంలో రూపక సాహిత్యానిది ప్రత్యేక స్థానం. అందులోను కాళిదాసు తరువాత భవభూతియే ప్రథమ గణ్యుడు. చిత్రంగా కాళిదాసులా భవభూతి కూడా మూడే నాటకాలు రచించాడు. అవి మహావీర చరితం, మాలతీ మాధవం, ఉత్తర రామచరిత్ర. ఆయన రచనలో శైలికి ప్రముఖ స్థానం ఉంది. రచించిన మూడు నాట కాలలో మూడు రసాలు పోషించబడినాయి. మహావీర చరితంలో వీర రసం, మాలతీ మాధవం లో శృంగార రసం, ఉత్తర రామచరిత్రలో కరుణ రసం అద్భుతంగా పోషించాడు. వీరరసం ప్రధాన రసంగా రచించబడిన మహావీరచరితంలో ఓజో గుణం, గౌడీ శైలి, సమస భారితమైన రచనా విన్యాసం, వర్ణనకు ప్రాధాన్యత, ఎలా నిర్వహించాడో వివేచించటం ప్రస్తుత వ్యాస ఉద్దేశ్యం.

## కీలక పదాలు :

వర్ణన, అలంకారం, శైలి, ఓజోగుణం, రసపోషణ, భావ విస్తృతి అన్నవి కీలక పదాలు

## భవభూతి రచనలు :

భవభూతి రచనలుగా చెప్పబడే మూడు నాటకాలు మనకీవేళ లభ్యమౌతున్నాయి. మహావీర చరితం, మాలతీ మాధవం, ఉత్తర రామచరిత్ర. ఇవి కాక ఇతరులు భవభూతి రాసినట్లు పేర్కొన్న కొన్ని ముక్తకాలు కుడా కన్పిస్తున్నాయి.

## మహావీర చరిత్ర - నాటక కళ :

"కావ్యేషు నాటకం రమ్యం" అన్నారు. ఈ రమ్యత ఎలా కలుగుతుంది? అది కేవలం కథా బలమా? లేక రసపోషణ వల్ల కలుగుతుందా? లేక మరేమైనా కారణా లున్నాయా? అని ప్రశ్నించుకుంటే దానికి కారణం నాటకీయత అనే సమాధానం వస్తుంది. మరి నాటకీయత అంటే ఏమిటి? కావ్యాలలో లేనిదేమిటి? నాటకాలలో ఉన్నదేమిటి? కేవలం నాటకీయత వల్లనే నాటకాలకు ఈ రకమైన ఆధిక్యత కలిగేట్లయితే ఆ నాటకీయతను నాటక రచయితలు ఎలా సాధిస్తారు? అనే ప్రశ్నకు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారు ఇలా చెప్పున్నారు. నాటకీయత రచనలో ఆరు అంశాల వల్ల సాధించబడు తుంది.అవి...

1. రంగ పరికల్పనం
2. సంభాషణ శిల్పం
3. చతుర్విధ అభినయ ప్రదర్శన చాతుర్యం
4. వర్ణనాంశాలను రూపక మర్యాదలుగా మలచటం
5. రసపోషణం
6. శిల్ప వైచిత్రి

సమర్థులైన నాటకకర్తలు ఈ అంశాల నన్నింటిని మేళవించి తమదైన ప్రత్యేకమైన శిల్పాన్ని ప్రదర్శిస్తూ నాటకాలను రచించారు. అటువంటి సంస్కృత నాటక రచయితలలో భవభూతి స్థానం చిరస్థాయి. విలక్షణం. భవభూతి అలాంటి నాటక కళా నిర్వహణలో వర్ణనలను ఎలా వాడుకొన్నాడో మహావీర చరితం ఆధారంగా పరిశీలిద్దాం.

## భవభూతి వర్ణనావైచిత్రి :

1. భవభూతి పురాణాలలో సహజంగా కనిపించే అతిశయోక్తిని చక్కగా అందిపుచ్చుకొన్నాడు. వర్ణనలు చేస్తూ చేస్తూ అతడు అప్రయత్నంగా ఈ రకమైన అతిమానుష / అతిలోక శక్తి సామర్థ్యాల వర్ణనలు విరివిగా చేశాడు. పౌరాణిక పాత్రలకు అతిలోక శక్తి యుక్తులుంటాయని భారతీయులే కాదు, యావత్ ప్రపంచ సాహిత్య కారులు నమ్మినది, అనుసరించి నదీ అదే బాట. కనుకనే ఒక హేర్క్యులస్, ఒక హనుమంతుడు వంటి పాత్రలు సాహిత్య ప్రపం చంలో స్థిరంగా నిల్చిపోయాయి.

2. ఈ నాటి సినీసాహిత్యంపై సంగీతానిది పైచేయి అయినట్లు భవభూతి వర్ణనలు ఒక్కొక్క చోట నటనను స్తంభింపజేస్తాయి.
3. కొన్ని సందర్భాలలో మూలవ్యతిరిక్తమైన కల్పనలు చేశాడు. వాటికి ఉదాహరణ : బలిష్టులు, దీర్ఘ కాయులు అయిన ఐదువేలమంది పురుషులు ఎనిమిది చక్రములు గల శకటంపై గల ఆ శివ ధనస్సును మిక్కిలి శ్రమతో లాగుకొని వచ్చినట్లు రామాయణంలో ఉండగా అది స్మరణ మాత్రాన ప్రత్యక్షమైనట్లు భవభూతి వర్ణించాడు. రామాయణ మూలాన్ని పరికించండి.

నృణాం శతాని పంచాశత్ వ్యాతానాం మహాత్మనామ్
మంజుషామష్ట చక్రాం తాం సమూహుస్తే కథంచన॥
(బాలకాండ 67 సర్గ, 3వ శ్లోకం)

ఇక భవభూతి నాటకం లో విశ్వామిత్రుడు...
శంభో ర్వరాదనుధ్యాన మాత్రోపస్థానదాయి వః
రామభద్రస్య పురతః ప్రాదుర్భావతుతద్ధనుః ॥
(అంకం-1- శ్లో.108, మహావీర చరితం)

అని స్మరించగానే
స్ఫూర్జద్వజ్ర సహస్ర నిర్మితమివ ప్రాదుర్భవత్యగ్రతో
రామస్య త్రిపురాన్తకృత్ దివిషదాం తేజోభిరిద్ధం ధనుః॥
(అంకం-1- శ్లో.109 మహావీర చరితం)

అని ప్రత్యక్షమైనట్లు వర్ణించాడు.

4. వాల్మీకి వర్ణించిన వానరాలు అడవి ఏనుగులంత ఉండి, చెరువులలోని నీటిని చిన్నాభిన్నం చేయ గలవు. కాగా భవభూతి వర్ణించిన వానరాలు మాత్రం
అ) పర్వతాలను విసరివేయగలవు, సముద్ర జలాలన్నింటిని త్రాగివేయ గలవు ఆ వివరం చూడండి.

అంభోధేర్నారికేళీ రసమివ చుళుకైః ఉచ్చుళంపయంత్యపో యే
యేషాముత్ క్షేప హేతుః శిఖరిషు లికుచోదుమ్బర ప్రాయ యేషు
బ్రహ్మ స్తంభం నివాస ద్రుమమివ రభసాద్విప్రకర్తుం క్షమా యే
యేషాం కోట్యో సంఖ్యాః సుతమమర పటేర్వానరాణాం నమంతి ॥
(అంకం -5 శ్లో.32, మహావీర చరితం)

5. రామాయణంలో జటాయువు ఒక పర్వతంలా ఎగిరి రావణ రథాన్ని నిరోధిస్తుంది. భవభూతి జటాయువు మాత్రం మేఘాలను తునాతునకలు చేయగలదు. సముద్రపు నీటిని రెక్కలతో పైకెగురగొట్టి పాతాళమును దర్శింపజేయగలదు. పర్వతాలను ముక్కలుగా చేసి నలుదిక్కులలో విసరివేయగలదు. ఆ వర్ణనను చూడండి.

పర్యాయక్షణ దృష్ట నష్ట కకుభః సంవర్త విస్తారయోః
నీహారీకృత మేఘ మోచిత దూత వ్యక్త స్ఫురద్విద్యుతః
ఆరాత్కీర్ణ ఖణత ణీకృత గ్రావోచ్చయ శ్రేణయః
శ్యైనేయస్య బృహత్పతత్ర ధుతయః ప్రఖ్యాపయన్త్యాగమం ॥
(అంకం -5 శ్లో.1 మహావీర చరితం)

దూరోద్వేలిత వాడవస్య జలధేరుల్లోల భిన్నాంభసే
రంధ్రైరాపతితేన వేగ మరుతా పాతాలమాధ్మాయతే
యద్వైకుంఠ వరాహ కంఠ కుహర స్ఫారోచ్చరత్ భైరవ
ధ్వానోచ్చండమకాండ కాల రజనీ పర్జన్యవత్ గర్జతి ॥
(అంకం -5 శ్లో.2 మహావీర చరితం)

అయితే అతిశయోక్తి పదాడంబరయుక్తమైన గౌడీశైలి కనిపించినా, అన్వయ కాఠిన్యం గానీ, గూఢార్థం గానీ, దురవగాహ్యత గానీ భవభూతి రచనలో కనిపించదు.

## 6. పాత్రోచితమైన వర్ణన : తాటకి వర్ణన

ఆంత్ర ప్రోతబృహత్కపాల నలక క్రూర క్వణత్కంకణ ప్రాయ ప్రేంఖణ భూరి భూషణ రవైరాఘోషయత్యంబరం
పీతఛర్దితరక్త కర్దమ ఘన ప్రాగ్భార ఘోరోల్లసత్
వ్యాలోల స్తన భారభైరవ వపుర్దర్పోద్ధతం ధావతి ॥
(అంకం -1 శ్లో.35 మహావీర చరితం)

తాటకి రక్తం తాగింది. నోటినుండి కారుతున్న రక్తం జిడ్డులా ఒళ్ళంతా కారి బురదలా పేరుకుపోయింది.

ఆ రక్తపంకంతో నిండిన ఆమె వక్షోజాలు విపరీతంగా కదులుతూ ఉన్నాయి. పేగులతో కపాలలతో తయారు చేసిన కంకణాలు ధరించింది. అలాంటివి ఇంకా ఎన్నో ఆభరణాలు ధరించింది. ఆ కపాలాలు ఒకదానితో మరొకటి తగలటం వల్ల ఉత్పన్నమైన ధ్వని ఆకాశమంతా ప్రతిధ్వనిస్తున్నది. అలాంటి స్థితిలో తాటకి దర్పంగా ఉద్ధతంగా, భూమి కంపించేలా పరిగెడుతూ వస్తున్నదట.

ఎంత చక్కని ఆహార్య వర్ణన. ఎంత జుగుప్సావహమైన ఆహార్య వర్ణన.! ఎంత భీతావహ వాతావరణ పరికల్పన. అహో! భవభూతి భావ గాంభీర్యం! ఇలాంటి వర్ణన మల్ల మనకు ఆముక్తమాల్యదలో మాలదాసరి వృత్తాంతంలో శ్రీకృష్ణదేవరాయల రచనలో కన్పిస్తుంది.

## 7. భావ విస్తృతి :

వర్ణన అందరు చేస్తారు. కానీ విస్తృతమైన భావాన్ని గ్రహించి వర్ణించగలగటం కవి పరిణతికీ, లోకానుభావానికి, భావ వైచిత్రికి ఉదాహరణలుగా నిలుస్తాయి. ఉదాహరణకు శ్రీ రాముడు శివధనుర్భంగం చేయగా వచ్చిన ధ్వని రాముని బాలచరిత కీర్తిని వ్యక్తం చేస్తున్న పటహ ధ్వనియా? అన్న సందేహానికి తావిస్తూ బ్రహ్మాండ పటహాలను మాటి మాటికీ తాకుతూ నేటికీ విశ్రమించటం లేదు.

ఇక్కడ వర్ణించింది శివ ధనుర్భంగ సమయ సంజాత భీషణ ధ్వని నైరంతర్యాన్నే అయినా అది పరోక్షంగా శ్రీ రాముని పరాక్రమాన్ని వ్యక్తం చేస్తోంది. ఇక ఆ ధ్వని నేటికీ విశ్రమించటం లేదు /ఆగటం లేదు. ఎందుకని? బ్రహ్మాండంలోని రెండు భాగాల మధ్య అది పరిభ్రమిస్తూ ఉండటమే కారణమంటాడు. పూర్వం బ్రహ్మగారు సృష్ట్యాదిలో సృష్టిలో భాగంగా బ్రహ్మాండాన్ని రెండుగా చేసినట్లు 'స్వయమేవాత్మనో ధ్యానాత్ తదండమకరోత్ ద్విధా" అని మనువు చెప్పాడు. ఆ సంపుటాకార బ్రహ్మాండ అర్థ భాగాల మధ్య మాటి మాటికీ పరిభ్రమిస్తున్నందు వల్ల ఆ ధ్వని నేటికీ విశ్రమించటం లేదు/ఆగటం లేదట. ఇంత విస్తృతమైన భావన ఎంతమందికి వస్తుంది చెప్పండి. అందులో అతిశయోక్తి అలంకారం లేదంటే అది అతిసయోక్తి అవుతుందనే నా సందేహం.

ఇక బాలుడైన రాముని ప్రతాపాన్ని వర్ణించే /వ్యక్తం చేసే పటహ ధ్వని వలె ఆ ధ్వని ఉన్నదన్నాడు గనుక ఇక్కడ ఉపమాలంకారం ఉంది. ఇన్ని విశేషాలకు నిలయమైన ఆశ్లోకాన్ని అవధరించండి.

దోర్లీలాంచిత చంద్రశేఖర ధనుర్దండావ భంగోద్ధత
ష్టంకారధ్వనిరార్య బాలచరిత ప్రస్తావనా డిండిమః
ద్రాక్పర్యస్త కపాల సంపుట విలసత్ బ్రహ్మాండ భాండోదర
భ్రామ్యత్పిండిత చండిమా కథమహో నాద్యాపి విశ్రామ్యతి ॥

(అంకం -1 శ్లో54, మహావీర చరితం)

## రావణ కృత సీతా వర్ణన :

స్త్రీ సౌందర్య వర్ణనలో భవభూతి కాలళిదాసులకు కొంత వ్యత్యాసముంది. కాళిదాసు కొన్ని చోట్ల అంగాంగ వర్ణన చేయగా మరికొన్ని చోట్ల దీప శిఖేవ రాత్రౌ అని ప్రభామాత్రంగా వర్ణించాడు. కానీ భవభూతి స్త్రీ సౌందర్య వర్ణనలో మాత్రం అంగాంగ వర్ణన కనిపించదు. చివరకు మోహ పరవశుడైన రావణుడు సీతను తలుచుకున్నప్పుడు కుడా అంగాంగ వర్ణన కనిపించదు. ఇది భవభూతి వర్ణనలో కనిపించే ఉదాత్త భావనగా చెప్పక తప్పదు. రావణుడు సీత గురించి ఇలా తలపోస్తాడు.

ముఖం యది కిమిందునా? (సీత ముఖారవిందం కనిపిస్తే చంద్రబింబం అవసరం లేదు)

ఇత్యాదిగా గల ఆ శ్లోకం ఆరవ అంకం కథా భాగం లో చెప్పుకొన్నాం గదా! పోనీ ఆమెను భార్యగా చేసుకొన్న శ్రీరామచంద్రమూర్తి అయినా ఆమె అందచందాలను వర్ణించాడా? కనీసం ఏకాంతంలో ఊహించుకొన్నాడా? అంటే లేదనే సమాధానం. సీతమ్మను చూసి శ్రీ రాముడే మంటున్నాడో వినండి.

ఉత్పత్తిర్దేవ యజనాత్ బ్రహ్మవాదీ నృపః పితా
సుప్రసన్నోజ్జ్వలామూర్తిరస్యాః స్నేహం కరోతి మే ॥

(అంకం 1-శ్లో.12, మహావీర చరితం)

ఈమె దేవయజన సంభవ. తండ్రి బ్రహ్మవేత్త అయిన జనక మహారాజు. అలాంటి ఈ పవిత్ర మూర్తి

అయిన సీతా తనూ ప్రకాశం నాలో చెప్పరాని ఆత్మీయతను కలిగిస్తోంది అన్నాడు. కనుకనే ఉత్తరరామ చరిత్రలోనూ సీతను శ్రీ రాముడు " ప్రియే! దేవయజన సంభవే!" అని సంబోధిస్తాడు. ఇది అచ్చమైన భారతీయ సంస్కృతి. పాశ్చాత్య నాగరికత వ్యామోహంతో వెర్రితలలు నేటి సమాజంలో ఈనాటి యువత అలవరచుకోనవలసిన పవిత్ర దృక్పథం. యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః అన్నారు గదా!.

భవభూతి శైలి గౌడీ శైలి. అందుకు కొన్ని ఉదాహరణలు ఇప్పటికే చెప్పుకొన్నాం. అయినా మరొక్కటి పరిశీలిద్దాం. రామ రావణ యుద్ధాన్ని వర్ణించే సందర్భంలోని కింది శ్లోకాన్ని గమనించండి.

వీరాణాం రుండతుండ ప్రవిఘటన పటుస్ఫార దోర్దండ ఖండ
వ్యాపార క్షిప్యమాణ ప్రతిభట వికటాటోప వర్ష్మ ప్రరూఢః
కూటః కోప్యేష యుద్ధాజిర భువి జరఠః చిత్ర కుటానుసారీ
లీయంతే యత్ర శత్రుప్రతిపతన వివశాః కోటిశః శూర కీటాః ॥

(అంకం-6-శ్లో.32 మహావీర చరితం)

ఇలా ఎన్నయినా ఉదహరించవచ్చు. దీని భావమేమంటే రాముడు శత్రు సైనికుల శరీరాలనుండి తలలు వేరు చేస్తున్నాడు. ఆ విధమైన శత్రునిర్మథన వ్యాపారం వల్ల కీట సద్రుశులైన శత్రుసైనికుల దేహ శకలాలు గుట్టలుగా పేరుకు పోయి యుద్ధరంగం లో చిత్రకూట పర్వతంలా కనిపిస్తున్నయట. ఇలా మహావీర చరిత్రలో భవభూతి కవిత్వం ఒక చోట మేఘంలా వర్షించి సహృదయ హృదయాలను రాసాప్లావితం చేస్తే మరొక చోట జలదనిర్ఘోష పటుత్వంలో ఔరా! అనిపిస్తుంది.

**ముగింపు :**

భవభూతి వీరరస ప్రధానం గా నిర్వహించి రచించిన మహావీర చరిత్రలో అధ్బుత రసానికి చోటు కల్పిస్తూ ఓజో గుణ భరితంగా రచన చేస్తూ వర్ణననలను సందర్భోచితంగా తీర్చి దిద్దాడు. అద్భుత రససమావేశం ఉన్నప్పుడే వీర రసం రక్తి కడుతుంది. ఈ రహస్య%శీ% తెలిసిన నాటక కర్త భవభూతి. రామ రావణులు చేసిన సీతా వర్ణ ద్వారా నేటి తరానికి స్త్రీకి ఇవ్వ వలసిన గౌరవం తెలియజేశాడు. అద్భుత మైన రచనా విన్యాసంతో చదువరుల మనస్సులు గెలుచుకొన్న రూపక రచనా రహస్య విజ్ఞాత భవభూతి. పాత్రోచితమైన వర్ణన ఎలా ఉండాలో చేసి చూపిన నాటక కర్త భవభూతి. కనుకనే నేటికీ ఆయన రచనలు చిరస్థాయిగా ఉన్నాయి, ఆయన అందించిన సందేశం నేటికీ ఆదర్శంగా నిలిచింది.

**ఆధార గ్రంథాలు :**


1. సంస్కృత సాహిత్య చరిత్ర, డా. ముదిగంటి గోపాలరెడ్డి డా. సుజాత రెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ, 1986.
2. ఉత్తర రామచరిత్ర, శ్రీమాన్ నేలటూరు రామదసయ్యంగారి వ్యాఖ్యతో సాహిత్య అకాడెమి ప్రచురణ, 1977.
3. Mahaveera Charitra, with the commentary of Sh. ANUNDORAM BOROOAH, Published by Assam Publication Board, 1969
4. కవిత్రయ విరచిత శ్రీ మదాంధ్ర మహాభారతం, (డా. జి.వి సుబ్రహ్మణ్యం గారి పీఠిక) తిరుమల తిరుతి దేవస్థానం ప్రచురణ.

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# పులిమ్రుగ్గు - ఒక క్షుద్రవిద్య

- డా. సింగుపురం నారాయణరావు, & - డా. సుసర్ల ఇందిర, తెలుగు విభాగం, బరంపురం విశ్వవిద్యాలయం, బరంపురం, ఒరిస్సా.

ఇతిహాస పురాణాలలో దేవతలు, రాక్షసులు, దేవతాంశ సంభూతులైన తదితరులు సంకల్పమాత్రాన ఇచ్ఛా రూపాన్ని పొందటం సర్వసాధారణం. ఈ విధంగా భావనా మాత్రాన ఏ రూపాన్ని సంకల్పిస్తే ఆ రూపాన్ని పొంద టానికి వానికి ఇదివఱకే అంతర్గతంగా సమీకృతమైన ఒక మహాశక్తో, ఉపాసనా బలమో కారణమయియుండవచ్చు.

రామాయణంలో మారీచుడు లేడి రూపాన్ని పొందటం, ఆంజనేయుడు మక్షి రూపాన్ని ధరించటం, సూక్ష్మరూపునిగా మారిపోవవటం, మైరావణుడు విభీషణునిగా రూపుదాల్చటం, అసురులు ధేనుకాది రూపాలని పొందటం, పూతన అందమైన స్త్రీగా అవతార మెత్తటం, మనుచరిత్రలో గంధర్వుడు మాయాప్రవర రూపాన్ని గ్రహించటం.... ఈ విధంగా రూపాంతర గ్రహణం అన్ని యుగాలలోనూ, పురాణేతిహాసాలలో కని పిస్తోంది. ఇక్కడ వీరందఱికీ కామరూపవిద్య కరతలామ లకమనే విషయం సుస్పష్టం.

మనస్సులోనున్న భావమే శరీరమందలి నాలుక, దవడ, అంగిలి, పెదవులు మొదలైన వివిధావయవాల సంచలనం కారణంగా శరీరాంతర్గతమైన వాయువు శబ్దరూపంగా బహిర్గతమవుతోంది. అంటే మనస్సులో కలిగే భావం మాటలుగా రూపొందటానికి శరీరమనే యంత్రం సాధనమవుతోంది. ఇదే విధంగా మనస్సులో కలిగే ఒక తీవ్రభావానికి మానసిక ఏకాగ్రత సాహాయ్యంతోనో, ఇతర సాధనాల ద్వారానో, కొన్ని యంత్రతంత్ర సాహాయ్యా లతోనో రూపకల్పన కావించవచ్చు. దేవాసురులలో మాత్రమే ఉన్న కామరూపవిద్య ఈ విధంగా సాధ్య మయిందేమో అంటారు విశ్వనాథ. 'పులిమ్రుగ్గు' నవలలో ప్రతినాయకుడైన జయద్రథుడు తనకున్న అపార మేధాశక్తిని, ఊహాపటిమను, దట్టమైన కాంతారాలలో మాత్రమే లభించే కొన్ని అపూర్వ వస్తువులని జోడించి, వివిధ వర్ణాల ధూళులతో పులిమ్రుగ్గును రచించి, మంత్రా నుష్ఠానం చేస్తే మనిషి పులి రూపాన్ని ధరించవచ్చనే ఒక అపూర్వమైన ప్రక్రియను ఆలోచించేడు.[1] ''విద్యలు క్షుద్రములైన కొలది యంత్రతంత్రములనాశ్రయించుకొని యుండును. ఇంకను క్షుద్రములైనచో వట్టి తంత్రము లను, ఓషధులను సమాశ్రయించుకొని యుండును. అంటారు విశ్వనాథ. ఈ కారణంగానే ఈ రంగురంగుల ధూళులను'' ''తొక్కిన వారి యొడలు పశుసమాన భావమును పొందుట జరుగుతున్నది.''[2] అంటారు రచయిత.

తాంత్రిక విధానాలలో రంగవల్లుల అలంకరణని ఆయా శాస్త్రాలునిర్దేశిస్తున్నాయి. నవగ్రహార్చన సందర్భాన ఆయా పీఠాలయందు ఆయా గ్రహాధిపతుల నావహింప జేసి ఉపాసించాలి. అటువంటి సందర్భాలలో ఆయా గ్రహానికి తగ్గ రంగవల్లులని తీర్చిదిద్దటటం చూడవచ్చు.

''తచ్చుస్మాధే దేశే గోమయేనో పలిప్య
స్వే స్వే స్థానే శాలివ్రేహిభి స్సికతాభిర్వా
చతురస్రం, వృత్తం, తుటాకారం, త్రికోణ
మష్టాశ్రం, అర్ధచంద్రాకారం, వజ్రాకారం
దండాకృతి, ధ్వజాకృతీతి క్రమేణ పీఠాన్యుప
కల్ప..............అర్చయేత్''

శ్రీ చక్రార్చన చేసే సందర్భంలో యంత్రంలో ఆ ఆకృతిని లిఖించటం కూడా ఇటువంటిదే.

''బిందుత్రికోణ వసుకోణ దశారయుగ్మ
మన్వస్రనాగ షోడశదళ పద్మయుక్తమ్
వృత్త త్రయాంచ ధరణీ సదన త్రయంచ
శ్రీ చక్రరాజ ఉదితః పర దేవతా యాః॥''

అదే విధంగా తాంత్రికవిద్యలలో ఆయా జంతువుల చిత్రాలను ముగ్గులలో చిత్రించి, తత్త దేవతల ద్వారా శత్రుమారక క్రియ నిర్వర్తించే సంప్రదాయముందని

మంత్రశాస్త్ర ప్రవీణుడైన త్రిపురారిభొట్ల వారి అనుభవ మైనట్లు తెలియవస్తోంది. విశ్వనాథవారు మరికొన్ని నవలల్లో కూడా ఈ ముగ్గు ప్రాధాన్యం వివరించినప్పటికీ పూర్తి ముగ్గుగా ఆవిష్కృతమైనది మాత్రం 'పులిముగ్గు' నవలలోనే.

విశ్వనాథవారు "భగవంతుని మీది పగ" నవలలో కాలంజరి నామంతో ఒక సర్పప్రయోగాన్ని వివరించేరు. ఈ ప్రయోగోపసంహరణలో కూడా ఈ ముగ్గు ప్రాధాన్యం చూడవచ్చు. ఖడ్గయుద్ధం ద్వారా ప్రయోగితమైన కాలం జరి ప్రయోగాన్ని మరల్చటానికి నాగార్జునుడు సర్పాస్థిక లను చేత పట్టుకొని, నాల్గు దిక్కులయందు నాల్గు తలల పాము పడగలతో నుండి, ఆ నాల్గు సర్పాల పుచ్ఛములు ముగ్గు నడిభాగాన పెనవేసికొన్నట్లు ముగ్గు వేశాడు. ఒక పాము ముగ్గు పసుపుతో, రెండవ దానిని కుంకుమతో, మూడవ దానిని బొగ్గుపొడితో, నాలుగవ దానిని ముగ్గు లోనూ వేసి, తన పాదాలు విజయసింహుని శిరస్సు వైపు, తల విజయసింహుని కాళ్ళ వైపు పెట్టి తాను విజయుని పాదాలు కావిలించుకొని పడుకొనే మంత్ర పునశ్చరణ చేయగా సూర్యోదయ సమయానికి విజయసింహుడు నాగార్జునుడు కూడా లేచి కూర్చున్నారు.

అష్ట సిద్ధులలో సంకల్పయాత్ర రూపధారణ ఒకటి. ప్రస్తుత నవలలో జయద్రథుడు ప్రపంచంలో నున్న అన్ని క్షుద్రవిద్యలను, తాంత్రిక విద్యలను నేర్చినవాడుగా వర్ణితుడు. అటువంటి వానికి అష్టసిద్ధులను నేర్వటం ఒక లెక్కలోనికి రాదు. అయితే మానిసి పులిగా మారే ప్రక్రియ ఏ పురాణాలలోనూ, పూర్వ కథలలోనూ కనిపించటం లేదు. దశవిధ మహావిద్యలలో కాని, నాగ, భైరవ, ప్రత్యంగిర సాధనలలో కాని ఈ విద్యతో పోలిక యున్న విద్య ఎక్కడా కన్పట్టటం లేదు. ప్రాచీనకాలం నుంచీ భారతదేశంలో రెండు రకాలైన విద్యలు ఉపాసిం చటం జరుగుతోంది. సురాసుర ప్రకృతులకు ప్రతీకగా సాత్త్విక తామసిక విద్యలు సృష్ట్యాది నుండి ఉన్నవే. సద్విద్యో పాసనల ఫలం శాశ్వతమవుతుండగా, తామసిక విద్యల వలన కలిగే ఫలితం తాత్కాలికమవుతోంది.

ఆంధ్రదేశాన క్షుద్రవిద్యలనుపాసించే ఒకానొక తెగ ఉం డేదట! "మాచాబత్తుల' వంశంలో వారైన "భేరీకోమట్లు' ఈ విధమైన తాంత్రిక విద్యలో సిద్ధహస్తు లైనట్లు కొన్ని గాథలు ప్రచారంలో ఉన్నాయి. ఇటువంటి విద్య సాధ్యమా అంటే "పెదారకట్ట' అనే గ్రామంలో జరిగిన ఉదంతం సాధ్యమనే చెబుతోంది. ఒంగోలు నుండి కనిగిరికి పోయే మార్గంలో "పెదారకట్ట' అనే గ్రామముంది. ఆ గ్రామంలో గల అగసాలి అనే వంశంలో శేషయ్యగారి కుటుంబంలో ఈ విద్య ఉండేదని వారి తమ్ముడైన కోటయ్యగారు చెప్పటమే కాక వారి కుటుం బంలో జరిగిన విషాదోతంతాన్ని వినిపించేరట!

కోటయ్యగారి కుమార్తె పురిటికోసం పుట్టింటికి వచ్చి, కొన్ని దినాలకు ప్రసవించిందట. అనంతరం కూతురు, అల్లుడిని బిడ్డతో అత్తవారింటికి పం పేరట! త్రోవలో ఈ అల్లుడు తన భార్యను వారింట గల విద్యను ప్రదర్శించ మని బాగా వేధించేడట. ఆమె ఎంత వద్దని వారించినా వినక ఒత్తిడి చేయగా తన కర్మపరిపాకం సమీపించిందని భావించి, భర్తను తృప్తిపఱచటానికి ఆ విద్యను ప్రదర్శింప నుద్యుక్తురాలయిందట! కొంత ఇసుకను మంత్రించి, బిడ్డతో భర్తకిచ్చి, సమీపాననున్న వృక్షాన్ని అధిరోహిం చుమని, వృక్ష సమీపానికి పులిరూపాన వచ్చిన తన పై ఆ మంత్రించిన ఇసుకని జల్లితే తన నిజరూపం తనకు వస్తుందని చెప్పి చెట్టు చాటుకి వెళ్ళి కొంత సేపటికి పులిరూపంలో వచ్చి గాండ్రించిందట!. చెట్టు పైనున్న భర్త భయంతో ఇసుకని జల్లటానికి బదులు బిడ్డను జారవిడి చేడట! శార్దూలం బిడ్డను తిని, చాలా సేపు వేచియుండి, చివరకు సమీపారణ్యానికి వెళ్ళిపోయిందట. చెట్టు పైనున్న అల్లుడు చివరకు క్రిందకు దిగి, మామ గారితో జరిగిన విషయాన్ని నివేదించేడట. ఆహారం భుజిం చిన తరువాత ఆమెను మనిషిగా మార్చటం అసంభవమని కోటయ్యగారు తెలిపి, దుఃఖంతో అల్లుని కూడా పులిని చేసి పంపివే సేడట! అప్పటి నుంచి ఆ విద్య వారితోనే అంతరించిపోయిందట!. ఈ విద్యను మరెవ్వరికీ ఉప దేశించరాదని కాళీమాత ఆజ్ఞ! ఈ కారణంగా చుట్టుప్రక్కల

విస్తరించిన తన శిష్యుల కెవరికీ కోటయ్య ఈ విద్యను ఉపదేశించనేలేదట!

"భేరీకోమట్లు' అనే ఒక తెగ తెనాలి ప్రాంతంలో ఇంచుమించు 40 50 దశకాల్లో ఉండేదనీ ఈ విద్యలో వారికి ప్రవేశం లేదు కానీ, చిన్న చిన్న జంతువులుగా రూపొందే విద్య వారిలో ఉన్నప్పటికీ ఆ విద్య పట్ల ఆదరం లేకపోయిన కారణంగానూ, వీరి వలన గ్రామంలో భయోత్పాతం కలిగిన కారణంగానూ ఈ విద్య పూర్తిగా అంతరించిపోయిందని తెనాలిలోని వారి శిష్యులు శ్రీ నల్లగొర్ల కోటయ్యగారు చెప్పినట్లు తెలుస్తోంది.[6]

'జునూన్' అనే హిందీ చలనచిత్రం ఈ అంశం ఆధారంగా తీసిన చిత్రమే. ఈ చిత్రంలో కథానాయకుడు అర్ధరాత్రి అవగానే పులిగా మారిపోయి జంతుప్రవృత్తితో బ్రతుకుతూ ప్రొద్దున్న అవగానే మనిషిగా మారిపోతూ ఉంటాడు. ఇది ఒక తాంత్రిక ప్రక్రియగానే నవలలో కూడా వర్ణితం. చివరకు ఓంకార మహిమ వలన ఆతడు మనిషిగా మారి ప్రతినాయకుని సంహరించివేస్తాడు. 'పులిమ్రుగ్గు' నవలలో కుమార జయద్రథుడు కూడ ప్రణవోపాసన, గాయత్రి ఉపాసన చేసి తన తండ్రి బారి నుండి రాజ్యాన్ని రక్షించటం గమనార్హం.

1. "పులియగుటకు ఆ వన్నియల దుమ్ములతో నేయొక ముగ్గో, పటమో, పులియాకారమో..... చేసి, దానిలో నిలుచుండుటయో, పొరలాడుటయో, తత్స్వరూపము తన్నావహింప చేసికొనుటకు ధ్యానమో యేదో చేయును. అప్పుడు కాని పులికాడు. " పులిమ్రుగ్గు, పుట - 41
2. అదే, పుట - 40
3, 4. పురాణవైర గ్రంథమాల- ఒక సమీక్ష, డా. రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు, పుట 391
5. భగవంతుని మీది పగ, పుట -
6. పురాణవైర గ్రంథమాల- ఒక సమీక్ష, డా. రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు, పుటలు - 392, 393

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# హాస్య చరిత్ర

– ఇంద్రకంటి శ్రీనివాస్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

పుట్టిన ప్రతి మనిషి వ్యక్తి తన జీవితంలో ఆనాధగా జీవించవచ్చు. సొంత ఇల్లు లేకుండా ఉండవచ్చు కాని ప్రపంచంలో అత్యంత సంపన్నుడి నుండి కటిక పేదవాడి వరకు లేకుండా ఉండలేనది హాస్యం మాత్రమే. ఒక మాటలో చెప్పాలంటే హాస్యం లేని ఆరోగ్యం లేదు అలాంటి గొప్ప దివ్యమైన దాని గురించి తెలుసు కోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

అసలు మనిషి ఎందుకు, ఏ పరిస్థితులలో నవ్వు తాడు? సహజత్వానికి భిన్నమెవికారము కాని, వైపరీత్యము కాని నవ్వు పుట్టిస్తుంది. అలాగే విపరీతాలంకారము, విక అతాచార అభిదాన వేషములు, అంగవికారములు వీటి వలన కూడా నవ్వు వస్తుంది. ఓ సందర్భంలోఅనకరణ వలనహాస్యం ఉద్భవిస్తే, మరో సందర్భంలో విరుద్ధమైన పలుకుబండీ, ఉచ్చరించే విధానమూ కూడా హాస్యానికి కారణాలవుతాయి.

ఒక వ్యక్తి జీవితంలో కాని, ఒక జాతి చరిత్రలో కాని ఎన్నో ఒడిదుడుకులు వచ్చి పోతుంటాయి. ఆశ నిరాశల చెలగాటంలో చిక్కుకుపోవడం, అద అష్టం వచ్చినప్పుడు పొంగి పోవడం, దురద అష్టం ఎదురైనప్పుడు క్రుంగి పోవడం జరుగుతుంది. దీనికితోడు ఒక్కొక్కప్పుడు అజ్ఞానం వల్లో అహంకారం వల్లో ఆత్మవినాశకరమైన ఆలో చనల వల్ల వర్తమానాన్ని నాశనం చేసుకుని భవిష్యత్తుని భయభ్రాంత మొనర్చుకొనే ప్రమాదం ఉంది. అలాంటి సమయాల్లో హితోపదేశాలూ, మంచి ఉపన్యాసాలు బెది రింపులు, చట్టాలు ఇవేవి పని చెయ్యవు. అవన్నీ అర్థంలేని, నిరుపయోగాలు అవుతాయి. ఒక్క మనిషే కాదు, మొత్తం జాతినే పతనావస్థ నుంచి తప్పించి మంచి మార్గానికి మరలించగలిగేదీ ప్రమాదం నుంచి రక్షించి ఆనందాన్ని ఆరోగ్యాన్ని అందించి జనాన్నీ జీవాన్నీ ఇవ్వగలిగేది హాస్యం మాత్రమే. అని నా ఆలోచన.

ప్రపంచ దేశాలలో ఏ దేశంలోను హాస్యకళ లేని సంస్క అతి లేదు. నవ్వని సమాజం లేదు. ఆ వివిధ శాస్త్రాల మధ్య సంబంధం వలన కూడానవ్వు ఒక ముఖ్యమైన విషయంగా మారింది. హాస్యం విశ్వమానవ లక్షణం. అదొక అనుబంధానికి, స్నేహానికి సంకేతం. అదొక అనిశ్చిత సామాజిక పరిస్థితికి, సమస్యకు సంబంధించిన వికారానికి చిహ్నం. ఒక చిన్నారి చిరునవ్వు తన సంరక్షకునికి, తనకు మధ్య అనుబంధాన్ని పెంచుతుంది. అలానే తన తక్షణ వలయానికి దూరంగా ఉన్నవారితో కూడా సంబంధా లను పెంచడంలో తోడ్పడుతుంది హాస్యం. హాస్యం అంటే వెదజల్లడం అని చెప్పవచ్చు.

పరిమాణాత్మకంగా చెప్పినప్పుడు ఒక వ్యక్తి 10 అడు గులు ఎగిరినప్పుడు నవ్వినదానికన్నా 20 అడుగులు ఎగిరినప్పుడు రెట్టింపుగానవ్వుతాడు అని చెప్పడంలో అతియోక్తి లేదు కానీ,వాస్తవంగా అలా జరుగదు కదా. ఆనందాన్ని కలిగించేది హాస్యం. మానవుని భౌతిక నిర్మాణం పైన మనో విజ్ఞానంపైనహాస్యంప్రముఖపాత్ర వహిస్తుంది. అది మానవుని జ్ఞాన సముపార్ధనకు తోడ్పడుతుంది. జ్ఞాపశక్తిని పెంచుతుంది.

సుమారు 10 లక్షల నుండి 50 లక్షల సంవత్సరాల క్రితం మానవ అభివఅద్ధి తోకలేని కోతులతో ప్రారంభ మైంది అని చెప్పవచ్చు. సంకేతాలైన ఆటలను పక్షులు, జంతువులు మొదట నేర్చాయి అని చెప్పడంలో సందేహం లేదు. సుమారు కొన్ని సంవత్సరాల క్రితం మానవ అభివఅద్ధిలో ఒక ముఖ్య దశ అయిన నిటారుగా నిల బడటం ద్వారా మనిషి అభివఅది చెందాడు. ఆధునిక మానవ లక్షణాలు అతనిలో కొన్ని కన్పిస్తాయి. ఆ తరు వాత కొన్ని వేల సంవత్సరాల క్రితం వెనుదిరిగిన నొసలు, ఉబ్బెత్తు కనుబమ్మలుగల రాతి యుగానికి చెందిన మానవరూపం తెరపైకి వచ్చింది. అతను వేటకు అవసర

మైన ఎన్నో పరికరాలు తయారుచేసుకున్నాడు, ఆటలు నేర్చుకున్నాడు, మంచి భాష లేనప్పడికి కొన్ని సైగలు, అటు కదలికలు కొంత భాష అని అతనికి తెలుసు. చింపాంజీల నవ్వు మనిషినవ్వుతో దగ్గర సంబంధాన్ని కలిగి ఉంటుంది అని మనందరికి తెలుసు. గుర్రాలు, కుక్కలు, పిల్లులు కూడా నవ్వుతాయని చెబుతారు కాని, ఆ నవ్వులు వేరు అంటే అవి వివిధ కదలికల ద్వారా తమ లోని హాస్యాన్ని వెలిబుచ్చుతాయని నా అభిప్రాయం అభిప్రాయం.

మానవుడు అభివ అద్ధి చెందిన తరువాత నవ్వు ఆరూప భాషలో ఒక భాగంగా వికాసం చెందింది. ఆటకు, నవ్వుకు, భాషకు మధ్య సంబంధం ఉంది. ఉన్నత అంతర్బుద్ధితో సన్నిహిత సంబంధం గల హాస్యం మనిషి యొక్క విశిష్టతను చాటుతుంది. జీవరాసులన్నింటిలో మానవుడు శ్రేష్టుడు అయితే, మనిషి యొక్క విశిష్ట లక్షణం హాస్యం.

మనుషులు భిన్న రకాలు. కొందరు అమాయకులైతే, మరికొందరు మాయకులు. కొందరు శాంతి కాముకులైతే, మరికొందరు విప్లవకారులు. కొందరు నీతిమంతులైతే మరి కొందరు అశ్లీల ప్రియులు. మనుషులవలె హాస్యోక్తులలో కూడా భిన్నత్వం కనిపిస్తుంది. అందులో అమాయక, చెడుభాష, అసభ్య, భావనా సంబంధమైన అనేక రకాల హాస్యోక్తులు ఉన్నాయి. ఇంకా లోతుగా పరిశీలించి నట్లయితే ముందు హాస్యం ఒకానొక హాస్యోక్తిలాంటింది. అది ఏకాగ్రతను భంగం చేస్తుంది. అది హాస్యస్ఫోరకం గాని, హాస్యఒరలో భాగం హాస్యోక్తులు, హాస్యం. మనసుకు తనతోను, ఇతర ప్రపంచంతోనుగల సంబం ధాన్ని అది చుట్టు ముడిపెడుతుంది. ఒక పని చేయడం ద్వారా వచ్చిన ఆనందంకన్నా మరొక పని నిర్వహణ వలన వచ్చిన ఆనందం తక్కువ అయి నప్పుడు, అధికం నుంచి అల్పం తీసివేయగా మిగిలింది వ్యత్యాసం. ఆ తేడాను ఆ వ్యత్యాసాన్ని బహిర్గతం చెయ్యగా జనించే ఆనందాన్ని హాస్యం అని నా అభిప్రాయం.

హాస్యోక్తిని ఆంగ్లంలో 'జోక్' అంటారు. దానికి పర్యాయ పదాలుగా పరిహాసం, ఎగతాళి, గేలి, నవ్వు పుట్టించే మాట, ఎకసకలు మొదలైన పదాలను వాడతారు.అన్ని హాస్యోక్తులు హాస్యాన్ని పుట్టించలేవు.మరి హాస్యోక్తి అద్భుతంగా పేలాలంటే స్నేహితులను/సభికులను కడపారా నవ్వించాలంటే దాని నిర్మాణం ఎలా ఉండాలి? దాని రూపాన్ని ఏ విధంగా తీర్చిదిద్దాలి? హాస్యోక్తి ప్రభావం దాని నిర్మాణంపైనే ఆధారపడి ఉంటుందా లేక మరే ప్రత్యేక లక్షణాల వల అది అత్యధికులను ఆకర్షిస్తుంది.

ఒక హాస్యసంఘటనను వివరించదలచినప్పుడు ముఖ్యంగా మూడు కొలమానాలు తీసుకోవచ్చు. 1. ఆ సన్నివేశం హాస్యాన్ని ప్రేరేపింపజేస్తుందా 2. అది హాస్యాన్ని అందించడానికే ఉద్దేశించబడిందా 3. దానిని విన్న ఇతరులు కూడా ఆ సంఘటన హాస్యాన్ని అందజేస్తుందని విశ్వసిస్తారా ? ఈ అంశాల ఆధారంగా హాస్య నిర్మాణాన్ని చేయవచ్చు.

## మరి హాస్యోక్తిని ఎలా పేల్చాలి :

ఎన్నో పరిస్థితులు, ఎన్నెన్నో సంఘటనలు నవ్వును పండిస్తాయి. భౌతికంగా గిలిగింతలు పెట్టే దగ్గరనుండి మానసికంగా కితకితలు పెట్టి నవ్వించి కవ్వించడానికి కారణాలు కోకొల్లలు. అందుకే హాస్యం వైభవాలు పలు విధాలు. హాస్యోక్తులు, మూకాభినయం, బఫూన్‌లు హాస్యగాళ్ళు, హాస్యరచయితలు, వ్యంగ్య చిత్రకారులు, కార్టూనిస్ట్ లు ద్వారా భిన్న రూపాలలో హాస్యం దర్శన మిస్తుంది. అయితే హాస్యోక్తిని చెప్పే ముందు నేనొక అద్భుత హాస్యోక్తిని పేల్చబోతున్నానని, అది వింటే నవ్వలేక మీ పొట్టలు విచ్చుకుంటాయని ఎచ్చులు పలుక కూడదు. మనం గుర్తించడం, వారి వ్యక్తిత్వాలను గౌర వించడం అవసరం. మీలో హాస్య భావన ఉంటే, హాస్య గుణం ఉంటే ఈ హాస్యోక్తి విని "ఉబ్బితబ్బిబ్బవుతారు". అని పుచ్చుగా ఉంటుందా అని కొందరు గేలి చేయవచ్చు. ఓ.కె. నీ హాస్యోక్తి ఎంతగా నవ్విస్తుందో చూద్దాం అని ఒకరు నన్ను నవ్వించయ్యా చూద్దాం అని ఇంకొకరు భీష్మించుకొని కూర్చుంటే, మీ చక్కని హాస్యోక్తులు

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



తుస్సుమనవచ్చు. అందుకే చక్కని హాస్యోక్తులు వ్యర్థ మాటలతో అర్థం లేకుండా చేయవద్దు.

కొందరు హాస్య చక్రవర్తులుగా కీర్తి గడించాలని ఎంత ప్రయత్నించినా కాలేరు. మరికొందర అనుకొకుండానే నవ్వులు పూయిస్తుంటారు. హాస్యం వంశపారంపర్యంగా సంక్రమించే జన్యుసంబంధమైన అంశాలు కూడా కొన్ని ఉంటాయి అని చెప్పవచ్చు. ఇవి మాత్రం వంశపార పర్యంగా సంక్రమించవచ్చు. హాస్యం బహుముఖమైనది కనుక దానికి సంబంధించిన పలు అంశాలు హాస్య రచయితల రచనల నుండి కొంతవరకు తెలుసుకోవడానికి అవకాశం ఉంది. ఇతర కళలవలె, హాస్యాన్ని కూడా ప్రత్యేక కృషితో అభివృద్ధి చేసుకోవచ్చు. హాస్యోక్తి చెప్పడంలో ఒక నేర్పు, ఒక విరువు, ఒక మెరుపు ఉంటుంది. దానిని మనం అలవరపరచుకోవాలి. అదొక టెక్నిక్, అదొక ప్రక్రియ, అదోక పద్ధతి, అదొక విటమిన్ విటవిన్-సి అని చెప్పవచ్చును.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# పెద్దన - మనుచరిత్ర - పర్యావరణ వర్ణన

- డా॥ జూరెడ్డి నిర్మల, అధ్యాపకురాలు, తెలుగు విభాగం, సెయింట్ జోసఫ్ మహిళా కళాశాల, విశాఖపట్నం.

ప్రకృతిలోని భాగమే పర్యావరణం. జీవరాశులకు, పరిసరాలకు మధ్య గల సంబంధాన్ని తెలిపేదే పర్యావరణం. లేదా మానవుని చుట్టూ వున్న జీవులైన వృక్షాలు, జంతువులు. నిర్జీవ పదార్థాలైన నీరు, గాలి, భూమి మొదలైన వాటిని కలిపి 'పర్యావరణం' అని అంటారు. అలంకారికులు కావ్యంలో వర్ణనలకే పెద్దపీట వేశారు.

"ప్రజ్ఞా నవనవోన్మేషశాలినీ ప్రతిభామతా

తదను ప్రాణనాజ్జీవే ద్వర్ణనా నిపుణ: కవి:" అని భామహుని నిర్వచనం. 'కవనీయం కావ్యం' అని లోచనకారుడు,'కవయతీతి కవి: తస్మకర్మ కావ్యం' అని విద్యాధరుడు నిర్వచించారు. దీనిని బట్టి కావ్యంలో వర్ణనా ప్రాధాన్యం మనకు అవగతమౌతుంది.

ఆంధ్ర ప్రబంధాలకు మొదటిగా ఆదర్శప్రాయంగా పరిగణింపబడే మహాకావ్యం 'మనుచరిత్ర'. ఆంధ్ర పంచ కావ్యాల్లో ఇదే మొదటిదని కొందరి అభిప్రాయం. భారత భాగవతాల తర్వాత ఆంధ్ర దేశంలో దీనితో సమా నంగా ప్రచారం పొందిన కావ్యం ఇంకొకటి లేదు. దీనిని రచించిన కవి అల్లసాని పెద్దన. ఈ కావ్యమందలి పర్యా వరణ సంబంధమైన వర్ణనలు, పాఠకులకు హృదయోల్ల సాన్నే కాకుండా, పర్యావరణ స్పృహను కూడా కల్గిస్తాయి.

ప్రవరుని ఉత్సాహాన్ని చూసి, తాను చూసిన ప్రదేశాలను వర్ణిస్తున్న సిద్ధుని మాటల్లో పర్యావరణ సౌరభాన్ని వికసింపజేయడం ప్రారంభించారు పెద్దన.

"లంబమాన రవిరథ తురంగ శృంగార చారు చామరచ్ఛటా ప్రేక్షకాంక్షణోద్గీవ చమర సముదయంబగు నుదయంబునం గల విశేషంబులు శేష ఫణికినైన లెక్కింప శక్యంబె? యంధకరిపు కంధరావాస వాసుకి వియోగభవ దుర్వథా భోగ భోగినీ భోగభాగపరివేష్ఠిత పటీర విటపి వాటికా వేల్ల దేలాలతావలయంబగు మలయంబనం గల చలువకు విలువ యెయ్యది ?యకటకట; వికట కూట కోటి విటంక శృంగాటకాఢౌకమాన జరదిందు బింబ గళదమృత బిందు దుర్దినార్ద్రీకృత సల్లకీ పల్లవ ప్రభంజన పరాంజన హస్తి హస్తంబగు నస్తంబునం గల మణిప్రస్తరంబుల విశ్రాంతింజింతించిన మేకం బులక లిప్పుడుం బొడమెడు ;..... " (మనుచరిత్ర - ప్రథమాశ్వాసం- 72 వ వచనం - పుట. 51 )

అనే సుదీర్ఘ వచనంలో ఉదయ పర్వతాన్ని, మలయ పర్వతాన్ని, పశ్చిమాచలాన్ని, మానస సరోవరాన్ని, రజత శైలాన్ని, మేరు పర్వతాన్ని, అక్కడ గల జంతు జాలాన్నీ, వృక్షాలను, లతలను, రత్న రాశులను మిక్కిలి హృదయోల్లాసం కలిగించే విధంగా రమణీయంగా వర్ణించాడు పెద్దన.

ప్రవరుడు హిమాలయ పర్వతం చూడాలనే కోరికతో సిద్ధుడిచే పాదాలకు పసరు పూసుకొని హిమాలయ పర్వత సందర్శనానికి వెళ్ళాడు. అక్కడి పర్వత సౌందర్యాన్ని చూసి ప్రవరుడు ఏ విధంగా పరవశుడయ్యాడో కవి ఈక్రింది పద్యంలో మనోహరంగా వర్ణించాడు.

చ॥ అట ఝజని కాంచె భూమిసురు డెడంబర చుంబి శిరస్సర జ్ఝరీ
పటల ముహుర్ముహుర్లుఠ దభంగ తరంగ మృదంగ నిస్వన
స్ఫుట నటనానుకూల పరిపుల్ల కలాప కలాపిజాల మున్
గటక చరత్కరేణుకర కంపిత సాలము శీతశైలమున్
(ద్వితీయాశ్వాసం -పుట. 54 )

ఈ పద్యం వినగానే ఎవరికైనా తాము వెంటనే హిమాలయ సౌందర్యాలను ఆశ్వాదించాలనే కోరిక, ఉత్సాహం కలగడం సహజం . ఆకాశాన్నంటే శిఖరాల నుండి దుముకుతున్న సెలయేళ్ళ మ్రోత మృదంగ వాయిద్యంలా ఉందని, ఆ వాయిద్య తాళ గతులకు తగ్గట్టుగా

నెమళ్ళు పురివిప్పి నర్తించెనని, ఆడు ఏనుగులు తమ తొండాలచే సాలవృక్షాలను కదిల్చి వేస్తున్నాయని మనోహరంగా వర్ణించాడు.

అలకానదీతీరంలో తుమ్మెదలు చేసిన హడావుడ్ని ఈవిధంగా వర్ణించడం పెద్దన చేసిన శైలీ విన్యాసానికి చక్కని ఉదాహరణ.

క॥ ఉల్లల దలకాజలకణ
పల్లవిత కదంబముకుళ పరిమళ లహరీ
హల్లోహల మద బంభర
మల్లధ్వను లెస ఘగ విసరె మరుదంకురుముల్
(ద్వితీయాశ్వాసం- 6 వ పద్యం - పుట -55 )

అలకానదీ నీటి తంపరులతో చిగిర్చి పూచిన కడిమి పూల యొక్క మకరందాన్ని త్రాగి మదించిన గండు తుమ్మెదల ఝుంకారాలతో మెల్ల మెల్లగా చల్లని గాలి వీచిందని అంతేకాకుండా, ఏనుగులను, పెద్ద పులులను, అడవి పందులను, ఋశ్యమృగాల్నీ, ఎలుగుగొడ్లను, తేనెటీగల గుంపును మొదలగు జంతుజాలాన్నీ, వాటి చేష్టల్నీ శిరీష కుసుమపేశల సుధామయోక్తులు హృదయంగములయినవని ఈక్రింది పద్యంలో కడు రమణీయమైనవర్ణన చేశాడు పెద్దన .

సీ॥ "తొండముల్ సా చి యందుగు జిగుళ్ళకు నిక్కు
కరుల దంతచ్ఛాయ గడలుకొన గ
సెలవుల వనదంశములు మూ గి నెఱెవెట్ట
గ్రోల్పులుల్ పొదరిండ్ల గుఱక లిడ గ
సెలయేటి యిసుకలంకల వరాహంబులు
మొత్తంబులై త్రవ్వి ముస్తెలెత్త
నడ్డంబు నిడుపు నాపడ్డలగతి మను
బిళ్లు డొంకలనుండి క్రేళ్లుదా ట
తే॥ బ్రబల భల్లుక నఖభల్ల భయద మథన
శిథిల మధుకోశ విసర విశీర్ణ మక్షి
కాంతరాంతర దంతురితాతపమునఃష
బుడమి తిలతండులన్యాయమున వెలుంగ
(ద్వితీయాశ్వాసం-7 పద్యం-పుట.55 ) అని వర్ణించాడు కవి. ప్రవరునిచే తిరస్కరింపబడిన వరూధిని విరహ అవస్థను వర్ణించే సందర్భంలో పర్యావరణ వర్ణన చేశాడు పెద్దన. " ఏ విహంగము గన్న నెలుగించుచు సారెకును సైకతంబుల గూడ దారు"అని చెప్పిన పద్యంలో సంధ్యా కాలంలో ప్రియుడ్ని ఎడబాసిన చక్రవాకీ పక్షులను, ఏనుగుల అవస్థలను వర్ణించిన తర్వాత సూర్యాస్తమయ మైనట్లు చెప్పాడు . చీకటిని వర్ణిస్తూ ....

క॥ బహుళజల ప్లవమాన
ద్రుహిణాండము చెమ్మ యుఱికి రూక్షార్క విభా
రహితత గాటుకపట్టెను
రహి చెడి యవ సంధతమస రాసులు బెరసెన్
(తృతీయాశ్వాసం-18 పద్యం - పుట.75 )

మిక్కుటమైన ఆవరణం వల్ల తేలియాడే బ్రాహ్మాండం మిక్కిలి చెమ్మగిల్లి తీక్షణమైన ఎండ తాకకపోవడం వల్ల బూజు పట్టి నల్లగా అయిందేమో అన్నట్లుగా కటిక చీకటి మెల్ల మెల్లన దశదిశలు ఆక్రమించిందని అందంగా ఉత్ప్రేక్షలో వర్ణించాడు కవి.

దేవకాంత పుంజకస్థల ముని తపాన్ని భగ్నం చేయడానికి వచ్చినపుడు చేసిన వసంత ఋతు వర్ణనలో అందమైన పర్యావరణం కనిపిస్తుంది.

చ॥ అనువగు సుళ్ళ నొప్పు మలయానిలవాహము నెక్కి తేంట్ల న
ల్లిన నిడువాగె ఝబూని లవలీ నవవల్లిక లెమ్మె పొమ్ములై
వ నుమ డ ఝ జెట్లు వట్టి మను ప్రా ఝత దళమ్ములతోడ ఝదోలె నా
మనిదొర మంచురాజు మడిమంచగ ఝగోయిలగంట మ్రోయ ఝగన్
(షష్ఠాధ్యాయం-26 పద్యం -పుట.158)

వసంత ఋతువు రాగానే దక్షిణపు గాలి వీచిందని, తుమ్మెదలు విపరీతంగా సంచరింపసాగాయని. వెన్నెల తీగలు చివుళ్ళతో ప్రకాశిస్తూ నలువైపుల అల్లుకొన్నాయని, మంచు కాలం గడుచుట వల్ల పండుటాకులు రాలాయని, ప్రపంచీకరణ నేపథ్యంలో ఋతువుల పేర్లు మరచిపోతున్న మనకు ఆయా కాలమందలి ఋతువుల

గొప్పదనాన్ని , అందచందాల్నీ తెలుసుకోవడానికి ఈక్రింది పద్య మందలి వర్ణన ఎంతో ఆవశ్యకం.

సీ॥ "సానదేఱి పాటమరించి నెఱె వాసినయట్టి
యాకురాలువు గండ్లయందు ఏదొఱ గి
యతిబాల కీరచ్ఛ దాంకురాకృతి ఏబొల్చి
కరవీర కోరక గతి ఏగ్రమమున
నరుణంపు మొగ్గలై యర విచ్చి పికిలియా
కల దండలట్లు గుంపు లయి పిదప
రేఖ లేర్పడ ఏగ వర్ధిల్లి వెడల్పయి రెమ్మ
పసరువాఱుచు నిక్క ఏబసరు కప్పు
తే॥ పూ ఏట పూ ఏటకు నెక్క ఏగప్పునకు ఏదగిన
మెఱు ఏగు నానా ఏటికిని మీ ఏద గిఱిగొనంగ
సొగయై యాకు వాలంగ జొంప మగుచుఏ
జిగురు దళుకొత్తె ఏదరులతా శ్రేణులందు"
(షష్ఠాశ్వాసం - 27 పద్యం - పుట. 158)

వసంత కాలం రాకతో చెట్లు, లతలు మున్నగువాని యందు పండుటాకులు రాలిపోతాయి. ఆ ఆకులు రాలిన స్థలంలో తేమ కలిగి , గ్రుడ్డు నుండి బయటకు వచ్చిన శుక కిశోరముల పక్షాంకురముల వలె కనిపించి, తర్వాత ఎర్రగన్నేరు రంగు ముకుళములై, తర్వాత ఆ చివరలు పికిలి పిట్ట వెంద్రుకల వలె ఏర్పడి పిదప ఈనెలు బలసి, పసరు రంగు కలిగి , ఆ పచ్చదనము నలు పెక్కి తగిన కాంతితో పొడవు పెరిగి చిగురుటాకు వెలుగొందె నని, పండుటాకు రాలిన తర్వాత చిగురుటాకు వచ్చే దశలను ఎంతో రమణీయంగా వర్ణించాడు కవి.

వసంత ఋతువులో కోయిలలు మనోహరంగా కూస్తాయి, అందులో హిందోళ రాగం కనిపిస్తుంది. వసంత కాలం వచ్చిన వెంటనే జరిగే దృగ్విషయాలన్నింటినీ ఈక్రింది పద్యంలో వర్ణించాడు పెద్దన.

సీ॥ చలిగాలి బొండు మల్లెలపరాగము రే ఏచి
నిబిడంబు సేసె వెన్నెలరసంబు
వెన్నెలరల ముబ్బి వెడలించె దీర్ఘికా
మంద సౌగంధిక మధునదంబు
మధునదం బెగ ఏబోసె మాకందమాలికా
క్రీడానుషంగి భృంగీరవంబు
భృంగీరవం బహంకృతి ఏ ధీఏ గె సాగించెఏ
బ్రోషిత భర్తృకా రోదనముల
విపిన వీథుల వీతెంచె గుపిత మదన
సమద భుజ నత సుమ ధను ష్టాంకృతములు
సరస మధుపాన నిధువనోత్సవ విలీన
యువతి యువకోటి కోరికల్ చివురు లొత్త (షష్ఠాశ్వాసం- 29 పద్యం -పుట ,159 ) వసంత కాలంలో చల్లని గాలులచే ఎగసినా మల్లికా పుష్ప పరాగం చేత, చంద్రిక వల్ల స్రవించుచున్న జలం చిక్కబడింది. వెన్నెల నీటి ముంపు వల్ల సమీపంలో గల ఎఱ్ఱ కలువల పూతేనె చక్కగా ప్రవహించింది. పుష్ప మకరందంచేత తియ్య మామిడి చెట్లలో తిరుగుచున్న మధుకరముల ధ్వని హెచ్చింది. వాటి వల్ల దేశాంతరమందున్న భర్తల గూర్చి స్త్రీలకు విచారం ఎక్కువైంది. వానిచే మదనుని పుష్ప బాణాల మ్రోతలు విహార వనములందు అలము కొన్నాయి. ఆ బాణ ధ్వనులు వ్యాప్తి కాగా మధురములైన మద్యములను గ్రోలి ఆడుచున్న స్త్రీ పురుషుల కోరికలు తీరాయి.

నదీ తీరాన్ని, అక్కడ గల జంతుజాలాన్ని, వృక్ష సంపదను వర్ణించడంలో పెద్దన అందెవేసిన చేయి. స్వరోచి తన ముగ్గురు భార్యలతో విహరించే సందర్భంలో గంగాతీరాన్ని వర్ణించిన తీరు కడు రమణీయం.

గంగాతరంగిణీరంగత్తరంగ శీ
కర శీత సైక తోత్కరములందు
మందార మాకంద మకరంద తుంది లేం
దింది రానందకృన్నందనములష
గాంత నిశాకాంత కాంత వితర్దికా
క్రాంత భూభృద్బృంద కందరముల
మసృణ బిసాహార మాంసల హంసికా
సంస దాసార కాసార తటుల
(షష్ఠాశ్వాసం - 62 పద్యం - పుట -164 )

అంటూ గంగానదీ ప్రవాహంలో అలల తాడనానికి రేగిన నీటి తుంపరల వల్ల చల్లనైన ఇసుక తిన్నెలను,

మందార మాకంద పుష్పాల మకరందాన్ని గ్రోలి మదించిన సముదాయాన్ని చంద్ర శిలా వేదికలచే ఒప్పారు పర్వత గుహలను, తామర తుండ్లను తిని బలిసిన హంసల సమూహాన్ని మనోహరంగా వర్ణించాడు పెద్దన.

స్వరోచి వేట సందర్భంలో అడవి పందిని వర్ణించిన తీరు మిక్కిలి అందంగా భాసిల్లింది.

క॥ కుటిల కృశ సాంధ్య రజనీ
విట కోరిక కోమలచ్ఛవిస్ఫుట దంష్ట్రో
ద్భట పోత్ర ఖనిత్రాగ్ర
స్ఫుటిత వనీధాత్రి నొక్క పోత్రిం గనియెన్
(షష్ఠాశ్వాసం - 87 పద్యం- పుట -168)

అంటూ భూమిని త్రవ్వుతున్న ఆ అడవి పందిని వర్ణించడం నిరుపమానం.

భగవంతుని సృష్టిలో అత్యంత అద్భుతమైంది ప్రకృతి. సారస్వత ప్రపంచంలో ప్రకృతిని మించిన వస్తువు లేదు. ప్రకృతి దృశ్యాలను చూసి పరవశించి తాదాత్మ్యం చెందని వాళ్ళుంటూ ఉండరు. పచ్చని చెట్ల నుంచి వచ్చే స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన కమ్మని నీరు, చెవికింపైన చక్కని శబ్దం ఇవ్వని మనకు ప్రకృతి ప్రసాదించే వరాలు. ఆంధ్ర కవితాపితామహుడు బిరుదాంకితుడైన అల్లసాని పెద్దన మనుచరిత్రలో చేసిన పర్యావరణ వర్ణన మిక్కిలి శ్లాఘ నీయం. పర్యావరణ కాలుష్యం, జనాభా పెరుగుదల వల్ల మంచు పర్వతాలు కరిగిపోవడం, సముద్ర మట్టాలు పెరగడం, సునామీ,తుఫానులు, వరదలు దారితీయడం. అంటువ్యాధులు ప్రబలడం, అడవులు, జీవజాతులు నాశనమవడం చివరకు మానవ మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. ఇంత అందమైన పర్యావరణాన్ని జాగ్రత్తగా కాపాడవలసిన బాధ్యత మనందరిపై ఉంది. అప్పుడే మానవాళి మనుగడ ఈ భూమిపై మనగలుగుతుంది.

**ఆధార గ్రంథాలు :**

1. మనుచరిత్రము - అల్లసాని పెద్దన
2. తెలుగు సాహిత్య చరిత్ర - పింగళి లక్ష్మీకాంతం
3. తెలుగు సాహిత్య సమీక్ష - (రెండవ సంపుటము ) -డా. జి. నాగయ్య
4. సమగ్రాంధ్ర చరిత్ర - ఆరుద్ర

❀❀❀

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# తెలుగు సాహిత్య మాస పత్రికలు - సామాజిక సేవ

**– డా. జరుపుల రమేష్** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, ఎస్.ఆర్. & బి.జి.యన్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ & పిజి కళాశాల, ఖమ్మం.

'భాష ఒక ఆటంకం అన్నాడు చలం' తన మ్యూజింగ్స్‌లో ఒకచోట. 'ఉద్దేశించిన భావాలను మాటలు బట్వాడాచేయవు' అన్నాడు ఆరుద్ర. 'శ్మశానాలవంటి నిఘంటువులు దాటానన్నాడు' శ్రీశ్రీ. వినూత్న భావాలనూ, విప్లవకర ఇతివృత్తాలను భాషలోకి మలచడం, అక్షరాలుగా అమర్చడం ఎప్పుడూ పెద్ద సవాలే! ఆ సమస్యను కళాత్మకంగానూ, సృజనాత్మకంగానూ పరిష్కరించేవి పత్రికలే! తెలుగులో అనేక మాసపత్రికలు వస్తున్నాయి. వాటిలో కొన్నింటిని తీసుకొని అవిచేస్తున్న సాహిత్యసేవలను విమర్శనాత్మకంగా పరిశీలించడం ఈ వ్యాసం ఉద్దేశం.

కవిహృదయం కదిలితే వినిపించే శబ్దం కవిత్వం. హృదయ విస్ఫోటనాన్ని శబ్దింపజేస్తూ సమాజాన్ని మేల్కొలి పేందుకు తపిస్తూ ఆలోచనలను అక్షరబద్ధం చేస్తుంటాడు కవి. అవి దృశ్యమానం చేసి పత్రికలు సాహితీలోకానికి అందిస్తుంటాయి. జీవితానికి మార్పు అవసరం. ఈ రోజు ఉన్న జీవితం రేపు ఉండదు. అందువల్ల ఎల్లప్పుడు నిత్య నూతనంగా, చైతన్యవంతంగా ఉండటానికి ప్రయత్నిస్తూనే ఉండాలి. మారకపోతే జీవితం లేదు. దాన్ని జీవితం అనరు! వ్యక్తి మారిన తరువాత తనే సమాజాన్ని మార్చడా నికి ప్రయత్నిస్తాడు. అలా మారడానికి ఉపయోగపడే ఆయుధమే పత్రికలు. ఈ వ్యాసం కోసం రెండు మాస పత్రికలను తీసుకున్నాను.

## సాహిత్య సేవ :

పత్రికలు సాహిత్యాన్ని ఎందుకు ప్రచురించాలి? ఎవరి కోసం ప్రచురించాలి? వాటి వలన ప్రయోజనం పొందు తుంది ఎవరు? అని ప్రశ్నలు వేసుకుంటే అనేక సమా ధానాలు వెలుగులోకి వస్తాయి. ముందుగా సామాన్య ప్రజానీకాన్ని పరిశీలిస్తే.....సాహిత్యం పఠించే వారిలోనే విభజన ఉందా! అనిపిస్తోంది. పాఠశాల, మాధ్యమిక, ఉన్నత, విశ్వవిద్యాలయస్థాయిలు ఉన్నట్టే పాఠకులు కూడా వివిధ స్థాయిల్లోనే ఉంటారు. కొంత మంది పాఠ శాల వరకే చదివిన వారు, మరికొంతమంది కళాశాల వరకు చదివిన వారు, ఇంకొందరు విశ్వవిద్యాలయాల వరకు చదివినవారు, ఇంకా జోషఫ్ పులిట్జర్ లాగా చదువు రాకపోయినా వార్తలను వేరొక వాళ్ళ చేత చదువించేకునే వారు, ఇలా రకరకాలుగా ఉంటారు. వీటినన్నింటిని పత్రికలు దృష్టిలో పెట్టుకొని ప్రజల్లోకి వెళ్తూంటాయి. ప్రజానీకంలో కొంతమంది కవిత్వాన్ని ఇష్టపడుతుంటారు. మరికొంత మంది కథలను ఇష్టపడుతుంటారు. ఇంకొందరు వ్యాసాలను పరిశీలిస్తుంటారు. మరికొందరు పాశ్చాత్య సాహిత్యాన్ని పరిశీలిస్తుంటారు. ఇంకొందరు సంపాదకీయాన్ని ఇష్టపడుతుంటారు. పాఠకుల ఇష్టాను సారంగానే సాహిత్యాన్ని అందించటానికి వివిధ మాస పత్రికలు ప్రయత్నిస్తుంటాయి. ఇలా ప్రతినెల అందివ్వడం మామూలు విషయంకాదు. ఆ సేవలు అనిర్వచనీయం, శ్లాఘనీయం!

ఈ మాస పత్రికలు రెండింటిని పరిశీలిస్తే.... కథలు, కవితలు, వ్యాసాలు, కొత్త పుస్తకాల స్వీకరణ, కొత్త పుస్త కాల సమీక్ష కనిపిస్తున్నాయి. సాహిత్య ప్రస్థానం, ప్రజా సాహితి మాస పత్రికలు అభ్యుదయ, విప్లవ భావజాలంతో ఉన్న రచనలను ఎక్కువగా ప్రచురిస్తుంటాయి. ఈ భావ జాలంతో ఉన్న వ్యక్తులు తమ తమ భావాలను సాహితీ ప్రపంచానికి అందివ్వాలనే ఆరాటపడుతుంటారు. అప్పుడు ఈ పత్రికను చదివిన పాఠకుడు తప్పనిసరిగా తమలో దాగిఉన్న సృజనను వెలికి తీస్తాడు. సాహిత్యం ఆ భావ జాలానికి దూరమైపోంతుదనే తరుణంలో ఈ పత్రిక రూపంలో ఆ భావజాలం మళ్ళీ జీవం పోసుకున్నందుకు సంతోషిస్తాడు, సాంత్వన పొందుతాడు.

నదులు ఎక్కడో కొండకోనల్లో పుడతాయి. నదులు ఎంత వేగవాహినులైనా, వాటి పుట్టుక సన్నగా చిన్నగా

ప్రారంభమవుతుంది. అవి సాగే దారిలో వాగుల్ని, వంకల్ని కలుపుకుంటూ ముందుకు సాగుతాయి. అవి కొండల్ని కోనల్ని దాటుకొని మైదాన ప్రాంతాలకు చేరేటప్పటికి తన ఉగ్రరూపాన్ని ధరించి, ప్రజలకు ఆశ్చర్యాన్నీ, సంతోషాన్ని కలుగజేస్తాయి. పత్రికలు కూడా నదులు లాగా సన్నని ధార లాగా ప్రారంభమై, ఆ తరువాత అనుకున్న లక్ష్యాన్ని చేరుకోడానికి ప్రయత్నిస్తుంటాయి. ఎన్ని మైళ్ళ దూరం ప్రయాణనా, అలసిపోకుండా నడకలోనే శక్తిని సమ కూర్చు కొని, దారిలో బాటసారులు చెప్పే కతలును, గాథ లను వింటూ నేను చేయాల్సిన పని, చూడాల్సిన కోణాలు ఎన్నో మిగిలున్నాయని గుర్తుకు తెచ్చుకొని సాయంత్రానికి ఒక రూపాన్ని వెతుకుంటుంది.

ఏ దేశంలోనైనా వార్తాపత్రికల అవసరం ఉంది. అయితే ప్రజాస్వామ్యానికి అవి వారధులు, సారధులు. ప్రజలకు ప్రభుత్వానికీ మధ్య అవగాహన, సద్భావనా వారధులు నిర్మిస్తాయి. ప్రజల అవసరాలు ఏమిటో తెలుసుకోవడానికి పత్రికలు మంచి సాధనాలు. ప్రజాభి ప్రాయాన్ని జాగృతం చేయడంలో వాటిది సారధి పాత్ర. ప్రభుత్వం చేసే మంచి పనులను ప్రజలు అజ్ఞానం తోనో, అమాయకత్వంతోనో ప్రతిఘటించవచ్చు. ప్రజలకు ఆ విష యాల మీద అవగాహన గానీ, చైతన్యం గానీ రావడానికి దిన పత్రికలు, మాసపత్రికలు ఉపయోగపడుతుంటాయి. నెల రోజులకోసారి వెలువడే మాసపత్రిక వల్ల ఎవరికి లాభం? ఏ విషయాన్ని ప్రజలకు అందిస్తుంటాయి? అనే సందేహాలు పాఠకులకు తప్పకుండా కలగక మానదు.

రూసో సమాజాన్ని బాగా అర్థం చేసుకున్నాక 'ఈ సమాజం వద్దు, తిరిగి ప్రకృతిలోకి వెళ్ళి పోవాలి' అనడంలో ఉద్దేశం ఏమిటి? అనే విషయాన్ని పరిశీలిస్తే ఇప్పుడున్న సమాజం కంటే ముందున్న సమాజం వ్యవస్థకు (ప్రజలకు) అనుకూలం. ఈ విషయం తెలియలంటే ముందుగా అనుభవించాలి, లేదా ప్రత్యక్షంగా చూడాలి. ఇది అందరికి సాధ్యమయే పని కాదు. కాబట్టే ఆ పనిని పత్రికలు సామాజిక సేవా దృక్పథంతో చేస్తున్నాయి.

ప్రాచీన కాలంలో ఒక ప్రాంతంలో ఉన్న మనిషికి, మరొక ప్రాంతంలో ఉన్న మనిషికి సమాచారం తెలియ జేయడానికి పావురాలని, గుర్రాల్ని వాడుకునే వారు. ఈ అవకాశం అందరికి ఉండేదా! లేక సమాజంలో కొంత మందికే ఉండేదా! అని చరిత్రను పరిశీలిస్తే కొన్ని అంశాలు వెలుగులోకి వస్తాయి. పూర్వ కాలంలో రాజరికం ఉండేది కాబట్టి, రాజులు మాత్రమే పావురాల్ని, గుర్రాల్ని వాడుకునే వారు. వాటి వల్ల తమకు కావల్సిన విషయా లను తెలుసుకునే వారు. మిగిలిన సామాన్య ప్రజలు వాటి జోలికి వెళ్ళే వారు కాదు. ఒకవేళ వెళ్ళినా ఆ గ్రామ అధికారికి విషయం తెలిస్తే కఠినమైన శిక్షలు వేసేవాడు. పావురాలు, గుర్రాలతో పాటు రాజులు శాసనాలు వేయించేవారు. వాటి ద్వారా కూడా రాజ్యంలో రాజు అనుసరించే మార్గాలు తెలుస్తుండేవి. రాజ్యంలో ఉండే వారందరు పావురాల్ని, గుర్రాల్ని వాడుకుంటే శత్రు సైన్యాన్నికి బలం, బలహీనత తెలిసే అవకాశం ఉంటుంది. రాజ్యంలో రాజుతో పాటు, ధనికులు కూడా ఈ అవ కాశాన్ని వాడుకునే వారు. ఆ క్రమంలోనే మెల్లమెల్లగా విషయ చేరవేతకు స్వేచ్ఛ కావాలనే ధోరణి ప్రజల్లోకి వచ్చింది.

జాన్‌గూటెన్‌బర్గ్ అచ్చుయంత్రం వచ్చాకే పత్రికలకు అసలైన అవతరణ జరిగిందని భావించవచ్చు. తొలితరం పత్రికలు, మాసపత్రికల్లో ఒక సమకాలీన విషయాన్ని తీసుకొని ఆ రోజుకు, నెలకు ప్రచురించేవారని పరిశోధ కులు చెప్తూంటారు.

బైరన్ "A Single drop of ink, that make the millions to think" అంటాడు. ఈ విషయాన్ని పత్రికలకు అన్వయిస్తే ఇట్టే సరిపోతాయి. విషయం సరిగ్గా తెలియక పోతే అందరితో పాటు ముందుకు వెళ్ళలేము. విషయం తెలిసిన వ్యక్తి సమాజాన్ని ప్రశ్నించగలడు. విషయం తెలియాలంటే అక్షర జ్ఞానం ఉండాలి. అక్షర జ్ఞానం ఉన్న ఈ దేశంలో ఎంత మంది రోజుకు పత్రికలు, నెలకు వచ్చే మాస పత్రికలు చూస్తున్నారు, చదువుతున్నారు అనే విషయాన్ని ఇక్కడ వదిలేద్దాం. విషయం తెలిశాక మన నిధులు, మన అధికారాలు, మనది, మనకు వచ్చే ఎటి నైనా సాధించుకోవడానికి మార్గం సుగమం అవుతుంది.

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

ఎప్పుడైతే వ్యక్తి చైతన్యవంతుడు అవుతాడో, అప్పుడే గ్రామం చైతన్యం అవుతుంది. తరువాత పట్టణం, జిల్లా, రాష్ట్రం, దేశం, ప్రపంచం అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది.

థామస్ జెఫర్సన్ " ప్రజాస్వామ్యం లేని పత్రికలు కావాలా? పత్రికలు లేని ప్రజాస్వామ్యం కావాలా? అని నన్నడిగితే ప్రజాస్వామ్యం లేని పత్రికలే కావాలంటాను. ఎందుచేతనంటే పత్రికలు ఉంటే వాటి వెనుకనే ప్రజా స్వామ్యం ఎలాగా వస్తుంది" అని అంటాడు. సమాజం మీద అవగాహన లేని ప్రజలు ప్రజాస్వామ్యం అంటే తెలు సుకునే స్థాయిలో ఉంటారా? దేశంలో సగానికి సగం మందికి తెలియదనే భావించాలి. ఏమో అధికారులు వస్తున్నారు, హామీలు ఇస్తున్నారు పోతున్నారనే విషయం మాత్రమే తెలుసు. డా. కేశవరెడ్డి రాసిన 'చివరి గుడిసె' నవలలో ప్రభుత్వ మంటే, స్వాతంత్ర్య మంటే పట్వారీలే కదా! అని అమాయకంగా పాత్ర నోట అనిపిస్తాడు. ఇది ఇంత సత్యమో ప్రజాస్వామ్యం గురించి తెలియకపోతే అదే జరుగుతుందనే విషయాన్ని పత్రికలు తెలియ జేస్తున్నాయి. యూరప్‌ని శాసించిన నెపోలియన్ "వెయ్యి తుపాకులకన్న ఒక పత్రికకు ఎక్కువ భయపడాలి" అంటాడు. (భారతీయ పత్రికారంగం చరిత్ర. మాడభూషి కృష్ణప్రసాద్. 2015. నవచేతన పబ్లిషింగ్ హౌస్. పుట: 15) కాబట్టి పత్రికలనేవి నిత్యం ప్రజల తరపున ఉండి సమాజాన్ని ప్రశ్నిస్తుంటాయి.

పత్రికలో వచ్చే కవితలు, కథలు, వ్యాసాలు అన్నీ కూడా సమకాలీన జీవితాలను చిత్రించేటట్టు ఉంటాయి. వీటిని చదవిన పాఠకుడు ఇది తమ జీవితమే కదా! అనే అనుకుంటాడు. ఆ తరువాత తన సమాజాంలోకి వెళ్ళి చూసుకుంటాడు. అప్పటికి గానీ వాస్తవ జీవితం తెలియరాదు. కాబట్టి ఇన్ని రకాలుగా ఈ మాసపత్రికలు సమాజానికి ఎంతో సేవ చేస్తున్నాయి. అంతే కాకుండా ఈ తరం పరిశోధకులకు ఇవి ఎంతగానో తోడ్ప తుంటాయి. నూతనంగా పరిశోధనలో చేరే వారు పరిశోధ నాంశాన్ని ఎన్నుకోడానికి నానా తంటాలు పడుతుంటారు. వీటిలో వచ్చే వ్యాసాలు, కథలు, కవితల ద్వారా ఫలనా అంశం చాలా బాగుంది, ఇది పరిశోధనకు తీసుకుంటే బాగుంటుదని భావించుకుంటాడు. ఇలా నెలనెల వచ్చే మానపత్రికలు వారికి దిక్సూచిలా ఉపయోగపడ తుందనడంలో అతిశయోక్తి లేదు. ఆ మాస పత్రికలను పరిశీలిస్తే...

## మాస పత్రికలు :

### 1. సాహిత్య ప్రస్థానం :

సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో 2002లో 'త్రైమాసిక పత్రిక'గా సాహిత్య లోకానికి 2007 వరకు సేవలు అందిం చింది సాహిత్య ప్రస్థానం. 2007 ఏప్రిల్ నెలలో సాహిత్యా నికి మూడు నెలలకు ఒకసారి చేసే సేవలు ప్రజానీకానికి అందడంలేదని భావించి "మాస పత్రికగా" సాహితీ లోకం ముందుకు వచ్చింది. ఈ మాసపత్రికలో కవితలు, కథలు, వ్యాసాలు, స్వీకారం, డైరీ అనే శీర్షికలు ఉన్నాయి.

### 2. ప్రజాసాహితి :

రంగనాయకమ్మ ఆధ్వర్యంలో 1977 అక్టోబర్ నెలలో ప్రజాసాహితి పత్రిక ప్రారంభమయ్యింది. ఇది ప్రారంభం నుండి మాసపత్రికగానే చెలామణి అవుతోంది. రెండు, మూడు సంవత్సరాల తర్వాత రంగనాయకమ్మ ఈ పత్రిక బాధ్యతలను జనసాహితి వారికి అప్పగించారు. అప్పటి నుండి ఈ పత్రిక బాధ్యత జనసాహితి నిర్వహిస్తోంది. ఈ పత్రికలో సంపాదకీయం, కథ, పుస్తక సమీక్ష, ప్రతి స్పందన, ధారావాహికలు, బాలసాహితి, గ్రంథాలయాలు, సంస్మరణ, శీర్షికలు, శాశ్వతనిధి, అక్షరనివాళి శీర్షికలు ఉన్నాయి.

### కవిత్వం :

అర్థం తెలియకున్నా, భావం తెలియకున్నా మనస్సును అట్టే హత్తుకునేటట్టు చేసే ప్రక్రియ కవిత్వం. పత్రికల్లో ఎక్కువగా వచన కవితలు రావడానికి అదేకారణం. కవిత్వ లక్షణాలు, లక్ష్యాలు వేరు కావచ్చు. కానీ, పత్రికల్లో ప్రచురించేటప్పుడు సంపాదకీయం మాత్రం ఎక్కువగా సరళీకృత కవిత్వానికి ఎక్కువ ప్రాముఖ్యాన్ని స్తుంద

నడంలో ఎటువంటి సందేహంలేదు. **'నేను కూడా కవిత్వం రాస్తాను, రాయగలను'** అనుకునే వారికిది గొప్ప అవకాశం. కొన్ని సందర్భాల్లో కవిత్వం పూర్తి స్థాయిలో ఏ భావాన్ని చిత్రిస్తుందో కూడా తెలియకుండా రాసే అవకాశాలు ఉన్నాయి. ఎందుకంటే ఎవరి స్థాయిలో వారు అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది కాబట్టి. ఈ పత్రికలు సామాన్య వ్యక్తి కూడా కవిగా ఊహించుకునే అవకాశం కల్పిస్తున్నాయి. **'ఇంకా రాయాలనే ఆలోచన, నేను కూడా రాయాలి, అందరూ రాయాల'**నే ఆలోచనకు ఈ పత్రికలు పునాది నిస్తున్నాయి.

ఒకసారి రాసిన వ్యక్తి మళ్ళీ మళ్ళీ రాయాలనే స్పృహ కలిగిన వారు ఒక సంఘటనకో, ఒక సందర్భానికో, ఒక వాదానికో స్పందించి తన భావాలకు అక్షరరూపం ఇస్తాడు. వాటికి ఈ పత్రికలు ఊతం ఇస్తున్నాయి. ఒకసారి రాసిన వాటికి తర్వాత రాసే వాటికి చాలా వ్యత్యాసం ఉంటుంది. దానికి కారణం ఈ పత్రికల ప్రోత్సాహమే! కొన్ని సందర్భాల్లో ఇటువంటి రచనలను ప్రచురించే అర్హత ఉందా! అనే సందేహం కలుగుతుంది. అర్హతను గురించి ప్రశ్నిస్తే అది వాళ్ళ విజ్ఞతకు వదలిపెట్టి మంచి రచనలు ప్రోత్సహించాలి.

## కథ :

ఈ వ్యాసానికి తీసుకున్న రెండు మాస పత్రికలు ఎక్కువగా కథలను ప్రచురిస్తున్నాయి.రెండు కూడా వేరు వేరు భావజాలలకు చెందిన కథలే. కథలు మనిషిని కట్టిపడేస్తుంటాయి. భావానికనుగుణంగా భాషను వాడుకుంటూ రచయిత కథను ముందుకు తీసుకెళ్తాడు. కొన్ని సందర్భాల్లో స్థాయికి తగ్గట్టు లేకున్న ప్రోత్సాహించాలనే లక్ష్యంతో పత్రికలు వాటిని ప్రచురిస్తుంటాయి. అలా చేయడానికి కారణాలు....

- తెలుగు భాషను(మాతృభాషను) కాపాడుకోవడం.
- భాషా నైపుణ్యాలను అభివృద్ధి పరుచుకోవడం.
- సామాన్య వ్యక్తిని కూడా కవిగా, రచయితగా మార్చడం.
- సమాజంలో ఉన్న సున్నిత సమస్యలను ప్రజలోకి తీసుకెళ్ళడం
- ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా ఉండడం.
- తొలితరం రచయితలను ప్రోత్సాహించడం.
- భావ వ్యక్తీకరణను ప్రోత్సాహించడం.

ఉదాహరణకు ఒక విషయాన్ని నేరుగా ప్రశ్నించలేము. అలా ప్రశ్నించే విధానం ఉంటే ఏ దేశంలో సాహిత్యం అనేది వచ్చేది కాదు. అందువల్ల ఆ విషయానికి సృజనాత్మకతను జోడించి, వాటికో సంఘటనను, సన్నివేశాన్ని సృష్టించి వర్ణనలను చేస్తూ రచనను చేస్తుంటారు. కాబట్టి ఏ కథ రాసిన అంతిమ లక్ష్యం సమాజ అభివృద్దే! కొన్ని సందర్భాల్లో ఈ కోవకు చెందకపోయి ఉండవచ్చు. వాటి గురించి చర్చే అనవసరం!

కొన్ని సందర్భాల్లో ఒక భావజాలంతో రాసిన కథలను కొన్ని మాస పత్రికలు ప్రచురించకపోవచ్చు. ఇంతకు ముందే చెప్పినట్టు ఏ పత్రికకైనా ముందుగా వారు ఏర్పరచుకున్న నియమ నిబంధనలు ఉంటాయి. ఒక పరిధికి లోబడి ఉంటారు. ఆ పరిధిలోనే అటువంటి కథలను ప్రచురిస్తుంటారు. ఈ వ్యాసానికి తీసుకున్న మాసపత్రికల్లో అభ్యుదయ, విప్లవ భావజాలంతో ఉన్న కథలు ఎక్కువగా వస్తుంటాయి.వీటిలో కూడా అనేక కోణాలు, అనేక కారణాలు గోచరిస్తున్నాయి.

## బాలసాహిత్యం :

మాసపత్రికలలో బాలసాహిత్యం కూడా ప్రచురిస్తుంటారు. పిల్లలకు సాహిత్యం ఎక్కడుంది, ఎవరు చదువుతారనే ప్రశ్నలు ఎదురౌతుంటాయి. పిల్లల నుంచి, పెద్దల వరకు అందరు చదివే ప్రక్రియ / చదివించే ప్రక్రియ బాలసాహిత్యం. భాష తనరూపం ఎలా సంతరించుకుంటుందో దీని ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది. ఈ మాస పత్రికల్లో ఉండే బాల సాహిత్యం ఎవరికి ఉపయోగపడుతుంది? పిల్లల జీవితాలను ఇతివృత్తంగా తీసుకొని కవితలు, కథలు మొదలైన ప్రక్రియలను రాస్తూంటారు.

- భ్రూణ హత్యలు
- బాల్య వివాహాలు

- విద్యకు దూరమవ్వడం
- అనారోగ్యం

పైన పేర్కొన్నవే కాకుండా అనేక రకాలైన సమస్యలు ఎదురౌతుంటాయి. వీటిని సమాజానికి తెలియజేయ డానికి ఉన్న ఏకైక ఆధారం పత్రికలు, మీడియా. వీటి మీద ఎవరైన పరిశోధన చేసి పుస్తకం రాస్తే ఆ రచన ప్రభావం బాగా చదువుకున్న వారి పైనే ఉంటుంది. కానీ సామాన్య ప్రజానీకంలో వెళ్ళడానికి నిరంతరం అందు బాటులో ఉండే పత్రికలే దోహదపడుతాయి. ఈ పత్రికలు చేస్తున్న సేవలో మరువలేని అంశం బాలసాహిత్యాన్ని ప్రచురించడం.

**వ్యాసం :**

ఈ రెండు మాసపత్రికలు వ్యాసాలు ప్రత్యేక శీర్షికతో ప్రచురిస్తున్నాయి. వ్యాసం రచయిత ఆంతర్యాన్ని అర్థం చేసుకోవడానికి దోహదపడే ప్రక్రియ. ఒక రచయిత రచన లను పూర్తి స్థాయిలో చదివే అవకాశం ప్రస్తుత కాలంలో చాలా తక్కువని భావించాలి. ప్రపంచీకరణ యుగంలో అందరు సంఘణక పరికరాలతో, చరవాణిలతో కాలం గడుపుతున్నారు. తీరిగ్గా కూర్చుని చదివే సమయం లేని తరుణంలో ఒక రచయిత రాసిన రచనని పూర్తి స్థాయి చదివే అవకాశం ఎక్కడుంది? పూర్తి స్థాయిలో కాకుండా ఎంతో కొంత సాహిత్య ఆసక్తి ఉన్న వారికోసం ఆధునిక భావజాలంతో ఉన్న వ్యాసాలను ప్రోత్సహించడానికి కారణం ఇదే.

నిచ్చెనమెట్ల సమాజంలో ఉండే తేడాలు లేకుండా ఉండాలనే నిబంధనతో రాసిన కవులు, రాస్తున్న రచ యితల రచనలను, ఆ భావజాలంతో ఉన్న పాశ్చాత్య సాహిత్యకారుల రచన పై వ్యాసాలను ఈ రెండు మాస పత్రికలు చాలా సందర్భాల్లో ప్రచురితం చేసినట్టు మాసపత్రిక ద్వారా తెలుస్తోంది. ఇలా చేయడం వల్ల తెలుగు సాహిత్యానికి ఎటువంటి ప్రయోజనం ఉం టుంది? ఒక పత్రిక ఈ కోణంలో చిత్రిస్తే, ఇంకో పత్రిక మరోకోణంలో ఆలోచించే రచయితల రచనలపై వ్యాసా లను ప్రోత్సహించే అవకాశం ఉంది. ఇలా చేస్తే సాహిత్యా నికి పూర్తి స్థాయిలో సేవలందినట్టే! అందుకే ఒక్కొక్క పత్రిక వారివారి భావజాలాలతో ఉండడం వల్ల సాహిత్య ప్రియులకే లాభం అనే విషయం అర్థమౌతోంది. ఆ ప్రచురణ సంస్థకు కూడా మేమే ఫలనా దాని పైన కృషి చేశాం, సేవ చేశాం అనే ఆనందందక్కుతుంది.

**పుస్తక సమీక్ష :**

మాస పత్రికలు చేస్తున్న సేవల్లో అత్యంత ప్రముఖ మైనది పుస్తక సమీక్ష. కవులు / రచయితలు రాసిన కొత్త పుస్తకాలు అందరూ కొనే స్థితిలో ఉండరు. అలాగే అందరికి అందుబాటులో ఉండవు. అలాగే అందరికి సమయానికి అందవు. ఉన్న పుస్తకాలనే చదివే వాళ్ళు కరువౌతున్న ఈ తరుణంలో కొత్త పుస్తకం ఎవరు చదువుతారు? తెలుగులో కొత్త పుస్తకాలు వచ్చాయని తెలిసేది ఎలా? వీటికి గొప్ప పరిష్కారం చూపాయి ఈ మాసపత్రికలు. ఈ పత్రికల్లో ఒకటి, రెండు పేజీలు కేటా యించి 'స్వీకారం, సమీక్ష' అనే శీర్షికలతో పాఠక ప్రజా నీకానికి నూతన పుస్తకాలు తెలుసుకునే అవకాశం, ఆ పుస్తకంలో ఉన్న సూక్ష్మ విషయాలు తెలుసుకునే అవకాశాన్ని ఈ పత్రికలు కల్పిస్తున్నాయి.

**పత్రిక సేవ - ప్రయోజనాలు :**

మాస పత్రికల ద్వారా సాహిత్యానికి ఎటువంటి ప్రయోజనాలు చేకూరుతున్నాయి అని ఆలోచిస్తే

- పాఠకుడు భాగస్థుడవడం.
- పాఠకుడు తమ స్వీయ రచనను సొంతంగా ప్రచురించలేకపోయాననే కోరిక తీరడం.
- కొత్త కొత్త రచయితలు సాహిత్య లోకానికి పరిచ మయ్యే అవకాశం
- తెలుగులో కొత్త భావాలను ప్రోత్సహించడం
- ప్రభుత్వ పాలన అంశాలు ప్రజలు తెలుసుకునే అవకాశం కలగడం
- మరుగున పడిన రచనలకు పునర్జీవనాన్ని కల్పిం చడం
- స్పందన - ప్రతిస్పందనను తెలుసుకునే అవకాశం

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

**ముగింపు :**

చివరగా "పత్రిక అసలైన దానిని, విశిష్టమూ, నాటకీయమూ, భావోద్వేగపూరితమూ, ఉత్కంఠ భరితమూ, అద్వితీయమూ, ఉత్సుకతా పూర్వకమూ, హాస్య స్ఫోరకమూ, అపురూపమూ అయి చదువరులు మాట్లాడుకొనేదానిని వెదకాలి. అదే సమయంలో వాళ్ళ మంచి అభిరుచులకు విఘాతం కలుగకూడదు. అలాగని పత్రికాస్వరంలో ఉండే సాధారణ తీవ్రత తగ్గకూడదు. అన్నిటికీ మించి అభిరుచులకు విఘాతం కలుగకూడదు. అలాగని పత్రికాస్వరంలో ఉండే సాధారణ తీవ్రత తగ్గకూడదు. అన్నిటికీ మించి ప్రజలకు దాని కథలలో ఉండే విశ్వాసం సన్నగిల్లకూడదు. అది ఆధారపడ తగినదని, పరిపూర్ణగా వుండగలదన్న వాళ్ళ నమ్మకం కూడా వమ్ము కాకూడద"ని అంటాడు జోసఫ్ పులిట్జర్. (భారతీయ పత్రికారంగం చరిత్ర. పుట: 20) కాబట్టి తెలుగు మాసపత్రికలు చేస్తున్న సేవ మరువలేనిది. యువతరాన్ని దృష్టిలో పెట్టుకొని వారిని ప్రోత్సహిస్తూ, ఉత్తేజితులయ్యేలా ప్రేరేపించడం బాధ్యతగా భావించాలి. కొత్త తరానికి, కొత్త రచయితలకు, కొత్త రచనలకు, సరికొత్త భావజాలాలకు, ఉన్నత పీఠాన్ని అందిస్తున్నాయనడంలో ఎటువంటి విప్రతిపత్తి లేదు.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# తెలుగు కథ - శ్రామిక వర్గ ఉద్యమం

- డా॥ కె.వెంకటరమణ, సహాయ ఆచార్యులు, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

తెలుగు కథా ప్రపంచంలో చిరస్మరణీయుడు సి.పి. బ్రౌన్. ఆయన తెలుగు భాషా సాహిత్యాలకు ఎనలేని సేవ చేశాడు. 'తాతాచార్యుల కథలు' అనే అపురూప కథాసంపుటిని తెలుగుజాతికి అందించాడు. ఆయన కంటే ముందు కల్నల్ మెకంజి తెలుగు భాషా సాహిత్యాలకు సేవ చేసినవాడు. ఆయన సేకరించిన కైఫీయత్‌లలో జన వ్యవహారంలోని కథలు కూడా వున్నాయి.

ఆధునిక తెలుగు కథ 1910 సంవత్సరంలో మహాకవి గురజాడ రచించాడు. అదే దిద్దుబాటు కథ. నాటి నుండి నేటి వరకు తెలుగు కథ సమాజంలోని వివిధ అంశాల్ని స్పృశిస్తూ పరిణామం చెందుతోంది. ఆంధ్ర దేశంలోనే కాక అంతర్జాతీయ రంగంలో సైతం తెలుగు కథ తన కీర్తి పతాకం ఎగురవేసింది. సామాజిక జీవితంలోని వివిధ అంశాల్ని సున్నితంగా స్పృశించి జన చైతన్యానికి కారణ మవుతోంది. గ్రామీణ జీవితాన్ని చక్కగా చిత్రించింది. శ్రామికులు జీవితంలో నిత్యం ఎదుర్కొనే సంఘర్షణను చిత్రించి వారిని ఉద్యమ పథంలో నిలుపుతోంది. ఈ అంశాన్ని పరిశీలించడమే ఈ వ్యాసోద్దేశ్యం.

శ్రామిక వర్గ చైతన్యాన్ని చక్కగా చిత్రీకరించిన తెలుగు కథ కరుణకుమార రాసిన 'కొత్తచెప్పులు'. గ్రామాలలో భూస్వాములు శ్రామికులను పీడించడం, దోపిడీ చేయడం, వారి శ్రమ మీద సుఖాల్ని, భోగాల్ని అనుభ వించడం, ఎదురు తిరిగినవారిని నిర్దాక్షణ్యంగా అంతం చేయడం వారి నైజం. ఇలాంటి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా గుండెలు మండిన హరిజనులు సమైక్యంగా ఎదురు తిరుగుతారు. వారు భూస్వామిపై పోరాడి విజయం సాధించిన ఉదంతమే ఈ కథకు ఇతివృత్తం. ఆ గ్రామానికి చిన్నప్పరెడ్డి అనే భూ స్వామి మహారాజు. గ్రామ ప్రజలంతా తన కరుణా కటాక్షాలతో జీవించాల్సిందే. తన మాటను జవదాటిన వారిపట్ల క్రూరంగా ప్రవర్తిస్తాడు. అవసరమైతే అంతం చేస్తాడు. తనకు కొత్తచెప్పులు తెమ్మని చెప్తే 'నరిసి' కొంత ఆలస్యం చేస్తుంది. దాన్ని భరించలేని చిన్నపురెడ్డి 'నరిసి'ని కొట్టిచంపాడు. ఆ శవాన్ని చెరువులో పడవేయించాడు. దాన్ని ఆత్మహత్యగా చిత్రించాడు.

'నరిసి' కి జరిగిన అన్యాయం ఆలస్యంగా గ్రామంలోని హరిజనులకు తెలిసింది. వారంతా చిన్నపురెడ్డిగారి ఇంట్లోను, పొలంలోనూ పనులు చేయడం మానేశారు. ఆ పనులన్నీ చేసే వారులేక నిలిచిపోయాయి. ఇలా వుండగా చిన్నపురెడ్డి ఇంట్లో ఎద్దు చనిపోయింది. అతని తరపున ఎందరు ప్రాధేయపడినా ఆ ఎద్దు కళేబరాన్ని తరలించడానికి వారు నిరాకరించారు. ఈ తిరుగుబాటుతో చిన్నపురెడ్డి మానసిక వ్యధకు గురైనాడు. ఆ బాధతో కృంగికృశించి మరణించాడు.

శ్రామికుల శ్రమపైనే సమాజం నిర్మాణమవుతుంది. ఆ సమాజం అభివృద్ధి చెందాలంటే శ్రామికులు స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితులు ఉండాలి. ఎక్కడైతే అణచివేత, దోపిడీ ఉంటుందో దానికి వ్యతిరేకంగా శ్రమ జీవులు సంఘటితమవుతారు. శ్రమజీవులు సంఘటితమైతే చిన్నపురెడ్డి లాంటి భూస్వాములైనా, రాజ్య శక్తి అయినా వారి ముందు తల వంచాల్సిందేనన్న విషయం ఈ కథ ద్వారా బోధపడుతుంది.

యజమాని దోపిడీకి చైతన్యవంతమైన శ్రామికులు తిరుగుబాటు చేసి కొత్త జీవితాన్ని ఆవిష్కరించుకున్నట్లు వివరించే కథ అవసరాల సూర్యారావు రాసిన 'కొత్త పుంతలు'.

శ్రామికులు అతి తక్కువ కూలికి షావుకారు దగ్గర పనిచేసేవారు. దాంతో వారు దారిద్ర్యాన్ని అనుభవించాల్సి వచ్చింది. తమ కూలిరేట్లు పెంచమని షావుకారుని వేడు కున్నారు. ఆయన కనికరం చూపలేదు. వారు పైడి తల్లి నాయకత్వంలో సమ్మె చేశారు. సమ్మెను విఫలం

చేయాలని యజమాని భావించాడు. అందుకు తన మనుషులను పురికొల్పాడు.

ఆ ప్రయత్నాలు కొంత వరకు ఫలించాయి. అయితే 'పైడితల్లి' యజమాని మాయమాటలను నమ్మవద్దని శ్రామికులకు బోధించాడు. నూతన జీవితంపట్ల వారికి ఆశకలిగించాడు ఆ మార్గమే శ్రామికులు స్వయంగా పొగాకు కొని చుట్టలు చుట్టి సంతలో విక్రయించటం.

సంపద సృష్టించే శ్రామికుడే యజమాని. రాజ్యంపై ఆధిపత్యం కూడా శ్రామికవర్గానికే వుండాలన్నది 'కారల్‌మార్క్స్' ప్రతిపాదించిన సిద్ధాంతం. శ్రామికుడు తన శ్రమ ద్వారా సకల సంపదలు సృష్టిస్తూ పీడనకు, దోపిడీకి ఎలా గురవుతున్నాడో రచయిత చిత్రించాడు. కార్మికులే ఏ విధంగా యజమానులుగా మారవచ్చో తెలిపి వారిని చైతన్య వంతులు చేసిన కథ ఇది.

బొల్లిముంత శివరామకృష్ణ రాసిన 'గోరీలదొడ్లో' కథ. పాలేరుల చైతన్యాన్ని, పోరాటాన్ని చిత్రించింది. పాలేర్లు యజమానుల దగ్గర మౌనంగా తల వంచుకొని పని చేసేవారు వారి పెత్తందారి ధోరణులు మౌనంగా భరించే వారు. అయితే మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వారిలో చైతన్యం కల్గింది. భూస్వాములకు వ్యతిరేకంగా ఐక్యమై పోరాటం చేసిన అంశాన్ని ఈ కథ చక్కగా చిత్రించింది.

ఈ కథలో 'సామిగాడు' గా పిలవబడే స్వామి చిన్నప్పటి నుండి భూస్వాముల ఇళ్లలో నిబద్ధతగా పనిచేసుకొనేవాడు. ఇతని పట్ల యజమానులకు నమ్మకము, గౌరవం ఉంది. అయితే పాలేరుగా తను ఎదుర్కొంటున్న అవమానాలు తన కొడుకుకు ఉండకూడదనుకున్నాడు. కొడుకును బాగా చదివించుకోడానికి ప్రయత్నించాడు.

గ్రామంలోని పాలేరులందరూ ఐక్యమై సంఘం ఏర్పాటు చేసుకున్నారు. అలాంటి సంఘం పాలేర్లకు ఉపకరించదని స్వామి మొదట్లో భావించాడు. అయితే కాలక్రమంలో చైతన్యం పొంది ఆ సంఘంలో చేరాడు. ఆ సంఘానికి నాయకత్వం కూడా వహించాడు. పాలేరు సంఘం చైతన్యాన్ని, పోరాటాన్ని భూస్వాములు పోలీసుల అండదండల్తో అణచివేయడానికి ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో స్వామి బలైనట్లు కథ ముగుస్తుంది.

నిరక్షరాస్యులైన పాలేర్లు అమాయకత్వంతో భూస్వాముల వద్ద తరతరాలుగా దోపిడీకి గురయ్యారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని అవమానాన్ని గుర్తించారు. తమ జీవితాల్లాగే తమ పిల్లల జీవితాలు ఉండకూడదన్న చైతన్యాన్ని పొందారు. తమ శ్రమ దోపిడీకి అంతం పలకాలని సంఘాన్ని ఏర్పరచుకున్నారు. భూస్వామిపై పోరాటానికి ఉద్యుక్తులయ్యారు. శ్రామికులు ఐక్యమై సంఘటితం అయ్యారు. ఆ సంఘటిత శక్తి పోరాటానికి ఉపక్రమించింది. ఆ పోరాటాలే పాలేర్ల శ్రమదోపిడీని తొలగించి నూతన జీవితాన్ని ఆవిష్కరిస్తాయని రచయిత ఈ కథలో శ్రమ జీవులకు ఉద్బోధచేశాడు.

భూస్వాముల దుర్మార్గాలను బడుగు జీవుల బాధలను రూపకల్పన చేసిన కథ శ్రీ సదానంద్ శారద రాసిన 'హద్దురాయి' కథ. భూస్వామి భూముల పక్కనే నాలుగెకరాల భూమివున్న ఓ కుటుంబం తమ భూమిని కాపాడుకోడానికి మూడు తరాలుగా చేసిన పోరాటానికి, ఆ పరిణామాలకు అద్దం పట్టిన కథే 'హద్దురాయి'.

రాజయ్య పొలం భీమయ్యదొర పొలానికి ఏటికి మధ్య వుంది. రెండు పొలాల మధ్య వున్న హద్దురాయి ప్రతి ఏడాదికీ ఏటి వైపు జరుగుతూవుంది. జరుగుతున్న ఆ హద్దురాయిని ఆపడానికి మూడు తరాలుగా ఆ కుటుంబ సభ్యులు చేసిన ప్రయత్నం పెరుగుతున్న వారి చైతన్యానికి ప్రతీకగా రచయిత ఈ కథను చిత్రించాడు. రాజయ్యది భూస్వామి దౌర్జన్యాన్ని ప్రశ్నించలేనితనం. రాజయ్య కొడుకు శివయ్య 'ఇదేమిటని' ప్రశ్నించగల చైతన్యం కల్గిన వ్యక్తి. శివయ్య కొడుకు సోములు భూస్వామి దౌరజ్యాన్ని ప్రశ్నించడమే కాకుండా ఎదుర్కోడానికి సన్నద్ధుడైన వ్యక్తిగా రచయిత కథను చిత్రించాడు.

భూ స్వాములు, పెత్తందార్ల అన్యాయాల్ని, అక్రమాల్ని ప్రశ్నించడమే కాకుండా పోరాడి ఎదుర్కోగలిగితేనే శ్రమ

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

జీవులకు న్యాయం జరుగుతుందన్నది ఈ కథలోని రచయిత సందేశంగా భావించవచ్చు.

శ్రీబొల్లిముంత నాగేశ్వరరావు రాసిన 'అమ్మఒడి' కథలో భూస్వామి రంగనాథం కు వ్యతిరేకంగా పేద రైతులు సంఘటితం కావడం చిత్రతమైంది.

రంగనాథం వంద ఎకరాల ప్రభుత్వ భూమిని, పేద రైతుల భూములను ఆక్రమించు కుంటాడు. అతడు అన్యాయంగా ఆక్రమించిన భూముల వెనుక ఒక కథ వుంది. ప్రభుత్వ భూములైన ఆ బంజరుభూములు చెట్టు కుప్పలతో ఓ అరణ్యంలా ఉండేవి. కాలువలు వచ్చినప్పుడు సాగవుతాయని రైతులు ఒక్కొక్కరు ఒక్కో ఎకరం భూమిని చదునుచేసుకొని పొలాలుగా మార్చుకున్నారు. తర్వాత కొంత కాలానికి కాలువలొచ్చాయి. తమకు మంచి రోజులొచ్చాయని రైతులు సంతోషపడ్డారు. అయితే రంగనాథం తన పలుకుబడితో రైతులు సాగుచేసిన భూములకు తన పేర పట్టాలు తెచ్చుకున్నాడు.

ఈ పరిణామంతో చైతన్యవంతులైన రైతులు 'ధర్మన్న' నాయకత్వంలో ఐక్య మయ్యారు. ధర్మన్న తాత రైతులందర్నీ సంఘటితం చేశాడు. భూస్వామిపై తిరుగుబాటుకు నాయకత్వం వహించాడు. భూస్వామికి వ్యతిరేకంగా రైతులు సంఘటితం కావడాన్ని చక్కని చిత్రీకరించిందీ కథ.

కాలువలు రావడంతో తమ పొలాలు పండుతాయని రైతులు సంతోషించారు. ఆ పొలాలు తమకు జీవనాధారం అవుతాయని భావించిన రైతులకు రంగనాథం చర్య వారిలో మానసిక సంఘర్షణను పురికొల్పింది. ఆ మానసిక సంఘర్షణే చైతన్యరూపమై రైతులను సంఘటితం చేసింది. భూస్వామిపై తిరుగుబాటు చేసి పోరాడటం ద్వారానే తమ జీవితాలు బాగుపడతాయని రైతులు భావించారు. కాబట్టి దోపిడీకి గురైన వారు సంఘటితమై పోరాడితేనే న్యాయం జరుగుతుందన్నది ఈ కథలో రచయిత భావనగా చెప్పవచ్చు.

'పోరాడితే పోయేదేమీ లేదు. బానిస సంకెళ్ళు తప్ప' అని మార్క్స్ అన్నట్లు శ్రమ తప్ప తన దగ్గర ఎలాంటి సంపద లేని వాడు శ్రామికుడు. తను శ్రమదోపిడీకి గురవుతున్నట్లు చైతన్య వంతుడు కావాలి. పోరాటం చేయాలి. ఇందుకు రచయిత శ్రమజీవికి వెన్నంటి నిలవాలి. అప్పుడే సమాజం సుసంపన్నమౌతుంది. శ్రామిక రాజ్యం సిద్ధిస్తుంది.

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# పత్రికా భాష - నవీకరణ

- డా॥ కె. కరుణశ్రీ, అధ్యాపకురాలు, తెలుగు విభాగం, డి.కె. ప్రభుత్వ మహిళా కళాశాల(స్వయం), నెల్లూరు.

ఆధునిక ప్రయోజనాలు, ప్రయోగాలు, సామాజిక అవసరాలు, భాషా పరిణామం మొదలైన అన్ని విషయాలనూ గుర్తించుకొని భాషను ప్రణాళికా బద్ధంగా ఆధునీకరించడమే నవీకరణ. వివిధ శాస్త్ర గ్రంథాలను నేటి అవసరాలకు అనుగుణంగా వ్యవహారంలోకి మార్చుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. భాషను ఆధునీకరించే ప్రయత్నం కందుకూరి వీరేశలింగం, కొమఱ్ఱాజు లక్ష్మణరావు మొదలైన వారి నుంచే ప్రారంభమైంది. ఎప్పటికప్పుడు వివిధ భాషలలో వస్తున్న నూతన సాంకేతిక పదజాలం, సంస్కృతం వంటి పూర్వ భాషలలో ఉన్న తర్క శాస్త్రం, జ్యోతిషం, అశ్వశాస్త్రం, రత్న పరీక్ష, తత్వశాస్త్రం వంటి ప్రాచీన శాస్త్రాలను నవీకరించుకోవడానికి మనం ప్రయత్నిన్నానే ఉన్నాం. ఈ ప్రయత్నంలో భాగంగా భాషలో కొత్త పదబంధాలను సృష్టించే ప్రయత్నం ఈనాడు వంటి పత్రికలు నిరంతం చేస్తున్నాయి. అన్య భాషలలోని పదాలకు సమానార్థకాలు సృష్టించి వాటిని వ్యవహారంలోకి తీసుకువస్తూ పత్రికలు చేస్తున్న యజ్ఞం మహత్తరమైంది. తెలుగు పత్రికలలోని భాషను జాగ్రత్తగా గమనిస్తే భాషను నవీకరించడంలో ఎదురయ్యే సమస్యలను గమనించవచ్చు.

1. లిపి, సాంకేతీకరణ సమస్యలు
2. నూతన పద బంధాల సృష్టి
3. వాక్యరీతులు
4. పరిభాష

మనం మాట్లాడుతున్న తెలుగులో తెలుగుతో పాటు సంస్కృతం, ఉర్దూ, ఇంగ్లీషు పదాలే కాకుండా ఇతర భారతీయ భాషల పదాలు కూడా ఉన్నాయి. ఆ పదాలను లేఖనంలో తెలుగు లిపిలో రాయడం లిపి ప్రమాణీకరణంలో ఎదురయ్యే ప్రధాన సమస్య.

ఉదా : Tank -ట్యాంకు/టాంకు

Bank - బ్యాంకు/బేంకు/బాంకు

తెలుగు పదాల లేఖనంలోనూ ఇలాంటి సమస్య ఉంది.

ఉదా : ఐంది/ అయింది.

వచ్చారు/వచ్చేరు. వంటి మాటలలో ఏ రూపం రాయాలో తెలియని సందిగ్ధత తెలుగు భాషలో కన్పిస్తుంది. 'తాటాకు' వంటి పదాలలో లేఖనం ఒకలాగ ఉచ్ఛారణ మరోలాగ ఉంటుంది. ఇది మరోసమస్య. బండి 'ఱ' వాడకం తెలుగులో చాలా వరకు పోయింది. కాని అది కొన్ని మాటల్లో అర్థ బేధాన్ని కలిగించగలదు. అలాగే ప్రాత, క్రొత్త, వ్రాత వంటి మాటల్లోని క్రావడి ఆధునిక భాషలో ఉచ్చారణలోనూ, రాతలోనూ తొలగిపోయినా అప్పుడప్పుడు కొందరి రాతలో కన్పిస్తుంది. కొత్త, పాత వంటి శబ్దాలలో రేఫ పోగా 'రాత' శబ్దంలో రేఫ మాత్రమే మిగలడానికి కారణం స్వర స్థాయిలో ఉన్న భేదాలే. 'ము'కారాంత పదాలను నిత్యం పూర్ణాను స్వారంతో ముగించడం, ఆధునిక భాషలో కనిపించినా ఇంకా చాలా మంది 'ము' కారాన్ని లేఖనంలో ఉపయోగిస్తున్నారు.

మంచం, కంచం లాంటి పదాలకు విభక్తి చేరినప్పుడు, సమిష్టిగా ప్రయోగించాల్సి వచ్చినప్పుడు పూర్ణాను స్వారంతో ముగించడం కుదరదు. కాబట్టి ముకారాంత పదాలను నిత్యంగా పూర్ణాను స్వారంతో ముగించడంలో కొంత సమస్య ఉంది. అల్ప ప్రాణ, మహాప్రాణ బేధాన్ని కూడా రాతలో పాటించడం, పాటించకపోవడం రాతలో కనిపించే మరో సమస్య.

ఉదా : భేదం - భేధం / బేధం

బాధ - భాధ / బాద

జంట పదాలలో మొదటి మాటకు అర్థం ఉన్నా రెండో మాటకు అర్థం దొరకదు.

ఉదా : పిల్లా జల్లా, గొడ్డు గోద, పనీపాటా వంటి పదాలు వ్యవహారంతో వినిపిస్తూ ఉన్నా, నిఘంటువుల్లో

వాటి అర్థం దొరకదు. వానగీన, ఆటగీట వంటి పదాలలో 'గి''గీ'లు నిందార్థకాలు. ఇవి జంట పదాలు కావు.

అన్య భాషాపదాలను తెలుగులో రాసేటప్పుడు అంతంలో ఉన్న పొల్లక్షరాలను ఉకారాంతంగా రాయడం సంస్కృతం నుంచి ఇంగ్లీషు వరకు కన్పిస్తుంది.

ఉదా : మనస్ - మనసు - హల్ - హల్లు
రోడ్ - రోడ్డు - పెన్ - పెన్ను.

ఇంగ్లీషు లిపిని తెలుగులో రాసేటప్పుడే కాక తెలుగు లిపిని ఇంగ్లీషులో రాసేటప్పుడు కూడా కొన్ని సమస్యలు ఎదురవుతాయి. సంధి, సమాసాల, నిర్మాణంలో కూడా సమస్యలున్నాయి. ఆధునిక కాలంలో గసడదవా దేశ సంధి వాడకంలో ఇబ్బంది ఉంది. 'సచ్చాడు' వంటి పద ప్రయోగాలు వ్యవహర్తల అజ్ఞానానికి, నిరక్షరాస్యతకు సూచకాలుగా మారాయి. 'ఆఫీసు గది' వంటి వైరి సమాసాలు ఆధునిక భాషలో కన్పిస్తున్నాయి. ఇలాంటి వాటిని మనం ఆధునిక కాలంలో ప్రాచీన వ్యాకరణాన్ని అనుసరించి తప్పుగా పరిగణించలేం.

అన్యభాషా పదజాలాలను అనువదించేటప్పుడు మూల భాషా వ్యవహారం ఖచ్చితంగా తెలియాలి. లేకపోతే అనేక సమస్యలు ఎదురవుతాయి.

ఉదా : మోది / మోడి
పూడి / పూది
కశ్మీర్ / కాశ్మీర్
బడోద/ బరోడ

పై పదాలలో మొదటి పదమే సరైనది. రెండవ పదం మూల వ్యవహారం తెలియకపోవడం వల్ల వ్యవహారంలోకి వచ్చింది. కాబట్టి అన్య భాషా వ్యవహర్తల నుంచి వాటి మూలాలు తెలుసుకున్నాకే అనువాదం చేయడం తప్పని సరి.

మాండలిక పదాల వాడకంలో కూడా అనేక సమస్యలున్నాయి. ఒక ప్రాంతంలో వ్యవహారంలో ఉన్న మాండలికం మరొక ప్రాంతంలో అశ్లీలార్థంలో కూడా ఉండొచ్చు. కొత్త భావాలు, అర్థాలు, స్ఫురింపజేసే పద బంధాలను అనువాదం చేసేటప్పుడు కూడా సమస్యలున్నాయి. కొన్ని పదాలు ఇంతకు మునుపు ఒక అర్థంలో ప్రయోగించబడినా ఇప్పుడు మరొక అర్థం కూడా రూఢీలో ఉండవచ్చు.

ఉదా : మౌస్ అంటే కంప్యూటర్ రాకముందు ఎలుక అనే అర్థం. కానీ నేడు మౌస్ అంటే కంప్యూటర్‌కి చెందిన పరికరంగా వ్యవహారంతో ఉంది. అలాగే కీబోర్డు అన్నపదం కూడా.

జాతీయాలు లోకోక్తుల అనువాదంలో కూడా కొన్ని సమస్యలున్నాయి. ఇతర భాషలలో ఉన్న జాతీయాలను మన భాషలోకి అనువాదం చేసేటప్పుడు మన భాషలో సమానార్థకాలైన జాతీయాలు ఉన్నాయోమో గమనించాలి. అటువంటి వాటినే ఉపయోగించాలి.

ఉదా : 'బందర్ క్యాజానే - అధరక్ కా స్వాద్' అన్న హిందీ జాతీయాన్ని తెలుగు చేయాల్సి వచ్చినప్పుడు దాన్ని యధాతథంగా తెలుగులోకి అనువదించకుండా అప్పటికే మన భాషలో వ్యవహారంలో ఉన్న, సమానార్థకమైన 'గాడిదకేం తెలుసు గంధపు వాసన' వంటి సామెతల్ని ఉపయోగించాలి.

వాక్యరీతులు, పరిభాషలలో కూడా అనేక సమస్యలున్నాయి. ఆర్య భాషలలో యత్ర తర్థక వాక్యాలు, కర్మణి ప్రయోగాలు ఎక్కువ. తెలుగులో అలాంటి లేవు.

ఒక్కోసారి ఒక పదం యొక్క అర్థం శాస్త్రాన్ని బట్టి కూడా మారుతుంది. అటువంటి వాటిని దృష్టిలో ఉంచుకోవాలి.

ఉదా : 'ధ్వని' అంటే భౌతిక శాస్త్రంలో ఒక అర్థం. అలంకార శాస్త్రంలో మరొక అర్థం ఉంది. అలాగే 'సంధి' అంటే చరిత్రలో ఒక అర్థం వ్యాకరణంలో మరొక అర్థం ఉంది. రసం అంటే అలంకార శాస్త్రంలో ఉన్న భావానికి, వ్యవహారంలో ఉన్న భావానికి తేడా ఉంది.

ప్రస్తుతం అమలులో, వాడుకలో ఉన్న పదాల అర్థాలు మార్చి భిన్నార్థాన్ని ఆరోపించకూడదు.

ఉదా : 'కంపు' అన్న పదానికి ప్రాచీన కాలంలో సువాసన అన్న పదానికి అన్న అర్థం ఉందని ఇప్పుడు ఉన్న చెడ్డవాసన అన్న అర్థాన్ని మార్చి సువాసన అన్న అర్థంలో ప్రయోగించకూడదు.

భాషలో పదాలకు ఉన్న రూఢ్యర్థాలు తెలిసి ఉండాలి. వారు పిల్లి, వీడు పులి, వాడు గాడిద వాంటి పదాలు వ్యవహారంలో ఎలా వాడుతున్నారో తెలుసుకోవాలి. పత్రికా రచనలో ఎన్నుకోదగిన పారిభాషిక పదాలను ఎన్నుకోవడంలో పై అంశాలతో పాటు మరికొన్ని అంశాలనూ దృష్టిలో పెట్టుకోవాలి.

స్పష్టమైన, నిర్దిష్టమైన అర్థాన్నిచ్చే పదాలతోపాటు సులభంగా అందరికీ అర్థమయ్యే పదాలను ఎంచుకోవాలి. స్థిరమైన వాడుక కలిగిన పదజాలం నుంచి పదాలను ఎంపిక చేసుకుంటే మంచిది. నూతన పద బంధాలను సృష్టించేటప్పుడు అవి నిడివిలో చిన్నవిగా ఉండేటట్లు చూడడంతో పాటు సులభంగా వ్యవహారంలోకి చొచ్చుకుపోయేటట్లు ఉండాలి. సరళతకు, భాషలో ఇమిడిపోయే తత్వానికి ప్రాధాన్యతనివ్వాలి.

**ఉపయుక్త గ్రంథాలు:**

నివేదన పద్ధతులు - భాష - (సం) కేతు విశ్వనాథరెడ్డి
అనువాద విధానాలు - (సం) పరిమి రామనరసింహం పమ్మి పవన్ కుమార్

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# "మూడో మనిషి కవితా సంపుటి - మాతృ హృదయం"

- **యం. ప్రభావతి,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, రాజధాని కళాశాల, చెన్నై, తమిళనాడు.

"కవయ : క్రాంత దర్శన:" అని నానుడి అనగా సామాన్యులు చూడలేని వాటిని కూడా దర్శించగల వాడని సాధారణ అర్థం. అటువంటి అద్భుత శక్తి కవికి మాత్రమే ఉంది. మన సమాజంలో ఎన్నో సంఘటనలు, విషయాలు, అంశాలు ఉంటూనే ఉంటాయి. ప్రతి అంశాన్ని విభిన్న కోణంలో కొందరు మాత్రమే చూడగలరు. అలా చూడగలగిన ఉన్నత వ్యక్తే కవి. తన అనుభవాల ద్వారా తన పాండిత్యంతో మనసులో వెలువడిన ప్రతి భావాన్ని అద్భుతంగా వివరించడానికి ఏర్పరుచుకున్న సాధనమే కవిత్వం. కవిత్వం ద్వారానే సమాజంలో ఎన్నో మార్పులు తీసుకురావచ్చు. రచయిత తన హృదయ భావాలను ఉప్పొంగిన బాధను, వేదనను, ఆవేశాన్ని వెళ్ళగ్రక్కటానికి "కలము" అనే ఆయుధంతో ఎంపిక చేసుకొన్నదే ఈ కవిత్వం.

సామాజిక, సాంఘీక, ప్రాకృతిక పరిస్థితులకు అనుగుణంగా ప్రజల స్థితిగతులను చూసి చలించిన రచయిత హృదయలోగిలి నుండి వెలువడిన జన జీవిత నగ్న సత్యాలే ఈ "మూడోమనిషి కవితా సంపుటి."

ఈ కవితా సంపుటిని ప్రముఖ రచయిత, సాహితివేత్త "ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్" గారు రాశారు. వీరు మద్రాసు విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో ఆచార్యులుగా పని చేస్తూ ఉత్తమ ఆచార్యునిగా పేరు ప్రఖ్యాతలు గడించారు. సాహిత్య సేవకుడిగా, రచయితగా, విమర్శకుడిగా అందరిచే ప్రశంసలు పొందారు. వీరి మార్గ దర్శకత్వంలో ఎంతో మంది విద్యార్థులు మంచి పరిశోధకులుగా తీర్చిదిద్దబడ్డారు. ఎంతో మంది ఉన్నత స్థితికి కారకులైనారు. మాడభూషివారి కలం నుండి ఎన్నో ఆణిముత్యాల వంటి కవిత్వాలు జాలువారాయి. అటువంటి కవిత్వాలలో ఒకటే "మూడోమనిషి" అనే కవితా సంపుటి.

"మూడోమనిషి" అను పేరులోనే ఎంతో వైవిధ్యం ఉంది. ఈ శీర్షిక వినగానే పాఠకుల మదిలో ఎన్నో ఆలోచనలు మెదులుతాయి. మరెన్నో ప్రశ్నలు తలెత్తుతాయి. కవిత్వం రాయటమే కాదు వైవిధ్యభరితమైన ఆసక్తి కరణమైన శీర్షికను కూడా పెట్టడమే మాడభూషి వారి ప్రత్యేకత. "మూడోమనిషి" కవితా సంపుటి మొదటి ప్రచురణ హేవళంబి ఉగాది, మార్చి 2017న ఆవిష్కరించారు. ఇందులో మొత్తం 38 కవితలున్నాయి. ప్రతి కవిత దేనికదే ప్రత్యేకతను సంతరించుకొని ఉంది.

## మాడభూషివారి మాతృహృదయం :

దేవతలు అన్నీ చోట్ల ఉండలేక అమ్మను సృష్టించారు అని పెద్దల మాట. అందుకేనేమో భగవంతుడు కూడా అమ్మ ప్రేమలోని మాధుర్యాన్ని అనుభవించడానికి మానవజన్మ ఎత్తాడని పురాణాలు చెబుతున్నాయి. అటువంటి అమ్మ ప్రేమను వర్ణిస్తూ ఎన్నో కవిత్వాలు వచ్చాయి, వస్తున్నాయి. ఇంకా వస్తూనే ఉన్నాయి అయినా కూడా ప్రతి కవితలో ఒక కొత్తదనం, కమ్మదనం కనిపిస్తుంది అదే "అమ్మ" గొప్పదనం. మాడభూషి వారి రచనలన్నీ పరిశీలిస్తే "అమ్మ" స్థానానికి అమ్మలోని ఆప్యాయతకు, ప్రేమకు, అమ్మ ఆవేదనకు ఎంత ప్రాముఖ్యాన్ని, ఎంత విలువను ఇస్తారో అర్థమవుతుంది. మాడభూషి సంపత్ కుమార్ గారు "మూడోమనిషి" అనే కవితా సంపుటిలో కూడా "అమ్మ" పట్ల తనకున్న భావాన్ని కింది విధంగా వివరించారు.

## ఆకురాలిన కాలం :

"అమ్మ ఆకులా రాలిపోయింది
పండీ పండక ముందే
నిండా పండక ముందే
"కాలాన్ని ఎదురించి నిలబడుతుందనుకున్నాం. కానీ అమ్మ పండుటాకులా రాలిపోయింది."

పచ్చని చెట్టులా వెచ్చని తన ఒడిలో సేదతీర్చిన అమ్మ ఆకురాలి మోడువారి పోతుందనుకోలేదు.

ఇది "ఆకురాలిన కాలం" అనే కవిత అమ్మ యొక్క

సహజ స్వభావాన్ని కళ్ళకు కట్టినట్లు చూపారు మాడభూషివారు. తన బ్రతుకంతా అందరి అవసరాలు తీర్చిన అమ్మ తనకు కాలం సమీపించినప్పుడు బిడ్డలందరిని అనాధలుగా చేసి వెళ్ళిపోవడాన్ని తెలియజేశారు. అమ్మలేని బిడ్డ స్థితి ఎంత దయనీయంగా ఉంటుందో కళ్ళ ముందు ప్రత్యక్షీకరించారు.

**తల్లి :**

"ఒక తల్లి పది మంది పిల్లల్ని
కని పెంచి పోషిస్తుంది!
పది మంది పిల్లలు
ఒక తల్లిని పోషించలేక పోతున్నారు!
అందుకే తల్లి
ఇప్పుడు
ఒకే బిడ్డతో సరిపెట్టుకొంటుంది."

ఈ "తల్లి" కవిత్వం ప్రస్తుత సమాజానికి నిలువటద్దం లాంటిది. తల్లి తన బిడ్డ కోసం సర్వస్వం ధారపోసి తాను తిన్నా తినకున్నా బిడ్డ ఆకలి తీర్చి పెంచి పోషిస్తుంది. అటువంటి త్యాగమూర్తి గొప్పతనాన్ని రచయిత చెబుతూనే బిడ్డల సంకుచిత బుద్దిని, నిరంకుశత్వాన్ని, కుసంస్కారాన్ని ఎత్తిచూపారు. బిడ్డల ప్రవర్తన వల్ల తల్లికి కలిగే వేదన ఇందులో ప్రస్ఫుటంగా వ్యక్తమవుతుంది.

**భ్రమలు :**

"అమ్మకు
పక్షపాతం ఉంటుంది
అమ్మకు
స్వార్థం ఉంటుంది
అమ్మ
నిర్ధాక్షిణ్యంగా ఉంటుంది."

ఈ కవితలో అమ్మకు పక్షపాతం, స్వార్థం ఉంటాయని కవి భావన. కొన్ని సార్లు అమ్మ నిర్ధాక్షిణ్యంగా ఉండదేమో అయితే ఇవన్నీ ఏ సందర్భంలో ఉంటాయో కూడా రచయిత ఈ కవిత్వంలో తెలియజేయడం రచయిత యొక్క అద్భుత సృష్టికి నిదర్శనం.

"అమ్మకు పక్షపాతం ఎక్కువ
తన బిడ్డ ఇసుమింటోడు అయిపోవాలని
అమ్మకు స్వార్థం ఎక్కువ
తన బిడ్డ అసుమింటోడు అయిపోవాలని
అమ్మకు నిర్ధాక్షిణ్యం ఎక్కువ
తన బిడ్డ దారి తప్పి పోకుండా ఉండాలని"

ఏ తల్లి అయిన పుట్టినప్పటి నుండి తన కన్నబిడ్డ పట్ల పక్షపాతం చూపిస్తుంది. తన బిడ్డ ఎంతో ఎత్తుకి ఎదగాలని కోరుకోవడంలో స్వార్థాన్ని కలిగి ఉంటుంది. ఎంతటి కఠిన శిక్షను వేసైనా సరే తన బిడ్డను సరైన మార్గంలో నడిపించాలనుకుంటుంది. అందుకే నిర్ధాక్షిణ్యంగా ఉంటుంది. ఇవన్నీ అమ్మలో ఉండే గుణాలు.

ఈ "భ్రమలు" అనే కవిత్వం అమ్మ మనస్తత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. అటువంటి మాతృమూర్తి పట్ల బిడ్డలు నిర్లక్ష్యాన్ని కలిగి ఉన్నారు. అమ్మ ఆదరణను గుర్తించలేక తమలో తామే ఏవేవో ఊహించుకుంటూ బిడ్డలు తామే గొప్ప వారమని విర్రవీగుతూ బ్రతుకుతున్నారు. ఈ సృష్టిలో అన్నిటిలో సజీవమైంది అమ్మ ప్రేమ మాత్రమే మిగతావన్నీ భ్రమలు అని మాడభూషి వారు ఈ కవిత్వం ద్వారా వారి మనోభావాన్ని కవిత్వీకరించారు.

ఈ విధంగా "మూడో మనిషి" అనే కవితా సంపుటిలో మాడభూషివారి మాతృహృదయాన్ని గమనించవచ్చు. ఇంకా ఇందులో అనేక అంశాలు ఉన్నాయి. అవన్నీ కూడా ఎంతో వైవిధ్యమైనవి.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. ఆధునిక కవిత్వము సంప్రదాయాలు - ప్రయోగాలు - నారాయణరెడ్డి సింగిరెడ్డి
2. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం - నారాయణరావు వెల్చేరు
3. ఆధునికాంధ్ర కవిత్వం - సందర్భాలు - చంద్రశేఖర్ రెడ్డి రాచపాళెం
4. మూడో మనిషి కవితా సంపుటి - సంపత్ కుమార్ మాడభూషి

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి గారి కథల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ కోణాలు

– మల్లెం శివప్రసాద్, పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రచురణ విస్తరణ సేవల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, శ్రీనివాసపురం, కుప్పం.

కడప జిల్లాకు చెందిన కథా సాహితీవేత్తలలో అచ్చమైన, నికార్సయిన, గ్రామీణ కథకుడు సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి. ఈయన 16-02-1963వ తేదీన బాలరాజు పల్లెలోని సన్నపురెడ్డి లక్ష్మిరెడ్డి, చెన్నమ్మ దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్య బాలరాజుపల్లెలోను, ప్రాథమికోన్నత విద్య వరకు నాసాపురంలోను, ఇంటర్మీడి యట్ విద్య పోరుమామిళ్ళ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను, బియస్సీ డిగ్రీ కోర్సును వి.ఆర్.డిగ్రీ కాలేజ్ నెల్లూరులోను, బి.ఎడ్ కోర్సును మైసూర్‌లో పూర్తి చేశాడు. 1989లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 30 సంవత్సరాల ఉద్యోగ జీవితంతో పాటుగా ప్రవృత్తిగా భిన్న ప్రక్రియలైన కథ, కవిత్వం, నవల, తదితర అంశాలలో సాహిత్యసేవ చేస్తు న్నారు. రాష్ట్రంలో వివిధ ఆకాశవాణి కేంద్రాల ద్వారా పలు దిన, వార, పక్ష, మాస పత్రికలు విశేష సంచికల ద్వారా ఈయన సాహితీ అభిమానులకు సుపరిచితులే. ఈయన కథలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు పొందాయి.

ఈయన తమచుట్టూ ఉన్న గ్రామీణ పరిస్థితులను ఆకళింపు చేసుకొని, వాటికి అనుగుణంగా స్పందిస్తూ అందులోని సమస్యలకు పరిష్కార మార్గం చూపిస్తారు. ఈయన కథల్లో సమకాలీన సమాజం, సమాజంలోని మంచిచెడు పార్శ్వాలు, సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమస్యలు కన్పిస్తాయి. ఆ సమస్యలను పాత్రల ద్వారానే పరిష్కారమార్గాలు చూపడం లేదా పాటకుడికే వదిలి వేయడం చేస్తాడు.

మానవజీవితం నుంచి పుట్టిన అనేక సమస్యలు తన రచనల్లో ప్రతిఫలించడానికి సన్నపురెడ్డి గారు కథా ప్రక్రియని ఎంచుకొన్నాడు.

## సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి కథల్లో సాంఘిక, ఆర్థిక, రాజకీయ కోణాలు :

మానవుడు సంఘజీవి. సంఘజీవి అయిన మానవుడు నిత్యం ఎన్నో సమస్యలతో సతమతమవుతూ వాటిని విచక్షణతో అధిగమించి జీవితాన్ని గడపాలనుకొంటాడు. రచయితలు కూడ సమాజంలోని వారే కాబట్టి వారి రచనల్లో సంఘ సంబంధమైన ఇతివృత్తాలను తీసు కుంటారు. అలాంటి వారిలో సన్నపురెడ్డి గారు కూడా సంఘ సంబంధమైన ఇతివృత్తాలను తీసుకొని రచనలు చేస్తున్నారు. వారి కథల్లోని సాంఘిక కోణాన్ని పరిశీలిస్తే

సన్నపురెడ్డి గారి కథల్లో సాంఘిక కోణానికి సంబం ధించిన కథలు

'వసంతం' అనే కథలో సంసార జీవితంలో దంప తులు బాగుంటే ఆసంసారం 'వసంతమే' అలా కాకుండా నరకప్రాయమైతే గ్రీష్మమే. బాలకొండన్న, బాలమ్మను వివాహం చేసుకొంటాడు. అయితే లైంగిక భయంవల్ల భార్యకు దూరంగా ఉంటే కృష్ణారెడ్డి బాలకొండన్నలోని లైంగిక భయాన్ని పోగొట్టి అతని సంసారాన్ని నిలబెట్టిన విధానాన్ని ఈ కథలో మనం చూడవచ్చు. ఈ కథలో దాంపత్యజీవితానికి సంబంధించిన సాంఘికకోణాన్ని మనం గమనించవచ్చు.

'నేను - తను' కథలో భార్యాభర్తల మధ్య ఉన్న చిన్న సమస్యను భర్తే సర్దుబాటు చేసుకొని తన కాపురాన్ని ఏవిధంగా ఆనందమయం చేసుకొన్నాడో సన్నపురెడ్డి గారు చక్కగా సాంఘిక కోణంలో పేర్కొన్నవాడు.

'అరలు అరలు'గా అనేక కథల్లో తన భార్యను తిట్టినా సర్దుపోయి సేవలు చేస్తూ తన సమస్యలకు పరిష్కారం చూపించే తన భార్యపై కోపపడిన తీరును గుర్తుకు

తెచ్చుకొని సిగ్గుపడిన ఒక భర్త కథ. భార్య చెప్పిన సలహా వల్ల మనశ్శాంతి పొందాలనుకోవాలని నిర్ణయించుకున్న భర్త మనస్తత్వాన్ని ఈ కథలో రచయిత చిత్రించాడు. 'సెగలోగిలి' అనే కథలో అనుమానపు భర్తతో కాపురం చేసే సగటు ఇల్లాలి మానసిక ఆవేదనను సాంఘిక కోణంలో సన్నపురెడ్డి గారు ఈ కథలో చిత్రించాడు. 'ఆమె మొలకెత్తిన నేల' కథలో పల్లెలో పుట్టి పెరిగిన తన భార్యను పట్టణానికి తీసుకెళ్ళి అక్కడి పరిస్థితులకు అనుగుణంగా నడుచుకొమ్మని చెప్పే భర్త ప్రవర్తనకు విసుగు చెందిన భార్య మనస్తత్వాన్ని ఈ కథలో పేర్కొన్నాడు.

తమ పిల్లల కోసం కష్టపడి, ప్రయోజకుల్ని చేసి శేష జీవితం గడుపుతున్న వృద్ధులు ఎన్నో సమస్యలతో బాధ పడుతూ అవసాన దశలో కూడా కుటుంబానికి ఉపయోగ పడాలనుకుంటారు. యుక్తవయస్సులో ఉన్న తమ పిల్లల్ని ఇంకా చిన్న పిల్లలుగా భావిస్తారు. తమబిడ్డలు పట్టణాల్లో స్థిరపడినా వారు మాత్రం స్వంత ఊర్లోనే ఉంటూ తమ బిడ్డల ప్రేమకు దూరమవుతారు. తమ బిడ్డల నిర్లక్ష్యానికి, ఆంక్షలకు గురి అవుతారు. తమ పూర్వ జీవితాన్ని నెమరువేసుకుంటూ కాలం గడుపుతూ ఉంటారు. ఇలా వృద్ధులకు ఎదురయ్యే సమస్యల్ని ఆలోచించి, వారికి ఆసరగా నిలవాల్సిన అవసరాన్ని గుర్తించి రచయిత వెంకట రామిరెడ్డి 'అమ్మ, ఊరిమిండి, ఆకుపచ్చ నిమ్మకాయ' అనే కథల్ని రాసి వాటిలో వృద్ధుల సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపిన కథల్లో చక్కటి సాంఘిక కోణం దాగి ఉంది.

'అమ్మ' కథలో తమబిడ్డలు వేరు కాపురాలు పెట్టు కున్నా, వారి ఇబ్బందుల్ని తీర్చాలనుకుంటుంది. బిడ్డ లందరికీ సమానంగా మమకారాన్ని పంచాలనీ, అలాగే ఎవ్వరికీ భారం కాకుండా స్వతంత్రంగా జీవిస్తూ తమ బిడ్డల క్షేమాన్ని కోరే తల్లి హృదయాన్ని ఈ కథలో రచయిత చక్కగా ఆవిష్కరించాడు.

'ఊరిమిండి' కథలో కన్నబిడ్డల ప్రేమకు దూరమై పెంచిన బిడ్డ కూడా తన ప్రేమకు దూరమవుతాడేమోనన్న వేదనతో విలపించిన మాతృమూర్తి కన్నీటి అక్షరరూపం ఈ కథ. 'ఆకుపచ్చ నిమ్మకాయ' కథలో చెడు అలవాట్లతో సంసారం నాశనం చేసుకుంటున్న తన కుమారుని జీవి తాన్ని కోడలు చేత దిద్దించిన ఓ వృద్ధుని గాథ 'ఆకుపచ్చ నిమ్మకాయ'.

## సన్నపురెడ్డి గారి కథల్లో ఆర్థిక కోణానికి సంబంధించిన కథలు :

సమాజంలో ఎన్నో కులాలు, మతాలు ఉన్నా, సమాజంలోని ప్రజలు పేద, మధ్యతరగతి, ధనవంతులు అనే మూడు రకాలుగా కన్పిస్తారు. పేదలు ఆకలితో అలమటిస్తే, ధనవంతులు సంపదలతో తులతూగు తుంటారు. మధ్యతరగతి ప్రజలు పేద, ధనవంతులకు మధ్య త్రిశంకు స్వర్గంలా దిక్కుతోచక బతుకుతుంటారు. ఇటువంటి ఆర్థిక సమస్యలకు సంబంధించిన ఇతివృత్తా లను సన్నపురెడ్డి గారు తన కథల్లో తీసుకున్నాడు. ఆయన కథల్లో ఆర్థిక కోణాల్ని పరిశీలిస్తే.

'రాలిన చింతపండు' పేదరికంతో కుటుంబాన్ని పోషించుకోలేని పేదమహిళ శేషమ్మ శారీరక శ్రమను, మధ్యతరగతి మహిళ ఎలా దోచుకుంటుందో ఈ కథలో రచయిత వివరించాడు. అలాగే 'గంపెడు గడ్డి' కథలో భర్త చెడు తిరుగుళ్ళు తిరగడంతో ఉన్న సొమ్మంతా పోవడంతో భార్య ఆ సంసారభారాన్ని మోయాల్సి రావడంతో కూలికి పోవడానికి ఆత్మాభిమానం అడ్డు రావడంతో పాడి బర్రెల్ని నమ్ముకుని కుటుంబాన్ని పోసిస్తూ జీవనం సాగిస్తున్న పేద మహిళ కథ 'గంపెడు గడ్డి'. 'తమ్ముడి ఉత్తరం' కథలో తన ఊరు, పొలం, తమ్ముడూ, అమ్మానాన్నల్ని, ప్రస్తుత తమ్ముడి దీనస్థితిని తలచుకుంటూ వేదన చెందుతున్న, ఓ రిటైర్డ్ కాబోతున్న ఉపాధ్యాయుని మనస్తత్వాన్ని రచయిత ఎంతో ఆర్ద్రతగా చిత్రించాడు. సమాజంలో తక్కువ శాతం ఉన్న ధనిక వర్గం వారు ధనబలంతో పేద, మధ్యతరగతి ప్రజల్ని తమ స్వల్ప పెట్టుబడితో అధిక లాభం ఆర్జిస్తూ ఉంటారు. అలాగే భూస్వాములు తమ పొలాల్ని పేదలకు కోరుకో, గుత్తకో ఇచ్చి పంటలు పండినా, పండక పోయినా వారి శ్రమ ఫలితాన్ని లాక్కొని పేదవాళ్ళ నోట్లో మన్ను కొడుతూ

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

ఉంటారు. అటువంటి వారి జీవితాల్ని రచయిత 'సుడి గాలి' కథలో వివరించాడు. ఈ కథలో పొలాన్ని గుత్తకు తీసుకొని పండించిన ఓబన్న అనే రైతు శ్రమను భూయజమాని చెన్నారెడ్డి చేతిలోనికి మారిపోతున్న వైనాన్ని దోపిడీ తీరును చక్కగా రచయిత ఆర్థిక కోణంలో తెలియజేశాడు.

## సన్నపురెడ్డి గారి కథలో రాజకీయ కోణాలకు సంబంధించిన కథలు :

రాజకీయాలవల్ల ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నేడు సామాన్య ప్రజలు అనేక సమస్యలకు గురి అవుతున్నారు. రాజకీయ వాదులు తమ స్వార్థం కోసం సామాన్యుల్ని బలిపశువులుగా వాడుకుంటున్నారు. రాజకీయాల వల్ల ఎన్నో కుటుంబాలు కష్టనష్టాలకు గురి అవుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో రాజీయాలవల్ల కక్షలు, కార్పణ్యాలకు బలి అవుతున్నాయి. ఈ రాజకీయ ఊబిలో చిక్కుకొని ఎంతోమంది బయటపడలేక ఆహుతి అవుతున్నారు. ఈ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సన్నపురెడ్డి 'బురద, భయంనీడ, వీరనారి' అనే కథల్ని రాశాడు ఈయన కథల్లో రాజకీయకోణాల్ని పరిశీలిస్తే.

'బురద' అనే కథలో రాజకీయాలకు బలికాకుండా బయట పడిన గొర్రెల కాపరి కథ. గ్రామ రాజకీయాలు, నాయకులు, తమ ఆధిపత్యం కోసం అమాయకుల్ని ఎలా బలిచేయాలనుకుంటారో తెలియజేయడమే కాకుండా అలాంటి నీచ రాజకీయాలకు ఎలా స్వస్తి పలకాల అనే అంశాల్ని రచయిత ఈ కథలో చక్కగా చిత్రించాడు. తన మాట వినని భర్త ఫ్యాక్షన్ జీవితాన్ని వదిలివేయక పోవడంతో సొంత నిర్ణయం తీసుకొని ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండాలనుకున్న ఓ మహిళ అంతరంగాన్ని రచయిత 'వీరనారి' కథలో చిత్రించాడు. 'భయం నీడ' కథలో కుటుంబాల మధ్య, కక్షలూ, పగలూ ఎప్పుడు? ఎందుకు ఆరంభమౌతాయో, ఎట్లా రూపాంతరం చెందుతాయో వాటి వలన పడే బాధలు తెలుసుకోవడానికి మృతా, ఫ్యాక్షన్ కథ అయిన ఈ కథను చదివితే రాయలసీమలో ముఖ్యంగా కడప జిల్లా ప్రజల జీవన వేదన అవగతమవుతుంది.

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి కథల్లో మనకు సామాజిక, ఆర్థిక, రాజకీయ కోణాలకు సంబంధించిన కథలు ప్రత్యక్షమవుతాయి. ఈయన రాసిన కథల్లో మానవ సంబంధాలు, లుప్తమవుతున్న విలువలు, అవినీతి, అక్రమాలు, అన్యాయంపట్ల, ఆవేదన, రాజకీయ నాయకుల దురహంకారం, కన్పిస్తాయి. ఈయన కథల్లో గ్రామీణ వాతావరణం, కడప మాండలికం కన్పిస్తుంది.

## ముగింపు :

ప్రపంచానికి అన్నం పెట్టే రైతు పస్తులతో బతకకూడదు. ప్రభుత్వం రైతుల్ని ఆదుకోవాలి. ప్రతి రైతు ఆర్థికంగా బాగుండాలి. గ్రామాల్లో ఫ్యాక్షన్ రాజకీయాలు సమసిపోయి ప్రశాంతత ఏర్పడాలని దళితులు వంటి అణగారిన వారి సాంఘిక, ఆర్థిక, రాజకీయాభివృద్ధి మెరుగుపడాలని, ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధికి తోడ్పడాలనీ నిరంతరం సన్నపురెడ్డి గారు కాంక్షించే అంశం. ఆ ఆకాంక్షే కథ రచనా ధ్యేయంగా పెట్టుకున్నాడు.

ప్రజలందరిని ఆలోచింపజేసే అర్థవంతమైన కథలు ఎన్నో తన కలం నుండి వెలువరించారు. సమాజంలోని కఠోర వాస్తవాలను కళ్ళకు కట్టినట్లు వాటిని చూపిన కోణం చెప్పిన శైలి సూటిగా పాఠకుల్ని గుండెల్ని తాకుతాయి. కొన్ని కథలు పాఠకుల్ని సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తాయి. మరికొన్ని కథలు జీవితాంతం వెన్నాడుతున్నట్లే ఉంటాయి.

## ఆధార గ్రంథాలు :

1. కొత్త దుప్పటి - సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి
2. బతుకు సేద్యం - సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి
3. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వానా శాస్త్రి
4. తెలుగు సాహిత్య విమర్శ - వెలమల సిమ్మన్న

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# "యానాది" తెగ - సంస్కృతి - సంప్రదాయాలు

- డా॥. ముడావత్ వెంకటేష్

మానవ సమాజానికి దూరంగా ఎలాంటి కల్మషం లేకుండా స్వచ్ఛంగా బ్రతుకుతున్న అటవి తెగలలో ఎన్నో వేల సంవత్సరాల చరిత్రగల మానవ జాతి 'యానాది' ఒకటి. పల్లపు ప్రాంతాలలో నివసించే యానాదులను మైదాన ప్రాంత గిరిజనులుగా గుర్తించారు. ఆకలి కొరకు, కడుపు నింపు కోవడం కోసం సంచరిస్తూ సంచార తెగలుగా చరిత్రకు ఎక్కారు. "వేల సంవత్సరాలకు పూర్వం ఈ దేశానికి వలస వచ్చిన ఆర్యుల వలన అంతకు ముందే ఈ భూమిపై నివసిస్తున్న అమాయకంగా, మోటుగా, అనాగరికంగా, పుట్టు పూర్వోత్తరాలు లేని ప్రజలు అని హేళనగా అనాదులు అనే నామకరణం జరిగే అవకాశం ఉంది. ఈ అనాదులే నేటి యానాదులు" (యానాది జీవిత చరిత్ర : ఏకుల వెంకటేశ్వర్లు : పుట : 11). వీరి ప్రధాన స్థానం నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోట, గుంటూరు, కృష్ణా ఏజన్సీ ప్రాంతాల్లో కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో నివసిస్తున్నారు. అతి స్వల్ప సంఖ్యలో అనంతపూర్ జిల్లాలోనూ ఉన్నారు. యానాదులు స్వతంత్ర జీవనం పట్ల ఆసక్తి కలిగి ఉంటారు. యుగయుగాలుగా యానాదులు భౌగోళికంగా ఇతర ప్రాంతాలలో సంబంధం లేకుండా జీవించారు.

## జీవన విధానం :

యానాదులు నదుల గట్లంట, అడవికి దగ్గరగా జీవిస్తారు. చేపలు పట్టడం వీరికి జీవన ఆధారం. దొంగలు పడకుండా కాపలా కాసేవారిగా ఉండటం కూడా జరుగుతుంది. జీవన ఆధారం కోసం సంచార జీవితం వీరిది. యానాదులకి స్థిరాస్థి అంటూ ఏమి లేదు. యానాదులు గొప్ప హాస్యప్రియులు. నవ్వుతూ కష్టాలను భరిస్తారు. ఆకలి బాధలను కూడా ఎగతాళి చేస్తారు. తిండిలేక పేగులు మాడిపోతున్న శరీరాన్ని చుట్ట చుట్టి మడతపెట్టి పడుకున్నపుడు 'మా యింట్లో మడత కుడుములు ఉడుకుతుంటయ్యిలే' అని తేలిగ్గా నవ్వుతారు. ఇంట్లో ఆకలితో ఎండుకుంటున్నాయని తెలిపేందుకు ఎండు ఈరాసామి చుట్టమోలే వచ్చాడులే అని ఆకలిని ఎగతాళి చేసి నవ్వుకుంటారు. కానీ ప్రకృతి అంటే ఎంతో ఇష్టం. తెల్లని వెన్నెల్లో తింటారు. అలానే ఆడుతూ పాడుతూ వారి ఆకలి బాధలను కూడా మరిచిపోయి ఆదమరచి నిద్రపోతారు. గిరిజన తెగలకు మధ్య ఇరుగు పొరుగు సంబంధాలు తక్కువగా వుంటాయి. వీరు అడవుల్లో చిన్న చిన్న గుంపులుగానో, సమీప గ్రామాలకు దగ్గరగానో జీవిస్తూ ఉంటారు. వీళ్లైనంతగా ఇతరుల జోక్యం లేకుండా వుండే సమయాల్లోనో, వేటలు, వేడుకల కాలంలోనో తెగలు కలిసే అవకాశాలు వుంటాయి. కొన్ని తెగల్లో నాయకులు వుండరు. పెద్దలందరూ కలిసి నిర్ణయాలు తీసుకుంటారు. గిరిజనతెగలు తాము నివసించే ప్రాంతాల్లోని వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తమ గృహనిర్మాణాలు గావించుకుంటారు. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చే రీతిగాను, అందంగా, కళాత్మకంగాను వర్షాకాలంలో సైతం ఇబ్బందులు లేనివిధంగాను గిరిజనులు తమ ఇళ్ళు నిర్మించుకుంటారు. వెదురు, కొయ్యదుంగలు, రాళ్ళు, ఆకులు వంటి వాటిని తమ గృహనిర్మాణ పద్ధతుల్లో గిరిజనులు వాడుతారు.

## యానాదుల సంస్కృతి :

సంస్కృతి అంటే 'జీవన విధానం' అని ప్రముఖ మానవ శాస్త్రవేత్త లూవిస్ పేర్కొన్నాడు. మానవుడు, ప్రకృతి, మానవాతీత శక్తుల మేలు కలయికే గిరిజనుల మతానికి ప్రాతిపదిక అని మరో ప్రముఖ మానవ శాస్త్రవేత్త విద్యార్థి పేర్కొన్నారు. ప్రకృతిలోని వనరులు సమాజానికి చెందినవి, వాటిని అనుభవించే హక్కు ప్రజలది. అందరూ సమానంగా అనుభవించేందుకు గిరిజన

సమాజం కొన్ని సామాజిక సూత్రాలను తరతరాలుగా రూపొందించుకొంది. ఆ సూత్రాలను ఎవరైనా ఉల్లంఘిస్తే మళ్ళీ సరిచేయడానికి కుల పంచాయితీలు, గ్రామ పంచాయితీలు, అంతర్గ్రామ పంచాయితీలు కూడా ఏర్ప రచుకున్నారు. తమకు జీవనాధారమైన ప్రక ృతిలో మంచిని, కీడును చేసే మానవాతీత శక్తులు ఉన్నాయని నమ్ముతారు. అందుకే గిరిజనులకు, అడవికి ఉన్న సంబంధాన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ, మతపరమైన రంగాల సమీకృత కలయికగా చూస్తారు మానవ శాస్త్రజ్ఞులు. యానాదులు అడవికి వేటకు పోయేటప్పుడు వారం వర్జ్యం కాకుండా శకునాలు కూడా పాటిస్తారు. కొత్త కుండలు, ఎద్దుల బండ్లు, వితంతువులు, తుమ్ము లను అపశకునాలుగా భావిస్తారు. రాత్రికి బొటనవేలు కొట్టుకున్నా, చంటిబిడ్డ దారికి అడ్డం వచ్చినా వీరు శకునం బాగు లేదని భావిస్తారు. మూలికా వైద్యం కూడా వీరికి బాగా తెలుసు. అత్యంత సమర్థులు యానాది స్త్రీలు. వీరి కంఠ స్వరాలు అత్యంత మధురంగా ఉంటాయి. చక్కగా పాటలు పాడతారు.

భారతదేశంలో గిరిజన సమూహాలు శతాబ్దాల తరబడి ఎంతో విలక్షణమూ, విశిష్టమూ అయిన సంస్కృతీ, సంప్రదాయాలు కలిగి వున్నారు. ఆధునిక కాలంలో దేశం లోని మారుమూల ప్రాంతాల్లో నాగరిక ప్రపంచానికి దూరంగా వున్న వాతావరణాల్లో జీవనరీతులు కొన సాగిస్తున్న గిరిజన సమూహాలు నేటికిని తమ సంప్రదాయ వారసత్వాన్ని పదిలంగా కాపాడుకుంటున్నారు. ఈ నేపథ్యం గమనిస్తే భారతీయ గిరిజనుల జీవితాల్లో చిరకాలంగా మనుగడలో వున్నట్టి ఎంతో వైవిధ్య భరితమైన సంప్రదాయాలు, సంస్క ృతి రీతులు ఎన్నో మనకు అగుపడతాయి. అంతేకాదు, దేశవ్యాప్తంగా విస్తరించిన గిరిజన సమూహాల బంధాలు, అను బంధాలు, జీవనరీతులు, సంప్రదాయ ధోరణులు, వేడుకలు, మూఢ విశ్వాసాలు వంటి ప్రతి అంశము తన విశిష్టతను వ్యక్తపరిచే విశేషమైన అంశంగా సైతం ఈ రంగంలో వుంటున్నాయి.

## యానాదుల సంప్రదాయాలు :

ప్రతి సమాజంలోని సభ్యుల సంస్కృతిని, ఆచార వ్యవహారాలను గురించి కొన్ని ఉంటాయి. గిరిజన తెగలు అడవుల్లో జీవించే ధోరణులకు అలవాటు పడిపోవడం వల్ల వారి మతవిశ్వాసాలు, ఆచార వ్యవహారాలు సహజంగానే ప్రకృతి సంబంధంగా వుంటాయి.సంస్కృతిలో కళా రూపాలకు ఒక ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉంది. యానాదులు మేళ, కీలుగుర్రాలు, యానాది చిందు, నేమలి ఆట, యానాది పగటివేశం, యానాది భాగవతం, తెప్పెట్ల నృత్యం హాస్యంగానే ఉంటాయి. ప్రస్తుత సినిమా రంగం వీరి నుండే గ్రహించిదని అంటున్నారు. యానాదులు, పండుగ, జాతరలో వాద్యాల మోతను మించి అలసిపోయేదాకా నృత్యం చేస్తారు. వీళ్ల మాతృభాష తెలుగు. అన్ని తెలుగు ప్రాంతాల 'యాస' ఉంటుంది యానాది.అడవికి వేటకు పోయే ముందు యానాదులు ముఖ్యంగా అడవి దేవుడైన 'కాట్రాయుడు'ను మొక్కు తారు. వేట సమయంలో ఎక్కడైనా 'పెద్దబండ' కనబడితే ఆ రాయినే దేవుడని భావించి నైవేద్యం పెడతారు. విశ్వం భగవంతుని రూపం అని వారి భావన.

## యానాదుల - వృత్తి :

యానాదులు ఇంకా ప్రాచీన పద్ధతులతోనే ఆహారాన్ని సమకూర్చుకుంటున్నారు. మాంసాహారులు అయిన యానాదులు ఎలుకలు, ఉడుములు, ఉడుతలు, కుందేళ్లు, కోళ్లు, మేకలు, గొర్రేలు, చేపలు, నేల తాబేళ్ళను తింటారు. తమ ప్రధాన వృత్తితో పాటు అనుబంధ వ ృత్తులు కూడా అనుసరిస్తారు. చేపలు పట్టడంలో గొప్ప నైపుణ్యం వీరిది. వీరికి తాటిపండు చాలా ఇష్టం. అలాగే నాగజముడు, కామంచి పండ్లు, అడవి పండ్లు, పాలపండ్లు ఇలా ప్రకృతి వారి ఆకలిని తీరుస్తుంది. గిరిజన తెగలు వ్యవసాయం, పశు పాలన, అటవీ వస్తుసేకరణ, చేపలు పట్టడం, కొన్ని గిరిజనతెగలు కుటీర పరిశ్రమలను వృత్తిగా చేసుకున్నాయి.

## యానాదుల పండుగలు :

యానాదులు అడవి దేవుళ్లను, కుల దేవుళ్లను మొక్కు తారు. ఇష్టదైవం తిరుపతి వేంకటేశ్వరస్వామి, అహోబిళం లక్ష్మీ నరసింహస్వామి. కుల దేవత చెంచులక్ష్మి. అదే విధంగా గ్రామ దేవతల పండుగలు చేస్తారు. భద్రాచలం లోని శ్రీరాముడిని కూడా పూజిస్తారు. ఆ దేవుళ్ల పేర్లు పిల్లలకు పెట్టుకుంటారు. హిందూ పండుగల్లో పగటి వేషాలతో చక్కని చిందులు వేస్తారు. పండుగలు, ఆచా రాలు గిరిజనుల జీవితాలపై భారంగా ఉండేవి కావు. అయితే ఇప్పుడు గిరిజనేతర సంస్కృతులతో సంపర్కం ఏర్పడటం, వల్ల ఈ గిరిజన పండుగలు, ఆచారాలు గిరిజనులపై మోయలేని భారం మోపుతున్నాయి. ఈ పరిస్థితిని వ్యాపారులు, వడ్డీ వ్యాపారులు తమకు అనువుగా మార్చుకుని అమాయక గిరిజనులను దోపిడీ చేయడం ప్రారంభించారు. గిరిజనులు పేదరికం కారణంగా ఆకలి బాధలు తట్టుకోలేక, అవసరాలు గడవక అప్పు చేసి అల్లాడుతున్నారు. భూమిపైన అడవిపైన హక్కును కోల్పోవడం, వివాహాలు, మరణ సందర్భాల్లో ఆచరించే సంప్రదాయాలు, పండుగ పబ్బాలు, పంట వేయడానికి కోయడానికి ఆచారం పేరుతో జరిగే ఖర్చు కోసం అప్పుచేసి, అసలుతో పాటు వడ్డీ కట్టలేక అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఆరోగ్యం క్షీణించినప్పుడు, మత పరమైన ఆచారాలు, రాజకీయపరమైన, న్యాయపరమైన ఖర్చులు, జరిమాన చెల్లింపు, సాంఘికపరమైన కారణాలు పొగ, మద్యం వంటి దురలవాట్లు ఆభరణాల కొనుగోలు, ఆహారపదార్థాలు, బట్టల కొనుగోలు వంటి అవసరాల గిరిజనులపై మోయలేని భారం మోపుతున్నాయి గిరి జనులు కష్టజీవులు రోజువారి జీవితంలో అలిసిపోయిన వారికి ఈ పండుగలు ఒక ఆటవిడుపు. అంతే కాకుండా ఎక్కడెక్కడో ఉండే బంధువులు పండుగ సందర్భంగా కలసుకుంటారు. తమ కష్టసుఖాలను పంచుకుంటారు. ఆత్మీయతానురాగాలను అనుభవిస్తారు. పండుగ సందర్భముగా తింటారు, తాగుతారు, డప్పు వాద్యాలతో, నృత్యాలతో ఆనందిస్తారు. తిరిగి పండుగ వచ్చేవరకు ఉండేవారెవరో, పోయేవారెవరో అనే వేదాంత భావనతో తనివి తీరా ఆనందాన్ని మరొకరితో పంచుకుంటారు. గిరిజన పండుగల వారి జీవితంలో పవిత్రస్థానం ఉంది. వీరి సమాజంలో ఒకప్పుడు మాతృస్వామ్య వ్యవస్థ ఉండేది.

## యానాదుల వివాహం :

యానాదులకు ప్రత్యేకమైన వివాహ సంప్రదాయాలు, కట్టుబాట్లు ఉన్నట్లు కనబడవు. పండుగ సమయాల్లో ఏ అమ్మాయి, ఏ అబ్బాయితో ఎక్కువ ఉత్సాహంతో ఆట లాడి పాటలు పాడతారో వారిని ఎంపికచేసి వివాహం చేస్తారు. వీళ్లు మేనరికపు వివాహాలు జరుపుతారు. వీరిలో ఆర్థికంగా ఉన్న కుటుంబాలలో బహుభార్యత్వం ఆచరణలో ఉంది. బాల్య వివాహాలు కూడా జరుపుతారు. కన్యాశుల్కం పాటించే పద్ధతి కూడా వీళ్లలో ఉంది. భార్యను పోగొట్టుకున్నవారు, విడాకులు పొందినవారు వితంతు పునర్వివాహం చేసుకోవచ్చు. వీళ్లు హిందూ వివాహ సంప్రదాయాలను అనుసరించరు. తాళిబొట్టు, పౌరోహిత్యం, ఏడడుగుల ప్రదక్షిణ చేయడం, ముహూ ర్తాలు, బంధు మిత్రుల ఆహ్వానాలు ఇవేమి ఉండవు. వీళ్ల వివాహాలను వీళ్ల పెద్ద మనిషి (నాయకుడు) పురోహితుడు అవుతాడు. వేద పండితుల సమక్షంలో వివాహాలు జరుపుకోరు. మొదటి నుండి కట్టుబాట్లు లేకపోవడం. ఇది అవసరమని కూడా అనిపించక పోవడం అనేది కనిపిస్తుంది. వీళ్ల వివాహాలు జరుగుతున్నప్పుడు యానాది స్త్రీ పెళ్ళి కొడుకుకు 'నలుగు' పెట్టేటప్పుడు పాటలు పాడతారు. ఒకరి తరువాత మరొకరు పాడతారు.

## ముగింపు :

పూర్వకాలంలో ఉన్న యానాదుల సంస్కృతి, నేడు అంతగా కనిపించదు ప్రధాన స్రవంతి అనుకునే సమాజం కంటే భిన్నంగా యానాదుల అనేక వైవిధ్యాలతో ఉం టారు. ప్రాంతాలపరంగా, భాషాపరంగా వివిధ వైవిధ్యాలు కనిపిస్తాయి. యానాదుల వేట విధానం, మద్యపానం, పోడు వ్యవసాయ విధానాలు, తమ సాంస్కృతిక

ఆచారంగా యానాదులు జీవించడం మనం గమనించదగ్గ విషయం. 'యానాది' గిరిజనుల కష్టాలను, అలాగే వారి సాంస్కృతిక పరిస్థితులను వారి జీవన విధానాలను అలాగే బ్రతకడం కోసం చేస్తున్న పోరాటాలు కనిపిస్తాయి.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. వెంకటేశ్వర్లు, ఏకుల (ఇ.వి.): యానాది జీవిత చిత్రం. బహుజన కెరటాలు ప్రచురణలు, ఒంగోలు, 2010.
2. డా. శాస్త్రి, వి.ఎన్.వి.కె: రాష్ట్రంలో గిరిజనులు-సమస్యలు. ప్రజాశక్తి ప్రింటింగ్ ప్రెస్. హైదరాబాద్. 2014.
3. శివరామక ృష్ణ, పిరాట్ల: ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనులు సంస్కృతి ప్రగతికి సవాళ్ళు.ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్. 2013.
4. హస్ నైన్, నదీం- 'భారతీయ గిరిజనులు' 1995
5. వెంకటరావు, పొన్నాడ- 'ఆంధ్రప్రదేశ్ లో గిరిజన సమస్యలు సంక్షేమం' - 2002లో ప్రచురించారు.
6. సూర్యనారాయణ, ఎమ్- 'భారతదేశము గిరిజన సముదాయాలు' 2005లో వెలువడింది.

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# వన రక్షణే - జనరక్షణ (వృక్ష గాథ తాత్త్వికత)

- మూడే నాగేంద్ర నాయక్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ప్రెసిడెన్సీ కళాశాల, చెన్నై, తమిళనాడు.

మానవ పరిణామ క్రమం వృక్షాల మనుగడ వల్ల జరుగుతోంది అన్నది అందరికీ తెలిసిన విషయమే. కాని ఎవ్వరూ వాటి గురించి పట్టించుకోక, వేగవంతమైన జీవితానికి అలవాటు పడి ఆలోచించటం మానేశారు. మనిషి జీవితమే కాదు సృష్టిలోని ప్రతిజీవి జీవితం వృక్షాలతో ముడిపడి ఉందన్నది నిర్వివాదాంశం. ఈ సత్యాన్ని గేయం రూపంలో చెబుతూ, సమాజానికి విలువైన సందేశాన్నిస్తున్నాడు కవి. ప్రతి వృక్షానికి ఒక ప్రత్యేకత ఉంటుంది. ఆ ప్రత్యేకతలను, వాటి బాదను చెబుతూ కవికి విన్నవించుకుంటున్నాయి. కవి ఆలకించి వాటికి పరిష్కార మార్గం చెబుతున్నాడు.

## కవి పరిచయం :

గుంటూరు జిల్లా తెనాలి మండలం ఎరుకల పూడి గ్రామంలో జన్మించిన ప్రణవి తన పల్లె జీవితంలోని పరిస్థితులను, మనుష్యులను, గమనించి మంచిని ఎత్తిచూపుతూ, చెడును నిరసిస్తూ తన అంతరంగాన్ని తెలియజెయ్యడానికి, 'అంతరంగాలు' పేరుతో రసరమ్య నాటికాను లోకానికి అందించారు. ఇందులో 7 నాటికలు, 3 నాటకాలు మాత్రమే గాక, సంగీత నృత్య రూపకం, ఏకపాత్రాభినయం, టెలిప్లే వంటి రసదర్శనాలూ ఉన్నాయి. అందులో భాగంగా 'వృక్షగాథ' ఇది ఒక సంగీత నృత్యరూపకం.

## కథా సంగ్రహం :

మనిషి ఎంతటి జ్ఞానో అంతటి అజ్ఞాని కూడా. సృష్టిలో మానవేతర ప్రాణులన్నీ తాను తినడానికో, ఉపయోగించుకోవడానికో ఉన్నాయని అనుకుంటున్నాడు మనిషి. తన కంటే యితరమైన సృష్టినంతా నాశనం చేస్తూ తాను మాత్రం కర్మయోగినని గొప్పగా చెప్పుకుంటున్నాడు మనిషి. మనిషికంటే త్యాగశీలంలో మిన్నమైన చెట్టు చేమల పాత్ర మనిషికంటే ఎక్కువ. అరణ్యాలలో నివసించి ఆదిమానవుడు చెట్లను ప్రేమించినాడు. వనదేవతలుగా ఆరాధించినాడు. అవి అతనికి ఆధ్యాత్మిక ఆలంబనాన్ని అందించినాయి. వాటిలోని దాతృత్వ గుణాన్ని 'దేవత' పేరుతో పిలుచుకున్నాడు. సూక్ష్మరూపంలో అణగారి ఉన్న అశ్వర్థ, వటవృక్షాల విత్తనాల నుండి మహావృక్షాలు పైకెదగడం గమనించిన తద్వారా సృష్టి సూక్ష్మతత్వం నుండి వికాస తత్వాన్ని వివేచించినాడు. సృష్టి వికాసాన్ని విత్తన తత్వంతో పోల్చి విశదం చేసుకున్నాడు. దీని వికాస తత్వాన్ని అర్థం చేసుకున్న బుద్ధుడు రావిచెట్టు కింద కూర్చొనే జ్ఞానోదయం పొందినాడు. బౌద్ధ యుగంలో రావిచెట్టు ఆరాధనీయమై ఉండింది.

ఈనాడు సాంకేతిక పారిశ్రామిక విప్లవం కారణంగా మనిషి తన ఆధునిక భౌతికావస రాలకనుగుణంగా నివాస ప్రాంతాలలోని చెట్లను నరికేస్తున్నాడు. అడవుల్ని మటుమాయం చేస్తున్నాడు. ఈ ఫలితంగా వాతావరణంలో విపరీతమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. భూతాపం పెరిగిపోయి, వర్షాలు తక్కువైపోయినాయి. భూమాత కడుపు తడి ఆరిపోయి నీటి చుక్క కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఎదురైంది. ఇదే పరిస్థితి యిలాగే కొనసాగితే మరికొంత కాలానికి మానవజాతి మనుగడ కష్టాల పావుతుందని తెలిసికూడా నిర్లక్ష్యంగా చెట్లను నాశనం చేస్తున్నాడు మనిషి. చెట్టుకు మనిషికి అవినాభావ సంబంధముందని మనిషి మరిచిపోతున్నాడు. ఇప్పటికయినా మనిషి తెలుసుకుని ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. వృక్షరక్షణ, వనపోషణ తన కర్తవ్యంగా గుర్తించి మనిషి మసలుకోవాలి. ఈ కర్తవ్యాన్ని గుర్తు చేసేదే ఈ వృక్షగాథ.

ఇదొక సంగీత నృత్య రూపకం. ఇందులో పదిమంది వనకన్యలు తరుల తాదులకు ప్రతిరూపాలైన పాత్ర ధారులై తమ మనసులోని బాధను వయోవృద్ధుడైన ఒకానొక కవికి విన్నవించుకుంటారు. తరులలతాదుల

బాసలు, ఊసులు, తెలిసిన ఆ కవి అన్నీ విన్నాడు, రావి, మఱ్ఱి, దేవదారు, ఖర్జూరం, పొన్న, పనస, మామిడి లాంటి వృక్షాలు, మల్లి, సంపంగి, జాజి, విరజాజి లాంటి లతలూ వనకన్యల రూపంలో తమ కష్టాలను ఏకరువు పెడతాయి. గొడూ గోదావల్ల, క్రిమికీటకాల వల్ల, వానలు వరదల వల్ల, మనుషుల వల్ల తమకెలాంటి ప్రమాదాలు ఎదురవుతాయో మొర పెట్టుకుంటాయి. పశుపక్ష్యాదులకు, మానవ జాతికి తాము ఎంతటి ఉపకారం చేస్తున్నాయో వివరిస్తాయి. మానవుల్లో మహామహులకు, దేవుడికి తామెంతగా యిష్టమో విశదం చేసి చెప్పాయి. ఒకేటమో బుద్ధ భగవానునికి జ్ఞాన క్రాంతిని ప్రసాదించిన బోధివృక్షము. ఒకటేమో కృష్ణ పరమాత్మకు శయ్యనమర్చిన వటవృక్షము. ఒక్కటేమో జంతుహింసను భరిస్తూ యజ్ఞా యాగాదులలో యూపస్తభంగా నిలిచిన దేవదారు వృక్షము. ఎడారి ఎండలో నిలిచి మహితాత్ముడైన అల్లాకు యిష్టమైన ఫలాలను అందించిన ఖర్జూరపు వృక్షము. దైవ హింసను భరిస్తూ శిలువగా చెక్కబడి ఏసుప్రభువుకు తోడుగా నిలిచిన చేవదేలిన మహావృక్షము, ఇలా ఇవన్నీ దైవ కార్యాలలో తామెంతగా ప్రాముఖ్యత కల్గి ఉన్నదీ తెలియపరచుకున్నాయి. ఇటు మనిషికి, అటు దైవానికి ప్రత్యక్ష పరోక్ష పనులలో ఏదో ఒక ఉపకారం చేసి తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి.

అది ఏమతమైనా చెట్టులేని ఆలయముండదు. దైవత్వాన్ని, త్యాగశీలాన్ని ప్రదర్శించే చెట్టు తత్వంలో దర్శించగలిగే మంచి జ్ఞానమున్న మనీషి. ప్రార్థనాలయాల ప్రాంగణాలలో చక్కని ఫలపుష్పాదులను, చిక్కని నీడను పంచి పెట్టే ప్రసిద్ధమైన తరుల లతాదులను పెంచి పోషించినాడు. నిజానికి చెట్టు తన సర్వస్వాన్ని త్యాగం చేస్తుంది. ఏ మాత్రం స్వార్థం లేకుండా ఇతరుల కోసమే బ్రతుకుతూ ప్రాణాన్ని నిలబెట్టుకుంటున్నాయి. మానవ యంత్రం మనుగడ సాగించడానికి జీవన యింధనం ఈ శాఖాహార శరీరాలే.

సరసమైన పొన్న చెట్టయినా, పసందయిన పనస చెట్టయినా, తేనె లొలికే తియ్య మామిడైనా, జిహ్వాను మురిపించే జామచెట్టయినా, నీళ్ళూరించే నిమ్మయినా, దానిమ్మయినా, మరెన్నో మధుర మనోహర రసరమ్య భురుహలు (చెట్లు) అందించే ఫలాలే రోగికి, భోగికి ప్రాణదానం చేస్తాయి. చెట్లే జీవజంతువులకు, క్రిమికీట కాదులకు, మనిషికి జీవన దాతలు, ఎన్నో ప్రాణులకు యింతగా జీవనాన్నిస్తున్న తమను మనిషి యింత క్రూరంగా హింసించి ఒక్క వేటుతో కూల్చడమే తప్ప తమ వికాసానికి ఏమాత్రం చొరవ చూపడంలేదని వృక్ష జాతి బాధపడిపోతున్నది.

ఇతరోపకారమే మ హోరీపకారంగా, తమ కర్తవ్యంగా భావించే వృక్షరాశి, ఇత ఏ ఆలోచనలు లేకుండా దైవత్వానికి మారుపేరుగా ఉంటున్నాయి. తాము చేసే సేవకు గుర్తింపు లేకుండా పోతోందని, మనిషి తమ పట్ల కృతజ్ఞత కూడా చూపడం లేదని వాపోతున్నాయి. చెట్లకు మన సే లేదని, మనసులేని చెట్లకు సేవ చేసే సంకల్పం కలిగేందుకే అవకాశం ఉండదని, చెట్లు చేసే సేవలు త్యాగం క్రిందికి రావని, మనిషి మూర్ఖంగా మాట్లాడుతుంటే చెట్లు సహించలేకపోతున్నాయి. ఇతరులకు ఒక పైసా విసిరేసినంత మాత్రాన గొప్ప త్యాగం చేసినట్లు ప్రకటించుకుంటున్న మనిషి, సర్వస్వం త్యాగం చేస్తున్న చెట్టును గుర్తించలేకున్నాడు.

మనిషేగాదు, సమస్త జీవకోటీ తమ పైననే ఆధారపడినాయని, కానీ అవన్నీ తమను పూర్తిగా నాశనం చెయ్యవని, మనిషి మాత్రమే తమను తుదముట్టిస్తున్నాడని, ప్రపంచానికి ప్రళయం తెప్పిస్తున్నాడని, దుఃఖిస్తున్నాయి. పసరు గల్గిన తమ ఆకులను పశుజాతి పరపరా కబళించినా, మిడతలు, దుష్ట పురుగులు దాడి చేసినా, వరదలు ముంచెత్తినా, ఎండలు దంచెత్తినా, ఆకులన్నీ రాలిపోయి మోడువారినా, మరలా చిగురెత్తి పూలు పూచి, కాయలు కాచి, జీవకోటికి పునరంకితమవుతూ సేవచేస్తున్న తమను మనిషి మాత్రమే తన అవసరాల కోసం వేళ్ళకాన పెకళించేస్తున్నాడని, మనిషి కృతఘ్నుడని తమ బాధను వ్యక్తం చేస్తున్నాయి వృక్షాలు. మానవేతర ప్రాణులకు తాము తక్కువగానే ఉపయోగపడుతున్నామని, మనిషికే అడుగడుగునా అవసరపడుతున్నామని నెత్తి నోరు

మొత్తుకుంటున్నాయి చెట్టు. శయన మందిరాన శయనించు పాన్పులుగా ఇంటిని నిలబెట్టే నిట్రాడులుగా సింహద్వారపు తలుపులై, దూలాలుగా పరువాల పెళ్ళిళ్ళ పందిళ్ళుగా, అతిథుల నలరించు ఆసనాలుగా, పొలము దున్నే నాగళ్ళై, బండ్లి, ఓడలై, పొయ్యిన మండే పుల్లలై, చివరకు చితిని కాల్చే కట్టెలై, బ్రతుకు ముక్కలై బూడిదయి పోతుంటే కూడా పెదవి కదపకుండా త్యాగమే కర్తవ్యంగా, కర్తవ్యమే యజ్ఞంగా, కడతేరిపోయే తమను ఎందుకు మనిషి తమతోబాటు, తమను కూడా పరిరక్షించలేక పోతున్నాడని ప్రశ్నిస్తున్నాయి.

వృక్షాల మీద పక్షులు గూళ్ళు కట్టె, గుడ్లు పెట్టె పిల్లలు లేపుతుండడం మనిషికి తెలియదా? చెట్ల నీడలో కుక్కలు పిల్లల్ని కని, పాలిచ్చి పెంచడం చూడలేదా? చెట్ల పాదల్లో చేమలు పుట్టలు పెట్టే నివాసముంటుండేది తెలియదా? ఇలా ఇలా ఎన్నో ప్రాణులు వృక్షాలను ఆధారం చేసుకుని జీవనాన్ని గడుపుతూ వాటి వాటి వంశాభివ ృద్ధిని చేసుకుంటూ ఆలన పాలన చూచుకుంటూ ఆనందిస్తు న్నాయి. కానీ వ ృక్షజాతికే తమ బిడ్డల ఆలనా పాలనా చూచుకునే అదృష్టం లేకుండా ఉందని విచారాన్ని వ్యక్తం చేస్తున్నాయి. వ ృక్షాలు పిల్లమొక్కను ప్రేమించే అద ృష్టం తల్లి మొక్కకుగాని, తల్లి మానును ప్రేమించే అద ృష్టం పిల్లమొక్కకు గాని లేకపోవడం తమ దౌర్భాగ్యమని తల్ల డిల్లుతున్నాయి వ ృక్షాలు.

వృక్షాల దీనస్థితికి కవీంద్రుని కనులు చెమర్చినాయి. వృక్షాల కడుపుకోత, హృదయ పఘోష కవీంద్రుని కళ్ళల్లో కన్నీటిబొట్లు పొంగి పొరలేటట్లు చేసినాయి. అతని గుండె ద్రవించి, అతని స్పందనను చూచిన తరుల లతాదులు అతని పాదాల పైన త ృప్తిగా పూలవాన కురిపించినాయి. తమ ఆర్తనాదాలను గ్రహించే మనసున్న మనిషి యింత కాలానికి దొరికాడని వనకన్యలందరు పరవశించి పోయినారు.

కవీంద్రుడు వృక్షాల ప్రాముఖ్యతను తనకు తెలిసిన కాడికి వాటికే విన్నవించుకున్నాడు. వేదాలు వెలిసిందీ, రామాయణ భారతాలు రాయబడిందీ తాళపత్రముల మీదనే. సకల శాస్త్రాలు శృంగార కావ్యాలు రూపుదాల్చింది తాళపత్రముల మీదనే. రామాయణంలో రాముడికి, భారతంలో పాండవులకు అడవులే ఆశ్రయమిచ్చినాయి. మహరులెందరో అరణ్యాలలోనే ఆవాస మేర్పరచుకొని అరణ్యక గ్రంథాలను వ్రాసినారు. సృష్టి అంతా ప్రకృతీ పురుషుల సంగమం. చెట్లు ప్రకృతి, మనిషి పురుషుడు. ప్రకృతీ పురుషుల సహజీవనమే సృష్టి రహస్యం. సృష్టి యొక్క తత్వాన్ని నిస్వార్థ జీవులయిన చెట్లే తెలియ జేస్తున్నాయి. అలాంటి వృక్షరాశిని మనిషి నిర్దయతో నిర్మూలిస్తుండడం తగని పని. ఈ అన్యాయాన్ని జగతి జనులకు వినిపిస్తానని, దేవునికి తెలియజేస్తానని, మనిషికి చెట్టు లాంటి గుణమిమ్మని మనసారా వేడుకుంటానని కవీంద్రుడు మాటయిచ్చినాడు వృక్షాలకు. వన రక్షణే జన రక్షణ అనీ, వృక్షాల కన్నెబిడ్డల్ని దత్త పుత్రులుగా భావించి మనిషి కొక్క చెట్టు చొప్పున పెంచుదామనీ జన్మ జన్మలూ కలిసి బ్రతుకుదామని ప్రపంచ జనానికి విజ్ఞప్తి చేసినాడు కవీంద్రుడు. సర్వే వనా సర్వేజనాః సుఖినో భవంతు అని కవీంద్రుడు పలికిన మాటలు వేదవాక్కుల వలె సత్య ప్రమాణాలుగా అనిపించి వనకన్యలు పరమానంద భరితులై ఆనంద తాండవం చేస్తూ పూలజల్లు కురిపించినాయి. పులకరించి పోయినాయి.

## పాత్ర - కవీంద్రుడు :

వృక్షగాథలోని కవీంద్రుడు ముఖ్యమైన పాత్ర తరుల లతాదులు బాసలు, ఊసులు తెలిసినవ్యక్తి. కనుకనే వృక్షాల దీనస్థితిని అర్థం చేసుకున్నాడు. అతని మనసు కరిగింది. వాటి నివేదనను భగవంతునికి సమర్పిస్తానని మాట యిచ్చినాడు వాటికి. వాటి వినతిని మనుషులకు కూడా విన్నవిస్తానని చెప్పి చెట్లను ఓదార్చినాడు. చెట్లను ప్రేమించే మంచి గుణం మనిషికిమ్మని దేవుని కోరుతా నన్నాడు. వృక్షాలు, మనుషులు సహజీవనం చేసుకుంటూ, ఒకరిపై ఒకరు ఆధారపడి అవినాభావ సంబంధంతో కొనసాగుతున్నారని, ఒకరి కొకరు ఆప్తులుగా ఉంటు న్నారని, చెట్లు వేరు, మనిషి వేరు కాదని చెప్పి కవీం ద్రుడు వృక్షాలను తృప్తిపరచినాడు. వృక్షాలు నిండిన అడవులే లేకపోతే రామాయణ భారత గ్రంథాలలోని

కథలు బీడు వారిపోయేవని, మొత్తం నాలు వేదాలుగాని, రామాయణ, భారత గ్రంథాలుగాని, కావ్యాలు గాని, సకల శాస్త్రాలుగాని తాళపత్రముల మీదనే రూపుదాల్చినాయని చెప్పి కవీంద్రుడు వృక్షాల బాధను తొలగించినాడు. రచయితే కవీంద్రునిగా పాత్రలో పరిచయం చేసుకున్నట్లుంది. రచయితకు వృక్షాలంటే ఎంతో ఆదరం, గౌరవం, ప్రేమ ఉన్నాయి గనుక.

**శైలి :**

వృక్షగాథ ఒక మరపురాని నృత్య నాటకం. చెట్ల ఆత్మలను, ఆవేదనను సవివరంగా చక్కని శైలిలో ప్రదర్శింపజేసినాడు రచయిత. శ్రవ్య మాధ్యమంగా వినిపించాల్సిన విశేషాన్ని దృశ్య మాధ్యమంగా చిత్రించడంలోని నాటకీయమైన ప్రతిభ రచయితలో స్వతస్సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తున్నది. కథల్ని, కొన్ని సంఘటనలను నాటకీయంగా మలచడం ఒక గొప్ప కళ. ఇందులో అద్భుత నైపుణ్యం ప్రదర్శించారు రచయిత.

పాత్రల కదలికల్నిబట్టి అప్పుడప్పుడూ సూత్రధారుడై, చెట్లయొక్క, కవీంద్రుని యొక్క అంతర్యాలను తెలుపుతూ రూపకాన్ని రక్తి కట్టించిన గంధర్వుని పాత్రను మలచిన తీరు రచయిత సమయస్ఫూర్తిని తెలియజేస్తున్నది. మధ్య మధ్యలో సాకీని, చౌపిఇపంచి, సముచితం వ్యాఖ్యానంతో సన్నివేశాలను అనుసంధానం చేస్తూ రచయిత కూర్చుకున్న సంవిధానం రమ్యంగా ఉంది.

ఈ రూపకం రచయితకు సంగీతం పట్ల, నృత్యం పట్ల ఉన్న మక్కువను స్పష్టం చేస్తున్నది. సందేశం

'సర్వేవనా, సర్వెజనాః సుఖినోభవంతు' అని నినదించినాడు రచయిత. "వనరక్షణే - జన రక్షణ" అనే సూక్తి రచయిత క్రొత్త సృష్టి. ఈ సూక్తి ద్వారా వనాలకు జనాలకు మధ్య ఉన్న సంబంధాన్ని స్పష్టం చేశాడు రచయిత. వృక్షాలను ఓదార్చుతూ "మీ కన్నబిడ్డల్ని దత్త పుత్రులని యెంచి, మనిషి కొక్క చెట్టు పెంచుతాము. జన్మజన్మలు కలిసి బ్రతుకుదాము" అని కవీంద్రునిచే పలికించడం ద్వారా రచయిత ఒకచక్కని సందేశాన్ని మానవజాతికి అందించినాడు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్లను పెంచాల్సిన అవసరాన్ని జనం ముందుంచినాడు. పేరుకే హరిత విప్లవం ఉంది గానీ నిజంగా చెట్లను వృద్ధి చెయ్యడంలో నిబద్ధత మనకు లేదని నిరూపించినాడు రచయిత. సాంకేతిక పారిశ్రామిక విప్లవాల కారణంగా, హరిత విప్లవం నీరుగారి పోతున్నదని ఉన్న చెట్లన్ని నిర్మూలింపబడడమే గాని, నూతనంగా అభివృద్ధి చేసింది లేదని, అడవులు, వనాలు మటు మాయమైపోతే ఫలితంగా వాతావరణంలో విపరీతమైన ఎన్నో మార్పులు చోటు చేసుకుని భూతాపం పెరిగి పోతుందని, వర్షాలు కరువైపోయి నేల తల్లి ఎడారిగా మారిపోతుందని తెలియజేస్తూ రచయిత, ఈ పాపాలన్నిటికీ తగిన ప్రాయశ్చిత్తం వృక్ష రక్షణేనని, మన కర్తవ్యాన్ని గుర్తు చేసినాడు.

**ముగింపు :**

మనిషి వృక్షం విలువ తెలుసుకోవాలి. వృక్షాలు పెంచడం వల్ల పర్యావరణానికి ప్రపంచానికి ప్రత్యక్ష మేలు జరుగుతుంది అన్నది మనిషి గ్రహించగలిగితే, అనేక ముప్పుల నుండి మనల్ని మనం రక్షించుకోవచ్చు అన్నది వృక్షగాథ సారాంశం. ఈ వృక్ష గాథను నేటి విద్యార్థులకు, వినిపించి, చూపించి ప్రచారం చేయగలిగితే కొద్దిలో కొద్దిగానైనా మేలు జరుగుతుంది. ఈ ప్రేరణతో చెట్లను పెంచాలి. మనిషి సంతోషంగా బ్రతకడానికి కృషి చేయడమే ఈ గాథ యొక్క ప్రధాన ఉద్దేశ్యం. (నా సిద్ధాంత గ్రంథంలోని ఒక భాగం)

**ఆధార గ్రంథాలు :**

1. అంతరంగాలు (రసరమ్య - నాటక ప్రక్రియలు) - ప్రణవి
2. శాంతి వనం - - మంచి కంటి విద్య పిల్లలు అనుభవాలు ప్రయోగాలు

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# బోయి భీమన్న వచన కవిత్వం - దళిత దృక్పథం

- డా॥ ఎన్. భీమన్న, తెలుగు అధ్యాపకులు, శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల, తిరుపతి.

తెలుగు సాహిత్యంలో ఎన్ని ప్రక్రియలు ఉన్నాయో, ఎన్ని ఉద్యమాలు ఆవిర్భవించాయో, అన్నిటిలో భీమన్న సిద్ధహస్తులు. ఆయన పద్యం రాసినా, వచనం రాసినా దళిత అభ్యుదయాన్ని కాంక్షించారు.

దళిత వచన కవిత్వం కారంచేడు సంఘటన తర్వాత ఉద్యమ రూపాన్ని పొందింది. అంతకు పూర్వమే బోయి భీమన్న దళిత ఉద్యమ స్ఫూర్తితో దళితులలో పోరాట పటిమను, చైతన్యాన్ని రగిలించడానికి వచన కవిత్వం రాశారు. ఆచార్య ఇనాక్ 1979 లోనే ఆధునిక భారత దేశంలో నాగరికత ముసుగులో జరుగుతున్న అనాగరిక వ్యవస్థను నిరశిస్తూ, దళితుల్ని ప్రగతి వైపు నడిపించే విధంగా కవిత్వం రాశాడు.

బోయి భీమన్న వచన కవత్వం గురించి ఆచార్య టి.గౌరీశంకర్ చెబుతూ "భీమన్న ఇజాలకు, భేషజాలకు కట్టుబడి నిజాన్ని నిర్భయంగా, నిర్మొహమాటంగా చాటుతారు. ప్రకృతి పురుషులు ప్రణయం, ఆత్మ పరమాత్మల ఐక్యం, అలౌకిక భావనా ప్రపంచం, రసాను భూతి, రసానందం, రసాద్వైతం, లౌకిక వస్తుజాలం, వ్యక్తి సమూహం, సామాన్యుని వేదన, సామాజిక సమస్యల చిత్రణ, అట్టడుగు మనిషి ఆక్రందన అన్నీ అతని కవిత్వంలో అక్షరాకృతిలో సాక్షాత్కరిస్తాయని" ప్రశంసించారు.

భీమన్న అభిప్రాయంలో కవిత్వం ఒక ప్రక్రియకు, భాషకు బందీ కాదు. అదొక స్వేచ్ఛా సుందర మధుర భావన అంటారు.

"ఆకాశంలో పద్యంగా ప్రవహించిన వాణ్ని
దూకి గేయంలో పడ్డాను!
అక్కడి నుండి గెంతి, గద్యం మీద పడ్డాను!
కవిత్వం ఒక ప్రక్రియకు ప్రేయసి కాదు.
ఒక భాషకు బందీ కాదు.
ఒక స్వేచ్ఛా సుందర మధుర భావన" అంటారు.

బోయి భీమన్న 1962లో 'అనాది కొన నుంచి అనంతత్వంలోకి' అనే వచన కవితా సంపుటిని ప్రచురించారు. ఇందులో కొన్ని ఆత్మాశ్రయాలు, కొన్ని ప్రకృతి వర్ణనలకు చెందినవి. మరికొన్ని తాత్త్విక, వ్యంగ్య సంబంధమైనవి ఉన్నాయి. ఇంకా భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వ ధోరణులు కూడా కనిపిస్తాయి. ఈ కవితల్లో భీమన్న ఎక్కువగా ప్రణయాన్ని, ప్రేమతత్వాన్ని మేళవించి చెప్పడనికి ప్రయత్నించారు. దీనితోపాటు తాత్త్విక విషయాలను భావ గాంభీర్యాన్ని అందించారు. ప్రకృతి పరిశీలన శక్తి కలిగి, భావ పుష్టితో రసరమ్యంగా వ్యక్తీకరించారు.

భీమన్న వ్యక్తీకరించిన భావాలు భావకవిత్వానికి దగ్గరగా ఉన్నా, అందులో వీలైనంత వరకు దళితుల కష్టాల్ని చెప్పడానికి ప్రయత్నించారు. షేక్స్‌పియర్ డ్యూక్ అనే రాజు చేత 'స్వీట్ ఆర్ ది యూజెస్ ఆఫ్ అడ్వర్సిటి' అని చెప్పించారు. అంటే కష్టాల్లో అభ్యుదయాల్ని చూడమని భావం. ఈ భావానికి దగ్గరగా ఉండే ఆనందాన్ని భీమన్న వ్యక్తీకరిస్తారు.

'పువ్వుల కంటే లెక్కకు ముళ్ళే ఎక్కువ
ఈ నా గులాబీ తోటలో అందుకని
ముళ్ళతోట అననా దీన్ని? అంటారు.

కష్టాలు సర్వసాధారణంగా వస్తుంటాయని దాన్ని ప్రతిఘటించి చైతన్య వంతులై సుఖాన్ని పొందమని దళితుల్ని చైతన్య పరుస్తారు భీమన్న.

"లక్ష ముళ్ల పొదల్ని భరించి
ఒక్క తోటైనా పెంచుకొందాం
లక్ష అపస్వరాల్ని సహించి
ఒక్క పాటైనా పాడుకుందాం
లక్ష కోరికల్ని పరిహరించ
ఒక్క మాటైనా కలుసుకొందాం!' అనటంలో లక్ష్య సాధన కోసం ఎన్ని కష్టాలనైనా భరించాలని, ఎదురైన

ఎన్నో అవమానాల్ని సహించాలని, కోరికల్ని చంపుకొని ఐక్యంగా పోరాడటానికి ముందుకెళ్లాలన్న ప్రతిఘటనాత్మక చైతన్యాన్ని ఈ కవితలో చొప్పించారు.

'దివారాత్రాలు' అనే ఖండికలో తాను జీవిస్తున్న జీవనాన్ని, బ్రతుకును నిందించకుండా, చావుకు భయపడకుండా అందులోని సౌందర్య విలసితాలైన ప్రయత్నించాలని ఉద్బోధిస్తారు.

'తపస్సులోకి' అనే ఖండికలో దళిత జీవనాన్ని మల్లె మొగ్గతోను, గులాబి పూవుతోను, ఉపశమించి తన నెంతగా నాశనం చేయాలని ప్రయత్నించినా, మోడుగా తయారు చేయాలని ప్రయత్నం చేసినా, తపస్సులోకెళ్లి తిరిగి పుష్పిస్తానని చెప్పడంలో అణచివేయబడ్డ దళితుడు తన స్థితికి వగచి మోడుగా పడి ఉండకుండా తిరిగి పుష్పించటానికి లేదా బ్రతకటానికి కావలసిన అన్ని శక్తుల్ని కూడగట్టుకొని ముందుకెళ్ళాలన్న సందేశం ఆ కవితలో కన్పిస్తుంది.

'తపస్సు చేసుకొంటూ
నాలో నేను జీవించినప్పుడు
అంకురించాను మల్లెమొగ్గగా,
వికసించాను గులాబి పువ్వుగా
ఫలించాను రసాలగా!'
కన్ను తెరచి
లోకంలో బ్రతకడం ప్రారంభించి
గిల్లి వేసుకోబడ్డాను రాత్రి అందం కోసం!
మాల గ్రుచ్చబడ్డాను మహాసభ గౌరవం కోసం
ఇంధనమై పోయాను లోకం ఆకలి మంటలో!

బోయి భీమన్న 1973 ప్రచురించిన మరొక వచన కావ్యం గుడిసెలు కాలిపోతున్నై. దీనికి 1975లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. గుడిసెల్లో పుట్టి, గుడిసెల మధ్య పెరిగిన భీమన్నకు గుడిసెలు ఎందుకు కాల్తాయి. ఆ గుడిసెల స్థానంలో వేరే గుడిసెలు ఎలా లేస్తాయి మొదలైన విషయాలు కూలంకుషంగా తెలుసుకొని ఈ సంపుటిలో రాశారు.

వర్ణాశ్రమ ధర్మవ్యవస్థ వేళ్ళు తన్నుకున్న ఈ సమాజంలో గుడిసెలు, గుడిసెవాసులు ఉండడానికి ప్రధాన కారణం వారి అజ్ఞానమే అంటారు భీమన్న. అందువల్ల ఆ వ్యవస్థను రూపుమాపడానికి ఆ వ్యవస్థ ధర్మాన్ని, రూపాన్ని మన కళ్ళు ముందు ఉంచుతారు భీమన్న.

గుడిసెలు కాలిపోతున్నై
ఓహో కాలిపోతున్నై
ఎవరి గుడిసెలో పాపం
మాల మాదిగలవే అయివుంటై
గుడిసెలు మరి ఎవరికుంటై?
చాలా మందికే ఉంటైలే
అసలు ఈ దేశ ధర్మమే అంత
అయితే ఈ గుడిసెలు
ఏడాది కొకసారైనా కాలిపోతుంటై
ఒకసారి కాలిపోయిన గుడిసెలు
మరి మళ్ళీ కాలిపోవడానికి
ఎక్కడి నుంచి వస్తుంటై?
అవును నిజమే
ఎక్కడి నుంచి వస్తుంటై
అదే మన ధర్మంలోని రహస్యం
ధర్మ సంస్థాపనార్థం
ఈ గుడిసెలు
మళ్ళీ మళ్ళీ అవతరిస్తుంటై
పోతుంటై పుట్టుకొస్తుంటై"

గుడిసెవాసులైన మాల మాదిగలు అందులో ఉన్న తంవరకు వారికి తమకు జరుగుతన్న అన్యాయాన్ని తెలుసుకునే అవకాశం లేదు. అందులో ఉన్నంత వరకు తమ గుడిసెలు కాలిపోవడం తిరిగి వాటిని నిర్మించడం, మరల గుడిసెలు కాలిపోవడం అనే విషవలయం సాగిపోతూ ఉంటుంది అంటారు కవి ఇక్కడ విషవలయం అని ఎందుకంటున్నాడో గమనించవలసిన అవసరం ఉంది. దళితులు గుడిసెల్లో ఉంటూ పేద

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


రికాన్ని అనుభవించాలే కాని వాటి నుండి బయట పడటానికి ఈ సమాజం అవకాశాన్ని కల్పించదు. అంటే దళితుల అభ్యున్నతిని కాంక్షించకుండా వారిని ఆ స్థితిలోనే ఉంచి వాటి చుట్టూ ఓ విషవలయాన్ని ఏర్పరచడాన్ని భీమన్న పరోక్షంగా నిందిస్తారు. ఈ కాలిపోతున్న గుడిసెల స్థానంలో మరో గుడెసెను నిర్మించకుండా గుడిసెల స్థానంలోనే భవనాలు లేపుకోవాలని భీమన్న అభిలషిస్తారు. కాలిపోతున్న గుడిసెల స్థితిలో నుంచి కొత్త ఉగాది పుట్టుక రావాలని కోరుకుంటాడు. పాతది గతించకుండా కొత్తదానికి దారే ఉండదని కాలిపోయిన గుడిసెల స్థానంలో మరో గుడిసె లేస్తే అది అభ్యుదయ కారకం కాదని భీమన్న అభిప్రాయం.

తిండి దొరకపోతే, బట్టలేకపోతే, కొంప లేకపోతే కృషించిపోనవసరం లేదని పరిస్థితులను తనకు అనుకూలంగా మలచుకొని ముందుకెళ్లాలని హీన పరిస్థితుల నుండే మేలైన వాటిని సాధించుకోవడానికి కృషి చేయాలని 'నాకు పేదరికం లేదు' అనే గేయంలో స్పష్టం చేశారు.

'నాకు తిండి దొరక్కపోతే
నేను పస్తులుండను
ఉపవాసాలు చేస్తాను!
నాకు పేదరికం లేదు
నాకు బట్ట దొరక్కపోతే
నేను చింకి పాతలు కట్టను
దిగంబరోద్యమం నిర్వహిస్తాను!
నాకు పేదరికం లేదు
నాకు కొంప దొరక్కపోతే
పేవు మెంట్లపై కూర్చోను
శ్రీ శుక మహర్షినే అవుతాను! అని బోయి భీమన్న అంబేడ్కర్ భావాల్ని తన కవితలో చొప్పించి దళితుల్ని చైతన్యవంతం చేయడానికి పూనుకుంటారు.

**ఆధార గ్రంథాలు :**

1. బోయి భీమన్న సాహిత్య షష్టిపూర్తి సంచిక
2. అనాది కొస నుంచి అనంతత్వంలోకి - భీమన్న
3. గుడిసెలు కాలిపోతునై - భీమన్న
4. బోయి భీమన్న రచనలు - దళిత దృక్పథం - డా॥నమశ్శివాయ.

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# రాసాని కథలు - కళాకారుల జీవితం

**- డా॥ పి. జయచంద్రుడు,** తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.యన్. ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), చిత్తూరు.

రాయలసీమ పేరెన్నికగల కథకుల్లో రాసాని విశిష్ఠ కథకులు. చిత్తూరుజిల్లా ప్రధాన కథకుల్లో ఒకరు. రాసాని పూర్తిపేరు రాసాని వెంకటరామయ్య. ఈయన కేవలం కథకులే కాదు.. ఒక నవలాకర్తగా, ఒక నాటకకర్తగా, ఒక నాటక ప్రయోక్తగా, ఒక విమర్శకుడిగా, ఒక కవిగా, ఒక కాలమిస్ట్‌గా కూడా సుప్రసిద్ధులే. అంతకన్నా సహృద యులు, మృదుస్వభావి. వస్తువులలో సహజత్వం, వర్ణన లలో కళాత్మకత్వం, శైలిలో సరళత్వం వీరికి వెన్నతో పెట్టిన విద్య.కథలను ఆశ్చర్యకరమైన ఎత్తుగడలతో, ఆసక్తి కరమైన కొనసాగింపుతో, ఆలోచనాత్మక ముగింపు పల కడంలో అందెవేసిన చేయి ఇతను. ఇతను మధ్య తరగతి, అట్టడుగువర్గాల పక్షపాతి. రైతు జీవితం, యానాదుల జీవితం, నక్కలోళ్ళ జీవితం, శ్రామికుల జీవితం, కళా కారుల జీవితం.. ఇవి వీరి కథా ఇతివృత్తాలు. ఇలా వైవిధ్య భరితమైన ఇతివృత్తాన్ని పోషింపబడిన కథల్లో కళాకారుల కడు దయనీయమైన జీవితాన్ని వర్ణించిన తీరు అత్య ద్భుతం.

కళాకారులు సంస్కృతికి, నూతన సమాజనిర్మాణానికి వారధులు. నేడు ఆ కళాకారుల జీవితాలు కడు దయ నీయంగా, మిక్కిలి దుర్భరంగాను ఉంది. కాబట్టి కళాకారు లను పోషించాలి. కళలను రక్షించాలి. అప్పుడే మన కళలు, సంస్కృతి సజీవంగా ఉంటాయి. ఇప్పుడు రాసాని కథల్లోని కళాకారుల జీవితాన్ని పరిశీలిద్దాం.

రాసానిగారు తన కథల్లో చిత్రీకరించిన కళాకారుల్లో ప్రధానమైనవారు ముగ్గురు. వీధినాటక కళాకారులు, వీరజాటి కళాకారులు మరియు డప్పు కళా కారులు.

వీధినాటక కళాకారుల జీవితాన్ని రాసాని గారు 'తపస్సు', 'పగటితారలు' అనే రెండు కథల్లో సహజంగా చిత్రించారు. 'తపస్సు' కథ ఒక వృద్ధ కళాకారుడు తగిన జీవనోపాధి లేకుండా తన ప్రాణాన్ని సైతం లెక్కచేయక తపస్సుమాను ఎక్కడానికి ఎలా సిద్ధపడ్డాడో కడురమ్యంగా వర్ణించారు. అలాగే 'పగటితారలు' అనే కథలో ఒక ట్రూప్‌లోని కళాకారులంతా తీసుకున్న ప్రభుత్వ రుణాన్ని తీర్చక ఊరు వదలి రోడ్ల పనులు చేసుకుంటూ అజ్ఞాతంలో కాలం గడుపుతున్న వైన్యాన్ని చిత్రించారు. ముందుగా 'తపస్సు' కథలోని వీధినాటక కళాకారుడు ఎటువంటి సమస్యలను ఎదుర్కొంటున్నాడో పరిశీలిద్దాం.

'తపస్సు' కథలో ప్రధాన పాత్ర కళాకారుడు రంగప్ప. రంగప్ప వయస్సు మీదపడిన ఒక కళాకారుడు. అందువల్ల అతనికి తన ట్రూపులో స్థానం పోయింది. ఆ ట్రూపు నాయకుడు మునివెంకటప్ప. రంగప్పకేమో జీవితాంతం రంగస్థలం పై నటిస్తూ రంగస్థలంపైనే ప్రాణం వదలాలనే తపన కలవాడు. కానీ వయసు మీదపడటంతో ముని వెంకటప్ప తన ట్రూపులో స్థానం కల్పించక పోయాడు. వయస్సులో ఉన్నప్పుడు బాగా ఉపయోగించుకున్నాడు. వయస్సు మీదపడటంతో రంగప్పను ట్రూపు నుండి దూరంచేసాడు. ఆ మాటలను రంగప్ప మాటలలో విందాం.

"ఎంతన్నా ముసిలోన్నైపోతిననుకో... మీ గురువు ముని వెంకటప్ప నన్ను మీ ట్రూపులోకి చేర్చుకోకపాయ... నేను తవుసుమాను ఎక్కేసత్తా వున్నన్ని దినాలు బాగా వాడుకొని ఇప్పుడు కూరలో కరేపాకు మాదిరి యేరేసిరి ... యేసికం యేసుకొని స్టేజిమిందనే పాణాలొదలాలంటా కలలు గంటావుంటి".

కళాకారుడు రంగప్ప ఎదుర్కొంటున్న మరొక సమస్య అప్పులబాధ. రంగప్ప వ్యవసాయం చేస్తూ కళావృత్తిని నిర్వహించేవాడు. కరువుకాటకాలవల్ల పంటలు సరిగ్గా పండక ప్రభుత్వ ఋణం తీసుకొని బోరింగ్ వేయగా నీళ్ళురాక అప్పులపాలైనాడు. అది కట్టలేక రంగప్ప జప్తుకు గురైనాడు. ఒకవైపు వృత్తి, మరోవైపు ప్రవృత్తి రెండూ లేకపోయింది. బతుకు జరగడమే గగనమైపోయింది.

రంగప్పకు వృత్తి, ప్రవృత్తి రెండూ ఆధారం లేకపోయే సరికి ఇంటి ఆడబిడ్డను రోడ్డుపనికి పంపించవలసి వచ్చింది. ఇలా ఎందరో కళాకారులు ఒక వైపు వృత్తి, మరోవైపు ప్రవృత్తి లేక గూడు చెదిరిన పక్షిలాగా అలమటిస్తు న్నారని రాసాని తన 'తపస్సు' కథలో చక్కగా వివరించారు.

వీధినాటక కళాకారుల జీవితాన్ని చిత్రించే మరొక రాసానిగారి కథే 'పగటితారలు'. ఈ 'పగటితారలు' కథలో 'కంగుంది గ్రామం' వీధి నాటకానికి ఎంత ప్రసిద్ధి గాంచిందో కథకులు రాసానిగారు చక్కగా వివరిస్తూ, అలాంటి గ్రామం కరువుకాటకాలవల్ల, యాంత్రికరంగంలో వచ్చిన మార్పులవల్ల కళాకారుల జీవితం ఎలా కకా వికలమైపోయిందో రచయిత చక్కగా వివరించాడు. ఊరూవాడా తిరిగి నాటకాలాడే కంగుంది గ్రామ నాటక కళాకారులు కరువుకాటకాల వల్ల వేషాలు దొరకక, చేసిన అప్పులు ఒకవైపు తీర్చక గ్రామాన్ని వదలి రోడ్లపని కోసం దూరప్రాంతానికి వలసవచ్చి, ప్రభుత్వ అధికారులకు భయపడే మునస్వామి ట్రూప్ సభ్యుల అవస్థలను చక్కగా వర్ణించాడు.

'పగటితారలు' అనే కథలో 'కంగుంది' గ్రామ కళా కారుల స్థితిని ఒకవైపు చిత్రిస్తూ, మునస్వామి ట్రూపు కళాకారులు బ్రతుకు తెరువు లేక రోడ్లపనులు చేస్తూ జీవనం గడుపుతున్న వైనాన్ని వివరించారు. కంగుంది గ్రామం ఇప్పటికీ వీధినాటకాలకు ప్రసిద్ధమైన ప్రాంతమే. కానీ నేటి సినిమాల ప్రభావం కరువుకాటకాల వల్ల వీధినాటకాలకు ఆదరవు చాలా తగ్గింది. ఒకప్పుడు కంగుంది వీధినాటకాలకు ఎంత ప్రసిద్ధో నాటకాల గురువు మునస్వామి మాటల్లో విందాం... "కంగుంది గ్రామంలో వుండే మన కొత్తిండ్ల నిండా వీధి నాటకాలాడే వాళ్ళే గదా వుండారు. ఊళ్లో మొల్తాడు గట్టిన పతి మొగోడూ నాటకాల్లో యేసికాలేసేవోడే. భారత నాటకాల్లోగానీ, రామాయణ నాటకాల్లోగానీ అందరూ యేసికాలూ యేసే సామర్తెం వుండేవోళ్ళేగదా".

"మనూరి నాటకాలకు ఎంత ఘనచరిత్ర వుండాది. సొతంత్రం రాకముందు కాంగ్రెస్ తరపున మన నాటకాల ద్వారా దేశభక్తిని ప్రబోధించినాము. బెంగుళూరుకి గాంధీ వచ్చినప్పుడు ఆయన ముందర బొబ్బిలియుద్ధం నాటక మాడితిమి. అది జూసిన గాంధి మన నాటకాలను ఎంతగానో మెచ్చుకున్నాడు. అప్పట్నుంచీ మనవాళ్ళకు కొత్త బలం వచ్చింది"

ఇలా కంగుంది గురించి మునస్వామి మాటల్లో ఆ గ్రామ కళావైభవాన్ని చెప్పుకోవచ్చు. కానీ అదే గ్రామంలోని కళాకారులు పగటి వేషాలు వేసుకొని ఊరూర తిరిగి కొందరు జీవనం గడుపుతున్నారని మనం ఈ క్రింది మాటల ద్వారా తెలుస్తుంది.

"ఈ సంవత్సరానికింక ఆటేసే అవకాశం రాదేమో? బ్యాంకీలోన్లు తీరేదెట్లా? యిప్పటికే గ్రామంలో చానా మంది ఆటోళ్ళు యేసికాలేసుకొని అడుక్కుంటా పల్లె లంటా, పట్నాలంటా పోయినారు. ఈ బ్రహ్మయ్య రాక పోతే, భారతం వొప్పించకపోతే మా పరిస్థితీ అంతేగదా. పగటేసికాలేసుకొని అడుక్కోవలసిందే. లేకుంటే బిడ్డాపాపల్తో కట్టగట్టుకోని సావాల్సిందే."

రాసానిగారు చిత్రించిన మరో కళాకారుడు వీరజాటి కళాకారుడు. 'వీరజాటి' అనే కథలో నాయకుడు కోటప్ప. ఇతను వీరజాటి కళను వంశపారంపర్యంగా స్వీకరించి ప్రదర్శిస్తూ జీవనం గడుపుతుంటాడు. కానీ ఎంతకాలం ఇలా కళాప్రదర్శనతో జీవించడమని రెండెకరాల అడవి భూమిని చదునుచేసి గౌరవప్రదమైన జీవితం గడుపు తుంటాడు. ఇలా రైతుజీవనం గడుపుతూ వీరమనాయుడి వద్ద అప్పులు తీస్తూ అడిగిన చోట్లంతా సంతకాలు చేస్తూ చివరకు ఆరెకరాల పొలం, అందులోని పంటనూ కోల్పోతాడు. అందుకు కారణం తన పొలంలో నాయుడి పశువులు పడి మేయడంతో తిట్టినందుకు ఆ నాయుడి జీతగాడు లేనిపోనివి కల్పించి కోటప్పపై నాయుడిలో పగను పెంచి పోషించాడు. ఆ ధనవంతుని పగ ఈ పేదవాడి జీవితాన్ని బుగ్గిపాలు చేసింది. వీరజాటి కళను చేపట్టవలసివచ్చింది. కానీ కోటప్పలో నాయుడిపై ద్వేషం, కోపం, పగ ఏర్పడినప్పటికీ ఏమి చేయలేక పోయాడు. ఇది వీరజాటి కథా ఇతివృత్తం.

కళాకారుడు పూర్తిగా కళనే నమ్ముకొనిగాకుండా ఇతర వృత్తులను కూడా చేసి గౌరవప్రదంగా బ్రతకాలని రచ యిత ఆశిస్తున్నాడు. ప్రతిరోజు వీరజాటితో బిక్షుకవృత్తిలో బ్రతకడం కన్నా వ్యవసాయం చేసుకుని అభివృద్ధి చెందా

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

లని గౌరవస్థానంలో ఉండాలని, స్వేచ్ఛగా జీవించాలని, ఇతరుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడకూడదని రచయిత ఆకాంక్షించాడు.

కోటప్ప తన పొలాన్ని వీరమనాయుడికి కోల్పోడానికి కారణం తనకు అక్షరజ్ఞానం లేకపోవడమే కారణమని, తనదే పొరబాటని భావిస్తాడు. తన మీద తనకే అసహ్యం వేస్తుంది కోటప్పకు. తన తప్పుకు తానే వీరజాటితో దండించుకొంటాడు. ఈ సందర్భంగా రచయిత పేద వాళ్ళకు అక్షరజ్ఞానం లేకపోవడం, పెద్దవాళ్ళపై ఉన్న గుడ్డినమ్మకమే ఈ పేదవాళ్ళను మరింత దరిద్రులుగా మార్చివేస్తుందని భావిస్తున్నాడు.

పేదవాడు ధనికునిపై విజయం సాధించలేకపోవ టానికి మరొక కారణం ధనిక వర్గానికి కొమ్ముకాసే బడుగు వర్గాలువారు. ధనిక వర్గం వద్ద పనిచేసే బడుగు వర్గం తనలాంటి బడుగు వర్గం అణగారిపోతుంటే చూస్తూ హేళన చేస్తారు. పైగా ధనిక వర్గానికి సహకరించడమే బడుగు వర్గం పైచేయి సాధించలేకపోతుంది. ఈ విషయాన్ని వీరమనాయుడి మాటలు విని వీరమ నాయుడి పనిమనుషులు కోటప్పను చితకబాధించడం ఒక చక్కని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇలా కోటప్ప చివరకు తన రెండెకరాల పొలాన్ని వీరమనాయుడికి కోల్పోయి వీరజాటి కళకు మరలా పునరంకితమవుతాడు. అటు తరువాత అతని కుమారుడు రెడ్డెప్ప వీరజాటిని స్వీకరిస్తాడు కానీ వీరమనాయునిపై విజయం సాధించడు.

కళాకారుల గురించిన మరో కథ హోమం. రాసానిగారు వీరజాటి కథలో పేద, ధనిక వర్గాల మధ్య జరిగిన ఘర్షణను చిత్రిస్తే 'హోమం' కథలో బలహీనవర్గాన్ని ఉన్నతవర్గం ఎలా అణచివేయడానికి ప్రయత్నించారో వివరిస్తూ, దానికి సమాధానంగా బలహీనవర్గం ఎలా ప్రతీకారం తీర్చుకుందో ఒక చైతన్య ఉద్యమాన్ని వర్ణిం చాడు.

'హోమం' కథలో రాసానిగారు అనాదిగా అణగారి పోతున్న పంచమకులస్థులలో, ఉద్యమాల ప్రభావంతో వారిలో కల్గిన చైతన్యాన్ని మిక్కిలి చక్కగా వర్ణించాడు. ఈ కథలో హరిజనులు తమ వాయిద్యాలను అగ్రకులా లకు వ్యతిరేకంగా అగ్నిలో వేసి నిరసన తెలియజేయడం ప్రధానోద్దేశం.

రాసాని వారు 'హోమం' కథలో డప్పు కళాకారుల జీవి తాన్ని చిత్రించారు. సాధారణంగా డప్పులు, కొమ్ములు, డుముకులు వాయించేవాళ్ళు హరిజనులు. ఈ కథలో హరిజనులకు, అగ్రవర్ణాలవారికి మధ్య జరిగిన ఆధిపత్య పోరును రాసానివారు చక్కగా వర్ణించారు. ఆ పోరాటంలో అగ్రవర్ణాలవారి పోటీకి ఏ మాత్రం తగ్గకుండా ఎదురు నిలబడి హరిజనులు విజయం సాధించడంలో కృతకృత్యు లయ్యారు. ఆ హరిజనవర్గానికి నాయకుడు సిన్నాయుడు. అగ్రకులానికి నాయకుడు కొండ్రెడ్డి. కొండ్రెడ్డి మిట్టూరు గ్రామ సర్పంచు. సిన్నాయడు మిట్టూరు గ్రామపంచా యితికి చెందిన మొరవపల్లె వార్డు మెంబరు. తరతరాలుగా మొరవపల్లె వార్డుమెంబరుగా అగ్రకులానికి చెందినవాళ్ళే మెంబరుగా నిలబడి ఏకగ్రీవంగా గెలిచేవారు. కానీ ఈసారి మొరవపల్లె ప్రజలు తమ ప్రాంతాభివృద్ధికి తమ జాతి వాడిని నిలబెట్టి ఎన్నుకున్నారు. మొరవపల్లె మిట్టూరుకు దళితవాడ. అందువల్ల కొండ్రెడ్డికి సిన్నాయుడిపైన, అతని అనుచరులపైన పగ, ద్వేషం. అందువల్ల మొరవపల్లెకు తాగునీటినిచ్చే చెరువు నీటిని చౌర్యం చేసి, అందులో చేపలు పట్టడానికి మిట్టూరు ప్రాంతప్రజలను ఉసిగొల్పి, చివరకు సిన్నాయుడితో గొడవపడి తన గ్రామానికి సిన్నాయుడి వర్గాన్ని వెలివేస్తాడు. అదే సమయంలో మిట్టూరులో ఎవరో చనిపోతే సిన్నాయుడి వర్గం మిట్టూ రోళ్ళకు డప్పులు వాయించడానికి వెళ్ళక మిట్టూరు గ్రామాన్ని వెలివేస్తారు. చివరకు తమ అవమానాన్ని, అంట రానితనాన్ని అంటకట్టిన పలకలు, డుముకులు, కొమ్ము లను మొరవపల్లె హరిజనులు మూకుమ్మడిగా అగ్నిలో పడవేసి అగ్రవర్ణానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తారు. ఈ హోమం కథ ద్వారా రాసానివారు హరిజనులలో వచ్చిన చైతన్యాన్ని, వారిలో వచ్చిన ఐక్యతాభావాన్ని చిత్రించాడు.

ఇలా రాసాని తన కథలో దుర్భరమైన కళాకారుల జీవితాల్ని అప్పులపాలై సరైన జీవనాధారం లేక అలమటి స్తున్న కళాకారుల వ్యథలను, కళాకారులపై ఉన్నత వర్గం చేస్తున్న దౌర్జన్యాలను చక్కగా ఆవిష్కరించారు.

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# అర్నాద్ కథలు - మానవ సంబంధాలు

- డా॥ పప్పల వెంకటరమణ, ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆమదాలవలస, శ్రీకాకుళం జిల్లా.

ప్రసిద్ధ కథా మరియు నవలా రచయితగా పేరొందిన దుంప హరనాదరెడ్డి 1946 జూలై 1వతేదిన దుంప అప్పారావు, అప్పలనర్సమ్మ దంపతుల ప్రథమ సంతానముగా జన్మించిరి. వీరి వంశీయుల నివాసం తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరం. ఉద్యోగరీత్యా విశాఖపట్నంలో స్థిరపడిరి. బి.హెచ్.పి.వి. ప్రభుత్వ రంగ సంస్థలో జూనియర్ ఇంజనీరుగా పనిచేసి పదవీవిరమణ పొందిరి. ప్రసిద్ధ రచయితలైన రాచకొండ విశ్వనాధశాస్త్రి, కాళీపట్నం రామారావు ప్రభావంతో రచనా రంగంపై దృష్టిపెట్టిరి. 'అర్నాద్' అనే కలం పేరుతో సుమారు 60కథలు మరియు నాల్గు నవలలను రాసి కథా, నవలా రచయితగా తెలుగు సాహితీ రంగమునందు సుస్థిర స్థానమును సంపాదించిరి.

మనిషి మనిషిగా ఉంటూ చుట్టూ వున్న మనుష్యులతో నెరిపే మంచి సంబంధాలే మానవ సంబంధాలు. "ఆది మానవుడు జంతువుల్లాగే వేటాడుకుంటూ, తన ఆహారం తాను సంపాదించుకుంటూ, వాటిలాగే కోర్కెలు తీర్చుకుంటూ కాలం గడిపేవాడు. అయితే స్త్రీ పురుషుల కలయిక వల్లే సంతానోత్పత్తి జరుగుతుందనే జ్ఞానమేర్పడిన తరువాత విశృంఖలత్వానికి స్వస్తి చెప్పి వివాహవ్యవస్థ, కుటుంబ వ్యవస్థల్ని ఏర్పరచుకొని సంఘజీవనం ప్రారంభించాడని అదే 'సామాజిక ఒడంబడిక సిద్ధాంతమని' ఫ్రెంచి సామాజిక శాస్త్రవేత్త రూసో ప్రతిపాదించాడు".

"సంఘజీవనం అవసరం లేదనే వారూ దైవమైనా కావాలి లేదా పశువైనా కావాలి" అని అరిస్టాటిల్ క్రీస్తు పూర్వమే చెప్పాడు. మానవుడు ప్రాథమికంగా సంఘజీవి. ఒకరి అవసరం మరొకరిపై తప్పనిసరిగా ఉంటుంది. అందు వల్ల పరస్పరం సహకరించుకుంటూ సహజీవనం గడపవలసిన అవసరం ఎంతైనా ఉంది. సంఘజీవనం కోసం వివిధ వృత్తుల్ని చేపట్టి ఒకరికొకరు పరస్పరం సహకరించుకుంటూ మానవ సంబంధాల్ని పటిష్ట పర్చుకుంటూ మానవుడు నాగరికతాప్రస్థానం ప్రారంభించాడు.

వివాహ వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ, సామాజిక వ్యవస్థల ద్వారా మానవ సంబంధాలన్నీ విస్తృతమైన తరువాత సహజీవనంలో స్వార్థం చోటుచేసుకొని సత్సంబంధాలు విచ్ఛిన్నమవడం ప్రారంభమైంది.

ఏవిధమైన బంధం లేకుండా కేవలం మనుషులుగా పుట్టడం వల్లనే మనుషుల మధ్య కలిగే సంబంధాన్ని కూడా మానవీయ సంబంధం అంటారు. మానవీయ సంబంధాలకు కులాలు, మతాలు, ప్రాంతాలు అడ్డంకిగా వున్నాయి. మానవుల్లో పరస్పర ద్వేషాన్ని పెంచే దానవత్వం నశించి సర్వమానవులు ప్రేమ భావంతో పరవళ్ళు తొక్కాలని, సమతత్వంతో సోదర సోదరీ భావంతో మెలగాలని ఆరాటపడేది మానవీయత.

మానవీయత సంబంధాల్ని పటిష్టం చేసుకోవాలనుకునే వారికి కరుణ, జాలి, దయాగుణాలు వుండాలి. ప్రేమ అనేది మానవీయ సంబంధాలకు పునాది. ప్రేమ పునాదిపైనే మానవీయ సంబంధాలనే సౌధం నిర్మించబడుతుంది. స్వార్థం ఎక్కువైతే మానవీయత తక్కువ అవుతుంది. హృదయ సంకోచంవల్ల మానవ సంబంధాలు మరుగున పడతాయి. ఈనాడు మానవ సంబంధాలను డబ్బు శాసిస్తుంది.

కష్టనష్టాల్ని, సాదకబాధకాల్ని వ్యక్తులు సమంగా పంచుకోవాలి. అందుకోసం మానవులు స్వార్థం విడనాడాలి. సంకుచితమైన జాతి మతాల సరిహద్దుల్ని చెరిపేయాలని. మనుషుల మధ్య స్నేహ సేతువును నిర్మించాలి. మనుషులను దగ్గరకు చేర్చి కలిపేది మనస్సు. "ఇతరులు ఏమిచేస్తే మనకు బాధ కలుగుతుందో దాన్ని మనం ఇతరులకు చేయకపోవడమే పరమ ధర్మమని మహాభారతం చెబుతుంది".

అర్నాద్‌గారి సాహిత్యం వ్యక్తుల్ని కలవడానికి ప్రాధాన్యతనిస్తుంది. తన సాహిత్యం చదివిన పాఠకులకు మానవీయ సంబంధాలు పట్ల మంచి అవగాహన కల్గు తుంది. 'మానవసేవయే మాధవసేవ' అనే సిద్ధాంతాన్ని విశ్వసించి ప్రవర్తించుట గూర్చి అర్నాద్ సాహిత్యం విశద పరుస్తుంది.

అర్నాద్‌గారి కథలన్నింటిలోను సుమారుగా మానవ సంబంధాల్ని గూర్చి పరిశీలించుట జరిగింది. మొదటి కథ వేలంపాటలో మానవత్వం మంటగలిసిపోయేటట్లు చంద్రకను కొందరు రౌడీలు బలాత్కరించి పిచ్చిదానిగా చేశారు. ఇందుకు కొంత స్వయంకృతాపరాథం కలదు. చంద్రిక తండ్రి చంద్రయ్య తన కూతురును సిల్క్ స్మితలా, జ్యోతి లక్ష్మిలా ఫోజులిమ్మని ప్రోత్సహించుట వల్ల యువకుల్లో ఉద్రేకం కల్గునట్లు ప్రవర్తించుట వల్ల ఆమెకు ఆగతి కల్గింది.

చిత్రం కథలో రాజయ్యను తోటి మానవుడని చూడ కుండా రాధమ్మ అసహ్యించుకొని గొంగలిపురుగుకంటె నీచంగా చూచును. ఈమె మెరిసేదంతా బంగారమని నమ్మి ఊహాలోకంలో విహరించును. ఈ కథలో రాయుడు కౄర స్వభావం గలవాడు. కూతురు వయసైన రాథమ్మను చెరిచి చివరకు వివాహమాడెను. శరీరంపై వాతలు పెట్టెను. చివరకు తను అసహ్యించుకున్న రాజయ్యయే ఆమెను రక్షించి మానవత్వాన్ని చాటుకొనెను.

'దుకాణం' కథలో డాక్టర్లు మధ్య పోటీ నెలకొని రోగుల పట్ల మానవత్వం లేకుండా ప్రవర్తించే సంఘటనల్ని గూర్చి వివరించారు. ఈ కథలో డాక్టర్ రత్నాకర్ తన దగ్గర వైద్యం కోసం వచ్చిన అప్పారావు భార్య లక్ష్మీ పట్ల అసభ్యంగా ప్రవర్తించి తన పరువు పోగొట్టుకొనెను. సమాజంలో మానవ సంబంధాలు దిగజారుతున్నాయనడానికి ఈ కథ ఒక గొప్ప ఉదాహరణగా నిలుస్తుంది.

'చుట్టాలు' కథ మానవత్వాన్ని పెంపొందింపజేసే కథ. ఇందులో రాజమండ్రి పుష్కరాలకు వచ్చిన సరోజ, సూర్యము దంపతులపట్ల ఎంతో ఆదరాభిమానం ప్రదర్శించిన రావులమ్మ గొప్ప మానవత్వం కలది. చుట్టాలంటే భయపడే రోజుల్లో వారికి కావలసినవన్నీ సమకూర్చి, ఎన్నో చూడదగిన ప్రదేశాల్ని చూపించి రాములమ్మ దంపతులు గొప్పగా ఆదరించిరి. స్వంత తల్లి నాలుగు రోజులు ఇంట్లో ఉంటే భయపడే సరోజ తమకు రాములమ్మ ఆదరించిన విధానానికి సిగ్గుపడి తన ప్రవర్తనలో మార్పును తెచ్చుకొంది.

కంపెనీ యజమాని రవీంద్ర భార్య పద్మ రైలు ప్రయాణం చేయునపుడు వారిని ఆపదనుండి రక్షించిన తమ కంపెనీలో పనిచేసే కార్మికుని పట్ల మానవత్వం లేకుండా ప్రవర్తించి తన సహజీవనాన్ని నిరూపించుకొందీ. పద్మ కూతురుకు రైల్లో ప్రయాణించినపుడు విపరీతమైన కడుపు నొప్పివస్తుంది. అలాంటి ఆపదలో పద్మ ఉన్న ప్పుడు కంపెనీలో పనిచేసే కార్మికుడు ప్రకాశ్ వారికి దన్నుగా నిలిచి కాపాడెను. రైలు దిగినపుడు కనీసం కృతజ్ఞతలు కూడా పద్మ చెప్పలేదు. సమాజంలో మానవ సంబంధాలు దిగజారుతున్నాయనే విషయాన్ని ఈ కథ తెలియజేస్తుంది.

'జేబులో తేలు' కథ నేడు మానవ సంబంధాలు దిగజారుతున్నాయనే విషయాన్ని తెలియజేస్తుంది. ఒక విప్లవవీరుడు సమసమాజ స్థాపనకొరకు నక్సలిజంలో చేరాడు. జనజీవన స్రవంతికి దూరంగా అడవుల్లో సాయుధుడై తిరుగుచుండెను. ఒక నాటి రాత్రి తన చిన్న నాటి స్నేహితుని ఇంటికి వచ్చాడు. స్నేహాన్ని మరిచి ఆ వ్యక్తి విప్లవకారుని పోలీసులకు పట్టించి ఉరిశిక్ష పడినట్లు ప్రవర్తించెను. నమ్ముకొని వచ్చిన స్నేహితుని పట్ల మాన వత్వం లేకుండా ప్రవర్తించి మానవుడు తన నీచబుద్ధిని వెల్లడించుకొనెను.

మునుస్వామి మేనల్లుడు జోగారావు. ఎన్నో సంద ర్భాల్లో మామకు సహాయ సహకారాలు అందించాడు. చేసిన సహాయం మరిచి చివరకు తన ఆస్థిని కాజేసి పెద్ద మనిషిగా చలామణి అగుచున్న మునుస్వామి గూర్చి అర్నాద్‌గారు 'నెత్తిమీద దేవత' కథలో వివరించిరి. తరుగు తున్న మానవ సంబంధాలకు నిదర్శనమైంది కథ. నమ్ముకున్న మామయ్యే నట్టేటముంచి మానవ సంబంధాల్ని దెబ్బతీసెను.

'ముద్ర' కథలో రాహూల్‌కు మామ్మకు మధ్య విడదీయరాని బంధం కలదు. అన్నీ తానై పెంచింది. తల్లికంటె మామ్మే రాహూల్‌కు ప్రేమ ఎక్కువ. మామ్మ చనిపోయినపుడు పసివయసులోనున్న రాహూల్ మామ్మను ఎవరో చంపేశారని కోపంతో కత్తిపట్టుకొని తిరుగను. అంటే మామ్మ ఎంత ప్రభావం తనపై ముద్రవేసిందనేది ఈ కథలో వివరించిరి.

'బంధీ' కథను మానవతా విలువల్ని పెంపొందించే విధంగా తీర్చిదిద్దెను. చిన్నప్పుడు తప్పిపోయిన కుమారుని వెదుకుతూ ఓ తండ్రీ పడే వేదనను హృదయ విదారకంగా వర్ణించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం విప్లవబాట పట్టిన కొడుకును మనస్ఫూర్తిగా అభినందించెను. కాని తన మరణాంతరం తన కొడుకే దహన సంస్కారాలు చేయాలనే బలమైన కోరిక తండ్రికి కలదు. ఈ బంధమే భారతీయ సంస్కృతిలో మానవ విలువలకు ఎంత ప్రాధాన్యం కలదనే విషయాల్ని తెలియజేస్తుంది.

సమాజంలోని మతకలహాల గూర్చి, తద్వారా మానవ విలువలు పతనమగుటను గూర్చి అర్షాద్‌గారు 'భయం' కథలో తెలియజేసిరి. ప్రకాశ్, అన్వర్ మంచి స్నేహితులు. మతాలు వేరైనప్పటికీ కలసిమెలసి అన్యోన్యంగా వుండేవారు. హైదరాబాదు పాత బస్తీలో మత కలహాల్లో చిక్కుకున్న ప్రకాశ్‌ను సురక్షితంగా రక్షించి తన కుటుంబీకులకు అన్వర్ అప్పగించెను. ఇలాంటి సంఘటనలు మానవతా విలువలు పెంపొందుటకు దోహదపడును. తద్వారా మత ఘర్షణలు తగ్గి సమాజాభివృద్ధికి తోడ్పడును.

స్వంత ఇంటి నిర్మాణం కష్టంతో కూడుకుందీ. కొందరికి అది అందమైన కలగానే మిగిలిపోతుంది. పెంటమ్మ వంటివారు ఇంటి అద్దెలు పెంచి అద్దెకుండేవారిని అదరగొట్టేసేది. మానవత్వం మరిచి అద్దెకుండేవారి పట్ల ప్రవర్తించేది. చీటికి మాటికీ తగువులాడేది. ఇళ్ళులేని వారిని చులకనగా చూసే స్వభావం పెంట్టమ్మకు గలదు. ఇలాంటి వారి వలన సమాజంలో మానవ సంబంధాలు దెబ్బతింటాయని అందమైక కల కథలో అర్షాద్‌గారు తెలియజేసిరి.

ఒంటరితనం కథ అడుగంటి పోతున్న మానవ సంబంధాలకు ఒక ఉదాహరణ. ఇందులో భానుమూర్తి ఉద్యోగం చేసి రిటైర్ అయిపోయెను. ఇతనికి పెన్షన్ డబ్బులు వస్తున్నాయి. భార్య సరోజ చనిపోయింది. కొడుకు గుజరాతీ అమ్మాయిని వివాహం చేసుకొని అమెరికాలో స్థిరపడెను. అన్నీ ఉండి ఒంటరిగా బతకవలసివచ్చింది. చివరకు చనిపోవాలనిపించింది. అవసాన దశలో తల్లిదండ్రుల్ని చూడవలసిన బాధ్యత పిల్లలపై కలదు. కనిపెంచి పెద్ద జేసిన తరువాత పక్షుల వలె ఎగిరి వెళ్ళుపోడాన్ని మానవతా విలువలు క్షీణించి పోతున్నాయనే దానికి నిదర్శనం.

వివాహం కుదిరిన తరువాత పెళ్ళికి ముందు గొంతెమ్మ కోర్కెలు కోరుట సమాజంలో సర్వ సాధారణమైపోయింది. అర్షాద్‌గారి 'రాధమ్మ పెళ్ళి' ఆగిపోయింది కథలో రాధమ్మ అత్త అయిన సూర్యకాంతం కోర్కెల వల్లనే వివాహం జరగలేదు. తనూ ఒక నాటి కోడలుననే విషయం మర్చిపోయి మానవత్వం లేకుండా సూర్యకాంతం ప్రవర్తించింది. ఇంజనీరింగ్ చదువుకొని ఉద్యోగం చేస్తున్న రాధమ్మ సూర్యకాంతం కోర్కెలను కాదని పెళ్ళిని రద్దుచేసుకొందీ. సామాజిక విలువలు లేని సూర్యకాంతం లాంటి వారింటికి కోడలుగా వెళ్ళడానికి రాధమ్మ నిరాకరించింది.

అర్షాద్‌గారి 'మనదికాని మనీ' మానవతావిలువలతో కూడుకున్న కథ. ఇందులో సుందరమ్మ మధ్యతరగతి ఇల్లాలు. తన ఇద్దరు కూతుర్లు అయిన విజయ, నీరజలను వారి పిల్లలను తీసుకొని తిరుపతి దైవదర్శనమునకు వెళ్ళింది. ఎవరో అభాగ్యులు పోగొట్టుకున్న ఇరవై అయిదు వేల రూపాయల మూట దొరికింది. సుందరమ్మ ఇద్దరు కూతుర్లు దురాశపడిరి. కాని నైతిక విలువలుగల సుందరమ్మ మూట పోగొట్టుకున్న వారి కోసం వెదకినా ఫలితం దక్కలేదు. చివరకు మనవల చేతులతో తిరుపతి వెంకన్న హుండీలో వేసి తన నిజాయితీని నిరూపించుకుంది. ఇలాంటి కథల్ని పాఠకులు చదవినపుడు వారిలో పరివర్తన కన్పించును. తద్వారా ఉన్నత ఆదర్శాలు గల సమాజాన్ని

నిర్మింపవచ్చును. డబ్బులు కోసం ప్రాణాలు తీసే నేటి రోజుల్లో ఇలాంటి మానవతా విలవలు గల కథలు రావడం ముదావహం.

ప్రభుత్వాలు తమ ఉద్యోగుల సంఖ్యను తగ్గించు కునుటకు వి.ఆర్.ఎస్. వంటి పథకాన్ని ప్రవేశపెట్టును. చాలామంది ఉద్యోగులు ఇలాంటి వాటికి బలైపోతున్న వీరన్నలాంటి ఉన్నత భావాలు గల కార్మికుని వి.ఆర్.ఎస్. భూతం బారినుండి అతని యజమాని భాస్కర్‌బాబు రక్షించి వీరన్న కుటుంబాన్ని రక్షించెను. మంచి మనసు, మానవత్వంగల ఇలాంటి యజమానుల వల్ల మానవ సంబంధాలు పెరిగి సమాజాభివృద్ధి చెందును. కార్మికుల కుటుంబాలు వీధిపాలుగాకుండా, అనాథలుగా మార కుండా రక్షింపబడుదురు. అర్నాద్‌గారు 'అదిగో పులి' కథలో ఈ విషయాలన్నింటినీ తెలియజేశారు.

'బేబీ వినీత' కథలో విజయ్ వంటివారు మానవతా విలువలు లేని మనిషి. పెళ్ళి అయినప్పటికీ పరాయి స్త్రీలపై మోజును పెంచుకొని, నైతిక విలువలు విడనాడి ప్రవర్తించును. స్త్రీలు చనువుగా ఉంటున్నారని వారిపై లేనిపోని కోర్కెలను పెంచుకొని పశువు వలె, మానవ మృగాల వలె ప్రవర్తించుదురు. ఇలాంటి మేకవన్నె పులులపట్ల జాగరూకతతో ఉండమని మానవ సమాజానికి ఉపదేశించెను.

కంపెనీలు ఉత్తమ కార్మికుల అవార్డులకు ప్రకటించి నపుడు నీతి, నిజాయితీ గలవారికి ప్రక్కన పెట్టి, ప్రలో భాలు పెట్టేవారికి, లంచాలు మేపే వారికి ప్రకటించుట చాలా చోట్ల జరుగుతుంది. నిరంతరం కంపెనీ బాగోగు లను పట్టించుకొనే వారికి గుర్తింపు లేదు. ఇలాంటి సంఘ టనల వల్లే మానవతా విలువలు దిగజారును. యాజ మాన్యం పట్ల నిరసన తెలియజేసి పరిశ్రమ మూతపడు టకు కారకులగుదురు. దీని వల్ల సమాజాభివృద్ధి కుంటు పడును. ఎక్కడైతే మానవసంబంధాలు బలంగా ఉం టాయో అక్కడే సమాజాభివృద్ధి జరుగునని 'నిరసన' కథలో తెలియజేశారు.

అర్నాద్‌గారికి మానవ సంబంధాలపట్ల ఉన్న అవ గాహనను నిరూపించిన కథ 'బంధం'. కథ ఆద్యంతమూ మానవతా విలువలు పుష్కలంగా కన్పించును. రమణయ్యకు కొడుకు, ఇద్దరు కూతుర్లు కలరు. భార్య సుందరమ్మ చనిపోయింది. చిన్న కూతురు అమ్మాజీ ఇంటి దగ్గర ఉండేవాడు. పెన్షన్ డబ్బులతో హాయిగా కాలం గడుపుతున్నాడు. చిన్నకూతురు స్వంత ఇల్లు కుట్టుకున్న తరువాత తిరుపతి వెళ్ళే సమయంలో పెద్ద కూతురు దగ్గరకాని, కొడుకు దగ్గరగాని ఉండమని అడిగింది. ఆత్మాభిమానంగల రమణయ్య ఎవరివద్దను ఉండకుండా వృద్ధాశ్రమంలో చేరి హాయిగా కాలం గడుపుచుండెను. తండ్రిలేని లోటు తెలిసివచ్చింది. తర్వాత ఎంత ప్రాధేయపడ్డ రమణయ్య రావడానికి అంగీ కరించలేదు. అందరూ ఉండి కూడా ఎవరికి భారం కాకుండా రమణయ్య ఒంటరిగా బ్రతికెను. మానవ సంబంధాలు తగ్గుచున్నాయనే దానికి ఈ కథ మంచి ఉదాహరణ.

ఎన్నిక కథలో నేటి ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో విలు వలు ఎలా క్షీణించిపోతున్నాయో వివరించి చెప్పిరి. చట్ట సభలకు నీతి నిజాయితీలు గల వారికి బదులు స్వార్థ పరులు, డబ్బు, గుండాబలం కలవారు ఎన్నిక కాబడు తున్నారు. ఇలాంటివారి ఎన్నిక వల్ల ప్రజాస్వామ్య ప్రభుత్వాలు భ్రష్టుపట్టిపోతున్నాయనే దానికి నిదర్శనం. నీతిపరుడైన భాస్కర్‌తో పాటు, అవినీతి పరులైన వారిని కూడా ప్రజలు గెలిపించుట ప్రజాస్వామ్యంలో సర్వ సాధారణమైపోయింది.

'గొరైలు' కథలో మానవ సంబంధాలు ఎంతగా మంట గలిసి పోయావనే విషయాన్ని తెల్పారు. సీతమ్మ అనే యువతిని ఆగ్రామ పెద్దలు పాడుచేసి పిచ్చిదానిగా చేశారు. పిచ్చిదైన సీతమ్మను రాములవారి భార్య మళ్ళీ పుట్టిందని ప్రజలను నమ్మించి ఆమెకోసం ఆ గ్రామంలో సీతాలయం నిర్మించారు. ఆమెకు పుట్టిన కవలల్ని లవకుశులుగా నమ్మించి ప్రజల్ని దోచుకునే పెద్ద మను షులు సమాజంలో ఎలా చలామణి అగుతున్నారనేదాన్ని అర్నాద్‌గారు వివరించి చెప్పారు.

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# జాతీయోద్యమ సాహిత్యం

– డా॥ పి. విజయకుమార్, సహాయ ఆచార్యులు (తెలుగు), ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అనే సూక్తి అక్షరాక్షర సత్యమని జాతీయోద్యమ చరిత్ర వల్ల తెలుస్తోంది. మాతృభూమిని దాస్యశృంఖలాల నుంచి విముక్తి చేయించాలని ఎందరో తహతహలాడారు. దేశం కోసం ఆత్మార్పణం గావించుకున్నారు. తెలుగు కవులు ఈ పవిత్ర యజ్ఞంలో పాలుపంచుకున్నారు. తమ కలాల్ని తుపాకీలుగా చేసుకుని ప్రబోధగీతాల్ని తూటాలుగా ఆంగ్లేయుల పైకి వదిలారు. ఎందరో కవులు, జాతీయోద్యమ కవితా రథసారథులయ్యారు. కొంతమంది కవులు కొన్ని గీతాలు మాత్రమే వెలుగులోకి వచ్చి ఎందరో కవులు అజ్ఞాతంగా ఉండిపోయారు. జాతీయోద్యమ కవిత్వంలోని ప్రధాన అంశాలుగా వీటిని పేర్కొనవచ్చు.

1. నాయక స్తుతి
2. నాయక స్మృతి
3. పురాప్రాభవ సంస్మరణం
4. ఉద్యమంలో ప్రధానపాత్ర వహించిన జాతీయ పతాకం, ఖద్దరు, రాట్నం వంటి వాటిని కీర్తించడం.
5. దేశంలోని నదీనదాల, మనుషుల, స్థలాల పవిత్రతనీ, వైభవాన్ని చాటడం
6. ఉద్యమంపట్ల ప్రజల్ని ఆకర్షితుల్ని చేసేలా ప్రచారగీతాలు రాయడం
7. గ్రంథాలయోద్యమం, అక్షరాస్యత, మహిళాభ్యుదయం, హరిజనోద్యమాలు అంతర్భాగాలు కావటం
8. భారతమాతాస్తవం

ఒక అజ్ఞాత కవి బంకించంద్రుని "వందేమాతరం" ప్రేరణతో డిసెంబరు 15, 1905న కృష్ణా పత్రికలో "ది క్రై ఆఫ్ మదర్ ఇండియా" అనే పేరుతో ఒక గీతాన్ని ప్రకటించాడు.

"హిందువులారా ఎన్నాళ్లీ గతి
మందమతులై మాటికి చెడెదరా
నందనులగు మీరందరు స్రుక్కగా
ఎందుకు నా బ్రతుకితరుల కోసమా ?
దూడనోరు గట్టిన ద్రోహంబు గొల్లలు
పాడి సమస్తము పరులకమ్ముగతి
కూడులేని నా కొడుకుల గాథని
మేలుకో సాధనమెల్లను బోయెడి"

జాతీయోద్యమ సాహిత్యంలో బహుశా తొలి తెలుగు గీతం ఇది.

"భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గుడసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి"

జాతీయభావ విస్ఫులింగములు చిటపటలాడే ఈ పద్యం కూడా చిలకమర్తి వారిదే.

"చెరసాలల్ పృథుచంద్రశాలలె యగున్, చేదోయి గీలించున
య్యరదండల్ విరిదండలయ్యెడన్, హేయంబైన చోడంబలే
పరమాన్నంబగు, మోటు కంబళులు దాల్పన్ పట్టు సెల్లాలగున్
స్థిరుడై యేనరుడాత్మ దేశమును భక్తింగొల్చు నవ్వానికిన్"

రాయప్రోలు సుబ్బారావు రాసిన "జన్మభూమి" గేయం ఎంతో చైతన్యాన్ని కలిగించింది.

"ఏ దేశమేగినా ఎందుకాలిడిన
ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైన
పొగడరా నీ తల్లిభూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము"

అని జాతీయాభిమానం రగిలించే కవిత్వం రాశారు. పూర్వ పుణ్యంవల్ల ఈ స్వర్గఖండంలో జన్మించామని ప్రబోధించారు. రాయప్రోలు, వేదుల, దువ్వూరి, తుమ్మల,

విశ్వనాథ వంటి కవులెందరో దేశభక్తి కవిత్వంలో జాతీయో ద్యమ కవిత్వానికి పుష్టి చేకూర్చారు.

"శ్రీ గాంధీ నామం మరువాం మరువాం
సిద్ధము జైలుకి వెరువాం వెరువాం
శ్రీ గాంధీనే మేము నమ్మేం నమ్మేం
మరి ఇతరులను మేము నమ్మం నమ్మం (దామరాజు పుండరీకాక్షుడు)

వంటి భజన కీర్తనలు గాంధిపై ఎన్నో వచ్చాయి. "జయ గాంధి దేవా మంగళం జయమంగళం" అనే మంగళ హారతులు వెలువడ్డాయి.

"కొల్లాయి గట్టితేనేమి - మా గాంధి కోమటై పుట్టితేనేమి
వెన్నపూసా మనసు, కన్నతల్లీ ప్రేమ - పండంటి మోముపై బ్రహ్మతేజస్సు
చకచక నడిస్తేను జగతి కంపించేను - పలుకు పలికితేను బ్రహ్మవాక్కేను"

అని బసవరాజు అప్పారావు రాసిన గేయం నేటికీ నాల్కలపై ఆడుతూనే ఉంది. గరిమెళ్ల సత్యనారాయణ రాసిన "మాకొద్దీ తెల్లదొరతనమూ" అనే పాట ప్రతి సభ లోనూ పాడేవారట

"మోడు మోకులు చిగుర్వోసిడి పోలిక
నీ బట్టగట్టేరు వడివడి వడుగు
జాబిల్లి కిరణంపు చందాన సాగెడు
నీ దారమెంతురు వడివడి వడుకు"

అని కవికొండల వెంకటరావు ప్రభృతులు రాట్నంపై కవితలు రాశారు. గాంధీ పంచసూత్రాలలో ఖద్దరు ధారణ ఒకటి.

ఖద్దరు ఉద్యమం స్వదేశీ ఉద్యమానికి అండగా ఉ ంది. విశాఖ ప్రాంతంలో కవిగారు అని పిలిచే మారేపల్లి రామచంద్రశాస్త్రి.

"ఖద్దరైన కట్టుడీ కడమలేవి కూడ చేయకున్న
మొుద్దులంచు మోటులంచు మూల్గకుండ ముక్కకుండ
బరువుకన్న దాస్యము బరువు కాదా చెప్పుడీ"

అని ప్రచార గీతాలు రాశారు. మంగిపూడి పురుషోత్తమ శర్మ రాసిన "పాలిపాట"లోని ఈ పంక్తుల్ని సినారె ఉద హరించారు.

"హిందూ ముసల్మాను లందఱము వచ్చాము
బౌద్ధసీఖులు ఏక భావులై వచ్చాము
పారసీ క్రైస్తవులు పరుగున వచ్చాము
బ్రాహ్మణ పంచములో కలిసి మెలిసొచ్చాము
మా భేదభావములు మంట కలిపేశాము
మమ్ము మన్నింపవమ్మా మా తల్లి
మమ్మాదరింపవమ్మా" అని స్వరాజ్య దేవతని ప్రార్థించారు.

దువ్వూరి, కరుణశ్రీ, దుర్భాక రాజశేఖర శతావధాని, గడియారం వేంకట శేషశాస్త్రి, జాషువా ఖండకావ్యాలు రచించారు.

ఆంధ్రోద్యమ కవిత్వం జాతీయోద్యమంలో భాగ మైంది. రాయప్రోలు, విశ్వనాథ, తుమ్మల, ఏటుకూరి వెంకట నరసయ్య, పుట్టపర్తి, త్రిపురనేని ఆంధ్రుల గత వైభవాన్ని చాటుతూ ఆంధ్రాభిమానాన్ని ప్రబోధించారు. కర్లపాలెం కృష్ణారావు కవి

"తెలుగునాడును గొల్వరా తమ్ముడా
తెలుగు గాలిని బీల్చరా
తెలివిగల వాళ్లంత తెలుగువారేనోయి"

అని గేయం రాసినట్లు సినారె ఉదహరించారు.

"ఆంధ్రుడవై జన్మించితి
వాంధ్రుడవై యనుభవింపు మీ యుర్విభవం
బాంధ్రుడవై మరణింపుమీ
ఆంధ్రత్వము లేని బ్రతుకు నాసింపకుమీ" అని రాష్ట్రగానం చేశారు తుమ్మల సీతారామమూర్తి.

తెన్నేటి విశ్వనాథం 'నెత్తురుకలం' అనే రహస్య నామంతో ఆగష్టు విప్లవ పాట రాశారు.,

"ఆగష్టు విప్లవం నాదేరా - ఆగష్టు వీరుడు నేనేరా"

అంటూ ఈ గీతం సాగుతుంది. ఈ కావ్యంలో కవి తెలుగువీరుల బలిదానాలను తెలుగు ప్రజల త్యాగ

నిరతిని అనేక విధాలుగా ప్రస్తుతించారు. క్విట్‌ఇండియా కోసం మిక్కిలినేని భగవంతరావు విద్యార్థుల వీరగేయాలు అనే సంపుటిని వెలువరించారు. కరుణశ్రీ 'అరుణ కిరణాలు' రచించారు. తెన్నేటి సూరి 'అరుణ రేఖలు' కావ్యాన్ని రచించారు.

జాతీయోద్యమంలో తెలుగు సాహిత్యం తన శక్తి మేరకు తన కవితాసుమాలను తెలుగు నేలపై వెదజల్లింది. తెలుగు ప్రజల హృదయాలలో స్వాతంత్ర్య కాంక్షను రగిలించింది. ఎందరో మహాత్ముల పుణ్య చరితులతో పునీతమైన ఈ పుణ్యభూమి గొప్పతనాన్ని ధన్య జీవులు ఘనతను తెలుగు కవులు తమ కావ్యాలలో ప్రతిబింబింపచేశారు. తెలుగు ప్రజలను స్వాతంత్ర్య సమరంలో దూకేటట్టు సిద్ధం చేశారు. తెలుగుతనాన్ని రంగరించి దేశభక్తిని పెంపొందించారు. దేశమాత కష్టాలను కడతేర్చడానికి కవులు తమ శక్తియుక్తులను పణంగా పెట్టారు. తెలుగు సాహితీ సరస్వతి జాతీయోద్యమానికి జవజీవాలను నింపింది. జాతీయోద్యమ ప్రభావంతో తెలుగువాణి దశదిశలా వ్యాపించింది.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# జాషువా ఆత్మీయతాపతాక గబ్బిలం

- ఎస్. బయారెడ్డి
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, రాయలసీమ
విశ్వవిద్యాలయం, కర్నూలు.

- డా॥ వి. రవి శంకర్
సహాయ ఆచార్యులు,
తెలుగుశాఖ, రాయలసీమ విశ్వవిద్యాలయం,కర్నూలు.

ప్రముఖ ఆంగ్లకవి షెల్లీ "కవులు ప్రజలచే ఎన్నుకొనబడని శాసన కర్తలు" అంటాడు. దేశకాలాలేవైనా కవి తన కాలపు సమాజానికి ప్రతినిధి. తన రచనల్లో సమకాలీన సమాజాన్ని చిత్రించడంతోపాటు, స్వీయ జీవితానుభవాలను వర్ణించడం సాధారణంగా జరిగేదే. దీన్నే మరో మాటలో చెప్పాలంటే ఆత్మీయతాముద్ర అనవచ్చు. ఎన్నుకున్న ఇతివృత్తం ఆధారంగా కవులు, రచయితలు ప్రధానంగానో లేదా అనుషంగికంగానో ఈ ఆత్మీయతకు తమ రచనల్లో స్థానం కల్పించినవారే. ప్రక్రియ ఏదైనా ఇందుకు మినహాయింపు కాదు. ఎంత నేలవిడిచి సాము చేసిన కవి అయినా ఏదోఒక సందర్భంలోనైనా తనచుట్టూ ఉన్న సమాజాన్ని చిత్రించకమానడు. అలాంటపుడు జీవితాంతం రకరకాల అవమానాలకు, అవహేళనలకు గురైన జాషువాలాంటి రచయిత కలంనుండి జాలువారిన రచనల్లో ఈ ఆత్మీయతాస్పర్శ మరింత ఎక్కువగా కనిపించడంలో ఆశ్చర్యంలేదు.

నేటి గుంటూరు జిల్లాలోని వినుకొండలో పుట్టిపెరిగి తెలుగు సాహితీ వినీలాకాశంలో విశ్వనరుడిగా ప్రకటించుకున్న మహాకవి గుర్రంజాషువా (1895 - 1971). ఆయన రచనలకు ఎన్నుకున్న నేపథ్యాలతోపాటు, సన్నివేశాలు, పాత్రలు అన్నీ ఆయన జీవితానికి దగ్గరగా కనిపిస్తాయి. కులాలు, మతాలు, ప్రాంతాలుగా విడిపోయిన సమాజంలో కళల్నికూడా అదే చట్రంలో బంధించడం సమంజసం కాదన్నది జాషువా భావన.

నా కవితావధూటి వదనంబు నెగాదిగ జూచి రుపు రే
ఖా కమనీయ వైఖరులు గాంచి 'భళిభళి' యన్నవాడె
మీ
దే కులమన్న ప్రశ్న వెలయించి చివాలున లేచిపోవుచో
బాకున గ్రుమ్మినట్లగును పార్థివచంద్ర! వచింప
సిగ్గగున్

కళాకారుడిని ప్రతిభ ఆధారంగా ఆదరించాలేగానీ, కులాన్నిబట్టి గౌరవమర్యాదలను ఆపాదించడమో, నిరాకరించి తృణీకరించడమో సమంజసం కాదన్న అభిప్రాయాన్ని జాషువా రచనల్లో అడుగడుగునా మనం గమనించవచ్చు. ఈ కోణంలో చూసినప్పుడు కారుణ్యాన్ని, మానవీయతను, ఆవేదనను విడదీయలేనంతగా జాషువా ఆత్మీయతతో ముడివేసుకున్న ఖండకావ్యం 'గబ్బిలం'.

ఇందులోని ఇతివృత్తం కల్పితమే అయినా గబ్బిలంలోని ప్రతి పదం, ప్రతి పద్యం ఆవేదనాభరితమైన జాషువా జీవితాన్ని పాఠకులముందు నిలుపుతాయి. అందుకే "గబ్బిలంబులకు దౌత్యంబుల్ ప్రబోధించు మానవతా స్రష్టన్ నవ్యభావ చతురుండన్ జాషువాభిఖ్యుడన్" అంటూ జాషువా సగర్వంగా చెప్పుకున్నారు. జాషువా ఎన్ని రచనలు చేసినా ఆయనకు బాగా కీర్తితెచ్చిన కావ్యం 'గబ్బిలమే'. జాషువా పేరుచెప్పగానే అందరికీ గుర్తుకువచ్చేదికూడా ఈ 'గబ్బిలమే'. జాషువా సాహిత్య జీవితానికి, సామాజిక దృక్పథానికి ప్రతీకగా నిలిచింది ఈ ఖండకావ్యం. రెండు భాగాలుగా ఉన్న ఇందులోని మొదటి భాగంలో సుమారు 117 పద్యాలు, రెండవ భాగంలో 142 పద్యాలుగా మొత్తం 259 పద్యాలున్నాయి.

జాషువా నిరాశ్రయుడిగా గుంటూరులో కాలం గడుపుతున్న రోజుల్లో తలదాచుకోవడానికి స్మశానానికి ప్రక్కన ఒక పాడుబడిన ఇల్లు దొరికింది. అందులో రాత్రి పూట చిన్న ఆముదం దీపపు వెలుతురులో గబ్బిలాలతో పాటు ఆయన సహవాసం చేస్తున్న రోజుల్లో చేసిన రచన

ఇది. ఇందులో జాషువా తన జీవితానుభవాలు, వ్యక్తిగత బాధలతోపాటు, తన జాతిజనుల వ్యధకు ప్రధానంగా స్థానం కల్పించారు. కారణమేదైనా జాషువాకు, ఆయన సమకాలీన సమాజానికీ సామరస్యం కుదరలేదు. ఆ సంఘర్షణలోంచి ఈ రచన రూపుదాల్చింది. "కవిత్వానికి బాధ పర్యాయ పదం" అన్నమాటను నిరూపిస్తున్నట్లుగా జాషువా గబ్బిలాన్ని రచించారు.

ప్రబంధ కవితకు భిన్నంగా, సమకాలీన భావకవితా మార్గంలో పయనించకుండా జాషువా తనదైన ప్రత్యేక మార్గాన్ని ఎంచుకున్నారు. విస్మృతవర్గాల ఆవేదనకు అక్షరరూపం కల్పించారు. అభ్యుదయ కవితా మార్గంలో పయనిస్తూ అసమానతలు తొలగిపోవాలన్నారు. ఈ అభ్యుదయ దృక్పథమే గబ్బిలం రచనకు ప్రేరణ అయింది. ఓ అరుంధతీ సుతుడు సమాజంలో పాతుకు పోయిన అంటరానితనాన్ని, చాతుర్వర్ణ వ్యవస్థలోని క్రూరత్వాన్ని గబ్బిలం ద్వారా శివుడికి విన్నవించుకోవటం ఇందులోని ఇతివృత్తం. ఆ అభాగ్యుడు తాను అనుభవిస్తున్న వేదనను తెలుపుతూ గబ్బిలానికి మార్గనిర్దేశం చేస్తాడు. గబ్బిలం విశ్వనాథుని దగ్గరకు ప్రయాణం కావడం తొలి భాగంలో కనిపిస్తుంది. తర్వాత కొన్నాళ్ళకు గబ్బిలం మళ్లీ కనిపిస్తుంది. వెళ్లిన పని సఫలమైందని చెప్తుంది. మళ్లీ నాయకుడు తన గోడు చెప్పుకుంటాడు. భారత జాతి అనైక్యతకు కారణమైన కులమతభేదాలతోపాటు, స్వకులంలోని వైరుధ్యాలు, మూఢాచారాలను నిర్భయంగా చెప్తాడు. రెండవ భాగంలో కనిపించే మరో ప్రధానాంశం జాషువా దేశాభిమానం.

"కాళిదాసుని మేఘసందేశము మనస్సులో నుంచుకొని నేనీ కావ్యమును రచించితిని. గ్రంథ నామము గబ్బిలము. శ్రోతలకిది కటువుగా దోపవచ్చును. కాని యందలి కథా నాయకుడు ప్రణయ సందేశము నంపును. ఇతడంపునది తుక తుక నుడుకు నశ్రు సందేశము. అతని శిక్షా కాలపరిమితి యొక సంవత్సరము. ఇతని శిక్ష ఆజన్మాంతము, తర తరములు. దీని కవధి లేదు. అతడు మన్మథాగ్ని తప్తుడు, ఇతడు క్షుధాగ్ని పీడితుడు. ఇరువురిలో నితడు దయనీయుడు" అంటూ "గబ్బిలం" పీఠికలో జాషువా చెప్తారు. దీన్ని బట్టి ఇది కాళిదాసు మేఘసందేశానికి అనుసరణ కావ్యమని చెప్పవచ్చు. అక్కడ మేఘుడు సందేశహరుడైతే, ఇక్కడ గబ్బిలం ఆ పాత్రను పోషించింది. సామాజంనుండి వెలివేయబడిన వర్గాల ఆక్రందన గబ్బిలం కావ్యానికి ఆయువు పట్టు.

ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన ఈ తారతమ్యాల్లో సమానత్వానికి చోటెక్కడుందంటారు. ఈ చట్రంలో తర తరాలుగా నలిగిపోతున్నవాళ్ల వేదనకు అంతం ఎప్పుడంటారు. రాత్రనక పగలనక రెక్కలు ముక్కలు చేసుకుంటూ శ్రమిస్తున్న వాళ్లను ఆదరించకపోగా, అస్పృశ్యత పేరుతో దూరంపెట్టడం జాషువా హృదయాన్ని కలచి వేసింది.

కర్మ సిద్ధాంతమున నోరు కట్టివేసి
స్వార్థలోలురు నా భుక్తిననుభవింత్రు
కర్మమన నేమొ, దానికీ కక్షయేమొ
ఈశ్వరుని చేత ఋజువు చేయింపవమ్మ!

అని గబ్బిలాన్ని వేడుకుంటాడు. కర్మసిద్ధాంతాన్ని చెప్తూ జన్మాంతర సంస్కారాన్ని సాకుగా చూపుతూ తమకు కనీస అవసరాలను కూడా దూరంచేస్తున్న వ్యవస్థమీద తిరుగుబాటును ప్రకటిస్తారు. "వాని నుద్ధరించు భగవంతుడే లేడు మనుజుడెట్లు గనికరించు" అంటూ కులాలకుంపటి కారణంగా జరుగుతున్న అన్యాయాలను ఎత్తిచూపుతారు.

ఎంత కోయిల పాట వ్యధ యయ్యెనో కదా!
    చిక్కు చీకటి వనసీమలందు,
ఎన్ని వెన్నెలవాగు లింకి పోయెనో కదా!
    కటిక కొండల మీద మిటకరించి,
ఎన్ని కస్తూరి జింక లీడేరెనో కదా!
    మురికి తిన్నెల మీద పరిమళించి,
ఎన్ని ముత్తెపురాలు భిన్నమయ్యెనో కదా!
    పండిన వెదురు జొంపములలోన,
ఎంత గంధవహన మెంత తంగెటి జున్ను
ఎంత రత్నకాంతి ఎంత శాంతి
ప్రకృతి గర్భమందు! భగ్నమైపోయెనో
పుట్టరాని చోట పుట్టుకతన

అంటూ అడవికాచిన వెన్నెలలా, సముద్రంమీద కురిసిన వర్షంలా పుట్టరానిచోట పుట్టిన కారణంగా ఎంత ప్రతిభ నిరర్ధకంగా మారిపోయిందోకదా అంటూ ఆవేదన వ్యక్తంచేస్తారు.

అదే సమయంలో స్వజాతిలోని అంతర్గత విభేదాలు కూడా ఆయన దృష్టినుండి మరలిపోలేదు. నిచ్చెనమెట్ల వ్యవస్థ ఒకవైపు అణగదొక్కుతుంటే ఐకమత్యాన్ని చాటుకోవలసిందిపోయి, అంతర్గతంగా తమలో తాము ఒకరికన్నా మరొకరు గొప్ప అంటూ విర్రవీగడం ఆయనకు నచ్చలేదు. పరుల తప్పులను ఎంచడానికి అందరూ సిద్ధపడతారుకానీ, తమలోపాలను అంగీకరించడానికి ఇష్టపడరు. కానీ దీనికి భిన్నమైన ధోరణి జాషువాలో కనిపిస్తుంది. భారతీయ సమాజంలోని అస్పృశ్యతా సమస్యతో పాటే పంచముల్లోని విభేదాలనుకూడా జాషువా నిరసిస్తారు. "కృష్ణులు, కృష్ణున్ని రసించు దైవములు క్రీస్తుల్, మస్తుగా బుట్టినన్ కలుపన్నేరరు రెండు జాతులను వక్కాణింప సిగ్గయ్యెడిన్" అంటూ బాధపడతారు. ఈ చైతన్యంతోనే

కులమతాలు గీచుకొన్న గీతల జొచ్చి
పంజరాన గట్టువడను నేను
నిఖిలలోకమెట్లు నిర్ణయించిన
నాకు తరుగులేదు విశ్వనరుడనేను

తి, కుల, మత, కుల బంధనాలను ఛేదించుకొని తనను తాను విశ్వనరుడిగా ప్రకటించుకున్నారు. అందుకే జాషువా రచనలు అనేక ప్రశ్నలను రేకెత్తిస్తూ ఆలోచింప చేస్తాయి.

జనులం చీలిచి పిప్పిజేసెడు దురాచారంబులన్ గాలమ
జట్టని విద్యాబలమేల? విద్యయన మౌఢ్యవ్యాప్తి కింపైనచో
జనమా? మోసపు వ్రాతకోతలకు రక్షాబంధమా? ఎందుకీ
మనుజత్వంబు నొసంగలేని చదువుల్ మైరేయపుం మైకముల్

ప్రజల్ని ఇబ్బందులకు గురిచేసే దురాచారాలను ఖండించలేని చదువులెందుకంటారు. మూఢత్వాన్ని, మూర్ఖత్వాన్ని పెంచిపోషించడమే తప్ప మానవత్వాన్ని విస్తరించలేని చదువులు నిష్ప్రయోజనం అన్నది జాషువా అభిప్రాయం. ఆధునిక కాలంలో చదువులు పెరిగి విజ్ఞానం విస్తరిస్తున్నప్పటికీ కులాల కుంపట్లు చల్లారకపోగా ప్రజలు వివిధ వర్గాలుగా విడిపోయి సిగపట్లు పడుతుండటం కళ్లెదురుగా కనిపిస్తున్న వాస్తవమేకదా.

కులమతాలకు అతీతంగా మానవత్వంపొంగిపొర్లే సమాజాన్ని అపేక్షించిన జాషువా 'గబ్బిలం' కావ్యంలో తన హృదయాన్ని స్పృశించి, స్పందింపజేసిన ప్రతి అంశాన్ని అక్షరబద్ధంచేశారు. సామాజిక ప్రతిపత్తికారణంగా గౌరవాదరాలకు పాత్రమయ్యే కాలంలో వ్యక్తి స్వేచ్ఛనూ, మానవతా విలువల్ని నాశనం చేస్తూ, మనుషులమధ్య అగాధం సృష్టిస్తున్న వర్ణవ్యవస్థ మీద తిరుగుబాటుచేసి సర్వమానవ సమానత్వాన్ని జాషువా ప్రబోధించారు. తనతోపాటు తనలాంటివారి జీవితాలకు సాహిత్యంలో స్థానం కల్పించి "సుకవి జీవించు ప్రజల నాల్కల యందు" అన్న మాటను సార్ధకం చేసుకున్నారు.

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# ఆంధ్ర మహాభారతం - వివిధ రాజు పాత్రల విశ్లేషణ

- డా॥ యస్. చిన్నరెడ్డయ్య సహాయ ఆచార్యులు, తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

మహాభారతం భారతీయుల జనజీవనంతో మమేక మయింది. తమ నిత్యజీవితంలో ఎదురయ్యే ప్రతి సంఘటనను భారతంలోని ఘట్టాల సన్నివేశాలతో ప్రజలు పోల్చుకుంటారు. అదేవిధంగా భారతంలోని వివిధ పాత్రల పేర్లను తమ పేర్లుగా పెట్టుకుంటున్నారు.

మహాభారతం భారతీయులకు పారిజాత కల్పవృక్షం వంటిది. ప్రజలు అడిగిన కోర్కెలన్నీ అందించే దివ్యవృక్షం పారిజాతం. మహాభారతం కూడా అటువంటిదేనని భారతీయుల విశ్వాసం. సహజంగా మానవులు కోరేవి పురుషార్థ ఫలాలు. వీటి సాధనకు సంబంధించి తెలుసుకోదగిన విశేషాలన్నిటినీ మహాభారతం తెలుపుతున్నది.

శ్లో ॥ ధర్మే చార్థే చ కామే చ మోక్షే చ భరతర్షభ । /
యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్ ॥

ధర్మార్థ కామ మోక్షాలకు సంబంధించి భారతంలో ఉన్న అంశం మరొకచోట ఉండవచ్చు. కానీ మహాభారతంలోలేని అంశం మరెక్కడా ఉండదని పైశ్లోకం చెబుతున్నది.అందుకే మహాభారతం మన భారతీయ విజ్ఞానానికి, సంస్కృతికి కల్పవృక్షం అయింది.

మహాభారతంపై ఇప్పటికే కొన్ని వందల పరిశోధనలు జరిగాయి. అందులోని వస్తువుపైన, పాత్రలపైన, భారత గ్రంథంలోని లక్షణాలపైన ఇంకా వివిధ కోణాల్లో పరిశోధనలు జరిగాయి. అయితే నేను మహాభారతంలోని చిన్నపాత్రలపై పరిశోధన సాగిస్తూ మహాభారతంలోని చిన్నపాత్రలైన వివిధ రాజు పాత్రలను ఈ పరిశోధనాత్మక వ్యాసంలో వివరణాత్మకంగా, విశ్లేషణాత్మకంగా పేర్కొనడం జరిగింది.

మహాభారతం ఇతిహాసం. ఇతిహాసం అంటే చరిత్ర అని అర్థం. గతమంతా చరిత్రే. అయితే గతంలో మన దేశాన్ని రాజులు, రాణులు, మంత్రులు పరిపాలించారు. ఒక్కొక్కవంశరాజులు వందలాది సంవత్సరాలు పాలించారు. ఈ రాజులకు సంబంధించిన చారిత్రక ఆధారాలు నేడు మనకు లభిస్తున్నాయి. అయితే అంతకుముందు వేల సంవత్సరాల కాలంలో పాలించిన రాజుల చరిత్ర మనకు వాఙ్మయంలో మాత్రమే దొరుకుతున్నది. అదే విధంగా వారు పాలించిన రాజ్యాల పేర్లు నేటికీ ఉన్నాయి. ఉదాహరణకు 'కురుక్షేత్ర'నే తీసికుందాం. కురు పాండవుల యుద్ధం కురుక్షేత్రంలో జరిగింది. ఇప్పటికీ హర్యానా రాష్ట్రంలో కురుక్షేత్ర ఒక పెద్ద నగరంగా భాసిల్లుతున్నది. యుద్ధం జరిగిన ఆనవాళ్లు అక్కడ మనకు లభించాయి. దీనినిబట్టి చూస్తే భారతకాలంలో రాజులు, సామంత రాజులు, ఆటవికరాజులు తమ పరిధిలో రాజ్యాలను ఏర్పాటు చేసుకుని పాలన సాగించినట్లు తెలుస్తున్నది. ఈ దృక్కోణంలో చూసినపుడు భారతంలో రాజులు ప్రధానపాత్ర వహించినట్లు తెలుస్తున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే రాజులు లేకుంటే భారతకథే లేదనవచ్చు.

మహాభారతంలో వందలాది మంది రాజులు ఉన్నట్లు తెలుస్తున్నది. వారిలో పెద్దపాత్ర మరియు పాధాన్యం కలిగిన రాజులను మినహాయించి చిన్నపాత్ర మరియు ప్రాధాన్యం కలిగిన రాజులను మూడు రకాలుగా వర్గీకరించడం జరిగింది. వారు -

1. కౌరవపక్షాన నిలిచి యుద్ధం చేసిన రాజులు, 2. పాండవపక్షాన నిలిచి యుద్ధం చేసిన రాజులు, 3. తటస్థంగా ఉన్న రాజులు.

1) కౌరవ పక్షాన నిలిచి యుద్ధం చేసిన రాజులు

దుర్యోధనుని పక్షం నిలిచి ప్రాణాలు సైతం లెక్క చేయకుండా యుద్ధం చేసిన రాజులు ఎందరో ఉన్నారు. వారిని ఇలా పేర్కొనవచ్చు. 1.చిత్రసేనుడు, 2. చిత్రుడు, 3. సత్యసేనుడు, 4. యుగంధరుడు, 5. వృషసేనుడు, 6. పౌరవుడు, 7. వృషకుడు, అచలుడు, 8. రుక్మరథుడు, 9. లక్ష్మణుడు, 10. బృహద్బలుడు, 11.భగవదత్తుడు, 12. భానుమంతుడు, 13. శ్రుతాయువు, 14.రమిత్రుడు, 15. శ్రుతాయువు, 16.క్షేమధూర్తి, 17. సుశర్మ,

18. సంగ్రామజిత్తు, 19. అలంబసుడు, 20. కృతవర్మ, 21.శక్రదేవుడు, 22. వృకరథుడు, 23. వంగపతి, 24. వసాధి భూపతి, 25. మిత్ర వర్మడు, 26. మిత్రసేనుడు, 27. మాగధ మహీశుడు, 28. మాగధుడు, 29. భూరి, 30. భూరిశ్రవసుడు, 31. బృహద్బలుడు, 32. పుర మిత్రుడు, 33. పౌండ్రాధీశుడు, 34.నీలుడు, 35. ధ్రువుడు, 36., నియుతాయువు, 37. నిరమిత్రుడు, 38. దౌశ్శాసని, 39.జయరాతుడు, 40. జలసంధుడు. 41. దండధారుడు, 42. చిత్రుడు, 43. చిత్రసేనుడు, 44.చంద్రసేనుడు, 45. చిత్రసేనుడు, 46. క్షేమంకరుడు, 47.గజుడు, 48.గాంధారులు, 49. కేతుమంతుడు, 50. కృతవర్మ, 51. కిరాతులు, 50. అభీరరాజు, 53. ఆర్జవుడు, 54. అచలుడు, 55. ఉలూకుడు.

కౌరవపక్షాన నిల్చి యుద్ధంచేసిన రాజులలో ఉదా హరణగా ఓ ఐదుగురు రాజుల గురించి వివరించడం జరిగింది. వారు.

## 1. అలంబసుడు :

ఈ పాత్ర ప్రస్తావన 'ద్రోణపర్వం పంచమాశ్వాసం'లో ఉంది. ఇతడు ఒకానొక రాజు. కురుక్షేత్రయుద్ధంలో కౌరవపక్షాన నిలిచి యుద్ధం చేశాడు. అలంబసుడు తన మాయాజాలంతో మోసం చేసి కార్చిచ్చునుండి వెలువడిన ఏనుగువలె ఘీంకరిస్తూ భీమున్ని ఇరవై ఐదు బాణాలతో, ధర్మరాజును మూడు బాణాలతో, ఉప పాండవులనూ, సహదేవుడిని, ఘటోత్కచుడిని ఇరువది అయిదు బాణా లతో, తన దర్పం తెలిసేటట్లుగా కొట్టి సింహనాదం చేశాడు. అలంబసుడు నేలమీదకు దూకి బాణాల జడివాన కురిపించగా ఘటోత్కచుడు తేరు దిగి పెను మాయతో నిండుకొన్న బాణ సమూహంతో అలంబసుడి మాయను ఎగురగొట్టి గదతో కొట్టాడు. వారిద్దరిమధ్య యుద్ధం భయంకరంగా సాగింది. వారిద్దరూ మొదట రథికులై విల్లమ్ములతో యుద్ధం చేశారు. ఆ యుద్ధంలో వాడి అయిన బాణాల కాంతులు దిక్కులలో వ్యాపించాయి. ఆ యుద్ధంలో ఎవరు ఎవరినీ కూడా అతిశయించ లేకపోయారు. ఇది పని కాదని రాక్షసమాయలతో యుద్ధం ప్రారంభించారు. ఒకడు పెద్ద సర్పంగా మారిన వెంటనే వేరొకడు గరుత్మంతుడిగా మారి ఆ సర్పం పొగరణ గించేవాడు. వెంటనే వేరొకడు ఏనుగుగా మారేవాడు. రెండోవాడు సింహంగా మారిపోయి గజకుంభస్థలాన్ని చిదిమేవాడు. ఇట్లా ఒక దానికి విరుగుడుగా మరియొకరు సూర్య రాహువులై, మేఘవాయురూపులై ఇంకా ఎన్నో వికృతరూపాలతో యుద్ధం చేశారు. ఆ యుద్ధంలో వారు ఒకరినొకరు బిగువుగా అదిమి పట్టుకోగా వారి శరీరాలు ఏకమయ్యాయి. ఆ సమయంలో ఘటోత్కచుడు సింహ నాదంచేసి, అలంబసుడి తను నెత్తురు రక్తం కారుతుండగా పట్టుకొని చుట్టూ తిరిగి, దుర్యోధనుడి రథాన్ని కనిపెట్టి దానిమీద అతని తలను విసిరివేశాడు.

## 2. క్షేమధూర్తి :

ఈ పాత్ర ప్రస్తావన 'కర్ణపర్వం'లో ఉంది. కులూత దేశపు రాజు క్షేమధూర్తి. కురుక్షేత్రయుద్ధంలో ఇతడు కౌరవపక్షాన నిలిచి యుద్ధం చేశాడు. క్షేమధూర్తి భీమునితో తలపడ్డాడు. మొదట తన గుర్రాన్ని భీముని గుర్రంతో ఢీకొట్టించాడు. ఆ దృశ్యం చూడడానికి ఒక కొండ మరొక కొండని ఢీకొన్నట్లుగా అనిపించింది. ఆ తరువాత క్షేమ ధూర్తి, భీములు ఈటెలతో యుద్ధం చేశారు. ఆ తర్వాత ధనుస్సులు తీసికున్నారు. ఒకరినొకరు నరుక్కున్నారు.

శక్తులతో, తోమరాలతో వేగంగా పోరాడే సమయంలో క్షేమధూర్తి విశాలమైన భీముని వక్షఃస్థలంపై ఏడు చిన్న ఈటెలను గ్రుచ్చుకొని పోయేటట్లు వేశాడు. అందువల్ల అతడి గర్వం ప్రసిద్ధికెక్కింది. అపుడు భీముడు సూర్య కిరణంవలె మెరుస్తున్న చిన్న ఈటె నొకదానిని ప్రయోగిం చాడు. దానిని కరూశ దేశపు రాజు మధ్యలో వింతగా ముక్కలుగా నరికాడు. అంతటితో వదలక వేగంగా అరవై బాణాలు భీముడి శరీరానికి తగిలేటట్లు ప్రయోగించాడు. భీముడు ఒక పెద్ద విల్లు తీసుకొని క్షేమధూర్తి ఏనుగుకు అన్నివైపులా బాణాలు దట్టంగా ప్రయోగించాడు. క్షేమధూర్తి ఏనుగు శరీరం నిండా బాణాలు నాటేసరికి అది వెనుదిరిగి పారిపోయింది. కానీ, భీముడు దానిని వెంబడించాడు.

కులూత రాజు శర పరంపరను భీముడు లక్ష్యపెట్ట కుండా, అతడి విల్లు విరగ గొట్టాడు. అతడి ఏనుగునూ

నొప్పించాడు. అపుడా రాజు మహా పౌరుషంతో మరొక విల్లు తీసికొని వెలుగులు చిమ్మే బాణంతో భీముని బాగా నొప్పించి, అతడి ఏనుగు ప్రాణాలు విడిచి నేలపై పడిపోయేటట్లు చేశాడు. దానికి సంతోషించి కౌరవసైన్యం కేకలు పెట్టింది. అపుడు భీముడు పడిపోయిన ఏనుగు నుండి గదతో దిగి క్షేమధూర్తి ఏనుగును పడగొట్టాడు. అతడు కత్తి పట్టుకొని భీముని మీదికి వచ్చాడు. అపుడు భీముడు వేగంగా కఠినగదాప్రహారంతో అతడిని సంహరించాడు.

### 3. చిత్రసేనుడు :

ఈ పాత్ర ప్రస్తావన 'కర్ణపర్వం ప్రథమాశ్వాసం'లో ఉంది. కురుక్షేత్ర యుద్ధ విశేషాలను సంజయుడు ధృతరాష్ట్రునికి వివరించే సందర్భంలో ఈ పాత్ర విశేషాలు చెప్పబడ్డాయి. ఇతడు అభిసారదేశపు రాజు. కురుక్షేత్ర యుద్ధంలో కౌరవ పక్షాన నిలబడి యుద్ధం చేశాడు. ఈ యుద్ధంలో ద్రౌపదీ సహదేవుల కుమారుడు శ్రుతకర్మ చిత్రసేనుడిపై వాడిగల ఇనుపబాణాలు ప్రయోగించినాడు. అపుడు చిత్రసేనుడు తొమ్మిది బాణాలతో శ్రుతకర్మను కొట్టాడు. శ్రుతకర్మకు కోపంవచ్చి, ఒక గట్టి బాణంతో చిత్రసేనుని భుజ శిరస్సూ రొమ్మూ కలిసేచోట కొట్టాడు. దానితో అతడు మూర్ఛిల్లాడు. శ్రుతకర్మ అట్లా ఉన్నవాడిని మళ్లీ కొట్టాడు. అపుడారాజుకు తెలివి వచ్చింది. ఆ వెంటనే విజృంభించి ప్రతాపంతో శ్రుతకర్మ ధనుస్సును విరగ్గొట్టాడు. శ్రుతకర్మ మరొక విల్లు తీసుకొని ఆరాజు శరీరం నిండా బాణాలు నాటగా, ఆయన ఏదు పంది ఒళ్లు పెంచినట్లు కనిపించాడు. శ్రుతకర్మ వక్షఃస్థలంలో దిగేటట్లు ఒక వాడిబాణం ప్రయోగించాడు చిత్రసేనుడు. శ్రుతకర్మ వెంటనే ఆ రాజును రక్తంలో ముంచి ఒక బాణం ప్రయోగించి అతడి తల నేలపై పడి దొర్లేటట్లు కొట్టాడు. ఆవిధంగా వారి యుద్ధం చాలా భయంకరంగా జరిగింది. ఆ యుద్ధంలో చిత్రసేనుడు మరణించాడు.

### 4. భూరిశ్రవుడు :

ఈ పాత్ర ప్రస్తావన 'ద్రోణపర్వం చతుర్థాశ్వాసం'లో ఉంది. ఇతడు బాహ్లికుని కుమారుడైన సోమదత్తుని రెండవ కుమారుడు. ఇతడు ఒక అక్షౌహిణి సేనతో కురుక్షేత్ర యుద్ధంలో దుర్యోధనునికి సహాయం చేయడానికి వచ్చాడు. కురుక్షేత్రయుద్ధంలో కౌరవుల పదకొండు అక్షౌహిణి పతులలో ఒకడు. కౌరవుల వైపునకల అతిరథోత్తములలో ఒకడు. ఇతడు కురుక్షేత్ర యుద్ధంలో అయిదవనాడు సాత్యకి కొడుకులు పదిమందినీ ఒకేసారి సాత్యకి ఎదురుగానే చంపినాడు. కురుక్షేత్రయుద్ధంలో పద్నాలుగవనాడు సాత్యకి అర్జునునికి సైంధవవధలో సహాయానికి పోయినపుడు ఇతడు సాత్యకితో యుద్ధంచేసి పైచేయి అయి సాత్యకిని చంపడానికి కత్తినెత్తిన ఎడమ చేతిని అర్జునుడు ఖండించాడు. అపుడు ఇతడు అర్జునుని నిందిస్తూ ప్రాయోపవేశానికి కూర్చున్నపుడు సాత్యకి అతని తలను నరికినాడు.

### 5. సుశర్మ :

ఈ పాత్ర ప్రస్తావన 'విరాటపర్వం తృతీయాశ్వాసం'లో ఉంది. సుశర్మ దుర్యోధనుని తరపున విరాటుని గోగ్రహణంలో పాల్గొన్నాడు. సుశర్మ త్రిగర్తదేశాధీశుడు. విరాటుని గోవులను తీసికొస్తానని, విరాటుని ఓడించి అతని నగరాన్ని స్వాధీనం చేసికుంటానని దుర్యోధనునితో అంటాడు. అతని అనుమతితో దక్షిణ గోగ్రహణానికి తన సైన్యంతో వెళతాడు. గోపాలకులను బాధించి తరిమివేసి, వాటిని పొలిమేరలు దాటించడానికి వేగంగా తోలుకొస్తాడు. వారు వెళ్లి సుశర్మ గోవులను తోలుకెళ్తున్న విషయాన్ని విరాటునితో చెబుతారు. విరాటుడు తన సైన్యంతోవచ్చి సుశర్మను ఎదుర్కొంటాడు. వారి యుద్ధ విన్యాస తాకిడికి సముద్రాలు ఒకదానితో మరొకటి భయంకరశబ్దాలతో ఘర్షణ పడ్డట్లుగా తోచింది. సుశర్మ మిక్కిలి వేగంతో విజృంభించి విరాటుని పట్టుకుంటాడు. బిగ్గరగా సింహనాదంచేసి అతన్ని తన రథం మీదికి తెచ్చుకుంటాడు. విజయం కలిగినందుకు గుర్తుగా ఒక్కసారిగా దుందుభులు మ్రోగాయి. పరాక్రమ గర్వ వైభవంతో మనస్సు ఉప్పొంగగా సుశర్మ విశేష దర్పంతో తిరిగి వెళ్లనారంభించాడు.

తమ రాజును బంధించి తీసికెళుతున్న సుశర్మపైకి ధర్మరాజు యుద్ధ సన్నద్ధుడై వెళ్లాడు. అతడి రథసారథిని,

గుర్రాలను చంపాడు. అపుడు ధైర్యం తెచ్చుకున్న విరాటుడు రథంలో ఉన్న ఒక గోదండాన్ని తీసికొని ముసలివాడైనా యువకుడి వలె ముందుకు నిర్భయంగా నేలమీద దూకి సుశర్మను సమీపించి గదతో మోదుతాడు. అపుడు భీముడు సుశర్మ రథం మీదకు దూకి, వెంటనే పట్టుకొని అతడి చేతులు వెనుకకు విరిచికట్టి పెద్ద సింహనాదం చేస్తా. విజయ గర్వంతో విరాటనగరం చేరిన తర్వాత ధర్మరాజు విరాటరాజుతో ఇలా అంటాడు. ఓ విరాటరాజా! నేను ఒకటి సముచితంగా కోరుతున్నాను వినుము. దానిని నెరవేర్చటం మంచిది. సుశర్మను చతురంగబలాలతో సహా ఇప్పుడే విడుదల చేయుము. ఇదేనాకు అన్నివిధాల ప్రీతి కలిగిస్తుంది అంటాడు. అపుడు విరాటుడు విడిచి పెడతాడు.

## 2) పాండవపక్షాన నిలచి యుద్ధం చేసిన రాజులు:

ఎందరో రాజులు ధర్మరాజు పక్షాన నిలిచి కురుక్షేత్ర యుద్ధంలో పాల్గొన్నారు. వారిని ఇలా పేర్కొనవచ్చు. వారు-1. నీలుడు, 2.దృష్టకేతువు, 3. సత్యజిత్తు, 4. చేకితానుడు, 5. శంఖుడు, 6. యుయుత్సుడు, 7. ఇరావంతుడు, 8. శతానీకుడు, 9. మదిరాశ్వుడు, 10. వృకుడు, 11.రోచమానుడు, 12. యువరాజు, 13. రోచమానుడు, 14. యుధామన్యుడు, 15.యదువులు, 16. మత్స్యరాజు, 17. మదిరాక్షుడు, 18.మాగధ సహదేవుడు, 19. భోజుడు, 20. బృహత్క్షత్రుడు, 21.పురజితుడు, 22. నీలుడు, 23. దుష్టకేతుడు, 24. ద్రవిడేశ్వరుడు, 25.ద్రౌపదేయులు, 26. ధృతవర్మ, 27. జనమేజయుడు, 28. జనమేజయుడు, 29.జయంతుడు, 30. దండ చిత్రుడు, 31. చిత్రాయుధుడు, 32. చిత్రుడు, 33. చేకితానుడు, 34. చిత్రసేనుడు, 35.చంద్రసేనుడు, 36. చిత్రవర్మ. 37. క్షేముడు, 38. కేకయపతులు, 39. కేకయుడు, 40. క్షత్రదేవుడు, 41. క్షత్రధర్ముడు, 42. క్షత్రధర్మ, 43. కేకయ కుమారుడు, 44. కుంతిభోజుడు, 45. ఉగ్రాయుధుడు, 46. ఉత్తమౌజుడు, 47. ఉపరిచరవసువు, 48. అజుడు, 49. కాశీరాజు, 50. కాశీకుడు. వీరిలో ముఖ్యమైన ఓ ఐదుగురు రాజుల గురించి ఉదాహరణగా పరిచయం చేయడం జరిగింది.

### 1. నీలుడు :

ఈ పాత్ర ప్రస్తావన 'ద్రోణపర్వం ప్రథమాశ్వాసం'లో ఉంది. కురుక్షేత్రయుద్ధ విశేషాలను సంజయుడు ధృతరాష్ట్ర మహారాజుకు పూసగుచ్చినట్లు వివరిస్తూ నీలుడి గురించి చెబుతాడు. ఇతడు అనూపదేశపురాజు. భీమసేనుని స్నేహితుడు. కురుక్షేత్రయుద్ధంలో పాండవపక్షం వహించి కౌరవులతో పోరు సలిపాడు. పన్నెండవ నాటి యుద్ధంలో ద్రోణుని కుమారుడైన అశ్వత్థామచేత చంపబడ్డాడు. నీలుడనే రాజు అశ్వత్థామపై లీలగా తేరు నడిపాడు. అందుకు కోపించిన అశ్వత్థామ అతన్ని ఎదుర్కొన్నాడు. అశ్వత్థామ బలమైన బాణంతో మర తొలగిన యంత్రం వలె అతడిని భూమిపై పడవేశాడు.

### 2. సత్యజిత్తు :

ఈ పాత్ర ప్రస్తావన 'ద్రోణపర్వం ప్రథమాశ్వాసం'లో ఉంది. కురుక్షేత్రయుద్ధ విశేషాలను సంజయుడు ధృతరాష్ట్రునికి వివరించి చెప్పే సందర్భంలో ఈ సత్యజిత్తు చేసిన యుద్ధ విశేషాలు చెప్పబడ్డాయి. కురుక్షేత్ర యుద్ధంలో ఇతడు పాండవపక్షాన నిలిచి యుద్ధం చేశాడు. ఈతడు ద్రుపదుని జ్ఞాతి. ఈతడు పాండవసేనలోని మహారథులలో ఒకడు. అర్జునుడు సంశప్తకులపైకి యుద్ధానికి పోతూ ధర్మరాజును ద్రోణుడి బారి నుండి రక్షించడానికి కురుక్షేత్రయుద్ధంలో పన్నెండవ రోజున ఈతడిని నియమిస్తాడు. ద్రోణుడు ఈతన్ని చంపగా ధర్మరాజు పారిపోతాడు. కురుక్షేత్రయుద్ధంలో ధర్మరాజుకు అండగా సత్యజిత్తును అర్జునుడు ఏర్పాటు చేస్తాడు. ద్రోణునితో యుద్ధ సమయంలో అర్జునుడు ధర్మరాజుతో ఇలా అంటాడు.

ధర్మరాజా! ఈ సత్యజిత్తు ఉన్నంతసేపు నీవేమాత్రం భయపడవలసిన అవసరం లేదు. ఒకవేళ ఇతడు శత్రువుల చేత హతుడైతే నీవు యుద్ధంలో నిలవటం నేర్పరితనం కాదు. వెంటనే యుద్ధం నుండి తప్పుకొనటం మేలు అంటాడు. ధర్మరాజు, ద్రోణుడు యుద్ధం చేయటం చూసి ద్రుపదవంశశ్రేష్ఠుడు, చలించని శౌర్యం కలవాడు,

సత్యపరాక్రముడు, సాటిలేని ధైర్యవంతుడు, మహా బలంతో ప్రకాశించేవాడు అయిన సత్యజిత్తు ధర్మజుడు సంతోష పడునట్లుగా ద్రోణాచార్యుడిని ఎదిరించి అతడికి బాధ కలిగేటట్లు భయంకరమైన పది బాణాలను ప్రయోగించి బాధిస్తాడు. అతడి సారథిపైన పది బాణాలు ప్రయోగిస్తాడు. ద్రోణుడు కూడా మరింతగా విజృంభించి బాణాలు వేస్తాడు. ఆ బాణాల దెబ్బలకు సత్యజిత్తు తల పగిలి చనిపోతాడు.

**3. చేకితానుడు :**

ఈ పాత్ర ప్రస్తావన 'ఆది, ఉద్యోగ, ద్రోణ, శల్య పర్వాల్లో' కనిపిస్తుంది. ఇతడు వృష్ణి వంశజుడైన యాద వుడు. ఇతడు మహారథుడు. ఇతనికి సాత్వతుడు, వార్ష్ణేయుడు అనే పేర్లు కూడా ఉన్నాయి. ఇతడు కురుక్షేత్రయుద్ధంలో పాండవపక్షం వహించాడు.

కురుక్షేత్రయుద్ధంలో శల్యుడు, భీముడు గదలతో యుద్ధంచేసి అలసిపోయి మూర్ఛిల్లారు. మూర్ఛిల్లిన శల్యున్ని కృపాచార్యుడు దూరంగా తీసికెళ్లాడు. భీముడు కొంత సేపటికి తేరుకొని. శల్యున్ని పేరు పెట్టి యుద్ధానికి రమ్మని పిలుస్తాడు. భీముని గర్వాన్ని సహించలేక సింహగర్జనలతో కూడిన తూర్యధ్వనులు వినిపించగా దుర్యోధనుడు ఆవేశంతో తన సేనతో ఎదుర్కొనగా ధర్మరాజుకు అగ్రభాగంలో ఉన్న రథికులైన యోధులూ, చేకితానుడు ముందుండగా ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆకాశాన్ని ముట్టాయి. భీముని దాటుకొని కురు సైని కులతో చేకితానుడు తలపడ్డాడు. దుర్యోధనుడు వజ్రం వలె కఠినమైన ఈటెను ప్రజ్వలించేటట్లు ప్రకాశించే విధంగా పైకి ఎత్తి, తన సేన సంతోషంతో సంభ్రమం చెందగా క్రీడాగతిని అనుసరించి ఆకాశంలో రెండు మెరుపులు నిండగా మిక్కిలి ప్రకాశంతో ఆక్రమిస్తున్న ప్రతాపవంతుడైన చేకితానుడిని దుర్యోధనుడు వధించాడు.

**4. యుయుత్సుడు :**

ఈ పాత్ర ప్రస్తావన 'ఆది, భీష్మపర్వా'ల్లో ప్రస్తావించ బడింది. యుయుత్సుడు - ధృతరాష్ట్రుడికి వైశ్యభార్య వలన కలిగిన కొడుకు. అతడు కురుక్షేత్రయుద్ధంలో పాండవ పక్షంలో చేరాడు. అతడు దుర్యోధనాదులు చేసిన చెడు పనులను ఉద్ఘాటిస్తూ పాండవుల సద్గుణాలను కీర్తిస్తూ తన సేనలతోబాటు పాండవసైన్యంలో చేరాడు. అపుడు పెక్కువాద్యాలు ఘోషించాయి. తన పక్షంలో చేరిన అతన్ని ధర్మరాజు బాగా గౌరవించాడు. ధృత రాష్ట్రునికి కల 112 మంది భార్యలలో గాంధారికి, ఈ వైశ్య సతికి మాత్రమే సంతానం కలిగినట్లుంది. యుద్ధా నంతరం బ్రతికిన ధార్తరాష్ట్రుడు ఇతడొక్కడేఇతడు మొదటినుండి సమబుద్ధి కలిగినవాడే. దుర్యోధనుడు భీమసేనుడికి విషాన్నం పెట్టించగా 'అది విషాన్నం తిన వద్ద'ని భీమసేనుడికి చెప్పాడు. కురుక్షేత్రయుద్ధారంభంలో ధర్మరాజు పిలువగా ఇతడు కౌరవుల వైపు నుండి వచ్చి పాండవపక్షంలో చేరాడు. ఇతడు దుర్యోధనుడి తరువాత పుట్టాడు. ఇతనికంటే కురుకులంలో యుధిష్ఠిరుడూ, భీమసేనుడు, దుర్యోధనుడు మాత్రమే వయస్సులో పెద్దవారు.

**5. ఇరావంతుడు :**

ఈ పాత్ర ప్రస్తావన 'అరణ్యపర్వం, భీష్మపర్వం'లో ఉంది. కురుక్షేత్ర యుద్ధంలో ఇరావంతుడు ఎలా యుద్ధం చేశాడో సంజయుడు ధృతరాష్ట్రునికి పూస గుచ్చినట్లు వివరించాడు. అర్జునునికి నాగ కన్యక అయిన ఉలూచికి పుట్టినవాడు ఇరావంతుడుకురుక్షేత్రయుద్ధంలో పాండవ పక్షాన నిలబడి పోరాటం చేశాడు. ధృతరాష్ట్రుడి కుమారుడైన శ్రుతాయువును ఎదుర్కొన్నాడు. వారిరువురూ ఘోరంగా పోరాడారు. ఇరువురి రథాలు కూలిపోయాయి. యుద్ధంలో ఇరావంతుడు తన సత్తా ఏమిటో చాటి చెప్పాడు. గుర్రాలగుంపులో ఇరావంతుడు కురుసేనవద్దకు వెళ్లి చొరబడటం చూస్తే దట్టంగా ఉండే పక్షుల గుంపుమీదికి ఉరికే డేగ గుంపువలె కనిపించింది. కౌరవులసేన పక్షుల గుంపువలె, ఇరా వంతుడి సైన్యం డేగ గుంపువలె కనిపించింది.

శకుని తమ్ముళ్లు ఆరుగురు ఇరావంతునిపై విరుచుకుపడ్డారు. వారందరినీ ధీటుగా ఎదుర్కొన్నాడు.

వారు ఇరావంతుని గుర్రాన్ని బాగా గాయపరిచారు. దాంతో అతడు నేలమీదనుండి యుద్ధం చేశాడు. వారు అతన్ని బల్లేలతో పొడిచారు. ఆయుధాలతో కొట్టారు. అయినా వారందరినీ తన యుద్ధనైపుణ్యంతో ఎదుర్కొన్నాడు ఇరావంతుడు. వారారుగురిని రెండు తుంటలుగా నరికేశాడు. వీరావేశంతో పెడబొబ్బలు పెట్టాడు. ఆ ఆరుగురు గాంధార రాజు కుమారులను ఇరావంతుడొక్కడే చంపటాన్ని దుర్యోధనుడు చూచాడు. వెంటనే అలంబసుడనే రాక్షసుని అతనిపైకి పురిగొల్పాడు. ఇరావంతునికి అలంబసునికి మధ్య ఘోరయుద్ధం జరిగింది. అలంబసుడు ఆకాశానికి ఎగిరిపోయి మాయా బాణాలు అతడిపై గుప్పించి, నొప్పించాడు. ఇరావంతుడు కూడా కోపంతో ఆకాశానికి ఎగిరి తన బలమైన కత్తితో అలంబసుడిని నరికి వేశాడు. అయినా వాడు అప్పటికప్పుడే యవ్వనవంతుడై యుద్ధం చేయసాగాడు. అపుడు ఇరావంతుడు నాగుల గుంపుతో అలంబసుడి మీదికి ఉరికాడు. అపుడు అతడు గరుత్మంతుని ఆకారం ధరించి ఇంద్రజాలంతో వాటిని అధీనంలోకి తెచ్చుకొని పట్టుకొని పాములు తింటాడు. దాంతో ఇరావంతుడు ఇరుకున పడతాడు. ఆ సమయం కనిపెట్టిన అలంబసుడు ఇరావంతుని మెడ నరికేశాడు. అతడి తల నేలపై పడింది.

**3) తటస్థంగా ఉన్న రాజులు :**

ఎందరో రాజులు, వారి సామంతులు, ఆటవిక రాజులు ఇరు పక్షాల్లో చేరకుండా తటస్థంగా ఉండిపోయారు. వారిలో కొందరు కురుక్షేత్ర యుద్ధానికి ముందు వివిధ సంఘటనల్లో కౌరవులతో పాండవులతో పోరాడినవారున్నారు. వారిలో కురుక్షేత్ర యుద్ధానికి ముందు గతించిన వారుకూడా ఉన్నారు. మరికొందరు కురుక్షేత్ర యుద్ధం పూర్తయ్యాక జీవించిన వారూ ఉన్నారు. వారిని ఇలా పేర్కొనవచ్చు. వారు - 1. బభ్రువాహనుడు, 2. పుళిందరాజు, 3. నిరమిత్రుడు, 4. గాంధారపతి, 5. ఉద్ధవుడు.

**1. బభ్రువాహనుడు :** ఈ పాత్ర ప్రస్తావన 'అశ్వమేధ పర్వం చతుర్థాశ్వాసం'లో ఉంది. చిత్రాంగద, అర్జునుడుల కుమారుడు బభ్రువాహనుడు. ఇతడు తల్లితో కలిసి మణిపూర పట్టణాన్ని పాలిస్తుంటాడు. ధర్మరాజు చేసే అశ్వమేధ యాగంలో భాగంగా అశ్వం మణిపూర రాజ్యంలోకి ప్రవేశిస్తుంది. దాని వెంట అర్జునుడు వచ్చి ఉంటాడు. బభ్రువాహనుడు తండ్రితో యుద్ధం ఎందుకని మిన్నకుండిపోతాడు. అయితే రాజ ధర్మం ప్రకారం తన కుమారుడు తనతో యుద్ధం చేయనందుకు అర్జునుడు నొచ్చుకుంటాడు. ఈ విషయం దివ్య జ్ఞానంతో తెలుసుకున్న ఉలూపి వచ్చి తనకు కొడుకు వరుస అయిన బభ్రువాహనుని రెచ్చగొట్టి అర్జునునిపైకి యుద్ధానికి ప్రేరేపించి పంపుతుంది. ఆ క్రమంలో తండ్రీ కొడుకుల మధ్య ఘోరయుద్ధం జరుగుతుంది. ఇరువురు స్పృహతప్పి పడిపోతారు. ఈ విషయం తెలుసుకున్న చిత్రాంగద అక్కడికి చేరి స్పృహ తప్పి పడి ఉన్న కొడుకు, భర్తను చూచి దుఃఖిస్తుంది. ఎలాగైనా భర్త అయిన అర్జునున్ని బతికించమని వేడుకుంటుంది. అంతలో బభ్రువాహనుడు స్పృహ వచ్చి లేస్తాడు. ఉలూచి సంజీవని మణి చేత అర్జునుని బ్రతికిస్తుంది. అర్జునుడు కుమారుడైన బభ్రువాహనుని కౌగిలించుకొని ఆశీర్వదిస్తాడు. ధర్మరాజు జరిపే అశ్వమేధయాగానికి సపరివారంగా రావాల్సిందేనని ఆదేశించి అర్జునుడు వెళతాడు. చైత్రమాస పున్నమినాడు బభ్రువాహనుడు తన తల్లులైన ఉలూపి, చిత్రాంగదలను తోడ్కొని ధర్మరాజు నిర్వహించే అశ్వమేధయాగానికి వెళతాడు. అక్కడ ధర్మరాజాదులు బభ్రువాహనుని అతని తల్లులను సగౌరవంగా ఆదరిస్తారు.

బభ్రువాహనుడు దొరతనం ప్రకాశిస్తుండగా ఉలూపి చిత్రాంగదలతో కూడిన ధర్మరాజు గృహానికి వచ్చాడు. ధర్మరాజు అతని తమ్ములు, బలరామకృష్ణాది యాదవులు ఆనందించారు. అతడి రాక సఫలమయ్యేటట్లుగా అతడిని సన్మానించారు. బభ్రువాహనుడు కూడా అందరికీ కర్తవ్య నిష్ఠతో ప్రీతి కలిగించి గాంధారీ ధృతరాష్ట్రులను దర్శించి నమస్కారాలు చేశాడు. కుంతిని చూచి పాదాభివందనం చేశాడు. ఆమె అతడిని కౌగిలించుకొన్నది. ధర్మరాజు అతని తమ్ములు అతనికి నవరత్న ఖచితములైన గద, శ్రేష్ఠమైన వస్త్రాలు ఇచ్చారు. బలరాముడు, కృష్ణుడు మొదలగువారు అతనికి నగలూ, తలతళలాడే బట్టలు పెట్టారు.

**2. పుళింద రాజు :** ఈ పాత్ర ప్రస్తావన 'అరణ్యపర్వం తృతీయాశ్వాసం'లో ఉంది. గంధ మాదన పర్వతానికి పోయేదారిలో ఉన్న పుళింద నగరపు రాజు సుబాహుడు. పాండవులు గంధ మాదనానికి పోతూ ఇక్కడకురాగా ఇతడు పాండవులను పూజించినాడు. పాండవులు తన సేనను భృత్యులనూ ఇక్కడ వదలి, కొద్దిపాటి పరివారంతో గంధమాదనానికి పోయారు.

**3. నిరమిత్రుడు :** ఈ పాత్ర ప్రస్తావన 'ఆదిపర్వం చతుర్థాశ్వాసం'లో ఉంది. ఇతడు నలుడికి చైద్య అయిన కురేణుమతి యందు జన్మించిన పుత్రుడు. ఇతడు కురుక్షేత్రయుద్ధంలో పాల్గొన్నట్లు కనిపించదు.

**4. గాంధారపతి :** ఈ పాత్ర ప్రస్తావన 'ఆదిపర్వం పంచమాశ్వాసం'లో ఉంది. ఇతడు గాంధార దేశపు రాజు. ఇతడి పేరు సుబలుడు. ఈ సుబలుడికి 11 మంది కుమార్తెలు. వారందరినీ ధృతరాష్ట్రునికిచ్చి పెళ్లి చేశాడు. వారి పేర్లు ఇలా ఉన్నాయి. 1. గాంధారి 2.సత్యవ్రత 3.సత్యసేన 4. సుదేష్ణ 5. సంహిత 6. తేజశ్రవ 7. సుశ్రవ 8. నికృతి 9. శుభ 10. సంభవ 11. దశార్ణ.

**5. ఉద్ధవుడు :** ఈ పాత్ర ప్రస్తావన 'మౌసలపర్వం ప్రథమాశ్వాసం'లో ఉంది. ఇతడు వృష్ణివంశం వాడైన దేవభాగుడి కుమారుడు. కృష్ణుని స్నేహితుడు. ఇతడు యాదవులు ముసలం వల్ల మరణించక మునుపే తపస్సుకు పోయాడు.

## ముగింపు :

మహాభారతం సాగరం వంటిది. సాగరంలో సకల జీవరాశులు ఉన్నట్లే మహాభారతంలో వివిధ పాత్రలున్నాయి. అందులో సర్పాలు, పక్షులు, మునులు, ఋషులు, రాజులు, రాణులు, సేవకులు, సైనికులు, మంత్రులు, సామంతులు, ఆటవిక రాజులు, నదులు, పర్వతాలు, దేవతలు, స్త్రీ పాత్రలు వంటివి ఉన్నాయి. వీటిలో ఏ పాత్ర ప్రాధాన్యం ఆ పాత్రదేననవచ్చు. భారతంకంటే ముందే వెలువడిన రామాయణంలోని పాత్రలను వేళ్లమీద లెక్కబెట్టవచ్చు. అయితే భారతంలోని పాత్రలను అలా లెక్కబెట్టలేము. అందుకే నన్నయ అంతటి మహాకవి కూడా భారతాన్ని ఆకాశంలోని నక్షత్రాలతో పోల్చాడు. దీనికి ఈ క్రింది పద్యమే నిదర్శనం.

చ ॥ అమలిన తారకా సముదయంబుల నెన్నను సర్వవేద శా
స్త్రములయశేష సారము ముదంబునఁ బొందను బుద్ధిబాహువి
క్రమమున దుర్గమార్థజలగౌరవ భారత భారతీ సము
ద్రముఁదఱియంగ నీఁదను విధాతృన కైనను నేరఁబోలునే! (భారతం 1-1-19)

మహాభారత సముద్రాన్ని ఈదడానికి బ్రహ్మకు కూడా సాధ్యం కాదు. అయినా భారతాంధ్రీకరణకు పూనుకున్నాడు. కవిత్రయ భారతంలోని చిన్నపాత్రల లక్ష్యంగా నేను పరిశోధన చేశాను. రాజుల పాత్రలలో కౌరవుల పక్షాన నిలిచి యుద్ధం చేసిన రాజులు 55మంది, పాండవ పక్షాన నిలిచి యుద్ధం చేసిన రాజులు 51 మంది, తటస్థంగా ఉన్న రాజులు 5 మంది అని పేర్కొంటూ అందులోని ముఖ్యమైన రాజు పాత్రల గురించి ఉదాహరణగా వివరించాను.

## ఉపయుక్త గ్రంథాలు :

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతం, ప్రచురణ : తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, 2008.
2. శ్రీమదాంధ్ర మహాభారత నామ సర్వస్వం - రేవంతీయం, రచన : పుత్తా పుల్లారెడ్డి, స్వీయ ప్రచురణ, 2010
3. శబ్దరత్నాకరము - సం॥ బహుజనపల్లి సీతారామాచార్యులు
4. శబ్దార్థ రత్నాకరము - సం ॥ వారణాసి వేంకటేశ్వర్లు, బాలసరస్వతీ బుక్ డిపో, చెన్నై, 1982
5. ఇదండీ మహాభారతం - రంగనాయకమ్మ, స్వీట్ హోమ్ పబ్లికేషన్స్, హైదరాబాద్ - 500 033, 2014.

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# గోరటి వెంకన్న పాటలు - శ్రమ సౌందర్య తత్త్వం

- యం. ఆదిశేషయ్య, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఆట పాటల కలబోత గోరటి వెంకన్న. ఈ పేరువింటే చాలు ఒంట్లో రక్తం పోటెత్తుతుంది. ఇక వీరి పాట వింటే 'కవులు భూగోళపు రక్త నాళాలు' అనే కవితలోని గుంటూరు శేషేంద్ర శర్మ అభిప్రాయంతో మనమూ ఏకీభవిస్తాం. శ్రోత గోరటి వెంకన్నతో ఆడిపాడుతున్నంత తన్మయత్వంతో ఊగిపోతాడు. అంతేకాదు ఉన్నచోటే నిలబడలేడు కూడా. తన జ్ఞాపకాలన్నింటినీ ఒడిసి పట్టుకొని పాటలుగా మలిచిన శిల్పి గోరటి వెంకన్న. ఏకునాదం మోత (1994), రేలపూతలు (2002), అలసెంద్రవంక (2010) వంటి కవితా సంపుటాలు తీసుకొచ్చారు. పలు సినిమాలకూ పాటలు రాశారు. వీరి పాటల ఆల్బమ్స్ కూడా విడుదలయ్యాయి. నాటకరంగంలోనూ ప్రవేశం ఉంది. వివిధ సినిమాల్లోనూ నటించాడు. మొత్తంగా పాటతో పెనవేసుకుపోయిన బంధం వెంకన్నది. తనకంటే ముందున్న వాగ్గేయకారుల వారసత్వానికి వెంకన్న ఆధునిక ప్రతినిధిగా నిలుస్తున్నాడు. ఆయన పాటలు తెలుగు ప్రజల జీవితంతో మమేకం అయ్యాయి. ఆ పాటలు మనిషి బాధలు, సంతోషాలతో కలగలిసి ఉన్నాయి. వెంకన్న పాటల్లోని చాలా సందర్భాల్లో శ్రమ సౌందర్య తత్త్వం అగుపడుతుంది.

'శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని' శ్రీశ్రీ తన కవిత్వంలో ప్రకటించాడు. ఇదే సూత్రాన్ని ప్రామాణికంగా స్వీకరించి వెంకన్న శ్రమజీవుల్లోని సౌందర్య తత్త్వాన్ని తన పాటల్లో ప్రవేశపెట్టారు. మార్క్స్, అంబేద్కర్ ప్రభావాలతో పాటల సృజన చేశారు. గోరటి వెంకన్న పాటల్లోని శ్రమ సౌందర్యతత్త్వాన్ని పరిశీలించి, విశ్లేషించడం ఈ వ్యాస వుద్దేశ్యం.

1964 ఏప్రిల్ 4వ తేదీ వెంకన్న జన్మించాడు. తల్లిదండ్రులు ఈరమ్మ, నర్సింహ. జన్మస్థలం మహబూబ్ నగర్ జిల్లా తెలకపల్లి మండలం గౌరారం. కల్వకుర్తిలో ఇంటర్, జడ్చర్లలో డిగ్రీ చదువులు పూర్తి చేశారు. హైదరాబాదులోని ఆంధ్ర సారస్వత పరిషత్తులో ఎంఏ తెలుగులో చేరాడు. ఈ కోర్సు పూర్తి కాకనే మధ్యలో ఉద్యోగం వచ్చింది. అప్పుడు చదువును వదిలిపెట్టి ఉద్యోగంలో చేరాడు. వడ్ల వెంకటయ్య ప్రేరణతో పాడటం నేర్చుకున్నాడు. సామాజిక ఉద్యమాల పరిచయం ఆయనలో సృజనాత్మకతను పెంచింది. అత్యంత నిశిత పరిశీలనా దృష్టి అలవడింది. ఇక్కడితోనే ఆగిపోతే వెంకన్న మనకు సమగ్రంగా అర్థం కాడు. పుట్టి పెరిగిన పాల మూరు పల్లె తనాన్ని తన వెంటే ఇప్పటికీ మోసుకు తిరుగు తున్నాడు. 'పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రలో.. నా తల్లీ బందీయై పోతుందో' అనే అత్యంత ప్రభావశీల మైన పాటను రాశాడు. ఇందులో ప్రపంచీకరణ దుష్పరి ణామాలను తూర్పారబట్టాడు. ఈ దేశంలో జరుగుతున్న జీవన విధ్వంసాన్ని ఒక్క పాటలో తెలియజెప్పాడు. ప్రపంచ ప్రజల ప్రధాన శత్రువు అమెరికా సామ్రాజ్యవాద కుట్రను ఈ పాటలో పరిచాడు. వీరి సాహిత్య కృషికి గుర్తింపుగా తెలుగు విశ్వవిద్యాలయ సాహిత్య పురస్కారం పొందారు. ఆయన పొందే అవార్డులకంటే కషి ఎన్నటికీ సమున్నతంగా నిలుస్తుంది. తెలుగులో అనేక మంది వాగ్గేయకారులు ఉన్నారు. ప్రాచీన కాలంలో అన్నమయ్య నుంచి మధుప్రియ వరకూ ఈ కోవకు చెందినవారే. వీరందరిలో గోరటి వెంకన్నది ప్రత్యేకమైన గొంతుక, వెంకన్న పాటల్లో జీవిత గాథత ఎక్కువ. సమస్యను చిత్రించడమే గాక, పరిష్కార మార్గాలనూ నిర్దేశించడం వీరి పాటల విశిష్టత. ఒక సందర్భంలో కవి కలేకూరి ప్రసాద్ 'తల్లి ఈరమ్మ కొడుకును కనబోయి పాటను గన్నది' అంటాడు. నా వరకూ చాలా పాటలు విన్నాను. అవి గోరటి వెంకన్న రాసినవనే విషయం చాలా కాలం తెలియదు. నా వరకూ గోరటి వెంకన్న పాటతో సుమారు 15 ఏళ్ళకు పైగా పరిచయం. వెంకన్న ఇచ్చిన అనేక ప్రదర్శనలు చూశాను.

ఆయన పాటల్లోని ఆలోచనా ధార వెంబడి నేనూ పరిగెడుతూనే ఉన్నాను. అప్పటి నుంచి కవి యాకూబ్ అన్నట్టు...

'గొంతు కెత్తుకున్న అతడి పాటల వెంట ప్రయాణిస్తూ ఇంకా ఇంకా నాలోకి జారిపోతుంటాను / అలా జారిపోవడం సాధ్యం చేసినందుకే / ఆయన నాకో అబ్బురం' (ఎడతెగని ప్రయాణం, పు.ట-46)

సాధారణ మనిషి జీవితమే వెంకన్న పాట. సమాజం, మానవ జీవితంలోని అనేక అంశాలను గోరటి వెంకన్న పాటలుగా మలిచాడు. అందులో తాత్త్వికతనీ, శ్రమ సౌందర్యాన్నీ ఏకరువు పెట్టాడు. ఈ పాటలు సమాజ మార్పును కోరుకోవడం విశేషం. వెంకన్న పాటలకూ, శ్రమ సౌందర్యానికీ అవినాభావ సంబంధం ఉంది. ప్రపంచంలో అందరికీ అన్నీ అందంగా కనిపించవు. సౌందర్యానికి ప్రమాణాలేమిటి? అనే ప్రశ్న సాహిత్య రంగంలో చర్చకు అవకాశాన్ని కల్పించింది. సౌందర్యం రెండు రకాలుగా ఉంటుంది. మొదటిది బాహ్య సౌందర్యం. రెండవది అంతఃసౌందర్యం. అదే విధంగా కొందరు సౌందర్యానికి కొన్ని లక్షణాలను ప్రతిపాదించారు. అవే సమగ్రత, పొందిక, స్పష్టత ఒక వస్తువు పైకి అందంగా ఉన్నంత మాత్రాన అంది అందమైనది కాకపోవచ్చు. దీనిని చూసే వారి అనుభవాన్ని బట్టి కూడా సౌందర్యం బోధపడుతుంది.

సౌందర్యానికి ఎవరికి తోచినట్టు వారు నిర్వచనాలు ఇచ్చారు. అయితే ఆంగ్లకవి కీట్స్ ఒక సందర్భంలో సత్యం, సౌందర్యం ఒక్కటేనని అభిప్రాయపడ్డాడు. ఏ కళ అయినా ప్రజలకు ఒక అనుభూతిని అందించాల్సి ఉంటుంది. లేకపోతే అది పునాదిలేని భవనంలా పేలవమయిపోతుంది. కాబట్టి ఏ కళైనా దానికదే స్వతహాగా ఒక తాత్త్విక భూమికను కలిగి ఉంటుంది. దీనిని సాహిత్యానికి అన్వయిస్తే మరింత బాగా అర్థమవుతుంది. ముఖ్యంగా కవిత్వానికి సంగీత స్థాయిని తీసుకొచ్చేది సౌందర్య తత్త్వమే. కవి తన భావాలను సౌందర్యాత్మకంగా కవిత్వంగా రూపొందిస్తాడు. గోరటి వెంకన్న సౌందర్య తత్త్వం తెలుగు సాహిత్యరంగంలో కొందరు గత రచయితలకు కొనసాగింపు. మరో రకంగా రేపటి రచయితలకీ అనుసరణీయం. ప్రజలను ఎక్కువగా ప్రభావితం చేసే సాహిత్య ప్రక్రియ పాట. వెంకన్న జీవించిన తెలంగాణా ప్రాంతం అత్యంత చైతన్యవంతమైనది. ఇప్పటికీ అక్కడ పాట ప్రవాహంలా ముందుకు సాగుతోంది. అందులో గోరటి వెంకన్న పాట మరింత సమున్నతంగా శ్రమ సౌందర్య పతాకను ఎత్తి పడుతోంది. దీనికి ఉదాహరణగా ఆయన రాసిన కొన్ని పాటలను పరిశీలిద్దాం. పాటలోకి శ్రోతను ఉన్ముఖీకరణ చేయడంలోనే వెంకన్న ఒక ప్రత్యేక శైలిని అనుసరించాడు. పాటలో వస్తువును అందించడానికి తెరలు తెరలుగా భావ చిత్రాలను ఏర్పరుస్తాడు. ఇవి సందర్భాన్ని యధార్థంగా అర్థం చేసుకునేందుకు అవకాశం కల్పిస్తాయి. కవి ఇలా 'యలమంద' అనే పాటలో గొర్రెలు కాసే పిల్లవాడి రూపును చూపిస్తాడు.

అంగిలేని వొంటిపై గొంగడేసుకుండు అడ్డపంచెను బుద్ధగోసిగా పెట్టిండు కిర్రుతోలు జోళ్లు కాళ్లకు తొడిగిండుకంది జొన్నకొయ్యలెలమంద కంజు పిట్టోలె పోతుండు యలమండ వేలెడంతలేడు యలమంద వెయ్యిమందకే వస్తాడు యలమంద' చిన్న పిల్లవాడు పరిమితమైన సౌకర్యాలతోనే శ్రమలో లీనమైన దృశ్యాన్ని మనకు పట్టిస్తాడు. చిన్న పిల్లవాడైన ఒక గొర్రెల కాపరిని పాటలోకి తీసుకొచ్చాడు. అందులో వాడి శక్తికి మించి పని చేస్తున్నాడని చెప్తాడు. ఇది పరోక్షంగా సమాజంలోని విశ్రాంత వర్గాన్ని గుర్తు చేస్తుంది. క్లిష్టమైన మార్గాన్నీ పాటలోని పాత్రచే అధిగమింపజేశాడు. ఒక వైపు శ్రామికుడిలోని ప్రతిభను గుర్తిస్తూ, మరో వైపు శ్రమను గౌరవించినట్టు అయ్యింది. ఇలా గొర్రెలు కాసే చిన్న పిల్లవాడినే పాట వస్తువుగా స్వీకరించడంతో ఆయన పాటలు శ్రమ సౌందర్యాన్ని ఎలా కల్గి ఉంటాయో అర్థమవుతుంది. ఈ విధంగా వెంకన్న పాటల్లో శ్రమసౌందర్యతత్త్వాన్ని తెలియ చెబుతాడు.

మరో చరణంలో గొర్రెలకాసే పిల్లవాడు శ్రమలో లీనం కావడం కనిపిస్తుంది. తుమ్మనీడ ఉంటే అమ్మఒడినే మరిచే గుణాన్ని కవిగా వెంకన్న పసిగట్టాడు. అందులోని సౌందర్యాత్మకతను వివరణాత్మకంగా పాటలోకి ప్రవేశ పెట్టాడు. 'ఎక్కరాని తుమ్మలెక్కి నరుకుతాడు / ఎత్తయిన

గుట్టలు ఎల్ల తిరుగుతాడు / వాగుల వొంపుల్ల రాగాలు తీస్తాడు. / చెరుపుగట్టున నిలిచి యలమంద /నందమా వోలే నవ్వుతాడు యలమంద / తుమ్మ నీడ వుంటే యలమంద / అమ్మ వొడిగి మరిసిపోతాడెలమంద' అదే పాటలో మరో చోట గొర్రె ఏదైనా జబ్బుకు గురైతే కాపరిగా ఉన్న పిల్లవాడు ఎలా ఆవేదన చెందుతాడు? ఈ జబ్బును వాడికి తెలిసిన వైద్య విద్యతో ఎలా మాన్పాలను కుంటాడు? అనే అంశాలను కవి పాటలోకి తీసుకొచాచడు.

**ఆ పాటలో..**

'తుంపరొచ్చి గొర్రె తుమ్మినా దగ్గినా / ముల్లుగొట్టి గొర్రె కాలు ఈడ్చిన గాని / తట్టుకోడు వాడు తల్లడిల్లు తాడు / గొట్టాకు లొట్టాకు యలమంద సెట్టు సూరి కడతాడమ్మా ఎలమందా / ఏడ నేర్చిన విద్య యల మంద / గొల్ల కురుమ వాడ విద్య యలమంద' (రేల పూతలు - పు.ట, 28)

గోరటి వెంకన్న పాటలను వింటే, అందులోని శ్రమ సౌందర్య తత్త్వాన్ని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. అతి సాధారణంగానే అందులో నిక్షిప్తమై ఉన్న అంశం నేరుగా శ్రోతకు, పాఠకుడికీ అందుతుంది. అదే విధంగా ఒక వైపు అందాల పోటీలంటున్న కాలంలో గ్రామీణ జీవితంలో భాగమైన స్త్రీ నిత్య జీవితంలోని అంశాలను సౌందర్యాత్మకంగా 'కంచెరేగితీపి' అనే పాటలో వివరించాడు. ఈ పాట వింటే అంతకు ముందే తెలుగులో వచ్చిన ఓ కవి పాట 'సిరిమల్లె సెట్టుకింద లచ్చుమమ్మో లచ్చుమమ్మా' గుర్తొస్తుంది. ఇది జీవితం లోని ఆవేదననూ, పరిష్కారాన్ని సూచించింది. అదే వెంకన్న పాట శ్రమ సౌందర్యాన్ని విడమర్చి చెప్పింది.

మంచెఎక్కి కేక పెడితే
కంచి మేకలు చుట్టు జేరును
నీ అల్లరిని ఆ లేగదూడలు
వొళ్లొకొచ్చి వొదిగిపోవును
పాలిపోయిన కందిచేనే లచ్చువమ్మా
నీవు పాట పాడితే పూతపడుతది లచ్చుమమ్మా'
నీ కాలి అందెల సవ్వడికి
తాబేళ్లు ఇసుకలో గుంతులేస్తయి
జాలిగల నీ చూపులకు
తోడేళ్లు సాధు జీవులవుతవి
దారిలో పల్లేరు ముల్లె లచ్చుమమ్మో
నీ కాలు మోపితే మల్లెలయితవి లచ్చుమమ్మో

శ్రమ జీవి పరిసరాలు, జంతుజాలం, వాటితో మమేక మైన శ్రమజీవిని సౌందర్యాత్మకంగా ఈ చరణంలో కవి వివరించాడు.

ఏరువాక నీవు జల్లితే
సాల్లువారని గింజలుండవు
నీ ప్రేమ నెరిగిన పక్షులన్ని
పాలకంకుల తుంచి వేయవు
నీ సెమట సుక్కలు రాలుతుంటే లచ్చువమ్మో
ఆ సేను సెలకలు దోసిలొగ్గును లచ్చువమ్మో

అంతేగాకుండా ఈ పాట ప్రతీకాత్మకంగానూ ఉంది. వెంకన్న రాసిన ఈ పాటను పరిశీలిస్తే లచ్చువమ్మ చెమట చుక్కలు శ్రమ సౌందర్యానికి, దోసిలొగ్గే సెలక స్థానం దోపిడీ స్వభావానికీ ప్రతీకలుగా కనిపిస్తాయి. ఈ ఒక్క పాటను పరిశీలించిన తర్వాత గోరటి వెంకన్న పాట వినిపిస్తే చాలు, అందులోని శ్రమ సౌందర్యాన్ని వివరిం చాల్సిన పని లేదనిపిస్తుంది. ఈ పాటలను విశ్లేషించడం అర్థంలేని పని అని కూడా అనిపిస్తోంది. శ్రమను అనేక మంది కవులు, రచయితలు ఇదివరకే చిత్రించారు. తరా లుగా వృత్తిగా భావించే పందుల పెంపకందార్ల జీవితాన్ని 'పిట్ట పరుగు నాగన్న' పాటలో చాలా ప్రతిభావంతంగా ప్రవేశపెట్టాడు గోరటి వెంకన్న. ప్రతి పాదమూ అందులో ఆలోచన, ఆవేదనలను కల్గిస్తోంది. మరొక విషయం ఏమిటంటే పాటను వ్యాఖ్యలుగా, నినాదాలుగా కాకుండా ప్రశ్నలతో ఎక్కువగా రూపొందించడాన్ని గమనించాలి. అదే విధంగా పాటలో వాడిన పదజాలం అత్యంత సరళంగా ఉంది. ఇదే పాటను తిరిగి అదే నేపథ్యమున్న ప్రజలకు వినిపిస్తే కూడా సాధారణంగానే అర్థమవుతుంది. ఇది గోరటి వెంకన్న పాటలు సాధించిన విజయం.

కడప తలుపు లేని గుడిసె
తుంగ ముస్తెలు దాసె గరిసె
ఇడుపున వో దోనె వోలిసె
సుక్క పందుల దరికి పిలిసె
ఉలువ జొన్న పొట్టు పులిసె
ఊరి ఎంగిలి కొంత కలిసె
కుడితిని కుడిసేతనే కలిపి
ఆ పంది పిల్లల ప్రేమతో విందున్నాదని పిలిసె'

ఇది పందుల పెంపకందార్ల ఇంట్లోని దైన్యాన్ని తెలుపుతుంది. పంది పిల్లలు పెరిగి పెద్దవై తనకు ఆదాయంగా మారాలనే వ్యాపార కోణం నుంచి కాకుండా, జీవిపట్ల మనిషికున్న మమకారాన్ని ఈ పాట తెలియజేస్తుంది. కాలం మారుతున్నా, మారని పందుల పెంపకందార్ల బతుకులను పదే పదే గుర్తు చేస్తుంది.

'సుక్క పంది పిల్లపుడితె
శుభం జరుగని మురిసెటోడు
బట్ట పందికి కల్లుతాపి
భాగవత మాడించెటోడు
రాగి గున్నకు తోడు జూపి
యోగమని తిలకించెటోడు
పందులే తన బంధు బలగంగ
బాదల్లొ సుఖములో బతుకును కలబోసుకునేది'

అసహ్యంగా సమాజం భావించే పందిని శుభ సూచికంగా భావించడం ఎంత గొప్ప భావన. వారి కష్ట సుఖాలను పందులతోనే కలబోసుకోవడం అంటే, వారిని పట్టించుకోని, గౌరవించని ఈ వ్యవస్థను పరోక్షంగా ఎత్తి పొడిచినట్టే.

'ఆవుతో శికారి కెల్లి
అయిదు కంజులే తెచ్చెటోడు
హలాల్ జేసె అలీకోటి
కల్లువోసె గౌడుకోటి
మనసులున్న మల్లికోటి
ఇంటిలోన విందుకోటి
ఆకలని యాచించెటోనికి
అడగకుండనె దానమోటి
అయిదుకన్నొకటెక్కువ బడితె
ఆ పిట్టలాను అడవిలోనే వదిలి వచ్చేది'

తనకు, తన చుట్టూ ఉన్నవారికి సరిపడా సంపదనే చాలనకుకోవడం ఎంత గొప్ప ఆదర్శ ధర్మం. కోట్లకు పడగలెత్తి ఇంకా కోట్లు దోచుకోవాలనుకునే వాళ్లు ఎక్కువవుతున్న కాలమిది. శ్రామికుడిగా నాగన్న చుట్టూ ఉన్న వ్యవస్థ ఎంత సౌందర్యాత్మకంగా ఉందో వివరించాడు. ఇంత శ్రమజీవి వ్యవస్థలో అవహేళనకు గురవుతున్నాడో కూడా ఇదే పాటలో ప్రస్తావించాడు.

'ఊరి పెద్దల చూసి ఎందుకో
నాగన్న ఎనకట ఉరుకులు పరుగులు పెట్టేది'

వ్యవస్థలో నాగన్న వంటి జీవితాల్లో మార్పు వచ్చే వరకూ ఈ పాటలోని పాదాలు ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. మొత్తంగా ఈ వ్యవస్థ అంతే సౌందర్యాత్మకంగా ఉండాలనీ వెంకన్న పాటలు కోరుకున్నాయి. ఈ పాటలు శ్రమ సౌందర్యాన్ని ప్రతిఫలించాయని చెప్పడంతో ఏమీ ప్రయోజనం ఉండదు. శ్రమ సౌందర్యమే సమాజంలో అత్యున్నతమైనదిగా భావించి పాటలు కట్టడంలోనే గోరటి వెంకన్న వాగ్గేయ కారుడిగా సఫలీకృతుడయ్యాడని చెప్పడం నా ఉద్దేశం. ఇది కవిగా గోరటి వెంకన్న మూర్తిమత్వంలో భాగమై ఉన్న అంశం. ప్రత్యేకమైన అధ్యయనం తోటిగా పాటల్లోకి శ్రమ సౌందర్యంలోని గాఢతను తీసుకొచ్చారు. బహుశా శ్రమను, శ్రమ జీవులనూ గుర్తించడం, గౌరవించడాన్ని ఆయన పాటలు కోరుకున్నాయని అనిపిస్తుంది. చివరకు శ్రమ జీవుల జీవితంలో మార్పు రావాలని కోరుకున్నాయి. వాళ్ల శ్రమకు తగిన విలువను గోరటి వెంకన్న రచనలు డిమాండు చేస్తున్నాయి. వెంకన్న ఒక ప్రాపంచిక దృక్పథం ఉన్నవారు. సమాజాన్ని నడిపే చోదక శక్తులేమిటో వెంకన్నకు చాలా బాగా తెలుసు. ఈ విషయం ఆయన పాటలను పరిశీలిస్తే అర్థమవుతుంది. ఎంత చక్కగా సమాజాన్ని అర్థం చేసుకున్నారో తెలుస్తుంది. ఎలాంటి దృక్కోణాన్ని కల్గి ఉన్నారనే విషయమూ స్పష్టపడుతోంది. ఈ విషయాలన్నింటినీ చక్కగా పాటల్లోకి

ప్రవేశపెట్టారు. వీరికున్న అధ్యయన పటిమ వారి పాటల్లోని అంశాల గాఢతను బట్టి అర్థమవుతుంది. నిత్య సంఘర్షణలు పడ్డ ఈ వ్యవస్థలో గోరటి వెంకన్న, ఆయన పాటలూ యాదృచ్ఛికం కావు. ఒక తాత్త్విక నేపథ్యంలో నుంచి గోరటి వెంకన్న పాటలను పరిశీలించాలి. ఎందుకంటే ఒక చారిత్రక క్రమంలోనే గోరటి వెంకన్న పాటలు రూపుదిద్దుకొని ఉన్నాయి. రేపటి ఒక ఆదర్శనీయమైన వ్యవస్థ నిర్మాణాన్ని గోరటి వెంకన్న పాటలు కోరుకుంటున్నాయి. అందుకే శ్రమ సౌందర్యంలోని అసలైన సువాసనలను ఆయన పాటలు పట్టి చూపుతున్నాయి. గోరటి వెంకన్న పాటలు గొప్పవనీ, అవి ఇప్పటికే ఎంతో సాధించాయని చెప్పడం నా ఉద్దేశం కాదు. రాబోయే ఒక సాంస్కృతిక పరిణామానికి గోరటి వెంకన్న పాటలు మైలురాళ్లుగా నిలుస్తాయనే నమ్మకాన్ని కల్గిస్తాయి. సమ సమాజాన్ని సాధించుకునే క్రమంలో సమాజానికి తగిన అవగాహనను, చైతన్యాన్ని అందిస్తాయనే నమ్మకాన్ని వెంకన్న పాటలు కల్గిస్తాయి. వెంకన్న పాటల్లో ఎంత ఆవేదన ఉందో, అంతే ఆవేశమూ ఉంది. ఎంత కవితా సౌందర్యం ఉందో అంతేస్థాయిలో శ్రమసౌందర్యతత్త్వమూ ఉంది. అన్నింటికంటే ముఖ్యంగా గోరటి వెంకన్న పాటల్లో అనేక సామాజికార్థిక, రాజకీయ, సాంస్కృతిక సమస్యలకు తగిన పరిష్కారాలూ వున్నాయి.

**ఆధార గ్రంథాలు :**

1. ఏకునాదం మోత - గోరటి వెంకన్న
2. రేల పూతలు - గోరటి వెంకన్న
3. అలసెంద్రవంక - గోరటి వెంకన్న
4. పాలపిట్ట, 2010 ఏప్రిల్ - ఇంటర్వ్యూ, యాకూబ్
5. ఎడతెగని ప్రయాణం - యాకూబ్
6. పిడికెడు ఆత్మగౌరవం కోసం- కలేకూరి ప్రసాద్
7. కృష్ణశాస్త్రి సాహిత్యం - సౌందర్య తత్త్వం - ఎస్. సీతారామయ్య

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# మహాభారతంలో గాంధారి స్వభావచిత్రణ

- డా॥ గుమ్మనూరు ఉషారాణి, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుంగనూరు, చిత్తూరు జిల్లా.

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్ ॥

వేదవ్యాసుడు లోకహితార్థం మూడు సంవత్సరాలు నిష్ఠతో భారతకథను 'జయ' కావ్యంగా రచించాడు. ఇందులో వ్యాసుడు ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే చతుర్విధ పురుషార్థాలను సాధించడానికి అవసరమైన విజ్ఞానాన్ని చక్కగా నిబిడీకృతం చేశాడు. ఈ కావ్యంలో వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఉపనిషత్తుల సారమంతా చోటుచేసుకోవడంవల్ల ఇది 'పంచమవేదం'గా, 'భారతీయ విజ్ఞాన సర్వస్వం'గా ప్రసిద్ధి చెందింది.

ఉగ్రశ్రవుడు శౌనకాదిమునులకు భారతకథను వివరించి చివరిగా -

"యదిహాస్తి తదన్యత్ర, యన్నేహాస్తి నతత్ క్వచిత్"

అని అన్నాడు. అంటే ఇందులో ఉండేదే ఎక్కడైనా వుంటుంది, ఇందులో లేనిది ఎక్కడా లేదు అని అర్థం. ఈ కావ్యంలో మనం సమాజంలో నేటికీ చూస్తున్న అన్నదమ్ముల ఆస్తితగాదాలు, కామాంధుల అరాచకాలు, మహిళలపట్ల దౌర్జన్యాలు, దుర్వ్యసనాలకు బానిసలై భార్యలను పదుగురిలో నవ్వులపాలు చేసే భర్తలు, పసిబిడ్డలను సైతం కక్షలతో చంపివేసే కిరాతకులు ......... ఇలా అన్నీ ఆనాటి భారతంలో మనకు దర్శనమిస్తాయి.

భారతంలో మనకు వినతాకద్రువలు, దేవయాని, శర్మిష్ఠ, శకుంతల, సత్యవతి, కుంతి, మాద్రి, గాంధారి, ద్రౌపది, సుదేష్ణాదేవి, ఉత్తర ............. ఇలా లెక్కకు మిక్కిలిగా వనితామణులు దర్శనమిస్తారు. వ్యాసవిస్తృతికి వెఱచి కేవలం గాంధారిని మాత్రమే ఎన్నుకున్నాను.

సృష్టికర్త సృష్టించిన ఒక అపూర్వ సృష్టి స్త్రీ. అన్ని రకాల బాంధవ్యాలను తన హృదయంలో నింపుకొని అందరికీ సమానమైన ప్రాధాన్యతనిచ్చి తనకంటూ ఏమీ మిగుల్చుకోని ఉన్నత వ్యక్తిత్వం స్త్రీది. అయితే పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు మొదలైనవాటిలో స్త్రీలను వివిధ కోణాలలో దర్శిస్తే, వారి విభిన్న స్వరూప స్వభావాలు మనకు దర్శనమిస్తాయి. మహాభారతంలోని గాంధారి అతిశయరూపలావణ్య, శీలము, ఆభిజాత్యము కలదిగా మనకు పరిచయమౌతుంది.

గాంధారి దుర్యోధనాది కౌరవులకు జన్మనిచ్చినతల్లి. అంధుడైన భర్తతో జీవితాంతం అనుకూలంగా నడచిన ధర్మపత్ని. ఈమె ఇతివృత్తం మనకు శ్రీమదాంధ్ర మహాభారతంలో పంచమశ్వాసంలో ప్రారంభమౌతుంది. అంబిక కొడుకైన ధృతరాష్ట్రుడిని పట్టాభిషిక్తుని చేసిన తర్వాత భీష్ముడు అతడికి వివాహం చేయడానికి ఒక యోగ్యురాలైన వధువును అన్వేషించే సమయంలో సుబలుని కూతురైన గాంధారిని గురించి ఇలా ప్రస్తావించాడు.

"......... గాంధార పతియయిన సుబలుని కూఁతు గాంధారియను దాని, నతిశయరూపలావణ్య, శీలాభిజాత్య సమన్వితగా ...." (ఆదిపర్వము) ఈమె పరిచయం చేయబడింది. అంతేకాక గాంధారి ప్రత్యేకతను గూర్చి ఇలా వివరించాడు భీష్ముడు.

క॥ ఈ కులము వివర్ధింపగ
నా కభిమత;మేను వింటి నలినేక్షణ దా
"నేక శత సుతులఁ" బడయగ
నా కన్యక వరము వడసెనట హరుచేతన్
(ఆదిపర్వము-పంచమాశ్వాసము)

కౌరవవంశాభివృద్ధే భీష్ముని లక్ష్యం. కులవిస్తారం కావాలంటే విస్తృత సంతానాన్ని కనగలిగే కులసతికావాలి. గాంధారి నూర్గురు కొడుకులు, ఒక కూతురుని కంటుందని శివుని వరం. కాబట్టి ఈ సంబంధం యోగ్యమైనదని అన్నాడు. అందుకు సుబలుడు (గాంధారి తండ్రి) సమ్మతించాడు.

అయితే బంధువులు గ్రుడ్డివాడైన వరుడని గుసగుస లాడినా, అతడు చూపులేకపోయినా గుణాలచేత ఉత్త ముడు అనడాన్ని విన్న గాంధారి .... "ధృతరాష్ట్రునకుఁ బితృవచన దత్తగాఁ దన్ను నిశ్చయించి "నాకుఁబతి యమ్మహీపతియ కాని యొరులనొల్ల" నని యప్పరమ పతివ్రత పరపురుషదర్శనంబు పరిహరించి పతికను గుణంబుగా నేత్ర పట్టంబునఁ దన నేత్రంబులు గట్టుకొని యుండె".

గాంధారి తండ్రి ఆజ్ఞను శిరసావహించే స్వభావం కలిగింది. కాబట్టి తండ్రి తనను ధృతరాష్ట్రునికి ఇచ్చినట్లు భావించి ఆనాటి నుండే ఆ మహాపతివ్రత పరపురుషులను చూడడానికి ఇష్టపడక కళ్ళకు అడ్డంగా గుడ్డకట్టుకుంది. దీనిని బట్టి ఆమె ఆనాటి సంప్రదాయాలకు కట్టుబడే స్వభావం కలదిగా తెలుస్తోంది.

గాంధారిలో స్త్రీ సహజమైన ఈర్ష్య స్వభావం కలదిగా కుంతికి పుత్రోదయమైనప్పుడు మనకు తెలుస్తుంది. కృష్ణద్వైపాయనుని వరంచేత గాంధారి గర్భవతి అయింది. దుర్వాసముని వరప్రభావంతో ధర్మదేవతవల్ల కుంతికి ధర్మరాజు జన్మించాడు. అప్పటికే గాంధారి ఒక సంవత్సరం గర్భవతి. మూలభారతంలో "సంవత్సరధృతే గర్భే గాంధార్యా జనమేజయ" అని వుంది. కుంతికంటే ముందే తాను గర్భం ధరించినా కుంతికే మొదట బిడ్డ పుట్టాడు. గాంధారి మనస్తాపం చెంది అసూయతో తన గర్భాన్ని తానే విచ్ఛిన్నం చేసుకుంది. ఇక్కడ గాంధారి తొందర పాటు స్వభావం, ఆమెలోని అసూయ, ఆవేశం ప్రస్ఫుటంగా దర్శనమిస్తున్నాయి. తర్వాత కృష్ణద్వైపాయనుని ఆదేశంమేరకు ఆ మాంస ఖండాలను 101 నేతి కుండల్లో ఉంచి బిడ్డలను పొందింది. ఇక్కడ ఆమెకు మాతృత్వం పట్లవున్న మక్కువ కూడా గోచరమవుతుంది.

సభాపర్వంలో ద్రౌపదీవస్త్రాపహరణ ఘట్ట సమయంలో అంతఃపురంలో ఎన్నో అపశకునాలు గోచరించాయి. అప్పటిదాకా మనకు గాంధారి జోక్యం కనిపించదు. తన బిడ్డలకు కీడు వాటిల్లుతుందన్న భయంతో అంతఃపురం నుండి గాంధారి విదురుని బెట్టుకొని ధృతరాష్ట్రుని వద్దకు వెళ్ళి జరిగిన విషయాన్ని వివరించి కోడలిని శాంతపరచమనడంతో తన బిడ్డలపట్లవున్న గుడ్డిప్రేమ కలదిగా గాంధారి కనిపిస్తుంది.

ఉద్యోగపర్వంలో శ్రీకృష్ణుడు పాండవులతో పొత్తు కుదుర్చుకురమ్మని చెప్పగా దుర్యోధనుడు ఆవేశంతో సభనుంచి నిష్క్రమిస్తాడు. కురువంశవినాశం తప్పదని కృష్ణుడు చెప్పగానే భయపడిన ధృతరాష్ట్రుడు విదురుడితో ఇలా అన్నాడు........

ఆ॥ బుద్ధిమంతురాలు పొందుగఁ బలుకంగ
నేర్చు; వచ్చి కొడుకుఁ దేర్చిపోవుఁ
గాన వేగనీవు గాంధారిఁ దోడితెమ్మని ..........."

(ఉద్యోగపర్వం: 3-382) అనే సందర్భంలో గాంధారి తెలివైనదని, నైపుణ్యంగా మాట్లాడే స్వభావంవున్నదని, కొడుకుని ఆమె శాంతపరచగలదని, వెంటనే ఆమెను సభలోనికి పిలుచుకొని రమ్మంటాడు. గాంధారి రాగానే సహజరీతిలో ధృతరాష్ట్రుడు "నీ కొడుకు అవిధేయుడై సభనుంచి వెళ్ళిపోయాడు. ఇటువంటి మూర్ఖుడు ఎక్కడైనావున్నాడా!" అని ప్రశ్నించాడు. ఆమె వల్లే కురువంశం నశించక బ్రతుకుతుంది అంటాడు.

అప్పుడు గాంధారి ......

తే॥ అనుడు'నీ పుత్రు' డవినీతుఁడగుట యెఱిఁగి
యెఱిగి వాని వశంబున నేలపోయె
దీవు నేమి యిచ్చితేని
నడ్డపడ నెవ్వరికి వచ్చునధిప! చెపును

(ఉద్యోగపర్వము :3-386) అంది.

ధృతరాష్ట్రుడు "నీ తనూభవుడు" అనంగానే తదనుగుణంగా ఆమె "నీ పుత్రుడు" అన్నపుడు ఎత్తిపొడుపు స్వభావం కనిపిస్తుంది.

"రాజా! నీ కొడుకు అవిధేయుడని తెలిసి తెలిసి వాడి ఇష్ట ప్రకారం ఎందుకు నడుచుకుంటావు? పాండవులకు నీవు ఏమియిచ్చినా అడ్డుపడే వారు ఎవరున్నారు?" అని ప్రశ్నించడంతో ధృతరాష్ట్రుడు రాజై కూడా తాను స్వతంత్రించక తప్పుచేస్తున్నాడనే భావం ఇక్కడ వ్యక్తమవుతుంది. తప్పుచేస్తే భర్తకైనా నీతి బోధించే స్వభావం కలదిగా కనిపిస్తుంది గాంధారి!

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



విదురుని పంపి దుర్యోధనుని సభలోకి తిరిగి పిలిపించి "మున్ను దనతోడంజనిన వారలందఱు నచ్చోటన నిలువనిట్లు వచ్చి సుయోధనుండు, నిజాసీనుండై యున్న జూచి తల్లి చిత్తంబున గర్జించుచు నతనికి ధర్మంబును నీతియును జుట్టఱికంబును బ్రదుకుఁదెరువును నిజశక్తియు, సహాయంబు గొలందియుఁ గులజన చిత్త ప్రకారంబును బాండవ పుత్రుల బలపరాక్రమం బులుఁ దెలియునట్లుగాఁ దెఱంగపడంజెప్పి బుజ్జగించి యుంగినిసియు ననేక విధంబుల నాడిన ............" (3-388) ఇలా దుర్యోధనుకి ధర్మాన్ని, రాజనీతిని, బాంధవ్యాల్ని, బ్రతుకుతెరువును, అతని శక్తిని, పాండవ శక్తి సామర్థ్యాలను స్పష్టంగా అర్థమయ్యేట్లు చెప్పింది. అతడిని బుజ్జగించి, బెదిరించి, బతిమాలి, కోపగించి చెప్పడంతో ఆమె బుద్ధికుశలత, సర్దుకుపోయే స్వభావం ఇక్కడ గోచరిస్తాయి.

యుద్ధంలో కౌరవులందరు మరణించిన తర్వాత ధృతరాష్ట్రుడు సపరివారంగా యుద్ధభూమికి వస్తాడు. పాండవులు ధృతరాష్ట్రుణ్ణి దర్శించిన తర్వాత వారు గాంధారివద్దకు వెళ్ళి నమస్కరించినపుడు ఆమె వారిని ఆశీర్వదించకపోగా ధర్మరాజును శపించడానికి పూనుకుంటుంది. "నీ కొడుకులను చంపిన పాపాత్ముడను వచ్చాను. కఠినంగా శపించి శిక్షించుము" అని ధర్మరాజు విలపించినపుడు ఆమె కరుకుగా వేడినిట్టూర్పులు విడిచి మౌనంగా ఉండిపోతుంది. గాంధారి కళ్ళగంతల సందులో నుండి ధర్మరాజు కాలిగోళ్ళు కనబడగా అవి ఆమె చూపుల తాకిడికి ఎర్రగా కందిపోతాయి. తనబిడ్డలను చంపిన పాండవులపట్ల ఆమెకు ఉన్న క్రోధం ఈ విధంగా బయట పడుతుంది.

వ్యాసమహర్షి ప్రసాదించిన దివ్యదృష్టితో యుద్ధరంగంలోని అన్ని దృశ్యాలు ఆమెకు స్పష్టంగా కనిపించసాగాయి. మృతవీరుల దేహాలపై పడి దుఃఖిస్తూవున్న కౌరవ స్త్రీలను చూసి గాంధారి ఇలా అన్నది

సీ॥ చూడుము ధృతరాష్ట్ర కోడండ్రఁ గన్నార
వీరె కన్నీరు పై వెల్లి గొనఁగ
దీనతఁ బొందెడు నాననంబుల విప్ర
లాపంబులైన సల్లాపములను
నడలు చొండొరులకు నన్నలఁ దమ్ముల
రూపించి వేర్వేఱఁ జూపుటయును
బొరిమొగంబులు సూచి పురపురఁ బొక్కుచుఁ
దలలల్లఁ దూలంగ నిలుచుటలును
తే॥ గలిగి యలిగెడు వారి కన్నులకుఁ బండు
వగుచునున్నారు కాకులు మగల తనువు
లెక్కియున్నను చేష్టలు దక్కి కొంద
ఱడువఁ జేయాడకున్నవారంబుజాక్ష!

(స్త్రీపర్వం 2-11)

అంటూ అపారదుఃఖంలో మునిగితేలుతున్న తన కోడళ్ళను చూసి ఒకవైపు బాధపడుతూనే, పగవారిని గురించి ఆమె మాట్లాడటం ఆమెలోవున్న మనుష్య సహజమైన ద్వేషం, అసూయ, పట్టుదలలకు నిదర్శనం.

తన ప్రియమైన పుత్రుడు దుర్యోధనుడి శవాన్ని చూసి మొదలు నరికిన చెట్టులా కుప్పకూలిపోయింది. రారాజులా బ్రతికిన తనబిడ్డ దీనంగా నేలమీద పడి ఉండడం చూసి ఆమె మాతృహృదయం పరితపించి పోయింది. తాను వచ్చినా లేచి నమస్కరించకుండా పడి వున్న కొడుకును చూసి కుమిలిపోయింది.

క॥ జననియుఁ దండ్రియుఁ దొలు బా
మునఁ జేసిన పాపకర్మమునఁగాక సుయో
ధనుఁడు మొదలయిన నూర్వుర
ననఘుఁడు ధర్మజుఁడు నామ
మడఁపగఁదగునే

(స్త్రీపర్వము 2-55)

దుర్యోధనుడు, దుశ్శ్యాసనుడు మొదలైన మహావీరులు నూరుమంది నామరూపాలు లేకుండా పోవడానికి వారితల్లిదండ్రులు పూర్వజన్మలో చేసిన పాపమే కారణమని లేకపోతే వారిని 'పుణ్యాత్ముడు' (ధర్మరాజు) నాశనం చేయగలడా అని ప్రశ్నించడంలో ఆమెకు ధర్మరాజుపై గల కోపము స్పష్టమౌతుంది. ఆమెలోని పుత్రప్రేమ, శత్రుద్వేషాన్ని 'పుణ్యాత్ముడు' అన్న పదంతో వెల్లడించబడింది.

పుత్రుల మరణానికి దుఃఖిస్తూవున్న ధృతరాష్ట్ర, గాంధారులను కృష్ణుడు ఓదారుస్తూవున్న సమయంలో గాంధారి "అంతా నీవు చెప్పినట్టే జరిగింది" అంది.

చ॥ విపుల విషాద తాపమున వేదన నొందు మ
దీంతు బుద్ధి కుం
దపగత మయ్యె నీదువచనామృత సేచనఁజేసి
యిట్టిచో
నపరిమిత ప్రభావ! విను మందుఁడు దీనుఁడు
వృద్ధునైన యీ
నృపు నరయంగఁ బాండవులు నీవును యుక్తులు
గారె! యెమ్మెయిన్"

(శల్యపర్వము : 2-373)

అంటూ కొడుకులు పోయిన దుఃఖాన్ని అణగద్రొక్కుకుంటూ, దీనుడైన తన భర్తను పాండవులు, కృష్ణుడు రక్షిస్తారంటూ చెప్పడంతో ఆమె స్వభావం తెలుస్తుంది.

"పాండవులు, కౌరవులు తమలోతాము అసూయతో యుద్ధానికి సిద్ధపడితే వారిని అడ్డుకోకుండా దుర్యోధనుని నాశనానికే నీవు రాయబారాలు చేశావు. రాజులను, వారిసైన్యాన్ని పేరులేకుండా చేశావు. అన్ని ప్రాంతాలు బీడుభూములయ్యాయి. చేసిన దానికి నీవు తగిన ఫలాన్ని అనుభవించు. నీ వైభవం సర్వనాశనము అయ్యేట్లుగా నా శాపాగ్నిలో నిన్ను దహించివేస్తాను" అంటూ గాంధారి శ్రీకృష్ణుని ఇలా శపించింది.

సీ॥ పూని పాతివ్రత్యపుణ్యఫలంబున
సంపాదితంబైన సారతపము
బలిమి సాధనముగాఁ బలికెద నుత్తమ
జ్ఞాతులఁ దమలోని సంగరమునఁ
బొలియఁజేసితి గాన పొలియుదు రన్యోన్య
ఘాతుకులై భవద్ జ్ఞాతిజనులు
నీవును దప్పక నేఁ డాదిగా ముప్ప
దాఱగు నేఁడైన యద్దినమున

తే॥ నరయ దిక్కెవ్వరును లేని యగ్గలంపు
గుత్సితంపుఁ దెఱంగునఁ గూలువాఁడ
విట్లు మీ వధూజనములు నేడ్చువారు
పతుల సుతులను బంధులఁ బనవి పనవి

(స్త్రీపర్వము : 2-161)

ఆమె శపించేనాటికి సరిగ్గా 36 సంవత్సరాలు పూర్తి అయిన రోజు చూడడానికి దిక్కెవ్వరులేని స్థితిలో అతిక్రూరంగా శ్రీకృష్ణుడు చనిపోతాడని నిర్దయగా శపించింది. యుద్ధరంగంలో కురువంశపు స్త్రీలు ఏవిధంగా దుఃఖిస్తూవున్నారో యాదవకాంతలు సైతం భర్తలను, కొడుకులను, బంధువులను కోల్పోయి కుమిలికుమిలి ఏడుస్తారని అన్నప్పుడు కడుపుకోతతో ఉన్న స్త్రీ ఎంతటి కఠినాత్మురాలిగా మారుతుందో గాంధారి తన శాపం ద్వారా తెలియజేసింది. చివరకు కుంతీ, ధృతరాష్ట్రులతో కలసి వానప్రస్థానికి వెళ్ళిపోతుంది.

ఈ విధంగా తోడికోడలిపై పోటీపడే మనస్తత్వం కలదిగా, బిడ్డలమీది గుడ్డిప్రేమతో వారి తప్పును కప్పిపుచ్చే తల్లిగా, తొందరపాటుతో బ్రతుకును నాశనం చేసుకోబోయే కొడుకుకు శత్రువుల బలాన్ని తెలియజేసి ఆపదనుంచి కాపాడడానికి ప్రయత్నించే విజ్ఞురాలిగా, ధర్మాధర్మాల పోరాటంలో ధర్మమే జయిస్తుందన్న విచక్షణ గల వనితగా, కొడుకుల వినాశనానికి కారణభూతుడైన వ్యక్తిని శపించడానికి వెనుకాడని వ్యక్తిగా ..... ఇలా గాంధారి విభిన్న సందర్భాల్లో విభిన్న రీతుల్లో స్పందించే హృదయం గలదిగా కవిత్రయం మనఎదుట ఆవిష్కరింపజేశారు.

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# పాటలో కులవృత్తుల చిత్రీకరణ

- డా॥. కసప నరేందర్, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, నిజాం కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

## కులవృత్తులు చారిత్రక నేపథ్యం :

కులవృత్తులు సంప్రదాయ వృత్తులు అవి వార సత్వంగా సంక్రమించినవి. అవి కఠోరశ్రమకుమూలం, సమాజంలో ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో అభివృద్ధి చేయడానికి ఉపయోగపడుతున్నాయి. కులవృత్తులు ఉపాధి కోసమే కాకుండా సాంస్కృతిక నేపథ్యం కల్గి ఉన్నాయి. పురాణాల కాలంనుండి నిర్మాణమైన ఒక వ్యవస్థ కులం. కులం అనేది ఎప్పటికీ సామూహికమైనది కాదు అది ఒక వర్గం. ఒక వర్ణం. కమరి వడ్రంగి కంచరి కంసాలు, కుమరి, చాకలి, మంగలి, చేనేత మొదలైనవి struggle లో నడిచే వృత్తులు అ వృత్తి దారున్ని He is a Contend Personality కఠిన ప్రయత్నం చేసేవాడని అర్థం.

భారతదేశంలో కులవ్యవస్థ దాదాపు 3000 సంవత్స రాల క్రితం ఏర్పడింది. కులవ్యవస్థ శ్రమవిభజన వల్ల ఏర్పడిందని తెలిసినా, అది కర్మానుసారం, దైవనిర్ణయం వల్ల జరిగింది అనే మాటలు వింటున్నాం.

మేధావి వర్గం భారతదేశంలోని కులవ్యవస్థను మూడు రకాలుగా చూశారు. 1.ఇండోలాజికల్ సోషియో, 2. ఆంత్రోపాలాజికల్, 3. సోషియోలాజికల్. కులవ్యవస్థ ఆవిర్భావం, ప్రయోజనం, భవిష్యత్తులను పౌరాణిక సాహిత్యం ఆధారంగా ఇండాలిజిస్టులు అధ్యయనం చేశారు. వీరు బ్రహ్మ లేదా విరాట్పురుషుడి నుంచి వర్ణాలుగా ఉద్భవించాయని, అనులోమ, ప్రతిలోమ వివాహ ఆచారాల ఫలితంగా వర్ణవ్యవస్థలో కులాలు విభా గాలుగా అభివృద్ధి చెందాయని భావించారు. అయితే కుల వ్యవస్థ శ్రమవిభజన ఆధారంగా ఏర్పడింది.

హిందూ సమాజంగా పిలువబడు మన దేశం కుల ఆధారిత సమాజం అని అంగీకరించక తప్పదు. అయితే కులం క్రమానుగత శ్రేణి విభజన 'Caste as a Hierarchical division or Society' అందుకే వృత్తులు కూడా క్రమానుగత శ్రేణిలోనే అమర్చబడి ఉంటాయి. ఉదా॥కమ్మరి పని చేసేవారిని కమ్మరులను కుమ్మరి పని చేసేవారిని కుమ్మరులని వివహారిస్తారు.

పాట మనిషి బ్రతుకుతో పెనవెసుకపోయింది. దు:ఖాన్ని సంతోషాన్ని బాధను ప్రతి సందర్భంలో వ్యక్తికరిం చింది. నేను ఉన్నాను అని అభయ హస్తాన్ని చూపించింది. అట్లాంటి పాటలో కుల వృత్తులను వాటి విధ్వంసాన్ని కనుమరుగైన వారి జీవితాన్ని పాటలలో చిత్రికరించారు కవులు ప్రపంచీకరణ ప్రభావం, కులవృత్తులు విధ్వంసం ఎట్లా జరిగిందో గోరటి వెంకన్న పల్లెకన్నీరుపెడుతుందో తెలియనికుట్రల పాటలో అద్భుతమైన దృశ్యమానం చేశాడు.

## పాటలో కులవృత్తుల చిత్రీకరణ :

అనాది కాలం నుంచి గేయరూపకమైన సాహిత్యం సమాజంలో ఉంది. పద్యం కంటే సరళమైన, సులువైన పదాలతో అల్లబడి, వాటిని పదాలుగా పేర్కొన్నారు వాగ్గేయాలుగా మనకు దర్శనమిస్తాయి. అ జ్ఞానకర్తృకమైన నాద సంప్రదాయం కల్గిన జానపదాలు మనకు లభిం చాయి. పాడుకోవడానికి అనువైనవి. శ్రవణ సౌందర్య మైనవి. చెవికి ఇంపైనవి. నోటికి తీపైనవి. ఇప్పుడు పదాలను, గేయాలను, పాటగా పేర్కోంటున్నాము. 'పాట' కొనసాగుతూ వస్తున్నది. ఇప్పటి పాట సబ్బండవర్ణాల సాధనం అయ్యింది గనుక ఏ విషయాన్ని చెప్పాలన్న 'పాట' తట్టకుండా చెప్పలేం. జనరంజకమైన విశేషమైన ప్రాచుర్యం పొందింది పాట కనుక విధ్వంసమైన కుల వృత్తులను, కులవృత్తులను నమ్ముకుని ఆగమైన జీవితా లను చిత్రిస్తూ కవులు పాటలు రాసి సీడీలను తయారు చేశారు. ప్రసారమాధ్యమాలలో ఆ పాటలు మారుమ్రోగు తున్నాయి. ఇప్పుడు ఆ పాటలను విశ్లేషించుకుందాం.

**విశ్వకర్మలు - వృత్తులు :**

ఐదురకాల వృత్తుల పనివారిని విశ్వకర్మలు అని పిలవబడుతున్నారు.

నభూమి నజలం చైవనతేజో నచవాయవ ః
నచబ్రహ్మ నచవిష్ణు నచరుద్రస్యతారక ః
సర్వశూర్య నిరాలంబో స్వయం భూవిశ్వకర్మణ ః

పంచభూతాలకంటే ముందే విశ్వకర్మ స్వయంభూగా అవతరించాడని మూలస్తంభ పురాణంలో విశ్వకర్మ జన్మను తెలియజేస్తుంది. ఋగేద్వము, యజుర్వేదము లలో విరాట్ విశ్వకర్మ భగవానుని ప్రసక్తి ఉంది. ఈయన ముఖమునుంచే ఐదు వృత్తులు, ఐదుగురు బ్రాహ్మలు జన్మించారు. వారు మను, మయ, త్వష్ట, శిల్పి, విశ్వజ్ఞ వారు. విశ్వకర్మ ఆజ్ఞాపనం చేత ఐదు వృత్తులను స్వీకరించారు. 1.అయఃశిల్పము - ఇనుపపని Black Smithy- మనువు, 2.దారు శిల్పము -వడ్రంగము Carpentry - మయుడు, 3. కాంస్యశిల్పము (కంచు) Coppersmithy- త్వష్ట, 4.శిల్పము-శిల్పి, 5.సువర్ణ శిల్పము - స్వర్ణకారము Gold smithy- విశ్వజ్ఞుడు ఇలా ఐదుగురు ఐదు వృత్తులను స్వీకరించి సమాజ సృష్టికి ఉపయోగడినారు.

ధ్వంసమైన కమ్మరి వృత్తిపైన పాట వచ్చింది.

బ్రహ్మన్న .... ఆ .... ఓ.... బ్రహ్మన్న
బ్రహ్మన్న .... వీర బ్రహ్మన్న
కమ్మరోళ్ల బ్రహ్మన్న ఎట్లజేస్తవు
ఈ కష్టాలు బ్రతుకునెట్ల ఎల్లదీస్తవ్ ... ఇది పల్లవి

పల్లవిలో వృత్తిగురించి చెప్పాడు. వృత్తిపనిచేసే బ్రహ్మను విధ్వంసమైన కమ్మరిపనికి ప్రతీకగా చేశాడు. పనిలేదు గనుక ఇప్పుడేంజేస్తవు కుటుంబాన్ని ఎలా సాకుతవు అని ప్రశ్నించాడు కవి.

కఱ్ఱులు బట్టేది నీవు - కత్తుల బట్టేది నీవు
కొండ్లను గట్టేది నీవు - కొడవలి గట్టేది నీవు
పలుగుల గట్టేది నీవు - పారలజేసేది నీవు
కొయ్యలు జేసి పట్టా లేసి
రెక్కలన్నీ ముక్కలైన డొక్క నిండదాయరో ....
గొడ్డలి బట్టేది నీవు .....
సమ్మెటేసి సంటిగాడు దిమ్మెర బోయిండురా ....
బువ్వకు జచ్చేది నీవు - బూర్దిలబొర్లేది నీవు ....
సద్గురు జేసి సర్వము జేసి బొడ్డుగోసే కాడికెల్లి
బొంద దోమెదాకరో....

ఇనుముతో వ్యవసాయానికి, ఇంటికి కావాల్సిన అన్ని పరికరాలను తయారుచేసి ఇచ్చేది కమ్మరి వృత్తి అతను. పుట్టుకనుంచి ఏది అవసరమో అవన్నీ చేస్తాడు. కానీ ఆకలికోసం అలమటించాల్సిందే. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇరాములేకుండా కుటుంబం అంతా కలిసి పనిచేస్తే కూడా తినడానికి తిండి ఉండదు. భూస్వాముల తిట్లు, దౌర్జన్యాలు ఇవన్నీ ఉంటాయి.

ఏదోరకంగా బ్రతుకుదాం అన్నా ఇప్పుడు ఆ పనికూడా లేకుండాపోయింది.

ఆసాములున్నారంటూ ఆరు నెలల ఉద్దేరంటా
ఆలుపిల్లలు ఆకలంటూ - అలమటిస్తుంటే
డాకలిపై సుత్తాడక దమ్మెడన్నం చేతులలేక
తాలిబొట్టు తీసుకెళ్లి తాకట్టు బెడ్తమంటే
అయ్యో నీ బాధలను ఆదుకునెదెవరు
కమ్మరోళ్ల బ్రహ్మన్న చేయికలపరా
ఈ కష్టాలు బ్రతుకులు మనకొద్దురా
హక్కులకై నిలదీయన్నా .....

బతుకులేదు కనుక ఉన్న ఆస్తి తాళి ఒక్కటే అది అమ్మినా బతకడం కష్టమే కనుక కలసి హక్కులకోసం పోరాడుదాం అని చెప్పాడు కవి.

ఇందులోనే వడ్రంగి పనిపై కూడా పాట ఉంది వడ్రంగి పని ఎలా కనుమరుగైందో వివరిస్తుందీపాట.

దేవుడా నీకొక్కదండము... ఓ.... దేవుడా
దీవ నియ్యు సామి ...ఏది దిక్కులేని వడ్లోలం
పొద్దు పొడవకముందే పెద్దపటేలొచ్చిండు
పద్దెంది జానల పాలమొద్దు దెచ్చిండు
ఇద్దరు నౌకర్లను నాయింట ముందుంచిండు
పొద్దంతా ఎండలోనే పెద్దబాడ్సె జెక్కిన ......
నాగండ్లు దంతెలు నాలుగైదు నింపించిన

గుంటకలు జంబులు గొర్రు కొయ్యలంటజేస్తి
పాలెలు పడుసోకలు కోలలు కాళ్లన్నీజేస్తి
పెట్టుబడి అడగబోతే పంటపండలేదంటరు

తెల్లవారరకముందే ఇంటిముందు నిలబడి పనిచేసే వరకు వదులనివారు భూస్వాములు. లావులావు మొద్దులు తెచ్చి ఇది, అదీ జేయమని ఆడర్‌వేస్తరు. రెక్కలన్నీ నొప్పులు పట్టంగ నాగలి, గుంటుకలు, కొయ్యలు, పాలెలు అన్నిజేసి, చేసిన కష్టం అడగబోతే చివరికి పంట పండలేదంటారు. మొదలు పనైతే జేయాలి తరువాత దేవుడెరుగు అందుకే దేవునికే మొరపెట్టుకుంటున్న శ్రామికుని అభ్యర్థనిది.

ఇనుప గొర్లు, నాగళ్లు ఇంటికోటి దెచ్చిండు
ఎడ్లబండ్లు నాగళ్లు ఏనాడో మూలవడే
బురదలు ట్రాక్టర్లు తిరిగి భూముల దున్నవట్టే
చేతివృత్తులడుగంటి చెప్పలేని బాధలాయే

రెండు పాటలను వీరాచార్యులు రాసాడు.

ఫ్యాక్టరీలు వచ్చాయి. ఇనుముతో చేసిన పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. దేశీయ, విదేశీ ట్రాక్టర్లు వచ్చి భూములను దున్నుతున్నాయి. కనుక ఎడ్లు లేవు ఎడ్లబండ్లు లేవు. చేతివృత్తులు కనుమరుగైనయి.

గోరటి వెంకన్న కులవృత్తుల విధ్వంసాన్ని అద్భుతంగా చిత్రించాడు.

పెద్దబాడిసె మొద్దుబారినది
పరకలపనికి ఆకలి తీరక
గడెం నొదలి పనిగాసమెల్లక
ఫర్నీచర్ పనులెదుక్కుంటు ...
ఆ పట్నం బోయిరి విశ్వకర్మలు
ఆసాములంతా గూసునేటి
ఆ వడ్రంగుల వాకిలి నేడుపాక్కిలి లేసి
దుఃఖిస్తున్నదిరో నాపల్లెలోన

అన్ని గ్రామాల్లో వడ్రంగివారు, కమ్మరివారు దగ్గర, దగ్గరయిండ్లే ఉండేవి. రైతులందరు పనికోసం వచ్చి అన్ని విషయాలు మాట్లాడుకునేవారు. ఇప్పుడు వడ్రంగి, కమ్మర పనులు లేవు. ఆసాములు లేరు. అందుకే కమ్మరికొలిమి దుమ్ము పేరింది, పెద్ద బాడిష మొద్దు బారింది. అంతో ఇంతో పని ఉన్న అది తిండి గింజలు దొరకనిపని. పట్టణాలలో ఫర్నీచర్ షాపుల్లోనైనా కూలిపని దొరకదా అనుకుంటూ వలసలకడుతున్నారు విశ్వకర్మలు.

మిత్ర విశ్వకర్మల వృత్తులను వర్ణిస్తూ పాట రాశాడు
సృష్టికి ప్రతిసృష్టిగా విశ్వకర్మ దృష్టిరా
పంచకర్మ పాఠమే ప్రపంచ గతిని చాటెరా అని విశ్వ కర్మల ఔనత్యాన్ని చిత్రించాడు.

విశ్వకర్మలు ఇంజనీరింగ్ టెక్నాలజిని కనుగొని అభివృద్ధిచేశారు.

**కుమ్మరి వృత్తి :**

కుమ్మరి మట్టితో పనిచేస్తారు కనుక కుమ్మరులని వ్యవహారంలో ఉంది. శాలీవాహను కుమ్మరుల మూల పురుషుడు. ఇతను శివుడు వరం వల్ల కుమ్మరి స్త్రీ కి జన్మనిస్తాడు. విక్రమార్కున్ని సంహరించి శాలివాహనుడు శకం స్థాపిస్తాడు.

గుండ బ్రహ్మపురాణం కుమ్మరుల కులపురాణం
సారే ....వాము, వీరిక ప్రధానమైన పనిమూట్లు

చెరువులో తేటనైన స్వచ్ఛమైన ఇసుకలేని మట్టిని తెచ్చి నానబెట్టి మెత్తగా తొక్కి ఆ మట్టితో చిన్నచిన్న పాత్రల నుంచి పెద్ద పెద్దగోలాల వరకు చేస్తారు. మట్టికుండలు ఆరోగ్యానికి మంచిది, వంటపాత్రలు, గ్లాసులు, నీళ్ల కుండలు, ధాన్యం దాచే కుండలు ప్రత్యేకమైనవి. కార్పొరేట్ తిమింగళాలు కుమ్మరికళలను హైజాక్ చేసి మార్కెట్‌లో వివిధ రకాల మట్టిపాత్రలను అమ్మడం ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని కుమ్మరులు ఉపాధి లేకుండా పోయారు.

కుమ్మరులకు గ్రామీణ ప్రాంతాలలో గౌరవం ఉండేది.

పెండ్లిళ్లు జరిగేటప్పుడు కొత్తకుండలను వాయిద్యాలతో వచ్చి తీసుకెళ్లేవారు. దక్షిణ చెల్లించి కుమ్మరులను గౌరవించేవారు.

ఉగాది పండగకు కొత్తకుండలను తీసుకుని పచ్చడి, పానకం చేసి తాగి ఉగాదికి ఆహ్వానం పల్కేవారు. ఇలా

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

కుమ్మరులకు సాంస్కృతిక జీవనం ఉండేది. మాయమై పోయిన కుమ్మరుల వృత్తి గురించి పాటలొచ్చాయి.

**గోరటివెంకన్న :**

కుమ్మరి వాములో అని తుమ్మలు మొలిసెను రాసాడు.

మరో పాట కుమ్మరుల శ్రమను వర్ణిస్తుంది
కుమ్మారోళ్ల శ్రమను జూడన్నా పాట రాసింది మల్లయ్య
కుమ్మరోళ్ల శ్రమను జూడన్నా
వాళ్లకుండ లెందుగ్గనుకురోరన్నా
కులవృత్తిని నమ్ముకుంటే
నీకు కూటికి కరువొచ్చిందా మాయన్నా ... ఇది పల్లవి
కుంటిరెడ్ల బండిగట్టీ
కుంట్లకెల్లి మన్నుగొట్టి
ఇంటిముందర ఎండబోసి
యిసుకరాళ్లనే ఏరేసి
మట్టిపెడ్డల నానబెట్టి
మంచిగ జల్లెడ బట్టి
ఒంటికాలిపై మీద నిల్చి ఓరన్నా ...
నీవు బరిగి దొక్కేలు ఎగిరిమన్ను
దొక్కేటి మాయన్నా ....

'కులవృత్తి మానకు గువ్వలచెన్న' అనే జాతీయం ఉంది. కులవృత్తి వారసత్వంగా వస్తుంది. కాలం మారు తున్న సందర్భంలో వృత్తుల్లో మార్పు చేర్పులుంటాయి. 'కులవృత్తిని నమ్ముకుంటే నీకు కూటికి కరువొచ్చిందా మాయన్న' అన్నాడు కవి. కుమ్మరి యొక్క శ్రమను మొత్తం వర్ణించిన పాట ఇది. కుమ్మరి వృత్తిని తెలియ జేస్తూ వచ్చిన మరో పాటలను కుమ్మరి శ్రీనివాస్ తెలం గాణ కుమ్మరి యువసేనవారు వెలువరించారు.

కులవృత్తిని నమ్ముకున్న కుమ్మరోళ్ల కులము
గత కీర్తి ఎంత ఘనము ప్రతి ఇంటిలోన మనము
పావులు నింతరము మరివొడి తేనెబలము
పురాణకాలం నుంచి ప్రాచుర్యం పొందిన కులము కనుక ఆ విషయాన్ని పల్లవిలో

ఇంటింట వాడుదామురో కుమ్మరోల్లకుండా
ఇగకుండలొండుకొని తిని ఉందామారోగ్యంగా
ఆ బ్రహ్మ కళనిచ్చె విష్ణువు భూమిచ్చె
శంకరుడురూపమిచ్చె - ఆత్రిమూర్తులేమెచ్చె
అందుకే అట్టి మట్టిసృష్టి పట్టుకొచ్చె
వృత్తులల్ల వృత్తి కుమ్మరోళ్ల చేతివృత్తి
ఈ భూమి పుట్టినపుడే పుట్టింది మట్టివృత్తి
బతుకునిచ్చినట్టి వృత్తిని బతికిస్తే మనకు తృప్తి
ఇంటింట వాడుదామురో కుమ్మరోళ్లకుండా
ఇగకుండలొండుకొని తిని ఉందామురో ఆరోగ్యంగా...

పాటలో మట్టిపాత్రలను ఉపయోగించడం వల్ల కుమ్మరులకు ఉపాధి దొరుకుతుంది. సమాజానికి ఆరోగ్యం దొరుకుతుందని చెబుతుంది. ఏ వస్తువునైన వాడడం ఉపయోగించడం వల్లనే వస్తువును బతికిస్తాం అలాగే వృత్తులు అంతే....

శాలీవాహన వారసులుగా పిలవబడుతున్న కుమ్మరులు మట్టిపాత్రలు చేయడం ద్వారా స్వచ్ఛమైన, చల్లని నీరుత్రాగి ఆరోగ్యాన్ని కాపాడుకునే వాళ్లం. యాంత్రిక పోటీలో వివిధ కంపెనీలు పుట్టుకొచ్చి రిఫ్రిజిరేటర్లు తయారుచేసి మార్కెట్‌లో ఉంచడం వల్ల ఫ్రిజ్‌ల వాడకం ఎక్కువైంది. కుండ మోటయ్యింది. ఫ్రిజు పరువు, మర్యాదలకు సంబంధించినదయ్యింది. వృత్తి లేక ఉపాధికరువైంది.

**మంగలివృత్తి :**

మానవుని అందంగా అలంకారంగా ముస్తాబు చేసే వృత్తి 'మంగలి' వీరిని నాయీ బ్రాహ్మణులంటారు. ఆంగ్లంలో ధ్యుతీవవతీ అంటారు. ఈ వృత్తి పాశ్చాత్య పోకడలకు నిలువుటద్దం.

మానవుడు క్షౌరం చేసుకుని తనను తాను గౌరవంగా తీర్చిదిద్దుకుంటాడు. నగరాల్లో సెల్యూన్‌షాపులు ప్రాచుర్యం పొందాయి. కార్పోరేట్ సంస్థలు ఈ వృత్తిని వ్యాపారంగా చేసాయి. మధ్యతరగతి బీదవారు సెల్యూన్ షాపులను ఏర్పాటు చేసుకోవాలంటే లక్షలు ఖర్చు వుతుంది.

గ్రామీణ ప్రాంతాలలో ఈ వృత్తి వారికి, ప్రత్యేక గుర్తింపు ఉంది.

క్షవరం ఒక్కటే కాకుండా, పెండ్లిల్లకు శుభకార్యాలకు బ్యాండ్, సన్నాయి వాయిస్తారు. పెండ్లికూతురుకు మైల పోలు, పెండ్లికొడుకు క్షవరంచేయడం వారి ప్రత్యేకత.

వారికి ప్రత్యేక కులపురాణం ఉంది. ఆ పురాణం ధన్వంతరీ వైద్యం, క్షవరం, భజంత్రీ మేళం వారి పని. మంగలి వృత్తిపై మిత్ర చక్కని పాటరాశాడు. ఆ వృత్తికి సంబంధించిన రామయ్య అనే పాత్రను సృష్టించి వృత్తిని చిత్రించాడు.

ఎంత సక్కనివాడు రామయ్య మా వూరి మంగలి మావయ్య

కలప చేతబట్టిఇల్లిల్లు తిరిగేను కథలెన్నో జెప్పుకుంటూ క్షవరాలు జేసేను.

కార్పోరేటు సెల్యూన్లు మంగలివారి పొట్టకొడు తున్నాయి.

గంపెడంత నెత్తిజూసి - సంటోని జిడ్డుజూసి
కాకితోనే కబురుబెడ్తే వాకిట్లో వాలిపోయే
కత్తిజూసి పోరగాడు, నెత్తి నోరు మొత్తుకుంటే
పొడుపు కథ లెన్నో జెప్పి - బుదగరించి
నెత్తినంతకత్తిరించి రామయ్య
వాన్ని ముత్యమోలే జేసినాడు చూడయ్య

పిల్లల నుంచి పెద్దవారి వరకు జుట్టును కత్తిరించి ముఖానికి అందాన్ని తీసుకొస్తాడు. ఎవ్వరైనా పిల్లలు ఏడిస్తే వారిని బుజ్జగించి మరిపించి జుట్టు కటింగ్‌చేస్తాడు. చివరికి అతను చేయాల్సిన కార్యం పూర్తిచేస్తాడు. అది క్షవర వృత్తి గొప్పదనం. క్షవరం చేసే అతనికి కులం, మతం, స్థలం అనేది ఉండదు జుట్టును కత్తిరించడమే ఆయన మతం. ఓరాయి దొరికితే చాలు. ఇంతనీడ ఉంటే చాలు. పనిపూర్తవుతుంది.

కాళ్లు చేతులురిగితె కట్టుగట్టి పంపెనంట
కాయపసరు ఆకుపసరు మర్మమేందో జేసెనంట
మంత్రసాని మంగలవ్వ సుఖంగా కాన్పుజేస్తే
బొడ్డుగీసి మందురాసి మాన్పినాడు రామయ్య

వీరికి నాటు వైద్యం తెలుసు. అనారోగ్యాలకు ఆకులు, అలమలతో పసర్లతో వైద్యం చేసేవారు.

మంచిధాన్యమేరికోరి గోళ్లముగ్గు చేసినాడు
పెండ్లిపిండ్లగానికేమో మైలపోలు తీసినాడు
పసుపురుద్ది గోళ్లు తీసి మంగళస్నానాలు పోసి
బట్టలు ధాన్యమిస్తే కట్నమని మురిసినాడు
మేటిబ్యూటిపార్ల రయ్యరామయ్య
పెండ్లికళ దెచ్చినాడు రామయ్య

పెండ్లిల్లో వీళ్ల హడావిడి బాగా ఉంటుంది. కాళ్ల గోర్లు తీయాలి, పసుపురాసి, మంగళ స్నానాలు చేయించి ఎలాంటి దిష్టి లేకుండా, పరిశుభ్రమైన, పవిత్రమైన వారిగా కొత్తగాపెండ్లి చేసుకోబోయే వారిని చేస్తారు. దానికి బియ్యం, లేదా బట్టలు ఇచ్చినా నగదు తీసుకోవాలన్న ఆశ ఉంటుంది. ముసిముసిగా నవ్వుతూ, నెత్తిన చెయ్యి తిప్పుతూ అడుగుతారు నగదు ఇస్తే సంతోషంతో దీవించి వెళ్తారు.

కులవ్యవస్థ వల్లవారు బ్రాహ్మణులుగా కాలేదు అంటాడుకవి. కాళ్లుచేతులు ఆడంగ పనిచేస్తే వచ్చే ఫలితం తక్కువ 'మంగలోడు' అనే నీచపు మాటలు విని పిస్తుంటాయి.

చివరి చరణంలో

కాస్మోటిక్స్ పేరు మీద కార్పోరేటు షాపులాయే
పుట్టగొడుగోలే పెరిగి వాడ కొక్క పార్లరాయే
పెట్టుబడి దొరకపాయే వృత్తిదారుదెబ్బదింటే
కార్పోరేటు వారేమో కోట్లకు పడగలెత్తిరి

మనిషి బతికి ఉండేవరకు ఉండేవృత్తి క్షవరం. కనుక ఈ వృత్తి మిగతా అన్ని వృత్తులకంటే ఉపాధి లభించేవృత్తే. అయితే 'రిలయన్స్' ఇంకా కార్పోరేట్‌వారు సెలూన్‌ల రంగాలలో ప్రవేశించి డిజిటలైజేషన్ ఫొటోలను జేస్తే ఆ పోటీకి మామూలు వారు తట్టుకోలేక ఇప్పటికి పెద్ద నగరాలలో చెట్లకిందో, డబ్బలనో క్షవరాలు చేస్తున్నారు.

### చాకలివృత్తి (రజక) :

చాకలి వారిని రజకులని అంటారు. ప్రస్తుతం రజక అనే పదానికి పేరుచివరన పెట్టుకుంటున్నారు అందరు.

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


రజకుల మూలపురుషుడు మడేలు. బట్టలు ఉతికే వృత్తిని గౌరవం స్వీకరించాడని రజకుల కులపురాణమైన మడేలు పురాణం వల్ల తెలుస్తుంది. రజకులు గ్రామీణ ప్రాంతంలో చెరువుల దగ్గర కొయ్యలుకొట్టి ఉడుకు నీళ్లల్ల సౌడు వేసి బట్టలు ఉతికేవారు. సహజంగా బట్టలు తెల్లగా మిలమిల మెరిసేవి. పండగలు, శుభకార్యాలు, దేవతాపూజల సమయంలో దివిటీలు, కాగడాలు పట్టే వారు. పెండ్లిలలో మైలపోలు తీయడం, బట్టలు ఉతికి నందుకు మేర ఇచ్చేవారు.

దొరలు, పటేళ్లు రజకుల ద్వారా తమ ఇండ్లల్లో జరిగే శుభకార్యాలు లేదా పెళ్లిల్లకు పత్రికలు ఇచ్చి ఆహ్వా నించేవారు.

నగేష్ రజక తయారుచేసిన పాట రజకుల శ్రమను వివరిస్తుంది.

మిలమిల మెరుపురా
మల్లెపూల తెలుపురా
తలతల తలకురా - రాజారజకురా
మరవని గుర్తురా - ఇస్త్రీ కడకురా
నీ విలువను పెంచెర రజకులంమేంరా
మసిబారిన బట్టలకు తెలుపునిచ్చే రజకులం
రాజైనా మంత్రైనా అందరికీ అవసరం

ఎంత మైల, మట్టి బట్టలనైనా తెల్లగా ఉతికేవారు రజకులు అన్ని కులాలవారికి బట్టలు ఉతికేవారు. గింజలు వచ్చింతర్వాత వారికి గింజలు పంచేవారు. తెల్లగ బట్టలు ఉతికి ఇస్త్రీ చేసిన తర్వాత మనిషికి ఉన్నతమైన గౌరవం వస్తుంది.

కానుపైనా, కళ్యాణమైనా
కాలం చేసినా మాసేవ అవసరం
రథము లాగిన బరాకు తీసిన
రజకుల దివిటే మీకు వెలుగురా
రాజా రాజా రజకులం
సమాజసేవే మాగుణం

మనిషి పుట్టుక తర్వాత నుంచి చావు వరకు ఇతరులపై ఆధారపడవలసిందే. మనిషి పుట్టిన వెంటనే మైల, మనిషి చనిపోయిన వెంటనే మైలగా భావించే మన సమాజంలో మైలబట్టలను ఇంటిని శుభ్రం చేసేవారు చాకలివారు. పెండ్లిల్లు అయితే దివిటీలు పట్టాలి. ఇలా అన్ని పనులు చేయాలి.

సంప్రదాయమే సమానత్వము - సంస్కృతి పట్ల మాకు గౌరవము

మాటతప్పని రజకులం - సమాజమే దేవాలయం

భక్తిభావము ధీరత్వము చాకలి అయిలమ్మ. ఆదర్శము చారిత్రక మహిళా పోరాటయోధురాలు చాకలి అయిలమ్మ. నేటి మహిళా తరానికి ఆమె ఆదర్శం. ఆమె వారసులు రజకులు సంప్రదాయాన్ని పాటిస్తారు.

బట్టిపెట్టినా బండకుతికినా
ఎండకు ఎండిందా ఎంత తెలుపురా
ఇస్త్రీ చేసిన మడత పెట్టిన
ఒంటికి తొడిగామా రాజారీవిరా
విలువలున్న వీరులం. విశ్వాసమున్న రజకులం
రజకులు లేకుంటే ప్రపంచమే మసిమయం.

మనిషికి గౌరవం తీసుకొచ్చే వృత్తి రజకవృత్తి. అలాంటి రజకులు లేకుంటే ప్రపంచమే 'మసి' మయమవుతుంది. అయితే ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం పెరిగింది. వాషింగ్‌మెషిన్స్ వచ్చాయి కనుక చాకలి వృత్తి వారికి ఉపాధి తక్కువైంది. ఇస్త్రీ పెట్టెల వినియోగం వల్ల స్వయం కృషి ఎక్కువైపోయింది. పట్టణాలలో దోబిలుగా వ్యవహరింపబడుతున్నారు వీరు.

**చేనేత వృత్తి :**

నేతపనివారిని సాలెవారని, పద్మశాలీలని పిలుస్తారు. వీరి మూలపురుషుడు భావనామహర్షి. వీరి కులపురాణం మార్కండేయపురాణం. ప్రాచీన కాలం నుంచి వున్న వృత్తి చేనేత. పత్తికాయల నుంచి పత్తిని తీసి నూలు రాట్నంపై దారాలుగా చేసి వస్త్రం తయారుచేస్తారు.

వస్త్రం మనిషికి కవంచ, రక్షణ, ఆత్మగౌరవం అంతే కాదు అందం, సౌందర్యం కూడా. మన దేశంలో క్రీ.పూ. 500-1000 శతాబ్దకాలంలోనే రాట్నం ఉపయోగించే వారని, మగ్గాలపై బట్టలు నేసేవారని తెలుస్తుంది. 18వ

శతాబ్దం పారిశ్రామిక విప్లవం ప్రభావంతో వస్త్ర పరిశ్రమ బాగా అభివృద్ధిలోకి వచ్చింది. నూతన ఆవిష్కరణలు జరిగాయి. 1738లో లేవిస్‌పాల్ మరియు జాన్‌వైట్‌రోలర్ స్పిన్నింగ్ యంత్రాన్ని కనుగొన్నారు. 1766లో పాల్ మర మగ్గాలకు నీటిచక్రాలను అమర్చాడు. 1784లో ఎడ్మండ్ కార్ట్‌రైట్ మరమ్మగ్గాని కనుగొన్నాడు. 18వ శతాబ్దం నుంచి యాంత్రికపరమైపోయింది వస్త్రపరిశ్రమ. అయినా చేనేత పరిశ్రమ దాని ఉనికిని పోగొట్టుకోలేదు. కానీ, యంత్రాలకు పోటీపడలేకపోయింది.

తెలంగాణలో సిరిసిల్ల నేత పరిశ్రమలకు ప్రసిద్ధి గాంచింది. కరువు కాటకాలతో చేనేత కార్మికులు ఆత్మ హత్యలు చేసుకోవం వల్లకూడా సిరిసిల్లా ప్రసిద్ధిగాంచింది. చేనేత పరికరాలు ఆధునీకరించుకోవడం, నేసిన వస్త్రాన్ని వాడడం వల్ల చేనేత వారిని సమాజం బ్రతికించవచ్చు. సిల్కు, నైలాన్ లాంటి వస్త్రాలకు అలవాటుపడి పాశ్చాత్య వస్త్ర సంస్కృతికి అలవాటు పడి, ఇంటిముందుర తయారైన రంగురంగుల నేత వస్త్రాలు వాడకపోవడం వలన చేనేత కార్మికులకు నష్టం వాటిల్లుతుంది.

చేనేత కృషిని, స్థితిని, గతిని చిత్రించిన పాటలను చూద్దాం.

అమ్మకుమార్ రాసిన పాట ఇది
మానవాళికి మగ్గం నేసిన
చేనేత చినబోయిండు
మానవత్వము చాటుకున్న
ఈ మనిషి మాయమవుతుండు
సాలెమగ్గముల సడుగులిగి
గతిలేని బతుకులైండ్రు
చేనేత వృత్తులు ఆగమై
మెతుకు దొరక లేకున్నదో
చేనేత నేసిన జాతీయండా
నింగిన ఎగురుతున్నదో
భరతమాత గడ్డమీద ఘనమైన చరితమీకున్నదో

మనిషికి వస్త్రం తయారుచేసి సంస్కారం, గౌరవం ఇచ్చిన వృత్తికారుడు నేతన్న. మనిషి ఆత్మాభిమానాన్ని కాపాడినవారు. ఆకులు, అలములు కట్టుకుని తనను తాను రక్షించుకునే మనిషికి వస్త్రం నేసాడు. దానికి రంగులు వేసాడు. మూడు రంగుల పతాకాన్ని తయారు చేసి భారతదేశానికి గుర్తింపు తెచ్చాడు. మనజాతీయ పతాకమే మన ఉనికి. అంతటి గొప్పదైన వృత్తిదారుడు ఉపాధిలేక నేసిన బట్టలు అమ్ముడు పోక అప్పులపాలై ఆత్మహత్య చేసుకుంటున్నాడు.

పొడిచే పొద్దుకు కారణమైన
కిరణమే జీవనవేదం
నీహలకు దారం అల్లినవాడే నేతకు ఆధారం
పుట్టెడు శోకం ఎదల దాచుకుని పంచుతారు మమకారం
పుత్తడి మానుపు పోసిన పక్కడొక్క నింపనికాలం
గఱడేతే పగిలేడ్చిన సెల్లని సెమటలపోరు
సరిలేని ప్రతిభ చాటుకున్న ఫలితం రాలేదు
నేసిన వస్త్రములు నేడు సేదలువడుతున్నయో

సూర్యుని కిరణమే లోకానికి వెలుగు, బ్రతుకు. చేనేత నాడెను ఉపయోగించి ఆధారం అల్లి వస్త్రం తయారు చేసి అది అమ్ముడు పోతేనే తిండి.

బతుకు భారాన్ని వేదనను గుండెలోతుల్లో నింపుకుని ఉన్న వస్త్రాన్ని అందంగా తయారుచేస్తాడు. బంగారం వస్త్రాలు నేసిన. తన కళానైపుణ్యాన్ని ప్రదర్శించి వస్త్రం ముగ్ధమనోహరంగా సిద్ధం చేసినా అది మార్కెట్‌లో ఆదరించకపోతే కార్మికుడికి శోకం మాత్రమే మిగులుతుంది. నేసిన వస్త్రాలన్నీ మూలకుపడుతున్నాయి.

సంప్రదాయ మన భరతావనిలో
పస్తుల జీవనయాగం
పూట గడిస్తే చాలనుకున్న చేనేత కడుపునినాదం
రాజుల చరిత్రకు నాణేత నిచ్చినట్టు చేనేత చరిత్ర
నేసిన వస్త్రం నెత్తినెత్తుకుని
పాలించేమి చరిత మాసకబారిన చీకటి
తనువుల సూర్యుడు ఉదయించాలె
భావితరాలకు మరిచిపోలేని చరిత్ర తేవాలే
వాడిన చేనేత మోములపైన చిరునవ్వులు

పులకరించాలె

జయహే .... చేనేత ....

భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు చేనేత వస్త్రం నిలువుటద్దం. నేతన్నలు సంప్రదాయాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. ఆనాటి రాజుల కాలం నుంచి నేటి ప్రజా స్వామ్య పాలకుల కాలం వరకు గొప్ప చరిత్రను కల్గి వున్నారు. జీవనపరంగా వారి బతుకుల్లో చీకటి అలుముకుంది. ఆ చీకటి వీగి వెలుతురు రావాలి. చేనేత బతుకులు బాగుపడాలి. భావితరాలు కూడా చేనేత సంప్రదాయాన్ని వారసత్వాన్ని కొనసాగించాలి.

గోరేటి వెంకన్న తన పల్లెకన్నీరు పెడుతుందో పాటలో చేనేత కార్మికున్ని సృశించాడు.

సాలెలమగ్గం సడులిరిగినది
చేతివృత్తుల చేతిలిరిగిపోయే
నా పల్లెల్లో అయ్యో ...
గ్రామ స్వరాజ్యం గంగలోన బాయే ఈ దేశంలోన

గ్రామంలోని చేతివృత్తులను వాటి నేపథ్యాన్ని తెల్సిన మహాత్మాగాంధీ రాట్నంపై దారాన్ని తయారుచేస్తాడు. ఆ దృశ్యం కుటీర పరిశ్రమలకు, చేతివృత్తుల ఆవశ్యకతను తెలియజేస్తాయి. అలాంటి వృత్తులన్నీ నేడు లేకుండా పోతున్నాయి. కనుక గ్రామస్వరాజ్యం గంగలో పోయిందన్నారు వెంకన్న.

## చర్మకారవృత్తి :

చర్మకారవృత్తి చేసేవారు మాదిగలు చనిపోయిన జంతువు నుంచి చర్మం తీసి దాన్ని శుద్ధిచేసి చెప్పులు, తోలు నుంచి తిత్తిలాంటివి చేస్తారు. పలుచట చర్మం నుంచి తప్పెట, డోలు, లాంటి వాయిద్య పరికరాలు సిద్ధం చేసేవారు. వీరికుల మూల పురుషుడు జాంబవంతుడు.

ఆరె, రంపెం, గూటం, మొ॥చర్మకారుల పని ముట్లు

మొత్తం సమాజం వీరు చేసే చెప్పులనే వాడేవారు. వివిధ రూపాలలో చెప్పులు చేసేవారు. ఆధునిక కాలంలో చెప్పుల కంపెనీలు రావడం తేలికైన రకరకాల చెప్పులు తయారుచేయడం వల్ల ప్రజలు ఆకర్షితులైనారు. బాట, పారగాన్ చెప్పులు మొదట్లో వచ్చినా ప్రస్తుతం వందలకొద్ది విదేశీ కంపెనీలు చెప్పులు తయారుచేస్తున్నాయి.

వీరు చర్మంతో చేసే ఏ వాయిద్య పరికరమైన 'కంగున' మోగేది. అలాంటిది ఇపుడు ప్లాస్టిక్ డప్పులు వస్తున్నాయి. అన్ని వాయిద్య పరికరాలు ప్లాస్టిక్‌మయం అయిపోయినాయి.

మార్కెట్‌లో దొరుకుతున్న నైస్ చెప్పులు, ప్లాస్టిక్ డప్పుల వల్ల చర్మకారవృత్తి నష్టం కల్గింది. చర్మకారులు కూడా మార్కెట్‌లో దొరుకుతున్న తోళ్లతో నైస్‌గా చెప్పులు చేస్తున్నారు. అయితే చెప్పులు చేయడం కన్నా అమ్మకంపై, రిపేర్లపై ఎక్కువగా దృష్టి పెట్టారు.

చర్మకారవృత్తి వచ్చిన పాటలను చూద్దాం

గోరటివెంకన్న తన పాటలో

మాదిగ లొద్దినోరు దెరిసినది
తంగేడు చెక్క బంగపడ్డది
తొండెముబొగ్గ నిండమునిగినది
ఆరెరంపె పదునారిపోయినది
పాత రేకు వలె మోతలు మోగేటి
ప్లాస్టిక్ డప్పులు
నా మ్యాదరి డప్పును పాతరేస గదరా
నా పల్లెల్లో

తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన కవి, గాయకుడు మాట్లాతిరుపతి చర్మకార్మికునిపై పాటరాశాడు.

పుడమికే తొలిసూరి బిడ్డలమైన ఘనత మాదిగా
రాజ్యమేలిన రాజుల మూలాలకే అనాదిగా
మాదిగా మహాదిగా .....
మాదిగానే మహాదిగా ....
ఈ ఆదిబీజము నాదిగా
మాదిగనేమాదిగా - ఈ దేశ చరితేనాడిగా
శబ్ద సృష్టికి ఊపిరోసిన తోలుదెబ్బె నాదిగా
నీకాలి నడకకు పానుపేసిన పాదరక్షే మాదిగ
మా గుండె చప్పుడు డప్పురా ...
మా చమట చెక్కలే చెప్పురా ....

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

త్రిమూర్తులు లేకముందే జంబూ ద్వీపాన్ని పరిపాలించిన జాంబవంతుడు. ఆ వారసులే మాదిగలు. జంతు చర్మంతో తోలు తయారుచేసి వాయిద్య పరికరం చేసి 'శబ్దం' సృష్టించారు. అది వారి వృత్తిగా చెప్పబడుతుంది. మనిషి పాదాన్ని రక్షించే కవచం చెప్పు ఈ రెండు రకాలుగా సమాజానికి ఉపయోగపడినారు మాదిగలు. అందుకే గుండె చప్పుడు, డప్పుఅయ్యింది. చెమట చుక్క చెప్పింది. చమట 'శ్రమకు' మూలం. చెమటోడ్చి మీకు చెప్పును తయారుచేసానని చెప్పడం.

ఎవసాయానికి తోడు నిల్సిన
తొండెం బొక్కెన మాదిగ
నీటినిల్వకు మూలపైన తోలుతిత్తిమాదిగ
ఎత్తుజోళ్లు ముకుదాళ్లు వడిసెల ఆరెకట్టే మాదిగ
మా కులానికే అవి అలంకారమై విరాజిల్లె అనాదిగా....
..........................
నాలుగు వేదములు పుట్టక మున్పె
నవబ్రహ్మలు పుట్టకమున్పె
కల్పవృక్షములు పుట్టకమున్పె
కామధేనువు పుట్టకమున్పె
ఆది జాంబవుడు అవనిపై మోపిన
అడగుల గుర్తె మాదిగా
ఆ వారసత్వముల అవతరించిన
మేథాశక్తే మాదిగ

నీటిని బొక్కెనద్వారా పంట పొలాలకు పారించడం మాదిగల ప్రత్యేకత. వృత్తికి సంబంధిచిన పరికరాలు. ఆరె, వడిసె, ముకుదాళ్లు, ఎత్తుజోళ్లు అవి మాదిగల అస్తిత్వ చిహ్నాలు అలంకారమై ఇప్పటి విరాజిల్లుతూనే వున్నాయి.

## మేదరవృత్తి :

మేరోళ్ళ చేతులకత్తెర మూలపోయి సిలువెక్కి పోయినది
సుట్టు రెక్కల బనీన్లు బోయినవి సోడెలాగులు జాడకు లేవు
రెడిమెడ్ ఫ్యాషన్ దుస్తులొచ్చెనంటా నాపల్లె పొలి మేరకు
ఆకుట్టు మిషన్ల చప్పుడాగి నాదో నా పల్లెల్లోనా

అంటూ మేరోళ్ల వృత్తి విధ్వంసంపై గోరెటి వెంకన్న పాట పాడాడాడు.

గ్రామాల్లో కుట్టు మిషన్లకు ఎప్పుడూ గిరాకి ఉండేది. రెడ్‌మెడ్ వస్త్రాలు వచ్చి మనిషికి గాలమేసినట్టు అయింది.

గ్రామాలు తీరుగుతు కుంకుమ నోములదండలు, మొలత్రాడులు అమ్ముకుని జీవనం సాగించేవారు బుక్కోళ్లు.

తాళాలు ఇతర వస్తువులు అమ్ముకుని జీవనం సాగించేవారు పూసలోల్లు అలాంటి వారి కనుమరుగైన వృత్తులను వర్ణించాడు గోరెటి వెంకన్న

కుంకుమ దాసరి బుక్కమీద గూడ కంపనీ రక్కసి కన్నుబడ్డది పూసలోల్ల తావాము కప్పలు కాశీల గలసి ఖతమౌతున్నవి బొట్టు బిళ్లలూ నొసటి కొబ్బెగదీరా నా పల్లెలోన

మన బుద్ధి దాసరీ బతుకు లాగమాయే ఈ పల్లెల్లోనా

రబ్బర్ స్టికర్స్ కుంకుమ రూపాన్ని సమాది జేసాయి.

లేడిస్ కార్నర్ షాపులు గ్రామాల వరకూ చేరాయి. బుక్కోరళ్లు పూసలోళ్లు, దాసరులు గ్రామ పొలిమేర్లకు కూడా రాకుండా పోయారు. దీపావళి, పున్నమి పండగలలో నోము నోచుకునే సందర్భంగా బుక్కోళ్ల హడావిడీ అంతా ఇంతా కాదు.

గొలకుదువలు గొంగళ్ల తయారు చేయడం గొండ్లుకలు.. కార్మికులు జీవనం సాగించటం అంతా గ్రామీణ జీవన సౌందర్యాన్ని తెలియజేస్తుంది.

## ముగింపు :

గ్రామీణ సాంస్కృతికతకు జీవనానికి అద్దంపట్టే కుల వృత్తులు కాలం తెచ్చినమార్పు లేదా మనిషి ఎంచుకున్న మార్గమోకానీ భారతీయ జీవన మూలాలైన కులవృత్తులు విధ్వంసకాడం మాయమవడం మన ఉనికి మనం పోగోట్టుకున్నట్టే.

ప్రతి వస్తువును వ్యాపార ధోరణిలో చూడబట్టి కుల వృత్తులకు విలువ లేకుండా పోయింది.

గోరెటి వెంకన్న కుల వృత్తులు నమ్ముకుని అన్యాయమైన వారికి ఉపాధి మార్గం చూపాలంటున్నాడు.

''వృత్తులు కూలె ఉపాధిపోయె ప్రత్యా మ్నాయం లేక నెపోయే కూలిన బతుకులు నిలుపుటకైనా కుటీర పరిశ్రమలైనా బెట్టరు.'' అంతా అయిపోయింది ఇప్పుడు కావలసింది కులవృత్తుల వారు బ్రతకడానికి ఇంత ఉపాధి కనుక ప్రభుత్వం అన్నికుల వృత్తుల వారికి పని కల్పించి వారు తయారు చేసిన వస్తువులు, పరికరా లన్నింటిని మార్కెట్ లోకి తీసుకొని రావాలి. ఏ ఆదారము లేక పోతే వృత్తి మాయమయినట్టు ఆవృత్తిని నమ్ముకున్న మనిషి మాయమవుతాడు.

**ఆధారగ్రంథాలు :**

1) ఆంధ్రలు జానపద విజ్ఞానం - డా॥ఆర్వీయస్ సుందరం
2) విశ్వబ్రాహ్మణులు సంస్కృతి అనుకరణము - డా॥ కపిలవాయి లింగమూర్తి
3) వివిధ వృత్తులు శ్రమ గౌరవ పాఠాలు - ప్రా॥ కంచ ఏలయ్య
4) కులపురాణాలు గౌడపురాణం - డా॥ గుడికాడి ఆంజనేయులు
5) సమాజ నిర్మితి విధానాలు & వివాదాలు తెలుగు అకాడమి హైదరాబాద్

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# ప్రబంధ సాహిత్యం - చారిత్రక ఆనవాలు

**- డా. విస్తాలి శంకరరావు,** సహా ఆచార్యులు, తెలుగు విభాగం, మద్రాసు విశ్వవిదాలయం, చెన్నై, తమిళనాడు.

సాహిత్యం, చరిత్ర అనేవి ఒకే నాణెనికి ఉండే బొమ్మ బోరుసు లాంటివి. ముఖ్యంగా తెలుగు ప్రాచీన సాహిత్య కాలానికి, ఆ కాలం నాటి చరిత్రకు ఎంతో అనుబంధం ఉంది. ఆ సాహిత్యాన్ని, చరిత్రలను పరిశీలిస్తే రెండూ ఒకదానికొకటి ఎంతోగానో ప్రభావితం అయినట్లుగా స్పష్టంగా తెలుస్తుంది.

అటు తెలుగు సాహిత్యచరిత్రలోగాని, ఆంధ్రదేశ చరిత్రలో గాని 16 వ శతాబ్ద కాలాన్ని స్వర్ణయుగంగా కీర్తిస్తున్నాం. ఈ గొప్పతనం, కీర్తి ఆ కాలంలో వెలువడిన ప్రబంధ సాహిత్యానికి అదే విధంగా ఆ కాలంలో ఆంధ్ర దేశాన్ని పాలించిన రాజవంశం అయిన విజయనగర సామ్రాజ్యానికే దక్కుతుంది. విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన రాజులలో కూడా శ్రీకృష్ణదేవరాయల కాలం ఆంధ్రదేశ చరిత్రలోనే కాదు ఆంధ్ర సాహిత్య చరిత్రలో కూడా స్వర్ణయుగంగా కీర్తిస్తూ మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి పదంలో ముందుకు సాగాయి. అంతేగాక ఆంధ్రదేశ చరిత్రలో గాని ఆంధ్రసాహిత్యంలో గాని ఈ కాలం ఎందరి చేతనో ప్రశంసంచబడి ఎందరికో ఆదర్శప్రాయంగా నిలిచింది.

ఇక తెలుగు సాహిత్యంలోనే ప్రబంధయుగ సాహిత్యానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అందుకు ప్రధాన కారణం ఆనాటి సాహిత్య వికాసానికి ఆయా రాజులు చూపిన ఔదార్యమే అని చెప్పవచ్చును. ఈ నేపథ్యంలో ఆకాలంలో వెలువడిన సాహిత్యానికి, ఆనాటి రాజులు సాహిత్యం పట్ల అంత మక్కువ చూపడానికి గల కారణాలను తెలుసుకొవాలంటే ఆనాటి సాహిత్యాన్ని, చరిత్రను తులనాత్మకంగా పరిశీలిస్తే ఒక దానికోకటి ఎలా ప్రభావితం అయ్యాయో తెలుస్తుంది. 16 వ శతాబ్దపు ప్రబంధ సాహిత్యం విశిష్టంగా వెలువడడానికి ఏర్పడిన పరిస్థితులను అర్థం చేసుకుంటే ఆ సాహిత్య విశిష్టత ఏమిటో తెలుసుకునే అవకాశం ఉంటుంది.

### విజయనగర స్థాపన నాటి పరిస్థితులు :

విజయనగర రాజులలకు ముందు ఆంధ్రదేశాన్ని పాలించిన రాజవంశం కాకతీయులు. కాకతీయ రాజ్యం చివరి రోజుల్లో జరిగిన పరిస్థితులను గమనిస్తే చివరగా ప్రతాపరుద్రుని కాలంలో అంటే క్రీ.శ. 1324లో ఉలుమ్ ఖాన్ అనే ఢిల్లి సుల్తాను ఓరుగల్లుపై దండెత్తి వచ్చి ప్రతాపరుద్రుని బందిగా పట్టుకుని ఢిల్లి తీసుకు వెళుతున్న సమయంలో మార్గమధ్యంలో నర్మదానదీ తీరంలో ప్రతాపరుద్రుడు ఆ అవమానాన్ని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడతాడు. ఓరుగల్లు ఆక్రమించిన ముస్లీం పాలకులు ఆ ఓరుగల్లు పేరును మార్చి సుల్తానాపూర్‌గా నామకరణం చేసి ఢిల్లీ సామ్రాజ్యంలో 23వ రాష్ట్రంగా చేర్చారు.

అలా ముస్లీం పాలనలోకి వెళ్లిన ఆంధ్రధేశాన్ని విడిపించడానికి ఆ రోజులలో అనేకమంది ఆంధ్ర రాజులు గట్టి ప్రయత్నమే చేశారు. అయితే ఆ రోజులలో ముస్లిం పాలనను ఎదరించగలిగినవారు ఈ ఆంధ్రదేశంలోనే కాదు యావత్ భారతదేశంలో కూడా వారిని ఎదిరించే సాహసం చేయలేకపోయారు. ఆలా ఆ సుల్తానులను ఎదిరించి నిలిచిన వారిలో ముఖ్యులు ఆంధ్రులనే చెప్పాలి. ఆకాలంలో అనేక ప్రాంతలలో కొందరు తెలుగు నాయకులు స్వతంత్ర రాజ్యాలను ఏర్పాటుచేసుకుని స్థానిక రాజులుగా పాలన చేస్తున్నారు. ఆ కాలంలో వివిధ ప్రాంతాలను పాలించే వారిలో ప్రధానంగా చెప్పుకోదగిన వారు.

1. గోదావరి తీరంలో 'రెకపల్లి' ని రాజధానిగా చేసుకుని పాలించే - ప్రోలనేడు వంశంవారు
2. తుంగభద్ర నదీతీరంలో విజయనగరం ను రాజధానిగా చేసుకుని పాలించే - హరిహరరాయలు అతని సోదరులు.

3. తెలంగాణ ప్రాంతంలో రాచకొండను రాజధానిగా చేసుకొని పాలించే - రేచర్ల అనపోత నేడు.
4. అద్దంకిని రాజధానిగా పాలించే - రెడ్డిరాజులు.
5. దక్కనులు గుల్బర్గాను రాజధానిగా చేసుకుని పాలించే - బహుమ్మనీ రాజ్యం మొదలనవి.

ఈ పైన్న పేర్కొన్న రాజ్యాలు అన్ని కూడా నిరంతరం కలహాలతో స్థిరత్వం లేక ప్రజలు అనేక అటుపాట్లు కు గురియ్యారు. క్రమక్రమంగా ఒకరిమీద ఒకరు దాడులు చేసుకుని అందుబాటులో వున్న ప్రాంతాలను తమ రాజ్యంలో కలుపుకుంటూ విస్తరించుకున్నారు. అలా ఒకరి తరువాత ఒకరు ఆ ప్రాంతాలను జయంచుకుంటూ విస్తరించుకోగా చివరకు అన్ని రాజ్యాలు అంతరించిపోగా యిక మిగిలిన రెండే రెండు రాజ్యాలు ఒకటి బహుమ్మనీ రాజులు, రెండు విజయనగర రాజలు. తెలంగాణ ప్రాంతం అంతా బహుమ్మనీ రాజ్యంలో భాగంగా ఉంది. ఇకా ఈ బహుమ్మనీ రాజులకు, విజయనగర రాజులకు నిరంతరం కలహాల కాపురంగా ఉంది. అవకాశం దొరికినప్పుడునల్లా ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం సర్వ సాధారణమయింది. ఈ నేపథ్యంలో గమనిస్తే హిందు ధర్మాలను, సంస్కృతిని కాపాడవలసిన భాద్యత ఒక్క విజయనగరం పైనే ఉంది. ఈ క్రమంలో విజయనగర సామాజ్ర్యాన్ని పరిపాలించిన రాజవంశాలను పరిశీలిద్దాం.

## విజయనగర రాజ్యం :

విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన రాజవంశాలు

1. సంగమ వంశం ( క్రీ.శ. 1336 - 1485)
2. సాళువ వంశం (క్రీ.శ. 1485 - 1505)
3. తుళు వంశం (క్రీ.శ. 1505 - 1576)
4. అరవీటి వంశం ( క్రీ.శ. 1570 - 1680)

ఈ విజయనగర రాజులకాలంలో బహుమ్మనీ రాజులకు, విజయనగర రాజులకు నిరంతరం ఘర్షణలు జరిగేవి. ఈ ఘర్షణల ప్రభావం ఆనాటి రాజులమీద గాని, ప్రజలమీద గాని ఎక్కువగానే ఉందని చెప్పవచ్చు. నిలకడలేని జీవితం ఎప్పుడు దాడులు జరుగుతాయో తెలియని పరిస్థితి. అందువలన ప్రజలు బ్రతికినంత కాలం విలాసవంతమైన జీవితాన్ని గడపడం ఆనాడు సర్వసాధారణమైంది. మరీ ముఖ్యంగా రాయలకాలంలో ప్రజల జీవితాలలో అనేకమైన మార్పులు ఏర్పడ్డాయి.

ఇకా విజయనగర సామ్రాజ్యాన్ని తుళువ వంశం రాజులు పరిపాలిస్తున్న కాలంలో బహుమ్మనీ రాజ్యం కూడా అంతర్గత కలహాలతో ఐదు రాజ్యాలుగా చీలి పోయింది. అవి.

1. ఆదిల్ షాహిలా - విజ్జాపురం రాజ్యం
2. కుతుబ్ షాహిలా - గొల్కొండ రాజ్యం
3. నిజాం షాహిలా - అహమ్మద్ నగరరాజ్యం
4. ఇమద్ షాహిలా - బేరారు రాజ్యం
5. బరీద్ షాహిలా - బీదరు రాజ్యం

పైన తెలిపిన ఈ ఐదు రాజ్యాలు విజయనగర రాజ్యానికి పొరుగురాజ్యాలుగా వున్నాయి.ఈ ఐదు రాజ్యాలలో కూడా ఒకరంటే ఒకరికి పడకా నిరంతరం కలహాలు, యుద్ధాలు జరిగేవి. కొన్నిసార్లు ఈ మహామ్మదు రాజ్యాల వలన విజయనగరానికి విపరీతమైన మెప్పు కలిగేది. ఈ నేపథ్యంలో తుళువంశానికి చెందిన వీర నరసింహరాజు రాజ్యంలో 'పితారి'లను అణిచివేసి ముస్లీంలతో పోరాడి విజయనగర సామాజ్ర్యాన్ని కాపాడానికి ప్రయత్నం చేసిన వారిలో ప్రధానుడు సాళువ తిమ్మరుసు.

## ప్రబంధ రచనకు దారి తీసిన పరిస్థితులు :

విజయనగర రాజులలో ముఖ్యంగా శ్రీకృష్ణదేవ రాయలుకాలంలో హిందూ - మహామ్మదీయ రాజ్యాల మధ్య, హిందూ - హిందువుల మధ్య , మహమ్మదీయ - మహామ్మదీయ రాజ్యల మధ్య నిరంతరం సంఘర్షణలు నిత్యకృత్యమైనాయి, ప్రజ జీవితంలో కూడా అస్థిరత్వం ఎక్కువ అయ్యింది. అందువలన భౌతికవాంచలు వీలున్నంత వరుకు ఎక్కువగా అనుభవించాలనే దృక్పథం ప్రజలలో ఏర్పడింది. అందుకు అనువైన పరిస్థితులు కూడా ప్రజలను విలాసవంతంగా జీవించే అవకాశాలను కల్పించాయి. అందువలన భోగలాలసత ఆనాటి ప్రజా జీవితంలో ప్రధాన భూమికగా చోటుచేసుకుంది. ఆనాటి

ప్రజాజీవితంలో వీర శృంగారాలు విడదీయరాని భాగాలుగా కలసిపోయాయి. ఏ కాలపు సాహిత్యం అయిన ఆనాటి ప్రజాజీవితాన్ని వారి మనోభావాలను చిత్రించడం ప్రధానంగా ఉంటుంది.ఇలా విజయనగం కాలం నాటి ప్రజాజీవితం, వారిభావాలు ఆనాటి కవుల మీద కూడా విపరీతంగానే ప్రభావితం చూపాయి.

మరోవైపు ఆనాటి ప్రజాజీవితంలో ఏర్పడిన వేగంవల్ల సుదీర్ఘమైన పురాణాలను, ఇతీహాసాలను ఆస్వాదించే ఓపిక బహుశా తగ్గి ఉండవచ్చు. అందువల్ల 'సూక్ష్మంలో మోక్షం' లా కథైక్యంతో రసానందాన్ని కలిగించగల ప్రబంధాలే ఆనాడు ఆదరణీయమైనాయి. ఈ లక్షణాలకు అనుగుణంగా ఆనాటి ప్రబంధాలు వెలువడినట్లు భావించవచ్చు. అంతేకాక ఆ కాలంలో అనేక మంది ఉద్దండులు అయిన కవులు రచించిన కావ్యాలు కూడా అత్యంత ప్రజాదరణ పొందినట్లుగా తెలుస్తుంది. ప్రతి కావ్యంలో కూడా ఆనాటి ప్రజాజీవితానికి సంబందించిన అనేక ఆనవాళ్లు కనిపిస్తాయి. ఆనాటి కవులు కూడా రాజుల ప్రోత్సాహం ఎక్కువగా ఉన్నందువలన ఆనాటి సాహిత్యం కూడా విస్తృతంగా వెలువడడం కాక ఆనాటి కాలాన్ని సాహిత్యంలోను , చరిత్రలోను స్వర్ణయుగంగా లిఖించదగినట్లుగా వెలువడింది.

ఈనాటి యుగంలోని వేగం వల్ల సుదీర్ఘమైన కావ్యాలకు బదులు చిన్న కథలుగా, చక్కని వర్ణాలతో ఆహ్లాదకరమైన ప్రకృతి సౌందర్యాన్ని దర్శించే విధంగా తీర్చిదిద్దినందువలన అవి విశేషమైన ప్రాదాన్యతను పొందాయి. ఇంకా ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా సుదీర్ఘమైన పురాణాలకు బదులు సంక్షిప్తాలయిన ప్రబంధాలు రచింపబడి ఉంటాయి. రాయలకాలంలో సాహిత్యాన్ని పరిశీలిస్తే వాటిలో ప్రధానంగా వీరత్వంతో పాటు రసికత, భోగలాలసత, శృంగార కాముకత మొదలయిన లక్షణాలు ఎక్కువగా చోటుచేసుకున్నాయని భావించవచ్చు. ఈ లక్షణాలే ప్రబంధాల ఆవిర్భావానికి, విశిష్టతకు తరువాత కాలంలో అనేక విమర్శలకు కారణాలుగా అయ్యాయని భావించవచ్చును.

**ముగింపు :**

ఇలా 16వ శతాబ్దం అటు సాహిత్యపరంగాను, ఇటు చరిత్ర పరంగాను ఎంతో కీర్తిన్ని పొందినట్లుగా తెలుస్తుంది. విజయనగరరాజులు గాని ఆనాటి ప్రజానీకంగా గాని ఏది అయితే జరుగుతుందని ఊహించారో అది ఆ తర్వాత అతి కొద్ది కాలానికే సంభవించింది. విజయనగర రాజులు ఒక వైపు సాహిత్యాన్ని మరో వైపు దేశాన్ని కాపాడుకుంటు, విస్తరించికుంటూ బహుమ్మనీ రాజులతో తమదైనా నేర్పుతో వ్యవహరించినా చివరకు అప్పటి వరకు కలహించుకున్న సుల్తాలను రాజులు అందరు ఏకమై ఒక్కసారిగా క్రి.శ 1565లో విజయనగరంపై దండెత్తారు. కృష్ణానదీ తీరంలో రాక్షస - తంగడి అనే గ్రామాల వద్ద విజయనగర సైన్యానికి, ముస్లీం సైన్యానికీ ఘోరమైన యుద్ధం జరగడం చివరకు ఆ యుద్ధంలో హిందువులు రాజులు ఓటమి పాలు అవ్వడంతో దేదిప్య మానంగా వెలుగొందిన విజయనగర సామ్రాజ్యం భగ్నమైంది అప్పటి వరకు తెలుగు సాహిత్యంలో విశేషమైన ప్రఖ్యాతి చెందిన ప్రబంధ సాహిత్యం కూడా అవసాన దశకు చేరి దక్షిణాంధ్ర యుగ సాహిత్యం వైపు పయనించింది.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య చరిత్ర - తెలుగు అకాడమి
2. ఆంధ్రదేశ చరిత్ర- సంగ్రహం- మల్లంపల్లి సోమశేఖర శర్మ
3. ఆంధ్రసాహిత్య చరిత్ర - పింగళిలక్ష్మీకాంతం
4. తెలుగు చరిత్ర - సంస్కృతి - తెలుగు అకాడమి

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# తెలుగు సాహిత్యంలో సేద్యం - కర్షకుడు

- జి. సుకన్య అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, బి.జె.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నారాయణగూడ, హైదరాబాద్.

భారతదేశం కర్మభూమి, వేదభూమి, కర్షకభూమిగా ప్రసిద్ధమైంది. ఆర్థికశాస్త్రం భారతదేశాన్ని వ్యవసాయ దేశంగా తెలియజేస్తూ నూటికి 70% ప్రజలు వ్యవ సాయంపై ఆధారపడి జీవిస్తున్నారని అభివర్ణించింది. ప్రపంచంలో భారతీయత, భారతీయ సంస్కృతి ప్రఖ్యాతం కావడానికి ప్రధాన కారణం గ్రామీణ సంస్కృతి. ఆ సంస్కృతికి మూలకం వ్యవసాయం. ఆ వ్యవసాయాన్నే జీవనాధార వృత్తిగా మలుచుకుని జీవనం సాగించేవాడే రైతు. "రైతులు దేశానికి వెన్నుముకలు" అని గాంధీ గారి మాటలు అక్షరసత్యం.

'గురజాడ' అన్నట్లు "తిండి కలిగితె కండగలదోయ్" అనేది వేదమంత్రంలా తెలుగు నాట ప్రతిధ్వనితం అవుతోంది. అలాగే "బంకించంద్ర ఛటర్జీ" సుతించిన వందేమాతరంలో "సుజలాం సుఫలాం" అనేది వ్యవ సాయం అర్థంలో మనం అన్వయించుకోవచ్చు.

ఉపనిషత్తులు "పృథివ్యాంత్రీకరత్నాని జలమన్నం సుభాషితమ్" తెలియజేశాయి. అంటే భూమి యందు అన్నం, జలము, సుభాషితమ్ అనే మూడు రత్నాలున్నట్లు తెలియజేశాయి. శాస్త్రంలో మరింత లోతుకు వెళ్ళి పరిశీ లిస్తే పరుశురాముడు భూమినిస్తాడని, కుబేరుడు విత్తనా లిస్తాడని, బలరాముడు నాగలిస్తాడని తెలియజేసిన విష యాలు తేటతెల్లమౌతాయి. అంతేకాకుండా జానపదుల భాషణలో పార్వతీదేవి శివుని భిక్షాటనం చేయడం వల్ల నలుగురిలో నగుబాటుగా ఉందని, కావున దానిని మానేసి వ్యవసాయం చేయమని చెప్పినట్లు తెలియ వచ్చింది. (ఈ విషయానికి ఆధార గ్రంథం 'రైతు రామా యణం" వానమామలై జగన్నాథాచార్యులు గారు).

పంచభూతాలలో పేర్కొన్న భూమి ద్వారా అందబడే ఫలం, వ్యవసాయం ద్వారానే సంక్రమిస్తుంది. అందువల్ల వ్యవసాయ వృత్తి సర్వదేశాలలోనూ, సర్వకాలాలలోనూ సర్వజనుల చేత స్తుతింపబడింది.

### "ఋగ్వేదంలో" వ్యవసాయం గురించి :

"అగ్రేవాపీ, సాంద్రవాపీ, గోపోషీ బీసంగ్రహీ
సాయం ప్రాతః, క్షేత్ర దర్శి ప్రళయేసి నవస్యతి"
(ఋగ్వేదం మూడవ కాండం 14వ సూత్రం)

నీటి వసతి, గోవులను పోషించడం, విత్తనాలు చల్లడం జాగ్రత్త చేసుకొని సరైన కార్తెలో చల్లడం, ఉదయం, సాయం కాలాలలో పొలం చూసుకోవడం చేసినట్లయితే ఎటువంటి క్లిష్టపరిస్థితులు వచ్చినను భయముండదు.

### వ్యవసాయం అర్థం :

కృషి, సేద్యం, యత్నం

వైశ్యవృత్తి, కర్షణం దున్ని పండించడం, ఉద్యోగం, కరినము, సేద్యం అని తెలుగులో అంటారు.

### వ్యవసాయం నిర్వచనము :

"పులకరించి భూపతి రామచిలుకయ్యె
హుంకరించి యాబోతులు అంకె వేసె
నాగలిని బట్టి కృషికుడు నడుముగట్టె
నాశలుప్పొంగి పాటె వర్షాగమమున"

అని వ్యవసాయానికి నిర్వచనం చెప్పారు. 'డా॥ పల్లా దుర్గయ్య' గారు "గంగిరెద్దు" కావ్యంలో.

జీవించడానికి ముఖ్యంగా అవసరమయైన ఆహార మును ఇచ్చే కృషిని వ్యవసాయం అంటారు. ఇది శాస్త్రీయ, సాంఘిక, ఆర్థిక విలువలు కలిగిన కళ. "జీవించ డానికి ముఖ్యావసరమైన ఆహారమును సమ కూర్చు కృషి వ్యవసాయం. బతకడానికి కుటుంబంతో కలిసి భూమి నుండి పంటను పండించి చేసే వ్యవ సాయాన్ని వృత్తి అంటారు.

"అన్నాద్భవంతి భూతాని" అని గీతావాక్యం. ఆహారం వల్లే అన్నీ జీవులు పుట్టి పెరిగి జీవిస్తున్నాయి. అలాంటి అన్నాన్ని పండించేది రైతే. కాబట్టి రైతు జీవనాధార వృత్తిగా వ్యవసాయాన్ని కల్గివుండి కుటుంబ పోషణకు ఉప యోగ

పడేటట్టు పంటను పంటను తనవంతు బాధ్యతను నెరవేర్చుకుంటున్నాడు.

వ్యవసాయ ప్రారంభానికి హస్త, చిత్త, స్వాతి, ధనిష్ట, మఖ, అశ్వని నక్షత్రాలతోపాటు, బుధ, గురు, శుక్ర వారాలు అనుకూలం అని కూడా జ్యోతిష్యగ్రంధాలు తెలియజేస్తున్నాయి. పంటల సమృద్ధి సంవత్సరములు విభవ, శుక్ల, ప్రజాపతి, చిత్రభాను, తారణ, పార్థివ, నందన, శుభకృతు, శోభకృతు, పరాభవ మొదలైనవి వ్యవసాయం సమృద్ధి కావడానికి దోహదపడె సంవత్స రాలుగా కాలమానం తెలియజేసింది. ఏతం ఎత్తడానికి బుధ, గురువారాలు, కుప్పలు వేయడానికి మూల, శ్రవణ, రోహిణి, ధనిష్టలు, నూర్చడానికి ఆరుద్ర, మఖ, మూల నక్షత్రాలు అనుకూలంగా తెలియజేసిన ఫలాలపట్ల రైతులు అనాధిగా విశ్వాసం కలిగి ఆ విధంగానే వ్యవ సాయం చేసి సమృద్ధి పొందారు. పొందుతున్నారు. ఈ విధంగా శాస్త్రాలు వ్యవసాయాభివృద్ధికి దోహదపడె అనేక అంశాను ప్రస్తావించాయి.

## రైతు అర్థం :

రైతు అనే పదానికి కృషకుడు, కృషాణుడు, కర్షకుడు, సేద్యగాడు కృషీవలుడు, రైతు రయితీ, పంటకాపు, దున్నేవాడు, వ్యవసాయం చేసేవాడు కృషికుడు. పంట కాపు, కృషీవల.. దున్నకొని జీవించేవాడు కర్షకుడు, సేద్య గాడు, వ్యవసాయదారుడు, అన్నదాత, భూమిపుత్రుడు, భూమిబిడ్డ, మోతుబరి అనే అర్థాలున్నాయి.

## శాసనాల్లో రైతుల వ్యవసాయ ప్రస్తావనలు :

''నివేద్యానకు బియ్యము నంది తూమున తూమెండు. నెయి సోలెండును, కూరలు మూండును, పెరుగు మానెండు'' విష్ణువర్ధమాన మహారాజు కూతురు ఒడయదేవి అమ్మగారు తమ పురుషుడైన కోణగణపద్దేవ రాజుకు పుణ్యంగా దీపావళి మహోత్సవవానికి బ్రహ్మలకి పెట్టిన క్షీరం పదివుట్లతోపాటు యివి కూడా దానం చేసింది. ఇవి రైతుల కుటుంబాలను గుర్తుచేస్తాయి.

''కృష్ణరేవడు అంటే.. నల్లరేగడి భూమి'' క్రిష్ణరేవడు భూమి పదిపుట్లను.. నిచ్చితిమి''. మహామండలేశ్వర చూర బల్లిరాజు తన తండ్రి చూరబల్లి రాజునకు ధర్మంగా నల్లరేగడి భూమి ఇచ్చినాడు. నల్లరేగడి పంటలు బాగా పండుతాయి.

ఇక సాహిత్య విషయానికి వస్తే వ్యవసాయాన్ని గురిం చిన విషయాలను కవిత్రయ భారతంలోనూ, భాగ వతంలోనూ మరియు శతక సాహిత్యంలోనూ ప్రస్తావిం చడం జరిగింది. శ్రీకాళహస్తీశ్వర మహత్యంలో ధాన్యాల గురించిన విశ్లేషణ ప్రస్తావించడం జరిగింది. వొ్రి ధాన్యం, కొర్రె ధాన్యం, ములకల ధాన్యం, సిరిధాన్యం అనే నాలుగు రకాల ధాన్యాల గురించి దూర్జటి తెలియ జేశాడు. అలాగే కృష్ణదేవరాయలు ''అముక్త మాల్యద''లో వర్ణనాత్మకంగా వ్యవసాయ పొలాలను తెలియజేశాడు.

''తల భక్షచ్చట గ్రుబ్బి బాతువులు కేదారంపు గుల్యాంతరస్థలి నిద్రింపంగ జూచి'' అంటారు.

దీనర్థం పొలాల్లో వరిమళ్లకు కాలువలు తీశారు. ఆ కాలువల మధ్య ఉదయ సమయంలో జాతులు తమ రెక్కల సందుల్లో తలలు దూర్చి నిద్రపోతున్నాయి అని చమత్కారించాడు.

శ్రీకృష్ణదేవరాయులు (1474-1530) ''అముక్త మాల్యదలో'' ''పంటచేల వర్ణన''.

''గూండ్లకై శాలిమంజరుల్ గొనుచు మూగి
యంబరంబున బఱచుకీరాళి వొలిచె
బసరు టొంటొంటి యాకుతో బందబాణి
ఛేదభయమున నెగసిన చేలనగ''

వరిచేలు పండినవి. వరి మొక్కలనుండి ధాన్యపు గుత్తులు వ్రేలాడుచున్నవి. చిలుకలు ధాన్యపు గుత్తులను గొణికి యెఱ్ఱని ముక్కులతో గఱచి పట్టుకొని యాకాశముపై గుంపులు గుంపులుగా గూండ్లకు జేరు చున్నవి. అది రాబోవు కోతలకు భయపడి వరిచేలు నింగికెగసి పాఱిపోవుచున్నట్లున్నది.

కరుణశ్రీ ''జంధ్యాల పాపయ్య శాస్త్రి'' గారు రైతుల నిట్లు వర్ణించారు.

నిండువేసంగిలో మండుటెండలందు
కష్టపడి కర్షకులు రాల్చు ఘర్మజలము
ఫలముగా మారె నేటికి పొలమునందు
బలము ప్రజలకు మన కృషీవలుని హలము.
(కరుణశ్రీ, బుద్ధచరిత్ర)

ఈ విధంగా వేదాలు, పురాణములు, ఇతిహాసములు కావ్యములు పైరు పంటలను ఎక్కువగా వర్ణించాయి.

రైతుకు గుట్టలు, చెట్లు, పనులు, పొలాలు ఇవే సర్వస్వం. అని తెలియజేస్తూ 'గంగుల శాయిరెడ్డి'

గుట్టలు, కుల పర్వతముల్
చెట్టులును పుట్టలును నదులు చెఱువులు వాగల్
పిట్టలు పశువులు కనకపు
గట్టులవలె కర్షకులకు కల్పద్రుమముల్
(కాపుబిడ్డ గంగులశాయిరెడ్డి)

'ఎఱ్ఱాప్రెగ్గడ' తన "హరివంశ కావ్యం"లో కూడా ఇదే విధంగా గొల్లవారికి కొండలు, కోనలూ దైవాలని కీర్తించాడు.

కానలలో చరించి గిరి కందరలన్ వసియించి గోవులన్
మానుగబెంచి వీని వలనన్ బ్రతుకొంది మనన్ సుఖంబుమై
భూనుత యున్నవారమటు బుద్ధి నెఱింగిన నెల్లభంగులన్
కానల కొండలుంబసులు గాదిలి వేల్పులు గొల్ల వారికిన్.

వేమన పద్యంలో పంటల ప్రస్తావన.

వెలయభూమి తల్లి విత్తనమటు తండ్రి
పంటలరయి సుతులు పాడిపరము
ధర్మము తన పాలిదైవము సిద్ధము.

రైతు మట్టినే నమ్ముకుని, ప్రకృతితో తన అనుబంధాన్ని పెంచుకుని, ప్రకృతిలోని జంతువుల పట్ల మమకారాన్ని పెంచుకుని, ఆ ప్రకృతిలోనే తాను జీవించాలని, తన కుటుంబాన్నీ, యావత్ప్రపంచాన్నే జీవింపజేయాలనే తపనతో తన ధనాన్ని, శక్తిని, యుక్తిని, మనస్సుని భూమిపై నిలిపి వ్యవసాయంపై దృష్టిని సారించాడు.

"నార్ల చిరంజీవి" భూమిని కన్నతల్లితో పోలుస్తూ

'కన్నతల్లివోలె కాపాడుచుండును
మూడు వేళలందు భుక్తిపెట్టు
పంటసిరులనిచ్చు బంగారు గడ్డరా
తెలుగు పొలములన్న తెలుగు బిడ్డ!'

"తెలుగుపూలు" అనే సంకలనంలోనిది సంప్ర తేది. 1977

"దాశరథి" దృష్టిలో తెలంగాణ అంటే శ్రామికులు, కర్షకులే, కర్షకుల కష్టాలను "తెలంగాణ తల్లి శీర్షిక" క్రింద వ్రాసిన పద్యం.

"ప్రాణములొడ్డ ఘొర గహనాటవులన్ పడగొట్టి మంచి మా
గాణములచే సృజించనెముకల్ మసిజేసి పొలాలు దున్నిభో
షాణములన్ నవాబునకు స్వర్గము నింపిన రైతుదే తెలం
గాణము రైతుదే, ముసలి నక్కకు రాచరికమ్ము దక్కునే"

పంటపొలాల్లో తెల్లవార్లు నిదుర కాచి, వేకువనే ఇంటికి వచ్చి చల్ది మెతకులు తిని తినగానే పనులు వెంటబడగా తిరిగి అడవులను బట్టే తెలంగాణ రైతుల సాధక బాధకాలను చక్కగా వర్ణించాడు. "మంజీరా" అనే ఖండికలో. "అతడు నేలదున్ని బ్రతుకంతయు పస్తులు పన్నరైతు మా పోతనయేమో" అని తెలంగాణ రైతు ద్రారిద్ర్యాన్ని నొక్కి చెబుతాడు.

చేనేత వృత్తిలోగా వ్యవసాయ వృత్తిలోనూ ఇంటిల్లిపాది పనిచేస్తారు. భార్యాభర్తలు కలిసి పనిచేసే విధానం చెప్పుకోదగింది.

దట్టంపు చెట్టుల కొట్టి కుప్పలు వేయ
నారాసులను గాల్చ నతివవచ్చు
మిట్ట పుట్ట ద్రవ్వి మట్టంబు సేయగా
పుర్వు పుట్రల జంప బోటివచ్చు
మదపు టెద్దులు గట్టి యదనుపై దున్నగా
విత్తనంబు వేయ వెలదివచ్చు

పైరుచుట్టు వెలుగు పలుమారుపెట్టగా
గడ్డిగాదము దీయ కాంతవచ్చు
ఇతర కార్యాదులను భర్త వెతికి సేయ
మంచెపై నెక్కి గాచునా చంచలాక్షి
పంట పండించి క్రమముగా పంచిపెట్టు
దంపతులపూల పూజించి దండ మిడుదు
'గంగిరెద్దు' - డా॥ పల్లా దుర్గయ్య

కూలీనాలీ చేసుకొని జీవించే స్త్రీ వడ్లను దంచె విధానాన్ని కూడా "పల్లాదుర్గయ్య"గారు ఎంత సహజంగా వర్ణించాడో.

భార్య భర్తతో తాను చేసే పనులను గూర్చి పలికే సందర్భం :

"దంచెద, చెర్గిపోసెద, తాల్చెద, కొడెద, నేమి పోసెదన్
మంచిగ పోటు పెట్టెదను, మల్చెద, జల్లెడ త్రిప్ప నేరుతున్
దంచిన బియ్యమున్ చెఱిగి తౌడును నూయువేణు చేసిజ
ల్లించి వరమ్ము ముక్కలెడలించెద నల్కల నేణి పోసెదన్"

ఎదిగిన మనిషిని భూమికి గల అవినాభవ సంబంధాన్ని కొంతమంది ఆధునిక కవులు గుర్తించారు. భూమికి, మనిషికి ఉన్న సృజనాత్మక సంబంధాన్ని వారి రచనలలో ఆవిష్కరించారు.

భూమి, విత్తు అందులోంచినే పుట్టుకొస్తా
భూమి ఒక నక్షత్ర పుష్పం అందులోంచినే
భూమి ఒక నయనం, అందులోంచి నే దృష్టిసారిస్తా
మట్టి చరిత్ర చరిత, మట్టి మనిషి చరిత్రే చరిత్ర
మట్టికన్న బలమైందీ, ప్రియమైందీ ప్రాణప్రదమైందీ
సువాసన చరితమైందీ, ప్రియమైందీ ప్రాణప్రదమైందీ
సువాసన చరితమైందీ మరేదీలేదు
అందుకే మట్టి నా జీవితం - నా అనుభవం, నా స్వప్నం

(కె. శివారెడ్డి మోహనా! ఓ మోహనా!)

రైతుగానీ, కూలీలుగానీ, ఆరుగాలం ఏ మట్టిలో కష్టపడుతుంటారో అదే మట్టి వాళ్లకు ప్రతిఫలాన్నం దిస్తుంది. కాబట్టి కర్షకుడు పొలాన్ని తన ప్రాణంతో సమానంగా చూస్తాడు. దాంతో వాళ్లమధ్య ఒక సజీవ సంబంధం ఏర్పడుతుంది.

"భూమి నా పానం రా! దాన్ని అమ్మేది అంటే తల్లిని అమ్మినట్టేరా అన్పిస్తుంది."

("మన్నుతిన్నమనిషి కథ" చిలుకూరి దేవపుత్ర)

రైతు యొక్క తొలి పోరాటం ప్రకృతిలోనే మొదలవుతుంది. మన వ్యవసాయం ఎక్కువగా వానమీదనే ఆధార పడి వుంది. ఏ ప్రాంతంలోనైనా గ్రామ జీవితంలో అస్త వ్యస్త పరిస్థితులు ఎక్కువగా కన్పిస్తాయి.

"బతుకును బతికించే, నిలబెట్టే, కదిలించే కీలక మూలకం" అన్నారు కవి.

(దర్భశయనం శ్రీనివాసాచార్య)

కథా సాహిత్యంలో కూడా వ్యవసాయ రంగాన్ని ప్రస్తుతించింది. అనేక కథలు వ్యవసాయపరంగా చోటు చేసుకున్నాయి. నవలా సాహిత్యంలో డా॥ కాలువ మల్లయ్య, భూమి పుత్రుడు, నేలతల్లి నవలలు, వ్యవసాయ సంబంధ విషయాలనందించాయి. తెలుగునాట ఎన్నో నవలలు వచ్చాయి. వస్తున్నాయి.

తెలుగు సాహిత్య ప్రక్రియలు విశ్వవిఖ్యాతమైన హైకు, నానీలు, రెక్కలు, వ్యంజకాలు వంటి ప్రక్రియలు కూడా వ్యవసాయ విషయాలను స్పృశించాయి.

తెలుగు చలన చిత్రాలలో వ్యవసాయ సంబంధ పాటలు కోకొల్లలుగా కన్పిస్తాయి. జానపద కవిరాజు కొసరాజు గారు వ్రాసిన "ఏరువాక సాగారో" అన్నపాట ఏనాటికీ తెలుగునాట ప్రతిధ్వనిస్తూ ఉంటుంది.

అలాగే డా॥ సి.నా.రె గారు "దేవుడు సృష్టించాడు లోకాలు ఈ మనిషే కల్పించాడు భేదాలు" అన్న పల్లలవి గల పాటలో

పంచెగట్టి భూమిలో దిగితె
పేదా బిక్కి బేధముండదు
వొళ్లువంచి చాకిరికిలొంగితె

నీదినాదని వాదముండదు
రైతే నాగలి పట్టకపోతే
ధన ధాన్యం పండించక పోతే
తింటానికి తిండెక్కడిది
మండె ఆకలి డొక్క మాడుతది

అని రైతును వ్యవసాయ మూలాధారిగా అభివర్ణించారు. అలాగే "తోడి కోడళ్లు" సినిమాలో "శ్రీశ్రీ" వ్యవసాయం అందరూ కలిసి చేస్తే కమ్మని ఫలసాయం ఇస్తుందంటారు.

జానపదుల మాటపాట వ్యవసాయం, వారు మన కందించిన జ్ఞాన భాండాగారం జ్ఞానసాగరం. సామెతలు, పొడుపు కథల రూపంలో అందించారు. ఉదా : సామెతలు

1) చిత్త స్వాతులు కురియకుంటే చిగురుటాకులు మాడిపోవును.
2) తల్లిని నమ్మినవాడు ధరణిని నమ్మినవాడు చెడడు.
3) దూడలేని పాడి దుఃఖపుపాడి
4) మడికి గట్టు ఇంటికి గుట్టు ఉండాలి
5) ఉత్తర ఉరిమితె ఎత్తరగంప
6) ఆరుద్రలో అద్దెడు చల్లితే పుట్టెడుపండును
7) క్షేమం కోరినవాడు సేద్యం చేస్తాడు
8) ఏతాము పాటకు ఎదురు పాటలేదు.

దేశ పురోభివృద్ధికి సేద్యం కీలకాధారం, జనాభాలో సగానికిపైగా వ్యవసాయం దాని ఆధారిత వృత్తులోనే జీవిస్తున్నారు. ప్రపంచ దేశాల్లో వ్యవసాయం, అనుబంధ వ్యాపకాలను ఓ వృత్తిగా గాక, వ్యాపారంగా పరిగణిస్తారు. పంటలతో పాటు అందుకు అవసరమైన విత్తనాలు, రసాయనాలు, పరికరాలు, పంటశుద్ధి చేసే ఆహారంగా రూపుదిద్దడంలో పాలుపంచుకునే వ్యవస్థలన్నింటినీ వ్యాపారసరళిలోనే నిర్వహిస్తారు. అంతర్జాతీయంగా సేద్య ఉత్పత్తులు, ఆహారశుద్ధి వంటివి అనేక పరిశ్రమలకు ఆధారంగా భాసిల్లుతున్నాయి. సేద్యాన్ని వ్యాపార దృక్కోణంలో కాకుండా తరతరాల వృత్తిధర్మంగా పరిగణించడం భారత్‌లోనే జరుగుతోంది.

వ్యవసాయం వృత్తిగా సాగే పరిస్థితులనుండి వ్యాపారంగా మారితేనే రైతులు మనగలుగుతారు. సాగు ఖర్చులు తగ్గించుకోవడం, ఉత్పత్తులను ధర వచ్చినప్పుడే అమ్ముకోవడం, లాభసాటిగా ఉంటేనే పెట్టుబడులు పెట్టుకోవడం, లాంటి వాణిజ్య సూత్రాలను పాటించినట్లయితే వ్యవసాయానికి మంచిరోజులొస్తాయి. కాబట్టి దానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకకరించవలసిన అవసరం ఎంతైనా వుంది.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# సమకాలీన తెలుగు నవలలలో 'తాండా' - సామాజిక దృక్పథం

- డా॥ హెచ్. కిషన్, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, బి.జె.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నారాయణగూడ, హైదరాబాద్.

**ప్రారంభం :** నూట ముప్పై అయిదు సంవత్సరాలకు ముందు పుట్టిన తెలుగు నవలలో ఒక లంబడా జాతి యువతి ప్రేమగాథ ఇతివృత్తం. అది 1872లో వచ్చిన ప్రప్రథమ నవల శ్రీ రంగరాయ చరిత్రం (గోపాలకృష్ణమ సెట్టి). 1872 మొదలుగా నేటి 2016 వరకు తెలుగులో కుప్పలుగా ఒక వెల్లువవలె, వర్షంవలె కురిసన నవలలకు లెక్కలేదు. అక్షరాభ్యాసం చేసి, తల-వల-అల-ఇలా పదాలు నేర్చి, ఆ క్రమంలో 'నవల' అన్నపదం నేర్చుకోగానే, అనుసరణీయాలు, అనువాద రచనలు... ఇలా కొన్ని వేల నవలలు ఈ నూటపాతికకుపై సంవత్సరాలుగా తెలుగులో వచ్చాయి. 2004లో వచ్చిన 'తాండా' ఒక అనువాద రచన. 2000 నుండి 2016 మధ్యలో వచ్చిన అనేక నవలలో ఈ నవల ఇతివృత్తం నేటి సమాజ అవసరాలకు దగ్గరగా ఉంది అనే ఆలోచనలతో, ఈ నవలనే ప్రధానగా స్వీకరించి, ఇందులోని పాత్రల పరిశీలనతో పాటు వర్తమాన సమాజంలో, సంస్కృతీ కరించబడిన జాతుల చేతిలో బాధల పాలవుతున్న అణగారిన వర్ణాల ఆర్తిని ఎత్తిచూపి సామాజిక న్యాయ సాధనలో, మనదైన దృక్పథాన్ని విశ్లేషణతో కూడిన వివరణలు అందించడం అనే ఆలోచే, ఈ వ్యాసరచనకు ప్రారంభం.

**ఉద్దేశ్యం :** నవల అన్న దానికి ఆనాడు వాడుకలో ఉన్న అర్థం "ఒక తెగ కథల పుస్తకవం (చిత్రకథ)", అని శబ్దార్థ రత్నాకరం నిఘంటువు చెప్తూ, ఇది దేశిపదం, స్త్రీ లింగం అంటుంది. ఒక "తెగ" అన్నదపం ఇక్కడ మనం విచారించవలసిన విషయం. విచారించడం అంటే విశ్లేషించడమని మళ్ళీ పునర్నిర్వచించుకోవాలి. కథ ఏ ప్రాంతానికి సమాజహితం కావడం. సంఘానికి ఒక మేలు కలిగించే ఉద్దేశ్యంతో కన్నడభాషలో రాయబడిన 'హవన' అనే ఈ నవలను తెలుగులో 'తాండా' అనువదించగా, దానిని పరిశీలించి ఒక జాతి చరిత్రను మానవీయ చరిత్రగా గుర్తించి, సమాజానికి, ఆ నవలలోని సందేశాన్ని అందించడమే ఉద్దేశ్యం.

## నవల నిర్వచనం :

చర్విత చరణం కాకపోయినా, ఒక తెగ కథల పుస్తకం అనే నిర్వచనం మనకు కొత్త ఆలోచనలను ఇస్తుంది. 18వ శతాబ్ది ఆరంభకాలంలో, సంప్రదాయ ధోరణులను అనుసరించి, 'నవీన ప్రబంధం, వచన ప్రబంధం' ఇలాంటి పేర్లు నవలా సారస్వతం ఆరంభంలో వాడుకలో ఉండేవి. "కేవలము గద్య పద్యాత్మకములైన తెనుగు ప్రబంధముల విశేషము లేమింపజేసి ఇది తెనుగు విద్యార్థులకు సైతం ఉపయోగించునని తలచెద" (వీరేశలింగం నవలలయందు నవలా ప్రబంధాలను వ్రాయు ప్రయత్నములను మానివేసితిని (స్వీయ చరిత్రము, 1915 రెండవ భాగం పుట 148" మొదలైన ఆధారాలున్నాయి. శ్రీ రంగ రాయ చరిత్రము కవరుపేజీపై నవీన ప్రబంధమని ఉండడంతో నవల అనే పదానికి పర్యాయపదం ప్రబంధం అని కూడా ఆనాడే వారు ఉపయోగించారనొచ్చు.

తెగ అన్న పదానికి, దేశ్యం, విశేషణం అని వివరించిన ఆంధ్ర శబ్ద రత్నాకరం అర్థాలుగా, ఎక్కుపెట్టిన అల్లెత్రాడు, నారి, వింటివనారినిలాగుట, నిడుపు, విధము, ఉపాయం, పక్షం, గుంపు, సమూహం, ప్రోవు, రాశి, జాతి అనే పన్నెండింటిని తెలియజేసింది. బహుజన పల్లివారి భాషలో (శ్రీ శబ్ద రత్నాకరం) 1) సజాతీయ సమూహం, 2) సమూహం, 3) విధం, 4) పక్షం, 5) ఎక్కుపెట్టిన అల్లెత్రాడు, 6) అల్లెత్రాటిని ఎక్కుపెట్టుట, 7) నిడుపు అనే వాటిని అర్థాలుగా వర్ణించింది, సోదాఋణలతో వివరించింది.

ఈ విషయంపై అధిక చర్చ అనవసరమని భావించి ప్రతిపాదిత అంశం 'తెలుగు నవలలలో తాండా' లేదా

వర్తమాన నవలా సాహిత్యంలో 'తాండా' అనే దానిని వివరించే యత్నం చేద్దాం. ఈ ప్రతిపాదితాంశాన్ని బలోపేతం చేసేందుకే 'నవల' అన్న శబ్దానికి ఉన్న అనేక నిర్వచనాలలో 'ఒక తెగ కథల పుస్తకం' అనే దానిని స్థూలంగా స్వీకరించవలసివచ్చింది.

**తాండా నవల నేపథ్యం :**

**1. పేరు :** కన్నడ భాషలో ఈ నవలను రచించింది శ్రీ మల్లిఖార్జున హరేమట్. ఈ నవలకు వీరు పెట్టిన పేరు "హనన". మానవశాస్త్ర సంబంధాలపై విశేష అధ్యయనాలు జరుగుతున్న ఈ రోజుల్లో, ఈ నవలలో వివరింపబడిన మానవీయ కోణాలను, సామాజికాంశాలను నవ్య విధానంలో ఎత్తిచూపుతుంది. ఒక విస్ఫోటనం వలె మన మధ్య పేలుతుంది. 'హనన' అంటే 'హత్య చేయడం లేదా చంపడం' ఎలాగో, 'హనన' అంటే హోమం అని అర్థం. హోమంలో దహింపజేయడం ఉంటుంది. హవిస్సును లేదా సమిధలను హోమగుండంలో వ్రేల్చి దేవతలకు అర్పించడం అంటే "హననం". సమాజంలో వర్గ, వర్ణ వివక్షతకు హననం సరైన సంచార జాతులలో ఒకటైన లంబాడా జాతిని హత్య చేయడం హననం, దైవ సమర్పణ అనే సంస్కృతీకరింపబడిన భాషలో ధనిక జాతులు అంటించి, దహనం చేయడం 'హననం'. ఈ నవలకు ఇంత నేపథ్యం ఆలోచించిన శ్రీమల్లిఖార్జున హిరేమఠ్ 'హవన' అనే సార్ధక నామముంచాడు. తెలుగులో భావసారూప్యత సాధించడం కోసం మరింత సులభంగా పాఠకులకు చేరువ అయ్యే ప్రయత్నంలో భాగంగా అనువాదకులు జయశ్రీ మోహన్‌రాజ్, యస్. మోహన్‌రాజ్ గార్లు, 'తాండా' అనే పేరు స్థిరం చేశారు. 'కొండ అద్దమందు కొంచమై కనిపించినట్లు' సూక్ష్మంలో మోక్షం లాగా సంపూర్ణ నవలాంశానికి, వర్తమాన సమాజ ధోరణులకూ, ఈ పేరు ఒక బుల్లెట్.

నిజానికి నవలలో కథనమంతా హవనతాండా అనే చోట జరిగిన కథ కనుక ఇది ఒక ప్రాంతనామం. ఊరి పెద్దలు చెరువు తవ్వేముందు హోమం చేశారు. దాంతో చెరువు నిండింది.

చెరువు తవ్వడం కోసం పనిచేసిన కూలీలు ఉండే చోటు 'హవనతాండా' ఊరివాళ్ళంతా ఒక శివాలయం నిర్మించుకుని కల్లేశ్వరుడిగా పిలిచి, గ్రామనామాన్ని కల్లూరు" అని పిలుచుకున్నారు.

సమాజంలోని ద్వంద్వనీతిని 'తాండా' పేరే ఎత్తి చూపుతుంది. వారు సంచార జాతులవారు, లంబాడీలు. 'ఇవ్వాళ ఇక్కడ, రేపు యెక్కడో' అనే సంస్కృతీకరింపబడిన జాతుల బలీయ నిర్వచనానికి అనుగుణంగా ఆ పేరు ఆ పేరు కూడా శాశ్వతం కాదని, ప్రస్తుతం సోమాల్యుడు, నాయకుడు కనుక ఈ తాండా పేరు "సోమాల్యాతాండా". ఇది ఆధునిక సమాజ దృక్పథం ఈ ధోరణి మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఇతర పాత్రలు :**

**1.** బసప్ప : నవల మొదటిభాగం అంతా ఇతడు మనకు చెప్తున్నట్టుగా ఉంటుంది. ఇతడు తండాకు వచ్చిన మాస్టరు. తండా మొత్తం మీద చదువు వచ్చిన వాళ్ళవరూ లేరు. తండా నాయకుడు సోమాల్యుడికి మాత్రం కొంచెం సంతకం చేయొచ్చు. తండాలోని పిల్లలకు పెద్దలకు ఎలాగైనా చదువు చెప్పాలని తాపత్రయపడతాడు బసప్ప. పదిమందితో మొదలై చివరకు పాతికకు చేరుతుంది బడిలోని వారి సంఖ్య స్నేహితులు, ఇతడికి ఉద్యోగం వచ్చిందని తెలియగానే, 'తాండాలో రాకుండా ఉంటే బాగుండేది' అంటారు. బసప్ప మాత్రం 'అది ఎక్కడ వచ్చినా, సిద్ధంగా ఉన్నాను చేయడానికి' అంటాడు. తండాలో వ్యక్తులు "పిల్లల్ని బళ్ళో వేస్తే మట్టి తినాల్సి వస్తుంది" అంటే 'తినే మొదటి ముద్దలోనే రాయివచ్చి నట్లు' అనుకుంటాడు బసప్ప.

**2. సోమాల్యుడు :** తండ్రి సంపాదించిన కొద్ది భూమిలో పంట పండిస్తూ భార్య, రూప్లీబాయి తోడుగా తండా సంప్రదాయాలను పాటిస్తూ, అలాగే "ఆధునిక కాలానికి అనుగుణంగా చదువుకోవడం కూడా అవసరం" అంటాడు. అభ్యుదయ భావాలు కల వ్యక్తి. ఇతని మరణం నిజంగా తండాకు తీరనిలోటు. తల్లి హాన్సి ఇతడిని తీర్చిదిద్దింది. దేశాయిలు ఇతర గ్రామ ప్రజలు, మాటలు తియ్యగా మాట్లాడుతూ చేతలలో వారిలో కనిపించే మోసగుణాన్ని

గుర్తుపట్టడం ఇతనికి అలవాటయ్యేలాగా చూపింది. ఊరంతటికీ చెరువుంది. ఆ చెరువుకు దిగువ మరికొంత వర్షాధారంగా కొద్దినీరు నిలబడితే అడ్డంగా రాళ్ళూరప్పా వేసి చెరువులాగా తయారు చేసిన సోమాల్య తండ్రి, సోమాల్యకు ఆదర్శం. తన కొడుకులు హరి, లోకులను చదివించాడు. వారిలో, హరి కాలేజే చదువుకుంటాడు. బి.కాం. పాస్ అయి, జిల్లా సహకార బ్యాంక్‌లో గుమాస్తా ఉద్యోగం సాధిస్తాడు.

**3. డుగ్లీభాయి** : భర్త చనిపోయినా కూడా ధైర్యం వదలక, బతుకు తెరువుకోసం గుడుంబా తయారు చేసి అమ్మేది. ఆ డబ్బుతో తన కుటుంబాన్ని పోషించేది. స్వతంత్ర జీవనానికి ప్రతీక డుగ్లీభాయి. ఈమె కూతురు రుక్కి, డుగ్లీబాయి కష్టపడడంతో పాటు బిడ్డకు తమవైన సంప్రదాయాలు, తన కూతురును రూప్లీబాయి దగ్గరకు పంపి తీజ్ పండుగకు ఆటపాటలను నేర్పించే యత్నం చేస్తుంది. తన స్వంత బిడ్డ కాకపోయినా, పరాయి బిడ్డకు కూడా పాలు పట్టే మంచితనం ఈమెది. పోలీసులు తరుచూ, వేధిస్తున్నా సహించేది.

**4. రుక్కి** : తండ్రి చిన్నప్పుడే చనిపోయాడు. తల్లి గుడుంబా చేసి చుట్టుపక్కల వారికి అమ్మి, వచ్చిన డబ్బుతో తమను పోషిస్తుందన్న జ్ఞానం ఉన్నప్పటికీ వయసుతో వచ్చిన ఆకర్షణను తీసివేయలేకపోయింది. అందంగా ఉన్న కారణంగా, తమ గుడిసెకు తరుచుగా గుడుంబా తాగడానికి వచ్చే ప్రక్క గ్రామానికి చెందిన ''లచమ్య' అనే వ్యక్తిని ఆకర్షించగలిగింది. అతడికి ఆస్థి కూడా ఉన్న కారణం చేత, పెద్దవాళ్ళ ప్రమేయం ఉన్నా లేకున్నా వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుంటారు. ఇది మారుతున్న సమాజానికి ఉదాహరణ. లింబ్యా ఈమెకు శత్రువు. రుక్కి మరణం చివరకు బాధాకరం.

**5. లింబ్యా** : పెద్ద ఆధారం లేని పాత్ర కాని అవసరమైన పాత్ర. ఇతడు రుక్కి జీవితంలో అడుగడుగునా అడ్డుపడు తుంటాడు. ఇతడికి రుక్కి అంటే చాలా ఇష్టం. రుక్కి లచమ్యను ఇష్టపడడంతో బాధపడతాడు. తన పట్టును సాధించుకోవాలనే లక్ష్యంతో అడుగడుగునా, వాళ్ళిద్దరినీ వెంటాడుతూ, వాళ్ళు తిరుగుతుంటే చూసి, తండా నాయకులకు తన బాధ వివరించి, తండా పంచాయితీ పెట్టిస్తాడు. చివరికి రూప్లీబాయి సహాయంతో రుక్కిని పెండ్లాడతాడు.

**6. దామ్లా** : మరో చిన్నపాత్ర. సంస్కృతీకరించబడిన జాతుల దృష్టిలో లంబాడాలు అంటే, ఇదిగో వీళ్ళే అనే భావాలకు బలం కలిగించేటట్లు ప్రవర్తిస్తాడు. నిజమైన లంబాడీల ప్రవర్తనకు వ్యతిరేకంగా ఉండే ఇలాంటి వాళ్ళ వల్లనే మొత్తం తండా సమాజానికి చెడ్డ పేరు వస్తుంటుంది. పక్కగ్రామం నుండి హవన తండాకు వచ్చి, డుగ్లీబాయి గుడిసెలో గుడుంబా తాగి రుక్కితో అతిగా ప్రవర్తించి, చివరకు దొంగతనాలు కూడా చేసే, ''ఇలాంటి వాళ్ళూ సమాజంలో ఉంటారు'' అని మనకు తెలిసేలా చేస్తాడు దామ్లా.

**7. ఎంకప్ప** : మరో చిన్నపాత్ర. ఇతడు లచమ్యకు మామ. ఇతడికీ ఒక కూతురుంది. తన కూతురుంది. తన కూతురుని లచమ్యకు ఇస్తే లచమ్య ఆస్తి బైటకు పోకుండా ఉంటుందని ఆశపడతాడు. లచమ్య ఆస్తి తన స్వాధీనమవుతుందని ఆశ ఇతనికి. ఇతని పాత్ర కూడా మారుతున్న సమాజ దృష్టిని మనముందుంచుతుంది.

**8. రూప్లీబాయి** : సోమాల్యుడి భార్య ఈవిడ. మారు తున్న సమాజాన్ని అర్థం చేసుకుంటూ తమవైన సంప్రదా యాలను కాపాడుకోవాలనే తాపత్రయం ఉన్నపాత్ర. తండాలోని పెండ్లి కాని బాలికలు ఝిమ్రి, ఖేమ్లి కూతురు చంద్రి, ధూళ్ళ కూతురు లచ్చి, ఖూబ్యా కూతురు గోమ్లి. ఇంకా కొంతమందికి కలిపి తీజ్ పండుగకు ఆటాపాటా నేర్పిస్తుంది.

డుగ్లీబాయి కూతురు రుక్కి, లచమ్య ఇద్దరూ ప్రేమించుకున్నప్పటికీ ఇది ఆధునిక సమాజ భావాలకు ప్రతిబింబం అన్నప్పటికీ, తమవైన తండా సంప్రదాయా లకు అనుగుణంగా వీరిద్దరి వివాహం అంగీకార యోగ్యం కాదంటుంది. వీరిద్దరూ వేరువేరు కులాలకు చెందినవారు కనుక వివాహం కుదరదని, ఇరు పక్షాలకూ సర్దిచెప్పి, చివరకు లచమ్యను దూరం చేసి, రుక్కికు, తమ తండాకే చెందిన 'లింబ్యా' అనేవాడికిచ్చి వివాహం జరిపిస్తుంది.

**9. ధూళ్యా** : ఆలోచనాశీలి. నిజానికి కల్లూరు గ్రామం

ఏర్పడడానికి మూలం తండా. తాండాలోని వారి శ్రమ ఫలంగా చెరువు ఏర్పడింది. ఆ పిదప గ్రామం, పంటలు అన్నీ వచ్చాయి. అయితే చెరువు ఆయకట్టుకు దూరంగా ఉన్న బీడు భూములను తాము సాగుచేసుకుంటే బాగానే ఉంటుంది కానీ, "మనమంతా వాళ్ళ పొలాలలో పనిచేసే వాళ్ళం కనుక వాళ్ళకు ఎదురు తిరిగి బతకడం కష్టమే!" జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయాలు తీసుకుందాం అంటాడు.

**10. హరి** : సోమాల్య కుమారులిద్దరిలో పెద్దవాడు. తమ్ముడు లోకూ ఇంటర్ తప్పి జులాయిగా మారినప్ప టికీ, తను మారుతున్న సమాజంతోపాటు విద్య తప్పని సరి అని నమ్మి బి.కాం. పూర్తిచేసి ఒక జిల్లా సహకార బ్యాంకులో ఉద్యోగం సంపాదిస్తాడు. కలిగిన ఇంటి అమ్మాయి కమలను వివాహం చేసుకుంటాడు. మారుతున్న లంబాడా సమాజానికి ప్రతినిధిత్వంగా కని పిస్తాడు. చివరకు నగరంలో ఒక కాలనీలో నివాసిగా మారి పోయి తండాకు దూరం అవుతాడు.

ఇంకా ఝుప్రా, హీరాలాల్, ఖేమ్లి, ధూళ్ళ, ఖూబ్యా లాంటి పాత్రలతోపాటు బొంబాయిలో ఉన్న దేశాయ్ అతని కొడుకు వెంకన్న, పంచాయితీ అధ్యక్షులు నింగప్ప, మంత్రి పుట్టప్ప, ప్రాంత శాసనసభ్యుడు ఎం.ఎల్.ఏ., సిద్దప్ప ఇలా ఎన్నో పాత్రలు కథానుగుణంగా వచ్చి పోతుంటాయి.

## సంక్షిప్త కథనం :

హనన తండాకు మాల్య నాయకుడు. హాన్సి ఇతడి భార్య. సోమాల్య కొడుకు. సోమాల్య భార్య రూప్లీబాయి, మాల్య అనంతరం సోమాల్య, తండా నాయకుడు అవుతాడు. హరి, లోకూ, ఝిమ్రి వీరి సంతానం. అలాగే తండాలో ఇతర జనాభా అంతా, డుగ్లీబాయి, ఖూబ్యా, దామ్లా, ధూళ్యా, రూప్లీబాయి తదితరుల కుటుంబాలతో ఉంటుంది.

ఒక వేపచెట్టు తండాకు మూలమైన చెరువు నిర్మాణం, చెరువుతో ఏర్పడ్డ కల్లూరు గ్రామంలోనూ పంచాయితీ పెద్ద నింగప్ప - తదితరులతో ఉండి సమాజాన్ని గమ నిస్తుంటుంది.

తండాలో వచ్చే మార్పులే నవలకు ఆధారం. డుగ్లీ బాయి గుడుంబా వ్యాపారం సహించని ఎక్సైజు వ్యాపా రుల కారణంగా తరచుగా పోలీసుల రాక, స్త్రీల దురవ్యవ హారాలు అన్ని కన్నులకు కట్టినట్టు చూపించాడు రచయిత.

చెరువుకు దూరంగా ఉన్న బీడు భూముల్ని హీరాలాల్ నేతృత్వంలో తండాలోని లంబాడీలకు పట్టా భూములుగా అందజేస్తారు ప్రభుత్వాధికారులు. ఒక రెండు సంవత్స రాలలో నాలుగు పంటలు పొందిన అనంతరం, బొంబాయిలోని దేశాయి కుమారుడు వెంకన్న, గ్రామంలో గ్రానైటు ఫ్యాక్టరీ పెట్టి తిరిగి ఆ పంట పొలాలలను, ఏదో కొద్ది ధరలు ఇచ్చి తమ స్వాధీనం చేసుకుంటాడు. తండాలోని వారు తిరిగి కూలీలుగానే మిగులుతారు. అప్పుడు పంట పొలాల్లో పనిచేస్తే, ఇప్పుడు ఫ్యాక్టరీలో కూలీపని, ఈనాటి కాలంలో రాజకీయ నాయకుల సభ లకు జనాలను తోలుకురావడం కూడా ఈ నవల వర్ణి స్తుంది. అలాగే పదవి పోయిన తర్వాత వ్యక్తుల ప్రవర్తనలో మార్పుకు కూడా, కారణం చూపిస్తుంది.

గుడుంబా తయారీ, లంబాడాల అనేక వృత్తులలో ఒకటి. డుగ్లీబాయి భర్త మరణం అనంతరం ఈ వృత్తిని చేపట్టింది. కుమార్తె సహాయం తీసుకుంది. రుక్కి తన కూతురు కనుక, ఎవరినో ప్రేమించింది అని తెలిసి వాడు లచమ్యా, వేరే కులంవాడని తెలిసి, ఆ జంటను రూప్లీ బాయి సహాయంతో విడదీసి తను తండాలోని వాడైన లింబ్యాకు ఇచ్చి వివాహం జరిపిస్తుంది.

చివరకు రుక్కి ఆ వ్యాపారానికే బలి అవుతుంది. ఎక్సైజు కాంట్రాక్టరు మేనల్లుడి కామదాహానికి గురికావడం ఇష్టం లేక, గుట్టపై నుండి దూకి ఆత్మహత్య చేసుకుంటుంది.

సోమాల్య కొడుకు హరి సంపూర్ణంగా ఆధునిక సమాజ దృక్పథానికి అద్దం పడతాడు. చదువుకొని, ఉద్యోగం చేసి, కన్నవారి అమ్మాయిని వివాహమాడి, కాలనీలో నివాసం పెట్టి చివరికి కన్నవారి నిరసనకు గురౌతాడు. ఇతడి ఇంట్లోని ఆధునిక పద్ధతులను వారు జీర్ణం చేసుకోలేక పోతారు.

ఖాళీ ప్రదేశంలో, తండా, చెరువు, ఊరు, భూముల వ్యవసాయం, ఫ్యాక్టరీ నిర్మాణం, తారురోడ్డు చివరకు మిగిలే దుమ్ము... ఇలా నవల ఇతివృత్తం కొనసాగుతుంది.

సోమాల్య కూతురు ఝుమ్రి, తను ప్రేమించిన ఖీరాతో గోవా పారిపోవడం ఈ నవలలో మరోకోణం. నగర జీవితం లోని ఆకర్షణకు తండాలోని వారు ఎలా శలభాలలాగా వచ్చిపడుతున్నారో వీరి జీవితం వర్ణిస్తుంది. తండాలోని ప్రశాంతతను పోగొట్టుకున్నామన్న ఝుమ్రి ఆలోచన మనల్ని కూడా కొంచెంసేపు ఆలోచింపజేస్తుంది.

కల్లూరులో కల్లూరేశ్వరుడి గుడి ఎలాగో, హనన తండాలో సేవాలాల్ గుడి అలాగే! చివరలో సేవాలాల్ గుడి రూపురేఖలు మారిపోతాయి. బొంబాయి నుండి వచ్చిన దేశాయి కొడుకు, సేవాలాల్ గుడికి అంతా గ్రానైట్ రాయితో కొత్తగా చెక్కడంపని చేయిస్తాడు. ఈ మార్పు సోమాల్య భరించలేదు. రాళ్ళ గుట్ట ఎక్కి, ఒక క్వారీలో దూరి మందుపాతరతో పాటు పేలిపోయాడు.

"రాళ్ళు కాలుతున్నాయి, మట్టి కాలుతుంది, చెరువు కాలుతుంది. అన్నీ భగభగా కాలుతున్నాయి. మండి పోతున్నాయి" అనే సోమాల్య చివరిమాట మారుతున్న లంబాడా సంస్కృతిని చూచి, ఆవేదనతో చలించిపోతున్న వారి మాట. చిన్నకొడుకు 'లోకు', చితికి మంట పెట్టగా బంధువులంతా అనుసరిస్తారు. ఇంట్లో ప్రమిదె వెలిగించారు. దీపం కొట్టుమిట్టాడుతుంది. ఆ వెలుగు అక్కడ కూర్చున్న అతని మనసులపై పడుతుంది. ఇలా నవల పూర్తి అవుతుంది.

### కథన విధానం :

రెండు భాగాలలో నవల కథనం కొనసాగుతుంది. మొదటి భాగం అంతా బసప్ప మాస్టరు మనకు చెప్తాడు. రెండవ భాగం నలుగురు, లోకూ, ఝుమ్రీ, హరి, కసను విడివిడిగా చెప్తారు. చీమంత దీపం ఏనుగంత చీకటిని మింగేస్తుంది నిజమే కానీ, దీపం వెలిగించేదెవరు?

### తండా పురాణం :

తండా కథను సోమాల్య చెబుతాడు. "మేమంతా మునుపు రాజస్థాన్‌కు చెందిన రాజపుత్ వంశస్తులం". ఉప్పు వ్యాపారం చేసే వాళ్ళవడం చేత, లమాణ్యులు, లంబాణ్యులు అనేవారు. క్రమంగా అది లంబాడీగా మారింది. మందుగుండూ, ధాన్యం కూడా వ్యాపారం చేసేవారు. తమ తండాలో ఒక వీరనారి "జగ్గూరజమణి" ఉండేది. అంటూ ఎన్నో చెప్తాడు సోమాల్య. లంబాడా సమాజానికి ప్రతినిధి అతడు.

'మోలా' అనే మరొక మూల పురుషుడి గురించి చెబ్తూ, 'అతడు బాలబ్రహ్మచారి. రాధ అతని భక్తి సేవలకు మెచ్చి చౌగడ, పాగడ, రాయగడ్ రాజ్యాల నుండి ఒక్కో పిల్లవాడిని తెచ్చి దత్తత చేసింది. వాళ్ళే ఆ తర్వాత చౌహాన్, రాఠోడ్, పవార్ అని మూడు తెగల వాళ్ళయ్యారు అంటూ, సేవాలాల్ అనే మూల పురుషుడి కథ కూడా చెప్తాడు.

జై జై కర్తర సేవాలాల్
భీమా ధర్మణీరోపేట్, జల్యేరీ అవతారీ....

మంగళూరు దగ్గర గుత్తి ఒక స్థలం. అక్కడ బళ్ళారి అనే తాండాలో భీమ, ధర్మిణీబాయి అనే దంపతులకు సంతానం లేదు. భీమ తపస్సు చేశాడు. మరియమ్మ దేవత ప్రత్యక్షమై 'నలుగురు కుమారులు జన్మిస్తారు' అందులో పెద్దవాడికి 'సేవా' అని పేరు పెట్టి నా సేవకు వదులు అంది. అంగీకరించాడు భీమ, సేవ, హ్యాప, బద్దు, బాణ అనే ఆ నలుగురిలో పెద్దవాడే సేవాలాల్. ఇసుకతో సిరాపురీ చేసేవాడు. పన్నెండేళ్ళ తర్వాత మరియమ్మ తన సేవకై రమ్మనగా, సేవాలాల్ "వృద్ధాప్యంలో తల్లిదండ్రులను వదిలి ఎలా వచ్చేది?" అన్నాడు. అమ్మకు ఆగ్రహం వచ్చింది. సమస్తం నాశనం అయింది. సేవా తిరిగి అందరినీ బ్రతికించే ఒప్పందంతో, అమ్మ సేవకు అంకితమయ్యాడు మగపిల్లవాడికి ఆడవేషం వేసి, సంతానం కావాలి అని అడిగితే, 'తప్ప కుండా' అన్నాడు. అలాగే ఆ వేషం వేసిన మగవాడు "చింగర్య" ఆడపిల్లగా మారిపోయాడు. ఇలాంటి మహిమలు అనేకం సేవాలాల్ ప్రదర్శించాడు. దేవిగుడి ముందు ఎర్రజెండా, సేవాలాల్ గుడిముందు తెల్ల జెండా లుంటాయి. జ్ఞానం దేవి అయితే, త్యాగం సేవాభావం సేవాలాల్‌ది. అమ్మది తామసశక్తి, సేవాలాల్‌ది సాత్త్వికశక్తి. ఇదీ సంక్షిప్తంగా సేవాలాల్ వృత్తాంతం.

సన్నివేశాల రూపకల్పనలో లంబాడా సమాజంలో మారుతున్న దృక్పథం గోచరిస్తుంది. ఆచారాలు, గైరవ

మర్యాదలు, మారుతున్న సమాజంలోని మార్పుచేర్పులు, గ్లోబలైజేషన్ నేపథ్యంలో, పంట భూములు ఫ్యాక్టరీలుగా మారడం, చివరకు మలవిసర్జనలో కూడా నవ్యతపై వ్యంగాస్త్రం ఈ నవల విసరుతుంది. నాటి కాలంలో ఇంట్లో తిని మల విసర్జనకు బయటకు వెళ్ళేవారు. నేటి కాలంలో బైట తిని ఇంట్లో మల విసర్జన చేస్తున్నారు.

## ఉప సంహారం :

1. మనల్ని మనం గౌరవించుకోవడం మానరాదు. మనవైన సంస్కృతీ సంప్రదాయాలను మనం పాటించాలి.
2. మన భాషను మనం క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. ఒక్క భాష మాత్రమే కాకుండా, సంస్కృతి, సంప్రదాయాలు, లంబాడా జాతి చరిత్ర, కథనాలు, పురాణాలను అధ్యయనం చేయాలి. సేవాలాల్ గుడిని ఇతరుల పరం చేయరాదు. సోమాల్య దుఃఖాన్ని అర్థం చేసుకుందాం.
3. ఐకమత్యంతో ఏదైనా సాధించవచ్చు. లోకు, సోమాల్య రెండవ కొడుకు. ఇంటర్ తప్పినా తండాను విడువడు. అలాగే హీరాలాల్ ఎక్కడున్నా కలిసికట్టుగా ఉంటే భూమిని సాధించుకోగలం అని చెప్పి ఆచరించి సాధించి నిరూపించాడు. 'ఐకమత్యమే మన బలం'.
4. ఆధునికతను అభ్యసిస్తూ మూలాలను మరచినందు వల్ల కలిగే నష్టాన్ని ఈ నవలలోని హరి పాత్ర వివరిస్తుంది. హరి, తన తల్లిదండ్రులకు కూడా చివరలో న్యాయం చేయలేకపోయాడు. తండ్రి సోమాల్య లంబాడా భాషలో పాటపాడుతుంటే, తన భార్య కమల అతడిని నిరోధించినప్పుడు, ఏం చేయలేకపోయాడు. ఇది తప్పు. మనం మన మూలాలను మరవరాదు.
5. ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవడంతో బీడు భూములను తమవిగా చేసుకున్న తండా ప్రజలు వాటిని నిలబెట్టుకోలేకపోయారు. ఇలా అవకుండా ఉంటే బాగుండేది. అయితే మారుతున్న సమాజం అవసరాలకు అనుగుణంగా మనం మారాలి. అలాగే ప్రభుత్వ పథకాలను మనమంతా సమిష్టి బాగుపడడం కోసం వినియోగించాలి.
6. లంబాడా తదితర సంచార జాతుల వస్తు సంస్కృతులను ప్రతిబింబించే 'ప్రదర్శనలు' ఏర్పాటు చేయడం మన కనీస అవసరం. భాషా, సంస్కృతుల అధ్యయనం లేకపోవడం వల్లనే జాతీ/తండా ఇలా తన ఉనికిని కోల్పోతుంది.
7. సామూహిక సమ్మేళనాలు తండా సంస్కృతిలో ఒక భాగం, తీజ్ పండుగ, మంగళవారం గౌరి పండుగ (బలి), సేవాలాల్ ఆరాధన, పంచాయితీ సాయంత్రం... ఇలా సందర్భాలలో సమ్మేళనాలు ఏర్పాటు చేయడం క్రమంగా తగ్గిపోతుంది. ఇది చాలా చింతనీయమైన విషయం. ఈ స్థితి మారాలి.
8. అన్నింటికన్నా "నాది, ఈ తెగ, నాది ఈ తండా" అని గర్వంతో తలెత్తుకొని ఆత్మాభిమానంతో జీవించడం మన భవిష్యత్తరాల వాళ్ళకు నేర్పించాలి.
9. వివిధ దేశాలలో, ప్రాంతాలలో ఉన్న ఇలాంటి సంచార జాతుల / తెగల సంస్కృతులను అధ్యయనం చేయడం మన అవసరం.
10. చివరగా మనల్ని మనం, గౌరవించుకుంటూ, ఇతర సంస్కృతుల పట్ల కూడా సమాన భావనలతో, ఆదరణలతో కలిసిమెలిసి ఆదాన ప్రదానాలతో 'సహజీవనం చేయడం', ఈనాటి మారుతున్న సామాజిక దృక్పథం మనకు వివరిస్తున్న నిజం ఈ నిజాన్ని మనకు అనుక్షణం గుర్తుచేసే ఉత్తమ నవల తాండా.

సంచార జాతులనే రివాల్వరు నుండి ఆధునిక సమాజం వైపు దూసుకొస్తున్న తుపాకీ గుండు, ఈ తండా.

## ఉపయుక్త గ్రంథసూచి :

1. జానపద సాహిత్యం, నగరీకరణ. 2. తెలుగు జానపద గేయ సాహిత్యం. 3. తాండా. 4. జానపద విజ్ఞానం.

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# గుఱ్ఱం జాషువా "తెరచాటు" నాటకం - సామాజిక దృక్పథం

- డా॥ చుక్కా శ్యామల కుమార్, శాఖాధిపతి, తెలుగు విభాగం, ఎ.జి.కె.యం. కళాశాల, సత్తెనపల్లి.

తెలుగు సాహిత్యానికి ఆధునిక వన్నెలద్ది తెలుగు పద్యానికి జీవం పోసి తెలుగువాడి కీర్తిని ఎగురవేసిన విశ్వకవి సామ్రాట్ జాషువా. తెలుగు వాఙ్మయానికి కావలసినంత సాహిత్య సంపదను కూర్చిన ఘనుడు నవయుగ కవి చక్రవర్తి జాషువా. ఆయన సాహిత్యం అపురూపమైనది. ఆధునిక పద్యానికి ప్రాణం పోసిన తెలుగు కవి కలం నుండి ఆధునిక వ్యవహారిక భాషలో పద్య స్పర్శ లేకుండా వచ్చి సామాజిక చైతన్యం కలిగించిన అద్భుత సాంఘిక నాటకం "తెరచాటు". గుంటూరు జిల్లా వినుకొండలో 1895 సెప్టెంబర్ 28న లింగమాంబ, వీరయ్య దంపతులకు జన్మించిన గుఱ్ఱం జాషువాను తెలుగు సాహిత్య లోకానికి ప్రత్యేకంగా పరిచయం చేయవలసిన అవసరం లేదు.

జాషువా రచనలన్నింటిలోకల్లా వ్యవహారిక భాషలో 1946 సం॥లో వచ్చిన రచన "తెరచాటు" సాంఘిక దురాచారాలను తన పదునైన కలంతో పొడిచి సంస్కరించడానికి కృషి చేశారు. సంఘసంస్కరణాభిలాషతో ఆనాటి సామాజిక సమస్యలైన బాల వితంతువుల హృదయ వేదనను, సనాతన వాదుల స్వార్థపరత్వాని, బాల్య వివాహాలు, ముసలి మొగుళ్ళు, పడుచుపెళ్ళాల కన్నీళ్లు, మతమౌఢ్యాలు, ఇలా ఎన్నో దురాచారాలను కథా వస్తువుగా తీసుకొని ఎంతో హృద్యంగా సందేశాత్మకంగా సామాజిక దృక్పథంతో నాలు అంకాల నాటకంగా తెర చాటును మలిచారు. నిజంగా ఈ నాటకం గురజాడ కన్యాశుల్కమంత పేరును పొందవలసి ఉంది కాని ఎందుచేతనో అంతగా ప్రాచుర్యం పొందలేదు. అందుకే ఈ నాటకాన్ని పరిశీలించి ఇందులోని కథాంశము యొక్క స్థితిని, మానవ స్వభావాలను, అనైతికతను పరిశీలించి ఆనాటి దురాచారాలను నేటి తరానికి ఆదర్శంగా చూపించాలనే తపనతో దీనిని ఎన్నిక చేసుకున్నాను.

"తెరచాటు" సాంఘిక నాటకం. ఇది రంగస్థలం మీద కూడా ప్రదర్శించగలిగిన నిడిమి గల సందేశాత్మక నాటకం. ప్రధానంగా ఇందులో నాటక రచనాకాలం (1946) నాటి సామాజిక, మత పరిస్థితులను, ఆచార సంప్రదాయాలను కళ్ళకు కట్టినట్లు వివరించారు. సనాతన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన బ్రహ్మశాస్త్రి మడి ఆచారాలంటూ గగ్గోలు పెడుతుంటే అతని కుమారుడు ప్రమోదుడు ఆధునిక సంస్కార భావాలు కలిగి గొప్ప సంఘసంస్కర్తగా ప్రజలలో చైతన్యాన్ని కలిగిస్తుంటాడు. రెండు విభిన్న దృక్పథాలను పాత తరం నుండి కొత్త తరానికి సాగే మార్పుకు సూచికంగా రచయిత చెప్పిన తీరు బాగుంది. మానవులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఎలా వ్యవస్థను అతలాకుతలం చేస్తారో వారి స్వభావాలను చక్కగా వివరించారు.

ఈ నాటకంలో బ్రహ్మశాస్త్రి తన మూడేళ్ళ కుమార్తెకు తన 50 యేళ్ళ బావమరిదితో పెళ్ళి చేస్తాడు. ఆ పిల్లకు పదేళ్ళు వచ్చిన తరువాత కాపురానికి పంపిస్తానంటారు. ఈ మధ్యలో బావమరిది మరణిస్తాడు. బ్రహ్మశాస్త్రి అతని భార్య బుచ్చిరావమ్మ తన కుమార్తె కళ్యాణికి వితంతువు క్రతువు నిర్వహించాలనుకుంటారు. ఒకరోజు తల్లి కళ్యాణికి తల దువ్వుతూ ఇంకా కొన్ని రోజులలో నీకు జుట్టు తీయిస్తామమ్మా అని అంటుంది. తల్లి చెప్పిన మాటలు అర్థం కాక కళ్యాణి ఎందుకమ్మా? అంటుంది? దానికి నీకు పెళ్ళయింది నీ భర్త చనిపోయాడని నిన్ను విధవని చేయాలంటుంది. కళ్యాణి తల్లితో అమ్మా! భర్తేమిటి? పెళ్ళేమిటి? విధవను చేయడమేమిటి? నాకెప్పుడు పెళ్ళయింది? అని అమాయకంగా అడుగుతుంది. ఇంతటి అనాగరికమైన అనైతికమైన సంస్కృతికి ఈ సంఘటన సాక్ష్యంగా నిలుస్తుంది. ఆనాడు బాల్య వివాహాలు ఎంత భయంకరంగా ఉండేవో ఈ సంఘటన తెలుపుతుంది. ముక్కుపచ్చలారని పసిపిల్లలకు

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

పెళ్ళిళ్ళు చేసే ఆనాటి దురాచారాలను ఈ నాటకం ఎత్తిచూపింది. ఈనాటి సమాజంలో కూడా 14, 15 యేళ్ల ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసే సంఘటనలను మనం చూస్తున్నాం. ఇప్పుడే ఇలా ఉండే అప్పుడు ఇంకా ఎంత దయనీయంగా ఉండేదో కళ్యాణి జీవితం అద్దం పడుతుంది.

"తెరచాటు" నాటకంలో కామశాస్త్రి సనాతనవాది. అతను వయసుకు వచ్చిన కుమార్తెకు పెళ్ళి చేయకుండా భార్య చనిపోయిందని పడుచు వయస్సు గల రాజ్యలక్ష్మిని వివాహం చేసుకుంటాడు. కామశాస్త్రి పనుల రీత్యా బయటకు వెళ్ళవలసి వస్తే భార్యను ఇంట్లో పెట్టి బయట తాళం వేసి వెళ్ళేవాడు. ఇది ఎంతటి దురాచారమో చూడండి. ఒక సందర్భంలో రాజ్యలక్ష్మి కామశాస్త్రిని తనను ఇలా నిర్భంధించడం అనైతికమని నిందిస్తుంది. తన యవ్వన జీవితమంతా వ్యర్థమైపోతుందని బాధపడుతుంది. దానికి కామశాస్త్రి అన్నీ సమకూర్చు తున్నానని, ఇంట్లో నుండి బయటకు రాకుండా చూసు కుంటున్నానని హాయిగా సావిత్రి, సక్కుభాయి వంటి ప్రతివ్రతల గురించి చదువుకొని పాతివ్రత్య ధర్మాన్ని పాటించాలంటాడు. దీనిన బట్టి చూస్తే ఆనాటి స్త్రీల దీనస్థితి అర్థమౌతుంది. ఆనాటి సమాజంలో ఇలా ఎందరో స్త్రీలను తల్లిదండ్రులు డబ్బులకు ఆశపడి ముసలివాడికి అమ్మివేసి వారి జీవితలను బుగ్గిపాలు చేసేవారు. స్త్రీలకు సమాజంలో గౌరవప్రదమైన స్థానం ఉండేది కాదు. వారికి ఎలాంటి స్వేచ్ఛ దొరకేది కాదు. కుటుంబాలలో కూడా విలువ ఉండేది కాదు. ఇదొక సాంఘిక దురాచారంగా మనకు కనిపిస్తుంది.

ఆనాటి సమాజంలోని వ్యక్తులు తమ స్వార్థం కోసం రకరకాల ఆచారాలను సృష్టించుకొని జీవించిన వారి స్వభావాలకు ఈ నాటకం అద్దం పడుతుంది. కామశాస్త్రి తన కుమార్తెకు పెళ్ళి చేయాలనుకుంటాడు. ఆ సమయంలో బ్రహ్మశాస్త్రి గారి కోడలు శ్యామల మాయ దారి రోగంతో మరణించేలా ఉందని తెలుసుకొని వాళ్ళ ఇంటికి వెళ్ళి యోగక్షేమాలు కనుక్కొని చివరకు బ్రహ్మ శాస్త్రితో నీ కోడలు పోతే మా అమ్మాయిని మీ అబ్బాయికి చేసుకోవాలంటాడు. శుల్కం ఏమాత్రం ఇస్తావని బ్రహ్మశాస్త్రి అడుగుతాడు. దీనిని బట్టి చూస్తే ఆనాడు కొన్ని వర్గాలలో ఉన్న ఆచారాలు ఎంత నీచంగా ఉండేవో తెలుస్తుంది. పురుషుడికి ఉన్నంత స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు, హక్కులు స్త్రీలకు లేవని తెలుస్తుంది. భర్త పోయిన స్త్రీలు వితంతువులుగా మారితే భర్త చనిపోయిన పురుషులు మాత్రం భేషుగ్గా ఎంతమందినైనా పెళ్ళి చేసుకోవచ్చనే దురాచారాలను ఈ తెరచాటు నాటకం నేటి సమాజానికి చూపిస్తుంది. అందులోని అనైతికత ఎంత నీచమో చూపి ఈనాటి తరానికి గొప్ప సందేశాన్నిచ్చి సమాజంలో కనిపించే అలాంటి దురాచా లను రూపుమాపాలని కవి హితవు పలికాడు.

బ్రహ్మశాస్త్రి కుమారుడు ప్రమోదుడు తన ఆదర్శ భావాలతో సంఘ సంస్కరణాభిలాషతో తన చెల్లెలు కళ్యాణికి బాల వితంతువు క్రతువును వ్యతిరేకిస్తాడు. ఇలా స్త్రీల జీవితాలను నాశనం చేయడం తప్పు అంటాడు. దానికి కోపించిన తండ్రి సనాతన ఆచారాలను పాడు చేస్తున్నావని, నీచ కులాల సంపర్కం వలన నీకు ఇలాంటి బుద్ధులు వచ్చాయని ఇంటినుండి వెళ్ళిపొమ్మంటాడు. దీనినిబట్టి చూస్తే అభివృద్ధి నిరోధకత్వం వాళ్ళ స్వభావంలా కన్పిస్తుంది. కుల, మతాచారాల పేరిట వ్యవస్థను సర్వ నాశనం చేశారనిపిస్తుంది. కొన్ని కులాల వారిని సమాజంలో నీచంగా చూశారని తెలుస్తుంది. అందుకు నిదర్శనం కిశోర కుమారుడు.

ఇతడు ఆధునిక భావాలతో చక్కని కవిత్వం రాస్తుంటాడు. సనాతనవాదులైన కామశాస్త్రి రాయ చయనులు తెలుగుభాషలో రాసేది కవిత్వమే కాదం టారు. వ్యాకరణం, ఛందస్సు లేని కవిత్వం కూడా కవిత్వమా అని ప్రతి ఒక్కరూ కవులేనని ఎద్దేవా చేస్తారు. దీనినిబట్టి పాండిత్యమంటే కేవలం కొన్ని వర్గాల వారికి పరిమితమని ఎవరైనా ముందుకు వస్తే వారిని ఆద రించకపోగా కులాల పేరుతో దూషించేవారని తెలుస్తుంది. ఆనాడు ప్రజలలోని చైతన్యాన్ని, పాండిత్యాన్ని సంపన్న

వర్గాలు ఆదరించలేదని అందుకే మన సమాజంలో కులమత విబేధాలు విపరీతంగా పెరిగాయని తెరచాటు నాటిక చూపిస్తుంది.

ఈ నాటకంలో తక్కువ కులాలుగా చూడబడిన వారిలో చైతన్యం ఉందని కిశోర కుమారుడు ద్వారా తెలుస్తుంది. ఉన్నత వర్గాలలో కూడా ప్రమోదుడు వండి ఆదర్శనీయులు ఉన్నారని తెరచాటు నాటకం చూపి స్తుంది. ఆనాడు కాలం మారుతున్నకొద్దీ ఆధునికత ఉందని గ్రహించవచ్చు. అయితే ఈ ఆధునిక సిద్ధాంతా లను ఆనాటి పెద్దలు గౌరవించలేదు. ఇబ్బందికరమైన అనైతికమైన ఆనాటి ఆచారాలే గొప్పవిగా పాటించటం చూస్తే వారి నీచ స్వభావాలు ఎంతటి పరాకాష్టకు చేరాయో తెలుస్తుంది. తెరచాటు సాంఘిక నాటకం ద్వారా జాషువా ఆనాటి సాంఘిక దురాచారాలను, మానవ స్వభావాలను అనైతికత్వాన్ని, అలసత్వాన్ని స్వార్ధపరత్వాన్ని నిశితంగా పరిశీలించి నేటి తరానికి చూపి ఇలాంటి వ్యవస్థ ఉండకూడదని గొప్ప సామాజిక సందేశాన్నిచ్చారు. అంతే కాక ఆనాటి సమాజంలోని దురాచారాలను చూపి వాటిని ఆచరించకూడదన్నాడు.

తెరచాటు నాటకం ద్వారా జాషువా చూపిన మానవ సంబంధాలు, స్వభావాలు మనలను ఆలోచింపజేస్తాయి. సనాతన ధర్మాల చట్రాలలో స్త్రీలను బంధించి స్వేచ్ఛను హరించారు. అవిద్య, బాల్యవివాహాలను, వితంతువులకు పునర్వివాహాలు లేకపోవడం, కులాచారాలు, మత మౌఢ్యాలు, అంటరానితనం, ఆర్థిక, మానసిక, స్వేచ్ఛలేని స్త్రీల జీవితాలు ఎన్నో అవమానాలు. ఇలా ఎన్నో సాంఘిక దురాచారాలను తెరచాటు నాటకం ఎత్తిచూపింది. మనిషిని మనిషిగా గౌరవించాలని ఆనాటి స్వార్థ, మానవ స్వభావాలను వారిలోని అనైతిక సిద్ధాంతాలను కూకటి వేళ్ళతో పెకిలించాలని జాషువా "తెరచాటు" నాటకం ద్వారా చూపించాడు. గురజాడ "కన్యాశుల్కం" ఎంత గొప్ప సామాజిక చైతన్యాన్ని కలిగించిందో జాషువా "తెర చాటు" నాటకం కూడా అంతటి చైతన్యాన్ని చూపింది. ఎప్పుడైతే మనిషి తన చెడు స్వభావాన్ని మార్చుకొని మనోవికాసం కలిగి ఉంటాడో మానవులంతా సమానమనే భావాన్ని కలిగించుకొని తనలో సామాజిక దృక్పధాలను, అనైతికతత్వాన్ని అలవరుచుకుంటాడో అప్పుడే సమాజం అభివృద్ధిని సాధిస్తుందని "తెరచాటు" నాటకం ద్వారా జాషువా సమాజానికి గొప్ప సందేశాన్నిచ్చాడు.

"సర్వేజనా సుఖినో భవంతు"

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# దళిత స్త్రీ - చారిత్రక నేపథ్యం

- శ్రీమతి కె. వి. పద్మావతి, శాఖాధిపతి, తెలుగు విభాగం, వి.యస్.ఆర్. & యన్.వి.ఆర్. కళాశాల, తెనాలి.

ఆధునికత, అభివృద్ధి, సాంకేతిక సమాచార హైటెక్ నవనాగరికత, శాస్త్రజ్ఞానం గురించి మాట్లాడుతూ స్వాతంత్ర్యం, స్వేచ్ఛ, సమానత్వాల గురించి ఆయా సందర్భోచితంగా ప్రస్తావిస్తూ, ప్రపంచంతో పాటుగా మనదేశం, సమాజం ఎంతో ముందుకు పోతున్నదన్నట్లు నమ్ముతున్నాం. కానీ, దళిత స్త్రీలపై జరిగే దురాచారాలు, హత్యాకాండలు, అణచివేతలు, కులవివక్షత, లైంగిక హింస అన్నీ యథాతదంగానే జరుగుతున్నాయి.

పేదవాళ్ళు కావటంవల్ల దళితులు తక్కువ కులస్తులు కాలేదు. తక్కువ కులంలో పుట్టిన పాపానికి సంపదకు, అధికారానికి, గౌరవానికి దగ్గర కాలేకపోయారు. అగ్ర కులంలో పుట్టినందువల్లనే దొరలుగా, భూస్వాములుగా, పెట్టుబడిదారులుగా, పెత్తందారులుగా, పారిశ్రామిక వేత్తలుగా అధికారాలు చెలాయిస్తున్నారు. తర్వాత తమ భార్యలకు, తల్లులకు కూడా గౌరవం లభిస్తుంది. కింది కులాల వారి తల్లుల్ని, చెల్లెళ్ళని, భార్యల్ని, వేదింపులకు, అత్యాచారాలకు గురిచేస్తూ, హత్యల్ని ఆత్మహత్యలుగా చిత్రిస్తూ చట్టాన్నీ, న్యాయాన్ని, నల్లడబ్బు కట్టలతో, రాజకీయ పలుకుబడులతో, కుల అధికారబలంతో తల్లకిందులు చేస్తున్నారు.

యుద్ధాలు జరిగినా, తుఫాన్లు వచ్చినా, మత కల్లోలాలు రేగినా, కరువు పరిస్థితులేర్పడినా, అర్థిక సంక్షోభాలు తలెత్తినా, అన్నింటికీ ముందు బలిపశువులయ్యేది కింది కులాలవారే, అందులోనూ ముఖ్యంగా దళిత స్త్రీలు. "శ్రామిక సంస్కృతికి నిజమైన సృష్టికర్తలు, వారసులు దళితులే. ఈ దళితులు మాతృస్వామిక వ్యవస్థకు, భౌతికవాదానికి ఆర్యులు. భారతీయ వ్యవసాయ నిర్మాతలైన దళితులను భారతదేశంపైన దండెత్తిన ఆర్యులు వీరిని ఓడించి 'అంటరానివారు'గా ముద్రవేసి ఆర్య సంస్కృతి ఆధిపత్యాన్ని నెలకొల్పారు. దళిత స్త్రీ ఒక సాంఘిక శక్తి, ఒక సంస్కృతికి ప్రతీక, ఒక చారిత్రక నేపథ్యం. అటువంటి దళిత స్త్రీ భారతదేశంలో ఈనాడు ఒక అస్పృశ్యురాలిగా సంక్షోభితమైన జీవన యాత్రలో ప్రయాణం సాగిస్తుంది. దళిత స్త్రీలు ఈనాడు మొత్తం సామాజిక శ్రమలో ఎనభైశాతం భారాన్ని మోస్తూ జాతీయ ఆర్థిక రంగాన్ని పరిపుష్టం చేసున్నారు. దళిత స్త్రీల జీవితం, శ్రమ భారతీయ ఆర్థిక రంగానికి పునాది. కానీ మన మేధావులు ఈ దళిత స్త్రీ జీవితాన్ని పరిశీ లించడం లేదు. తమ మానవీయ ఔనత్యాన్ని కించపరిచే సాంఘిక అణచివేతలోను, ఆర్థిక సంక్షోభంలోను ఈనాటి దళిత స్త్రీలు ఎంతో సంఘర్షణతో జీవిస్తున్నారు".
(పద్మారావు, కత్తి. 1993:263)

దళిత స్త్రీ వ్యవసాయ రంగంలోనేకాక ఆనకట్టలు భవనాలు, రోడ్ల నిర్మాణాల్లో, బట్టల మిల్లులు, ఇతర పరిశ్రమలు, ఫ్యాక్టరీలు ఇలా ఎన్నో రంగాలలో కూడా దళిత స్త్రీలే పని చేస్తున్నారు. జీవనోపాది కొరకు ఇటువంటి శ్రమను ఒక ప్రక్క అనుభవిస్తూ, మరో ప్రక్క తన గృహ జీవనానికి సంభందించిన పిల్లల పోషణ, సుదూర ప్రాంతాల నుండి కట్టెలు కొట్టి మోసుకు రావటం, నీళ్ళు తేవటం వంటి పనులన్నీ దళిత స్త్రీ చేస్తుంది. శ్రమలోనే కాకుండా సంస్కృతికి చారిత్రక మూలమైన ముగ్గులు, లిపులు, బొమ్మలు, పచ్చబొట్టు మొదలగునవి దళిత స్త్రీయే మొదట రూపొందించింది. కానీ చరిత్ర సంస్కృతులలో ఆమెకు స్థానం లేకుండా పోయింది.

ఇంతటి మహత్తరమైన కళాతపస్విని పేదరికంలో మునకలు వేస్తుంది. చాలీచాలని ఆహారంతో తన బిడ్డల పోషణ నిమిత్తం అనునిత్యం తన శ్రమను దారపోస్తుంది. ఆమె గర్భవతిగా ఉన్నప్పుడు సరైన పౌష్టికాహారం లేక జీవం పోసుకొని వెలుగులోకి రావలసిన బిడ్డ కడుపులోనే మరణించే సంఘటనలు, 'తానుండే గ్రామంలో పనిలేని సమయంలో తట్టాబుట్టా నెత్తిన పెట్టి రద్దీగా వుండే రైళ్ళలో దూరప్రాంతాలకు ప్రయాణించి, ప్లాట్‌ఫారం మీద

సామాన్లుంచి బిడ్డలను కాపలాపెట్టి పొలాల్లో పనిచేసి వచ్చేసరికి రైలు కిందపడి చనిపోయిన పిల్లలను చూసిన ఆమె హృదయక్షోభ వర్ణనాతీతం. దళిత స్త్రీ బిడ్డ పుట్టేటప్పుడే కాకుండా రోజూ పురిటి నొప్పులు పడుతుంది' (పద్మారావు, కత్తి. 1993:266).

ఒకవేళ పసిపిల్లలను తమతోపాటే పొలాలకు తీసుకు వెళ్తే, అక్కడ పాలిచ్చే సమాయానికి యజమాని అభ్యంతర పెట్టే సంఘటనలు, అవమానిపరచి పనికి రాకుండా చేయడం వంటివి అనేకం జరుగుతున్నాయి. ఎక్కువ మంది దళిత స్త్రీలు పాకీపనివారుగా, చెప్పులు కుట్టేవారిగా పనిచేస్తున్నారు. మరికొందరు ఈ దేశంలో ఏ రంగంలోనైతే భద్రత లేదో, అతి తక్కువ వేతనాలున్నాయో, రక్షణ వస్తువులులేవో వాటి పనులకు వాళ్ళు నెట్టి వేయబడుతున్నారు.

"శరీర నిర్మాణంలో స్త్రీలంతా ఒకే ఆకృతిని కలిగివున్నా అగ్రకుల స్త్రీల సమస్యలు వేరు, దళిత స్త్రీల సమస్యలు వేరుగా ఉన్నాయి. లింగ వివక్షత స్త్రీలందరికీ సాధారణంగా ఒకటే అయినా, కుల వివక్షత, దానికి సంబంధించిన అనుమానాల అనుభవం అగ్రకుల స్త్రీలకు జీవిత కాలంలో ఎప్పుడూ ఎదురయ్యే అవకాశం లేదు" (విజయలక్ష్మి, జి. భూమిక. నవంబరు 03- ఫిబ్రవరి 04 :175) దళిత స్త్రీ అంటే సమాజంలో గౌరవం లేదు. చీత్కారాలే నిత్యం ఆమెను వెంటాడుతున్నాయి. కుల పరంగా దళిత పురుషులు కూడా అంటారానితనం, అవమానాలను ఎదుర్కొంటున్నారు. వీటితోపాటు లింగ వివక్షతను దళితస్త్రీ, మిగిలిన స్త్రీలకంటే ఎక్కువ సమస్యలను ఎదుర్కొంటుంది. దళిత స్త్రీలకు అందం, ధైర్యం, ఆలోచన, ఆస్తి, తెగువ లాంటివేవీ ఉండ కూడదు. ఒకవేళ ఉంటే వారిపై దాడులు, అత్యాచారాలు, బట్టలూడదీసి రోడ్డు మీదికి ఈడ్చి, కొట్టుకుంటూ ఊరేగించడం అనేవి మామూలు విషయాలైనాయి.

'దళిత స్త్రీ ఇప్పటికీ కొన్ని జిల్లాల్లో గుళ్ళకు అనుబంధమైన జీవితాన్ని గడుపుతూ తద్వారా లైంగిక హింసని అనుభవిస్తున్నారు. 'జోగిని'లుగా, 'మాతంగు'లుగా 'బసివిని'లుగా వారనుభవిస్తున్న జీవితం దుర్భరమైంది. దారుణమైంది. వారి జీవితాలను మానవరహితంగా దేవుడి పేరుచెప్పి కొల్లగొట్టి వారిని పెండ్లికి, జీవన సంస్కృతికి దూరంగా ఊరుమ్మడి బ్రతుకులుగా రూపొందించారు. రెండు సంవత్సరాలు, ఐదు సంవత్సరాలు వయసులోనే వారిని దేవుళ్ళకు అప్పజెప్పి వారిని అగ్నిగుండంలోకి తోయడం జరుగుతుంది'. (పద్మారావు, కత్తి. 2003:93)

దళిత స్త్రీల బతుకులను ఊరుమ్మడి బతుకులు చేసే ఈ దురాచారం ఇప్పటికి కొన్ని ప్రాంతాల్లో ఆచరించబడుతూవుంది. అంతేకాకుండా మనుస్మృతి కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి కేంద్రంగా పని చేసింది. ఇది ఆధిపత్య కులాల స్త్రీలను శూద్రులతో సమానంగా జతకట్టడంతో పాటుగా, వారి లైంగికతను కూడా నియంత్రించింది. హిందూ కర్మ సిద్ధాంతాలన్నీ కూడా స్త్రీకి కించిత్ విలువనివ్వక పోగా చిన్న చూపు చూశాయి. ఎంతో మంది ఆధిపత్య కులాల దళితేతర స్త్రీలు నోములు, వ్రతాలు చేస్తూ దేవుళ్ళను పూజించటం జరుగుతుంది. ఈ వాతావరణం దళితులపై కులహింసను తీవ్రం చేస్తుంది.

"ప్రాచీన తెలుగు సాహిత్యంలో వేదాలు, పురాణాలలో కొంత మంది దళిత స్త్రీల చిత్రీకరణ కనిపిస్తుంది. వారే అరుంధతి, శబరి, శూర్పణఖ, తాటకి, మాతంగ కన్యలు, దాసీలు, పూలమ్మేవారుగా, వేశ్యలుగా, రాక్షస స్త్రీలుగా ప్రస్తావన చేయబడింది. వీరిని గూర్చి పరిశీలించినట్లయితే రెండు కోణాలు కనిపిస్తాయి.హైందవ సంస్కృతిని, దాని ఆధిపత్యాన్ని ప్రశ్నించిన వారికి రాక్షస స్త్రీలుగాను, అనుకరించిన వారిని భక్తులుగాను చిత్రించటం జరిగింది" (శ్యామల, గోగు. 2003:4). ఇక్కడ దళిత స్త్రీ తన జాతి సంస్కృతికి, సాంఘిక ఆచారాలకు తిలోదకాలిచ్చే ఆర్య సంస్కృతిని ఆదరించినట్లు వర్ణించటం గమనార్హం -

"అరుంధతి నీ యింటి కోడలయిన రోజే
వరసలు కలుపుకున్న వాళ్ళమైతే
మంటల మధ్య మాడిన కంచిక చెర్ల కోటేశెవరు?"
(నాగేందర్, పగడం. 1996:192)

అని చారిత్రక నేపథ్యంలో జరిగిన వివాహానికి ప్రస్తుత పరిస్థితికి ముడిపెట్టి అరుంధతి వశిష్టుని వివాహమాడిన మాదిగ స్త్రీ అని పురాణాలు, కాలజ్ఞానంలో వీరబ్రహ్మం గారు చెప్తున్నారు.

"శూర్పణఖ రావణుని చెల్లెలు అని చెప్పటం కన్నా, ద్రావిడ స్త్రీ అనటం సరైంది. ఆమె చాలా అందగత్తె. రాముణ్ణి ప్రేమించింది. పెళ్ళాడమని అతణ్ణి కోరింది. రాముడు ఆమె చెవులను లక్ష్మణునితో కోయించాడు. ఆమెను కురూపిని చేశాడు" (ఐలయ్య, కంచ. 2000:107). శూర్పణఖ రాముని ప్రేమించటం అప్పటి సాంప్రదాయాల ప్రకారం తప్పుకావచ్చు, కాకపోవచ్చు. కానీ తమకు ఇష్టం లేకపోతే లేదనే మాట స్పష్టంగా చెప్ప కుండా ముక్కూ చెవులు కోసి ఆమెను వికృతరూపిగా చేయటం వారి ప్రవృత్తికి తార్కాణం అని చెప్పవచ్చు. అనార్యస్త్రీల పట్ల ఆర్యుల ప్రవర్తనారీతి అది. "తాటకి ఒక రాజ్యానికి పాలకురాలు. ఆమె చాలా బలవంతురాలు. యజ్ఞయాగాది క్రతువులు జరుగుతున్న హింసను వ్యతిరేకించింది. మునులంతా రాజు దగ్గరకు వెళ్ళి అతని బల సహాయంతో ఆమెను చంపి ఆమె రాజ్యాన్నీ, భూములనూ ఆక్రమించారు ఇది అసలు కథ. దీనికి చిలవలు పలవలు అల్లి తాటకిని దుష్టురాలిగానూ ఆమెను చంపిన రాముణ్ణి దుష్టశిక్షకుని గానే చిత్రించారు" (శ్యామల, గోగు. 2003:127) తాటకిని అతి క్రూరంగా ముందు చేతులు నరికి ఆ తర్వాత ముక్కు, చెవులు కోసి చంపారు. దళిత స్త్రీల హత్యలు పురాణాలు, రామాయణ, మహాభారతాల కాలం నాటివి. ఇప్పుడు ఎందుకు, అవన్నీ ఒకప్పటి సమాజానికి చెందినవి అనే వారు కూడా ఉన్నారు. ఇప్పుడు ఎందుకు, అవన్నీ ఒకప్పటి సమాజానికి చెందినవనే వారు కూడా ఉన్నారు. కానీ అదే కాలం ఇప్పుడూ కొనసాగుతుంది. దళిత స్త్రీ దృష్టికోణంలో భారతదేశంలో వేళ్ళూనుకొనిన కులం నిచ్చెన మెట్లలోకి వర్గం, జెండర్ కూడా చేరింది. వీటన్నింటిలో దళితస్త్రీ అట్టడుగునవుంది. వ్యవసాయ కార్మికుల్లో, బలవంతంగా వ్యభిచారపు రొంపిలోకి నెట్టబడ్డ స్త్రీలలో, అగ్రకుల భూస్వాముల, పోలీసుల దాడులకు బలై పోయిన వారిలో అత్యధికులు దళిత స్త్రీలే. వీరి నిస్స హాయపు స్థితిని అధికారంలో ఉన్నవాళ్ళు నిరంతరం దోపిడీ చేస్తూ ఏ విధమైన శిక్ష లేకుండా తప్పించుకో గలుగుతున్నారు. మాలమాదిగవాడల పైనే అగ్రకులాల దాడులు, దళితుల్లోని చైతన్యాన్ని మొద్దుబార్చడానికి దళిత స్త్రీలపై లైంగిక అత్యాచారాలకు పాల్పడుతున్నారు. ఈ దేశపు చెట్టుకు చెదలు పట్టినట్లు, కులవ్యవస్థ పట్టి పీడిస్తూనే ఉంది. ఈ దేశపు చెట్టు నుండి రాలిపోతున్న నుసి దళిత స్త్రీ.

"దళిత స్త్రీ హత్యల్లో కారంచేడు కేసులో ప్రధాన సాక్షి ఆలీసమ్మ హత్య అతి క్రూరమైంది. ఆమె కొడుకును చంపటం ఆమె స్వయంగా చూసింది. సాక్ష్యం చెప్పటానికి పూనుకున్న తల్లిని కూడా చంపేశారు. సజ్జల గూడెంలో 'మహాదేవమ్మ' బసివిని గుడ్డలూడదీసి అమానుషంగా చంపేశారు. మెదక్ జిల్లాలో ఒక రజక స్త్రీ అగ్రకులాల పెద్దలను నిరాకరించినందుకు ఆమెకు గుండు గీయించి, జీడిరసాన్ని గుండు మీద రుద్ది, ఆమెను గాడిద మీద ఊరేగించి అవమాన పరిచారు (పద్మారావు, కత్తి. 2003:94-96). నల్గొండ జిల్లాలోని చెలకుర్తి గ్రామంలో 'ముత్తమ్మ' అనే దళిత స్త్రీని వివస్త్రను చేసి ఊరేగించారు. అందుకు కారణం రెడ్డి కులానికి చెందిన జయమ్మ అనే యువతి గొల్ల గోవిందుని ప్రేమించగా జయమ్మ ఇంట్లోవారు దానికి అభ్యంతరం చెప్పగా వీరిరువురు ఊరు వదిలి పారిపోగా వాళ్ళకి సాయం చేసిందేమోనన్న అనుమానంతో ముత్తమ్మపై దారుణమైన అత్యాచారం జరిపారు. ఇది చుండూరు సంఘటన జరిగిన ఎనిమిది రోజులకు జరిగింది. "the chelkurti incident is yet another milestone in a history of upper caste decadent culture. This took palce exactly eight days after the chundur carnage. If chundur reflected the reddy arrogance of guntur district, chelkurti reflected the reddy decadence of Nalgonda. At chelkurti, a reddy woman, Jayamma, and a golla (backward caste) boy, Govindu, were said to have been carrying on a relationship for almost five years. As Jayamma's and Govindu eloped and it was suspected that muthamma, another golla woman, had helped them. Narayan Reddy (who is not a rich person at all) along with two others - parvatha reddy and Venkatarami Reddy - distrobed Muthamma, inserted chilli powder and a stick into her vaginal tract, and paraded her naked in the viallage for

more than three hours''. (Ilaiah, kancha. 2004:84)

1989లో ప్రకాశం జిల్లా టంగుటూరు మండలంలో ఇందిర అనే దళిత యువతి తన బతుకు తాను బతుకు తుండగా కమ్మ కుల భూస్వామి ఆమెపై గల లైంగిక వాంఛను బయట పెట్టగా ఆమె అందుకు నిరాకరించిం దని ఆమెపై అతి దారుణంగా అత్యాచారం జరిపి, హత్య చేసి నడి రోడ్డుపై నగ్నంగా పడవేయగా 24 గంటల పాటు ఆ శవం అక్కడే ఉండగా అక్కడి పోలీసులు కానీ, పాలనా యంత్రాంగంకానీ, ప్రజలుకానీ ఎటువంటి సాయం చేయలేదు. “the case of Indira, an Sc girl near tanguturu of Prakasam district, illustrates the point more clearly. Indira was good-looking girl who was employed in a private company. As she was earning a decent salary she was maintaining herself well. A kamma landlord repeartedly sent feelers asking her to surrender to him sexually in an illicit relationship but not to marry him legally. Indira spurned the offer. oneday the landlord managed to catch hold of Indira, raped her and brutally killed her. Her naked corpse lay on the main road of the village for more than 24 hours. Neithr the administration nor the upper castes bothered to remove the body nor to sent a message to her relatives. The landlord was neither killed nor socially boycotted nor did the police arrest him. Even today, after two years (the incident occurred in 1989) the culprit roams scot - free'' (ilaiah, kancha. 2004:88). ఈ విషయాలపై చర్య తీసుకునే వారు కూడా లేరు. దళితులు వచ్చి ఏమైనా చేయడానికి ముందుకు వస్తే తమకు ఇదే గతి పడుతుందని ఎవరూ ముందుకు రాలేదు. అదేవిధంగా 'సెంట్రల్ యూనివర్శిటీ' లోని 'సునీత' అనే దళిత విద్యార్థినిని అగ్రకుల విద్యార్థి ప్రేమ పేరుతో మోస గించటం వలన ఆమె ఆత్మహత్య చేసుకొని మరణించింది' (పద్మారావు, కత్తి. 2003:94-96). ఈ విధంగా పొలాల్లో, చావిళ్ళలో, గుడిలో, బడిలో, చివరికి విశ్వ విద్యాలయాల్లో కూడా దళిత స్త్రీ హత్యలే. దళిత స్త్రీల శరీరంమీద, మానంమీద, హృదయంమీద, బాల్యంమీద, శ్రమమీద, విద్యమీద, విజ్ఞానంమీద, వ్యక్తిత్వంమీద నిరంతరం దాడి జరుగుతూనే ఉంది. అగ్రకుల అహంకారానికి కుల, లింగ పరంగా వివక్షతకు గురవుతున్నది కేవలం ఒక దళిత స్త్రీ మాత్రమే.

దేశంలోని దళిత స్త్రీలందరూ ఉద్యమించాలంటే వారి భర్తలు, బిడ్డలు కూడా వారికి సంఘీభావంతో నిలిస్తే, వారి విముక్తి పోరాట లక్ష్యాన్ని చేరుకుంటుంది. దళిత మహిళలు ముందు భాగాన నిలిచి సింహగర్జన చేయ టానికి కారంచేడునుండి నాంది. 'నీ తల్లి లాంటిదాన్ని' అని ప్రాధేయపడినా వదలని కర్కశులను చూసి దళిత స్త్రీలో చైతన్యం కలిగి, సంఘటిత శక్తిగా మారి నీరుకొండ, కొత్తకోట, టంగుటూరు, కొల్లిపర, పిప్పర, చుండూరులో ఉద్యమించి విజయాన్ని సాధించారు.

ఎందరో మహానుభావులు కృషి ఫలితంగా ఈనాడు ప్రగతిపథంలో పయనిస్తున్న స్త్రీ తాను పోగొట్టుకున్న హక్కులను పోరాడుకుంటూ తిరిగి సంపాదించు కోవాలి. తన స్వాతంత్ర్యాన్ని తాను తెచ్చుకొని, తమకు జరిగిన అన్యాయాన్ని అంతర్జాతీయంగా తెలియజేసి తమపై జరిగే మానవ హక్కుల ఉల్లంఘనను అందరి దృష్టికి తేవాలనేది దళిత స్త్రీ లక్ష్యం. దళిత స్త్రీలు రాజ్యహింసకు, కుంటుంబ హింస, సాంఘిక బహిష్కరణలు, అవిద్య, సాహిత్య అణచివేతలు, కులవివక్ష, లింగవివక్ష, మూఢనమ్మకాలు, ఆర్థికవెసులుబాటు లేకపోవటం లాంటి సమస్యల్ని అనాదిగా ఎదుర్కొంటూ అబలలుగా, బానిసలుగా, కర్మభూమిలో పూసిన పువ్వులుగా, మన కర్మ ఇంతే అనుకునే ఆలోచనా ధోరణి నుండి విప్లవాన్ని పొంది అగ్గిపువ్వులుగా రగులుకుంటూ, పులిపిల్లల్లా గర్జిస్తూ ఫిరంగుల్లా పేలుతూ సమాజమనే ఆకురాయి మీద తమ కలాల కత్తుకు పదును పెడుతూ, తమ గుండె కొలిమిలో పదును దేలిన భావాల కరవాలాలను గురి చూసి విసిరి తిరగబడుతున్నారు, తిరగబడి తమ అధికారాన్ని సాధించుకుంటారు.

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# మానవ జీవితంలో తెలుగు సామెతలు - సాంఘిక నేపథ్యం

- డా॥ పులపర్తి శ్రీనివాసరావు, పోస్ట్ డాక్టోరల్ ఫెలో, తెలుగుశాఖ, ఆంధ్రవిశ్వకళా పరిషత్, విశాఖపట్నం.

సామెతలు గురించి సాహిత్యంలో మంచి పరిశోధనలే జరిగాయని చెప్పవచ్చు. 'సామెత' అనే పదం వరాహ పురాణంలో తొలిసారిగా ప్రయోగించబడింది. తెలుగులో పి.కృష్ణమూర్తి, జి.ఎస్ మోహన్, పి.నరసింహారెడ్డి వంటి వారు సామెతలపై పరిశోధన చేశారు. పాశ్చాత్యుల్లో ఆర్ఎస్ బాగ్స్, వారన్. రాబర్ట్స్, ఆర్చర్ టేలర్ సామెతలను వర్గీకరించి మంచి పరిశోధనలే చేశారు. ఇలా జానపద విజ్ఞానంలో భాగంగా సామెతలపై విశేష కృషి చేసిన వారెం దరున్నా ఎవరికి వారే ప్రత్యేకత కలిగిన వారు. ఈ సామెత లను అధ్యయనం చేస్తే మానవ జీవితం వెనుక ఉన్న సాంఘిక నేపథ్యంతో పాటు, ఆయా కాలాల్లో వచ్చిన సామెతల ఆధారంగా నాటి మానవుని సామజిక జీవనాన్ని కూడా అంచనా వేయవచ్చు.

'తెలుగు సామెత'ను గురించి రాయాలనుకునేటప్పుడు అనేక ప్రశ్నలు తలెత్తుతాయి. అసలు సామెత అంటే ఏమిటి? ఈ సామెత ఎప్పుడు పుట్టింది? ఎలా పుట్టింది? మనిషి జీవితానికి సామెతకు సంబంధమేమిటి?... ఇలా ఎన్నో ప్రశ్నలు. ఒక్కో విషయాన్ని తరచి ఆలోచిస్తే ముందుగా తీసుకోవలసింది సామెత అంటే ఏమిటని!

మనసు హత్తుకునేటట్టు సూటిగా చెప్పబడే వొక చిన్న వాక్యాన్ని సామెత అంటారు. అయితే మనసుకు హత్తుకునే దేది? జీవితానికి గాని, మానవునితో సంబంధం ఉన్న ఏదైనా సత్యం మనసుకు హత్తుకుంటుంది. భాషకు సంబంధించిన చమత్కారం మనసుకు హత్తుకుంటుంది. ప్రకృతికి సంబంధించిన సౌందర్యం మనసుకు హత్తు కుంటుంది. ఇవన్నీ ఒక దానితో ఒకటి కలిసి, ఒకదానితో ఒకటి పోల్చి తయారయితే అది సామెత అని చెప్పవచ్చు. ఫలానిది 'సామెత' అని మనం గుర్తించగలం. మాట్లాడుతూ, మాట్లాడుతూ మనకు తెలియకుండానే సామెతను వాడుతాం. వింటున్న మాటల్లో సామెత వుంటుంది. చదువుతూన్న పుస్తకాలలో ఎన్నో సామెతలు దొర్లుతాయి. అంటే సామెత నలుగురి నోటపడి బాగా నలిగి జన వ్యవహారంలో కలిసిపోయిందనేది స్పష్టమయిన విషయం.

అయితే సామెతకు భాషార్థమేమిటి? అంటూ తెలుసు కోవాలనుకుంటే సామ్యం చూపేది సామెత. సామ్య, సామ్యత, సామెత అయి వుండవచ్చునని పండితులు చెప్పారు. సామెతకు అనేక ఇతర పదాలు కూడా వాడుకలో వున్నాయి. అవి సుద్దులు, సాటువ, నానుడి, సూక్తి, లోకోక్తి, శాస్త్రములు, జనశ్రుతులు.. సుద్దులు అంటే సత్యం లేక నిజం చెప్పబడేవి. 'దానికి దీనికి సాటవ దెచ్చింది' అని వాడుకలో అంటారు. దీనిని బట్టి సాటవ లేక చాటువ అంటే ఒక దానితో వొకటి పోల్చి చెప్పడం.

ప్రధానంగా 'సామెత' అని చెప్పబడే వాక్యం రెండు భాగాలుగా ఉండి యతి గానీ ప్రాస గానీ ఉంటుంది. వీటిలోని రెండు విషయాలు ఒక దానితో ఒకటి పోల్చబడి ఉంటాయి. వీటన్నింటిలో 'సాటువ' అని చెప్పబడేది సామెత అని చెప్పబడిన వాక్యానికే అయితే 'సామెత' అనే పదం 15వ శతాబ్దంలో రాయబడిన వరాహ పురాణంలో మొదటిసారిగా వాడబడిందని పండితుల అభిప్రాయం.

మానవుడి జీవితంతో సంబంధం కలిగి ఉన్న సామెత ఎప్పుడు, ఎలాగ, ఎందుకు పుట్టింది? అని ఆలో చించాలి.'సామెత' తయారవడానికి కావలసిందేమిటో తెలుసుకుంటే వీటికి సమాధానం లభిస్తుంది. మానవుడికి జీవితం ఉంది. ఆ జీవితానికి అనుగుణంగా స్పందించ గలిగే హృదయం ఉంది. ఆ స్పందనలో నుంచి బయలు దేరే 'భావం' సామెతకు ప్రాముఖ్యం కావాలి.

సాధారణంగా మనిషి మనసులో ఏదయినా అను భవం పట్ల గాఢమైన అనుభూతి కలిగేటప్పుడు అది ఒక 'భావం'గా మారి గుండెలలో తిరుగుతూ వుంటుంది.

పరిస్థితులు అనుకూలించినప్పుడే ఆ భావం మాటగా మారి బయటపడుతుంది. మనిషి మనసులో నుండి చటుక్కున పొంగి బయటపడేది మాటే! మామూలు మనిషి సామాన్యంగా తన భావాన్ని ప్రకటించడానికి మాటనే ఆశ్రయిస్తాడు. ఆ మాట బయటపడడానికి విశ్రాంతి అవసరం లేదు. భాషా పాటవం ప్రేరేపించే గాఢత్వాన్ని బట్టి వుంటాయి. ఆ అనుభూతిలో వుండే ఉద్వేగాన్ని బట్టి ఆ మాటలు లయబద్ధంగా వెలువడతాయి. ఆ లయే సామెతలలో రసాత్మను కలిగిస్తుంది. వినేవారికి అంత ఉద్వేగం ఉండదు కాబట్టి లయాన్వితమైన ఆ వాక్యం ఆనందం కలిగించి దాన్ని వారు స్వంతం చేసుకొని తాము మళ్ళీ వాడి ఇంకొకరికి వినిపిస్తారు. ఇలా మళ్ళీ వాడేటప్పుడు పరిస్థితులు ఏ రకంగానయినా మారిపోవచ్చును. దానిని అనుసరించి మానవుడి మనఃస్థితి మారవచ్చును. అందులో కొన్ని పదాలు మారిపోవచ్చు. గాని భావం మారదు. రూపం మారదు. ఈ రకంగానే 'సామెత' ఒకరి దగ్గర పుట్టి ఒకరి నోటి నుండి ఇంకొకరికి చేరేటప్పుడు చిన్న చిన్న మార్పులు పొందుతూ బ్రతుకుతూ వస్తోంది.

ఉదాహరణకు వ్యవసాయం చేయాలంటే దానికవసరమయిన వానను అంచనా వేయాలి. భూమి యొక్క తీరు తెన్నులు తెలుసుకోవాలి. ఇలాంటి విషయాలన్నీ అనుభవం ద్వారా మానవుడు గ్రహించాలి. ఇలా తను గ్రహించిన విషయం తన తరువాతి వారికి చెప్పాలి. ఇలా చెబితే తప్ప వారు తిరిగి వ్యవసాయం చేయలేరు. వ్యవసాయం క్రీస్తుపూర్వం నుండి ఆంధ్రదేశంలో వుంది. దానికి సంబంధించిన అంచనాలు ఇక్ష్వాకుల కాలం నుండీ వేయబడుతున్నాయి. అంటే ఆయా పనులకు సంబంధించిన భావం ఏదో వొక రూపంలో ఆ నాటి నుండి మానవులలో నలుగుతోంది. దానిని చెప్పాలి. దానిని ఏదో ఒక రూపంలో ప్రకటించాలి. అది వ్యవసాయదారులందరికీ అవసరమవడంతో ఒకరినుండొకరికి ప్రయాణం చేసింది. ఇలా ప్రయాణం చేసేటప్పుడు తాను తెలుసుకున్న కొత్త విషయాన్ని చేర్చుతూ అవసరం లేని దాన్ని తుంచుతూ తన మానసికోద్వేగానికి అనుగుణంగా మార్చుతూ చెప్పడం జరిగింది. ఇలా శతాబ్దాల పాటు ప్రయాణం చేయడంతో పదాల చేరికలో అందాన్ని కూర్చుకుంటూ తయారయింది.

ఇవి ఒక్కసారిగా తయారు కాలేదు. ఏ ఒక్కరో ప్రకటించ లేదు. ఎవరికో ఏదో చెప్పాలనే ఆదుర్దతో గాక తన మనసులోని భావాన్ని లేక బాధను లేక అనుభవాన్ని లేక అభిప్రాయాల్ని ప్రకటించే ఉద్దేశంతో చెప్పడం వల్ల ఇవన్నీ జీవితం పొడుగునా ప్రతి వారికీ వుండేవే అవడం వల్ల ఈ సామెతలు అప్పుడూ అప్పుడూ అక్కడా అక్కడా పుట్టి వీధిన పడ్డాయి.

సృష్టిలో ప్రతి జీవీ సంఘజీవి. మానవుడూ ఇందుకు భిన్నం కాడు. ఒక మనిషి లేక ఇంకో మనిషి లేడు. తోటి వారి అవసరం లేక మనగలిగే బ్రతుకు లేదు. తన జీవితావసరాలనూ, అవకాశాలనూ ఎప్పటికప్పుడు చెప్పేసి వ్యక్తిగతమయిన కోపతాపాలు, క్రోధావేశాలు, ఎప్పటికప్పుడు ప్రకటించేసి, విషయం సమాజపరం చేసేసి మనిషి సంఘజీవి అయిపోయాడు. అందుచేతే ఇంత వరకు మానవుడి జీవితంలో ఒక మనిషికీ ఇంకొక మనిషికీ గాని ఒక కుటుంబానికీ ఇంకొక కుటుంబానికీ గాని అంత భేదం లేదు. వారి సుఖదుఃఖాలూ, జీవిత సమస్యలూ, అనుభూతులూ, అనుభవాలూ అన్నీ సమానంగానే వుండేవి.

ఇటువంటి జీవితానికి ఒక క్రమపద్ధతి ఉండాలి. ఒక కట్టుబాటు కావాలి. మనిషిలో ఒక సర్దుబాటు ఉండాలి. అంతేగాక జీవితంలో తాను ఎదుర్కొంటున్న అనుభవాలనూ, తాను సంపాదించిన జ్ఞానాన్నీ తరువాతి వారికి అందివ్వాలి. అంతేగాక ఇటువంటి శ్రమైక జీవితంలో విసుగు రాకూడదు. ఉత్సాహం కలగాలి. ఆయా అవసరాల కోసం మానవుడు పాటలు కట్టుకున్నాడు. కథలు చెప్పుకున్నాడు. ఆటలు ఆడుకున్నాడు. నాటకాలాడుకున్నాడు. ఇలా ఎన్నో కళాత్మకమయిన పంథాల ననుసరించాడు. కానీ మానవునికి సంతృప్తి లేదు. వాటన్నింటి మీదా అతడికి తెలియకుండానే ఒక సన్నని ముసుగు జారింది.

అవన్నీ ప్రకృతి గురించి, ఎవరో వీరుల గురించి, భక్తుల గురించి, అతీత వ్యక్తుల గురించి, శక్తి, దేవుడు వంటి అందరాని శక్తుల గురించి వీటన్నింటిలోనూ తన ఆశలనూ, అనుభవాలనూ, నమ్మకాలనూ, విశ్వాసాలనూ కలిపి చెప్పినా అందులో తను లేడు. మనిషిగా తను లేడు. తన భావుకత మాత్రం ఉంది.

అవన్నీ మనిషి జీవితాన్ని ప్రకటించాయే గాని జీవితాన్ని వ్యాఖ్యానించలేదు. జీవన సమస్యలను సూటిగా వెల్లడించలేదు. ఇంకా ఏదో చెప్పాలి. ఏదేదో చెప్పాలి. ఇంకా చెప్పవలసినది మిగిలిపోయే వుంది అనే తపన మానవుడిని వేధిస్తోంది.

జీవన విజ్ఞానం సూటిగా చెప్పాలనే ఆరాటంలో అనేక భావాలు అనేక విధాలుగా ప్రకటిస్తూ వచ్చాడు. గాలి గురించీ, నీటి గురించీ, పాడి గురించీ, పంట గురించీ, నీతి గురించీ, జాతి గురించీ, ఇల్లు గురించీ, తల్లి గురించీ, ఒక విషయమని లేకుండా, ఒక స్థలమని లేకుండా, ఒక సమయమని లేకుండా ప్రకటిస్తూ వచ్చాడు. అనుకోకుండానే ఇవి 'సామెత' రూపం దాల్చి వృద్ధి చెందాయి.

ఇక మానవజీవితంలో సామెతల మమేకత్వాన్ని తెలుసుకోవాలంటే కొన్ని ఉదాహరణలు పరిశీలించి అవి ఎందుకు,ఎలా ఏర్పడ్డాయో విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేయాలి.ఈ కోణంలో కొన్ని సామెతలను ఉదహరించాను.

సామాన్య మానవుడి జీవనాన్ని తెలుసుకోవడానికి చరిత్రకారులు నాలుగు ఆధారాలను సాధారణంగా వాడుకుంటున్నారు. అవి 1.రాజులు, రాజ వంశీయులు వేయించిన శాసనాలు 2. కవులు రాసిపెట్టిన పురాణేతి హాసాలు 3. సాధారణ మానవుడు వాడి వదిలేసిన పురావస్తువులు 4.ప్రస్తుతం ప్రజలు అనుసరిస్తున్న అలవాట్లలోనూ, సంప్రదాయాలలోనూ, ఆచారాలలోనూ మిగిలివున్న సూచనలు.

ఇందులో నాల్గవ దానిలోనివి మానవ బ్రతుకులో ప్రత్యక్షంగా కనిపిస్తూ కొన్ని మాటల ద్వారా బయటపడుతుంటాయి. అవే సామెతలు. ఇవి చక్కని చిన్న చిన్న వాక్యాలు. వీటిలోని మాటల పేర్పు వల్ల అంతర్గర్భితంగా వున్న భావం వల్ల అవి వుపయోగించిన సందర్భాన్ని బట్టి అశేష జ్ఞానాన్ని పంచిబెడుతూ వుంటాయి. అయితే ఇవి ఒక వరుసలో చెప్పబడలేదు. ఒక పరిస్థితిలో చెప్ప బడలేదు. ఇవి మానవుడి అవసరాలనూ, మానసికోద్వే గాలనూ అనుసరించి బయలుదేరడం వల్ల ఆ అవ సరాలు, అవి అవసరమయిన సాంఘిక జీవనమూ తెలుసుకోవచ్చును. ఇవి ఎటువంటి విషయాలు తెలియజేస్తున్నాయి, వీటి ద్వారా మానవుడి సాంఘిక జీవనం ఏ మాత్రం తెలుసుకోవడానికి వీలవుతుంది అనేది ప్రయత్నించి చూడాలి.

“అండలుంటే కొండలు దాటవచ్చు” అని సామెత.

క్రీ.పూ. 8-6 శతాబ్దాల మధ్య ఆర్యులు, వింధ్య పర్వతాలు దాటి దక్షిణాదికి తరలి వచ్చారు. ఆర్యులకు అండగా వుండి వింధ్య పర్వతాలు దాటి త్రోవ చూపించిన వాడు అగస్త్యుడట. దీనికో చక్కని కథ వుంది.

'నేను గొప్పవాడినంటే నేను గొప్పవాడిని' - ఒకసారి వింధ్య పర్వతానికీ మేరు పర్వతానికీ పోటీ వచ్చినదట. 'ఎప్పుడు నా చుట్టూరా చుక్కలూ, చంద్రుడూ, సూర్యుడూ తిరుగుతూ వుంటారు. అందుచేత నేనే గొప్పవాడిని' అన్నాడట మేరువు. 'అదే నీ గొప్పతనానికి కారణమయితే వాళ్ళను నీ చుట్టూ తిరగకుండా ఆపేస్తానని' వింధ్యుడన్నాడట. ఆ వుద్రేకంలో పెరిగి పోవడం మొదలు పెట్టాడట. ఆకాశంలో సూర్యచంద్రుల గమనాన్ని ఆపేసేటంత వరకూ పెరిగాడట. వీరి గమనం ఆగిపోవడంతో కొన్ని దేశాలలో పూర్తిగా ఎండ, కొన్ని దేశాలలో పూర్తి చీకటి ఆవరించి వుందట. అప్పుడు దేవతలూ, మనుషులూ అందరూ అగస్త్యుడి దగ్గరకు వెళ్ళి ఈ విపరీతాన్ని ఆపమని మొర పెట్టుకున్నారట.

అప్పుడు అగస్త్యుడు భార్య లోపాముద్రతో తీర్థ యాత్రలు చేసే నెపంతో బయలుదేరాడు. అల్లంత దూరాన అగస్త్యుడ్ని చూడగానే ఎక్కడ శాపం పెడ తాడోనని వింధ్యుడు భయపడ్డాడట. తన దేహాన్నంతా

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

తగ్గించుకుని ఆయన ముందు సాష్టాంగపడ్డాడట. అప్పుడా ముని 'నాయనా నేను ముసలివాడిని. ఇంత ఎత్తుగా వున్న నీ వీపు మీద ఎక్కి అవతలికి పోవడానికి, తిరిగి రావడానికి శక్తి లేని వాడిని కాబట్టి నేను తిరిగి వచ్చే వరకూ ఇలాగే వుండు' అని చెప్పి దక్షిణాదికి వచ్చి వుండి పోయాడట. అగస్త్యుడు తిరిగి వస్తాడేమోనని అప్పటి నుండీ వింధ్యుడు అలాగే వుండిపోయాడట.

చారిత్రకంగా అగస్త్యుడు క్రీ.పూ.1200 నాడు జీవించి వున్నాడు. ఇతడు ఋగ్వేద సూక్తాలు రాసిన ఋషులలో ఒక ఋషి. ఆర్యులు దక్షిణ దేశానికి రావడం క్రీ.పూ. 800-600 మధ్య జరిగి వుంటుందని చారిత్రకారుల అంచనా. అటువంటప్పుడు ఈ అగస్త్యుడు 400 సంవత్స రాల పాటు బ్రతకడం అసంభవం. అందుచేత వేదకాలం నాటి అగస్త్యుడికి ఈ పురాణ అగస్త్యునికి సంబంధం లేదనుకోవాలి.

అగస్త్యుడ్ని కొండలు దాటించడం గాక చారిత్రకంగా దక్షిణ దేశంలో వున్న సంపద ఆర్యులకు ఆశ కలిగించింది. బ్రతకవచ్చనే అండనిచ్చింది. అక్కడ అన్ని తరహాల లోహాలతోనూ భూమి నిక్షేపమయి వుంది. వజ్రాలు, ముత్యాలు, రత్నాలు, శంఖులు దొరుకుతున్నాయి. దట్టమయిన అరణ్యాలు మంచి వర్షపాతాన్ని తెలియ జేస్తున్నాయి. పొడుగాటి సముద్రతీర ప్రాంతం నౌకా వ్యాపారానికనుకూలంగా వుంది. ఈ సంపద వల్ల ఆకర్షి తులై ఆర్యులు దక్షిణ దేశానికి వలస వచ్చారు. ఈ కథను బట్టి చూచినా, భూగోళ పరిస్థితులను బట్టి చూచినా ఈ 'అండ' అనేది 'సంపద' లేక 'మనిషి తోడు' అనేది అర్థ మవుతోంది కదా! ఇంక కొండలను దాటడం శాస్త్రపరి జ్ఞానం అభివృద్ధి చెందినంత సులువుగా ఏనాడూ లేదు. ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వెళ్ళాలంటే వాతా వరణ మార్పు వల్ల విషజ్వరాలు సోకి, క్రూరమృగాల బారిన పడి ఎందరో నాశనమయ్యేవారు. సామ్రాజ్య కాంక్షతో కొండలను దాటి వచ్చిన అలెగ్జాండరు విష జ్వరంతో మార్గమధ్యలోనే మరణించడం చరిత్ర చెప్పిన సత్యం. అంటే అంత కష్టంతో కూడిన కొండలను దాటడము కూడా 'అండ' వుంటే అతి సులువుగా చేయ వచ్చు. అంత చిన్న వాక్యంలో ఎంత పరిజ్ఞానం యిమిడి వుంది.

పై సామెత విశ్లేషణలో చారిత్రక నేపథ్యం ఉంది. కొన్ని సామెతలు ఆశువుగా వచ్చినా ప్రతి దానికీ ఒక వృత్తి అంటూ ఉందని, అది వివిధ రకాలుగా ఉంటుందని, చారిత్రకమా, రాజకీయమా, ఆర్థికమా లేక సాంఘికమా ఇలా అనేక రకాలుగా నేపథ్యాలుంటాయనే విషయం అర్థమవుతుంది.

అలాగే మరో సామెత మరియు దాని విశ్లేషణ పరిశీలిస్తే "కొండను చదరబెట్టి ఉలవ జల్లినట్లు" అనే సామెతను విశ్లేషిస్తే సామాన్యులకు సహితం తెలియని విషయాలు గ్రహించవచ్చు.

ఒక మనిషి కూర్చోడానికి సరిపోయేంత చాపను చదర అంటారు. కొండను చదర బెట్టడం అంటే సమతలం చేయడం. అలా చేస్తే తప్ప సేద్యం చేయడానికి పనికి రాదు. అలా చేశాక ఉలవ చల్లినట్టు అనడంలో వుద్దేశ మేమిటి? ఉలవే ఎందుకు చల్లాలి? కొండనే ఎందుకు చదరబెట్టాలి. ఇవి తెలుసుకోవలసిన విషయాలు. చివరలో 'నట్లు' అని అనడం వల్ల ఒకప్పుడు చేయబడి, ఈనాడు అది అనవసరమైనదని తెలుస్తోంది.

ఉలవ అన్నింటిలోకి నాసి రకం పంట. ఇది ఎటు వంటి పొలంలోనయినా పండుతుంది. పై సామెత ఆధా రంగా "ఉలవ కాని పొలం ఊసర క్షేత్రం" అని మరో సామెత ఉద్భవించడం కనిపించింది. ఉలవ కూడా పండని పొలం ఏదయినా వుంటే అందులో ఊసర్లు తిరుగు తాయే తప్ప ఇంక దేనికి పనికిరాదు అని అర్థం. దీనిని బట్టి ఉలవ ఎటువంటి భూమిలోనయినా పండుతుంద నేది తెలుస్తుంది. ఉలవ ఎక్కడైనా పండుతుందనే సామాన్య విషయాన్ని అందరికి తెలియదు. ఇంకా చారిత్రకంగా విశ్లేషణ చేస్తే, 'కొండను చదరబెట్టి' అంటే కొండ ప్రదేశాలలో నేల సారవంతంగా వుండదు. రాయి రప్పతో వుంటుంది. అయినా ఆ ప్రాంతాలలో నివసించిన మానవులు ఆ కొండలలోనే చదునయిన ప్రదేశాలు చూసి

BHAVAVEENA
Vol. 16, Issue. 4, April - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

వ్యవసాయం చేసేవారు. వ్యవసాయం ప్రారంభించిన నూతన శిలాయుగ జనావాసాలు అనుకూలమయిన రాళ్ళు దొరికే కొండలలోనూ నదీ తీరాలలోనూ వున్నట్లుగా చారిత్రకులు కనుగొన్నారు అన్న విషయాన్ని బట్టి చూస్తే సామెతకు ఎంతో ఆధారం ఉంటే తప్ప లోకంలో చెల్లు బాటుకావని అర్థమయ్యింది.

నూతన శిలాయుగ జనావాసాలూ, బృహత్ శిలా సంస్కృతి జనావాసాలూ రాగి, వులవ పంట భూములూ ఒక్క చోటనే వున్నట్లు తెలుసుకోవడం వల్ల నూతన శిలాయుగంలో మానవులు ఉలవ, రాగులూ పండించే వారని చారిత్రకులు నిర్ధారించారు. ఇవి బళ్ళారి జిల్లాలోని తెక్కలి కోట వద్ద, అనంతపురం జిల్లాలోని పాలవాయి వద్ద జరిపిన త్రవ్వకాలలో బయటపడ్డాయి. దక్షిణ భారత దేశంలో పూర్వం వ్యవసాయదారుల ప్రధానాహారం ఈ రెండు పంటలూనూ, కాబట్టి మానవ జీవితారంభంలో కొండను చదును చేసి ఉలవలు పండించే వారన్నది ఇందులో వున్న ధర్మసూక్ష్మం. తన అనుభవాన్ని మానవుడు మరచిపోలేదనడానికి ఈ సామెత నిదర్శనంగా కనిపించింది.

ఇంకో సామెత "ఉత్తర చూచి ఎత్తరగంప, విశాఖ చూచి విడువర కొంప"5. వ్యవసాయ సంబంధమైన ఈ సామెతలో రైతుల జీవన చిత్రణ కనిపిస్తుంది.

మృగశిర కార్తెలో వానలు ప్రారంభమవుతాయి. వాన ప్రారంభం కాగానే రైతు వ్యవసాయపు పనులు ప్రారంభిస్తాడు. ఏ కారణం చేతనయినా ఆ కార్తెలో వాన పడక పోతే ఆ తరువాత వరుస కార్తెలలో వాన కోసం ఎదురు చూస్తాడు. ఉత్తర కార్తెలో వాన ఉలవ పంటకు అదను. ఉలవ చివరి పంట. ఆ కార్తెలో కూడా వాన పడకపోతే వ్యవసాయానికి అదను పూర్తయినట్టే. ఆ తరువాతి వాన ఏ పంటకూ అనుకూలం కాదు. అంటే ఆ ఏడు కరువు తప్పదు.

"ఉత్తర హస్తలు వృష్టికి ప్రమాణం"

ఈ కార్తెలలో పడిన వానను బట్టి ఆ ఏడు అతివృష్టా, అనావృష్టా, సామాన్య వృష్టా అనేది రైతు చెప్పగలిగేవాడు. అతివృష్టయినా, అనావృష్టయినా నష్టం వొకటే. అందుచేత సంసారాన్ని గంపలో సర్దుకోమన్నాడు. అంటే ఆనాటి రైతు సంసారమంతా కూడేసినా గంపను మించి ఉండేది కాదు. విశాఖ కార్తె కూడా చూచి అప్పటికీ వాన లేకపోతే కొంప వదిలిపెట్టమన్నాడు. ఆనాటి రైతు బ్రతుకు పూర్తిగా వర్షం మీదే ఆధారపడి వుందని ఈ సామెత వల్ల స్పష్టంగా తెలుస్తోంది.

మరో వ్యవసాయ సంబంద సామెతలో చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే రైతుల జీవితం అర్ధంచేసుకోవచ్చు.

"రాగుల రాయి తిరుగుతూ వుంటే రాజ్యమంతా చుట్టాలే" అనేది సామెత.

రైతు ఇంటికి వచ్చిన చుట్టాలకు కూడా రాగుల పిండితో చేసిన ఆహారమే పెట్టేవాడని ఈ సామెత వల్ల తెలుస్తోంది. అది పుష్కలంగా వుంటే సంపన్నుడి కిందే లెక్క. అటువంటి వాడికి చుట్టాలు అధికంగా వుంటారని అందుకే ఈ సామెత వచ్చిందని గ్రహించవచ్చు. అనుభవమే సామెతల రూపంలో ఉంటుందనడానికి ఈ సామెతను ఉదహరించారనిపించింది.

మరో సామెత "పచ్చకామెర్లకు పలచని మజ్జిగయే పథ్యం"లో మానవుని సంపూర్ణ జ్ఞానాన్ని తెలియజేసే విధంగా ఈ సామెతను గుర్తించవచ్చు. ప్రాచీన కాలంలో ఆయుర్వేద వైద్యానికి ఎంతో ప్రాధాన్యత ఉండేది. ఆ వైద్యం అంతా అనుభవపూర్వకంగా వచ్చినదే. పెద్దలు ఆచరించిన తరువాత తరానికి అందించిన ఆయుర్వేద విద్యలో అపారమైన జ్ఞానం దాగి ఉందని చెప్పడానికి ఈ సామెత "ఔషధం కానిది అవనిలో లేదని" సామెతను కూర్చారు. దీనికి లోక వ్యవహారంలో ఒక చక్కని కథ కూడా ఉంది.

ఒక గురువు వద్ద వైద్యం నేర్చుకుంటున్న శిష్యుడు ఉంటాడు. తన వైద్య విద్య ఎప్పుడు పూర్తవుతుందని గురువు గారిని అడుగుతాడు. అందుకు గురువుగారు శిష్యుడికి పరీక్ష పెడతాడు. ఈ 'అడవి అంతా వెదికి వైద్యానికి పనికిరాని ఆకును వారం రోజుల్లోగా తీసుకు రమ్మని చెబుతాడు. ఆ శిష్యుడు వారం రోజుల పాటు

అడవి అంతా వెతుకుతాడు. ఎక్కడా వైద్యానికి పనికిరాని ఆకును సంపాదించలేక పోతాడు. తన వైద్య విద్య పూర్తి కాలేదని నిరాశపడతాడు. అదే విషయం గురువుగారితో చెప్పగా గురువు సంతోషపడి అతడి విద్య పూర్తయినదిగా చెబుతాడు. అసలయిన వైద్యునికి వైద్యానికి పనికి రానిది ప్రపంచంలో కనిపించదని అదే అతని సంపూర్ణ జ్ఞానానికి నిదర్శనమని చెబుతాడు.

ఏ సామెత అయినా అనుభవ పూర్వకంగానే సమాజంలో ఉచ్ఛరిల్లుతుందని ఈ సామెత బట్టి అర్థమవు తుంది. సామెత ఏర్పడే విధానంలో ఏదో ఒక నేపథ్యం కనపడుతూనే ఉంది. అయితే ఇదంతా మనిషి జ్ఞానానికి సంబంధించినదే. మనిషి ప్రాచీన కాలంలో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి లేని కాలంలో తనకు తానుగా ప్రయోగాలు చేసి వాటి ఫలితాలను సమాజానికి అందించే వారు. ఆ కోణంలో అవి సామెతల రూపంలో దాల్చు కోవడం గమనించవచ్చు.

"పూటకూళ్ళమ్మ పుణ్యమెరుగదు"

ఈ సామెత చారిత్రక నేపథ్యాన్ని స్వభావోపేతంగా ఉంది. ఈ పూటకూళ్ళు అనే వాటికి ప్రాచీన కాలం నుండి నిన్న మొన్నటి వరకూ ఎంతో ప్రాధాన్యం ఉండేది. కూలీల దగ్గర నుండి మహారాజుల వరకూ భోజనాలు పూటకూళ్ళ రూపంలో తీసుకెళ్ళేవారు. సాహిత్యంలో కూడా వీటి ప్రస్తావన చాలా చోట్ల ఉంది. పూటకూటిళ్ళు కాకతీయుల కాలం నుండి ఉన్నట్లు 'క్రీడాభిరామం' వల్ల తెలుస్తోంది. 'పూటకూళ్ళమ్మ' అని వ్యవహరించడం వల్ల స్త్రీలే ఈ వృత్తిని అవలంబించే వారని గ్రహించవచ్చు. కార్యార్థమై నగరానికి వెళ్ళే వారు ఈ పూటకూళ్ళలో భోజనం చేసేవారు. అయితే 'పుణ్యమెరుగదు' అనే పద ప్రయోగం గురించి పరిశీలిస్తే, అన్నం పరబ్రహ్మస్వరూపంగా హిందువులు భావిస్తుంటారు. కాబట్టే అతిథి అభ్యాగతులకు అన్నం పెట్టడం పుణ్యకార్యంగా గృహస్థులు భావించే వారు. అటువంటి అన్నాన్ని అమ్ముకోవడం పాపకార్యంగా పెద్దలు తెలియజేసేవారు. కాకతీయుల కాలంలో ఈ పూట కూళ్ళల్లో భోజనం చాలా బాగుండేదని 'క్రీడాభిరామం'లో వర్ణిం చారు. అక్కడ ఒక రూకకు షడ్రసోపేతమైన భోజనం దొరికేదని సాహిత్యంలో ఈ ప్రస్తావన ఉంది.

"కప్పుర భోగి వంటకము
కమ్మని గోధుమ పిండి వంటయున్
గుప్పెడు పంచదారయును
క్రొత్తగ కాచిన యాలనే పెసర
పప్పును, గొమ్ము నల్ల నటి
పండ్లును, నాలుగు నైజునంజులున్
లప్పలతోడ క్రొంబెరుగు
లక్ష్మణ వజ్జుల యింట రూకమున్" అని క్రీడాభిరామం

లోని భోజన వసతిని గురించి వర్ణన. దీన్ని బట్టి ఆ నాడు కేవలం వ్యాపార సరళిలో పూటకూటిళ్ళు నడపబడలేదని కూడా తెలుస్తోంది.

ఇదే ప్రస్తావన ఆముక్తమాల్యదలో కూడా ఉంది. దీనిలో "అక్కల వాడటి నరకూళ్ళ మెక్కి" అని చెప్ప బడిందట. పూర్వం రక్త సంబంధం లేని స్త్రీలను కూడా పేర్లు పెట్టి పిలిచేవారు. పూటకూటిళ్ళలో అన్నం పెడతారు. అన్నం పెట్టేవారు తల్లితోనూ, అప్పచెల్లెళ్ళతోనూ సమానులు. అందుచేత పూటకూటిళ్ళు వున్న వీధులను అక్కలవాడ అనే పిలిచేవారని ఆముక్తమాల్యద పద ప్రయోగం బట్టి తెలుస్తుంది.అలాగే 'నరకూళ్ళు మెక్కి' అనే పదాన్ని ప్రయోగించారు. అంటే హితం కాని అన్నం లభించడం చేత సగం కడుపుగానే తిన్నారని సురవరం ప్రతాపరెడ్డిగారు ఆంధ్రుల సాంఘిక చరిత్రలో తెలియ జేశారు. దీనిని బట్టి విజయనగర కాలానికి పూటకూళ్ళు పక్కా వ్యాపార సరళిలో నడుపబడేవని అర్థమవుతోంది.

అలాగే "ఆడ పెత్తనం, తంబళ్ల దొరతనం" అని సామెత ఉంది.

ఇది 'పల్నాటి చరిత్ర'లోనిది. శైవ వైష్ణవ మతాల మధ్య ఘర్షణ జరుగుతున్నప్పుడు వొకరినొకరు అవహేళన చేసేటందుకు బయలుదేరిన సామెత ఇది. తంబళ్ళు శాస్త్రజ్ఞానం లేని శూద్రులవడం వల్ల దాన్ని ఆధారం చేసుకుని ఈ విధంగా హేళన చేసి ఉండొచ్చు. పల్నాటి చరిత్రలో నాయకురాలు నాగమ్మ స్త్రీ. పైగా శైవ మతాభి

మాని. స్త్రీకి పెత్తనం యిచ్చినా, పాలనాదక్షత లేని తంబళ్ళ దొరతనం వచ్చినా సర్వనాశనం జరుగుతుందనే భావం ఇందులో వుంది.

"నంబి పుణ్యాన పెళ్ళి ముగించినట్టు" అని మరో సామెత.ఈ సామెత ఎలా రూపుదాల్చుకుందో సవివరంగా పరిశీలిస్తే వైష్ణవాలయాల్లో అర్చకులను 'నంబు' లంటారు. మత ద్వేషాలధికంగా వున్న కాలంలో, ముఖ్యంగా దేశంలో శైవమతం ఆధిపత్యంలో వున్న సమయంలో తిరుచూర్ణం ధరించిన నంబి ఎదురయితే శివారాధకులు భరించలేక పోయేవారు. నంబి ఎదురయితే నాగుపాము ఎదురు పడినట్లు బెదరుకునేవారు. అది క్రమేపీ ఒక నమ్మకానికి దారి తీసింది. నంబులు ఎదురుపడితే దుశ్శకునంగా భావించే పరిస్థితికి ప్రజలు చేరుకున్నారని, ఏ ఇతర పనుల మీద వెళ్ళేటప్పుడు గాని నంబులు ఎదురు రాకుండా చూసుకునేవారు. నంబి ఎదురుపడకపోవడం వల్లే పెళ్ళి సవ్యంగా జరిగిందనే భావం నాటుకుంది.

మూఢవిశ్వాసాలకు సంబంధించిన పై సామెతలాగే క్రింద సామెత కూడా అటువంటిదే.

"నంబీ నంబీ నా పెళ్ళి కేమి సాయం చేస్తావంటే, నేను ఎదరు రాక పోవడమే సహాయమన్నాడట" అనేది పై సామెత వల్లనే పుట్టింది.

ఇలా అనేక పనులలో అనేక పరిస్థితులలో ఎదుర యిన విషయాలతో తన అనుభూతులను జత చేసి చెబుతున్న మానవుడు కేవలం లౌకికమయినవేగాక నీతిని జతపరిచిన తాత్విక సామెతలనూ చెప్పాడు.

మానవజీవితానికి సంబంధించిన సామెతలను అధ్యయనం చేసే క్రమంలో ధర్మం, నీతి మొదలైన అంశాలకు సంబంధించిన వాటిని కూడా లోతైన పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది. అటువంటిదే ఈక్రింది సామెత.

"పంచాంగాలు చింపేస్తే నక్షత్రాలు రాలిపోతాయా?"

నక్షత్రాల పరిభ్రమణం ఆధారంగా పంచాంగాలు వ్రాయబడ్డాయి. విజయనగర పతనం తరువాత మహ మ్మదీయ సేనల అఘాయిత్యాలు అధికమయ్యాయి. దేవాలయాలను ధ్వంసం చేశారు. విగ్రహాలను నాశనం చేశారు. బ్రాహ్మణులను హింస పెట్టారు. హిందూ మత సంబంధమయినవేవీ జరుపరాదని ఆజ్ఞాపించారు. ఇటువంటి భౌతిక నాశనం చేసినంత మాత్రాన మతం నశించదని చెప్పడం కోసం ఈ సామెత బయలుదేరింది. నక్షత్రాలు దాటి గతులు ప్రకారం తిరుగుతూంటాయి. పంచాంగాలు చింపేస్తే మళ్లీ వ్రాసుకోవచ్చు. అవి

చింపిసినంత మాత్రాన గ్రహగతులు ఆగిపోవని భావం.

మరో వివరణ పరిశీలిస్తే, జవాబులు లేని ప్రశ్నలు ఎన్నో మనకు తారసపడుతుంటాయి. వీటికి పరిష్కారం దొరకదు. అటువంటిందే ఈ సామెత. "విత్తు ముందా చెట్టు ముందా?"

విత్తు వేస్తే చెట్టు వస్తుంది. చెట్టు ఎదిగి కాయలు కాసి పండి అందులో నుండి మళ్ళీ విత్తు తయారవు తుంది. ఇలా పునరావృతమవుతూ జాతిని అభివృద్ధి చేస్తుంది. అయితే ఆదిలో చెట్టు ముందువచ్చి విత్తు పుట్టిందా, విత్తు పుట్టి అందులో నుండి చెట్టు మొలి చిందా.. ఇది వేదాంతాన్ని సూచించే సామెత. సత్యం తేలని, పరిష్కారం లేని సమస్యలను దీనితో పోలుస్తారు.

"నీరు పల్లమెరుగు, నిజము దేవుడెరుగు"

ఏదయినా విషయం గురించి తలొక నిజం తెలియ జేస్తున్నప్పుడు అసలు విషయం ఎవరికీ తెలియనప్పుడు ఈ సామెత వుపయోగిస్తారు.

"నారు పోసినవాడు నీరు పోయడా?" అని సామెత.

విత్తనాలను ముందుగా ఒక చిన్న మడిలో ఒత్తుగా చల్లి మొలిపించుటను నారు అంటారు. ఇందులో మొక్కలు కొన్ని వారాలు ఎదిగిన తర్వాత పీకి అసలు మడిలో నాటుతారు. ఇలా నార్లు పోసే పద్ధతిని వరికి మాత్రమే అధికంగా అనుసరిస్తారు. వరికయినా ఈ పద్ధతిని ఈస్టిండియా కంపెనీ స్థాపించబడి వరి సాగుబడి అధికమయిన తరువాతే అలవాటులోకి వచ్చింది. అంతకుముందు గొర్రు ద్వారా విత్తేవారు. అలవాటులోనికి వచ్చింది. అంటే ఈ సామెత మూడు వందల సంవత్సరాల నాటిదని తెలుస్తోంది.

విజయనగర పతనం తరువాత దేశం అల్లకల్లోల మయింది. రెండు వేల సంవత్సరాల నుండి అవిచ్ఛిన్నంగా నడుస్తున్న స్వయం సంపూర్ణ గ్రామ వ్యవస్థ భగ్నమైంది. గృహ పరిశ్రమలు చేతి వృత్తులు శిథిలమయ్యాయి. ఆర్థిక వ్యవస్థ శిథిలమవడం వల్ల పాత సమాజం విరిగి పోయింది. బ్రిటిషు వారి ఆక్రమణలు, మహమ్మదీయ సేనల దాడులు ప్రజల్ని స్థిరంగా వుండనీయలేదు. తిండికీ, గుడ్డకూ కరువు ఏర్పడింది. జీవనోపాధి ఎలా ఏర్పరచుకోవాలో తెలియని స్థితి బయలుదేరింది. అటు వంటి సమయంలో దేవుడ్ని తలచుకుని ప్రజలు ఆత్మ విశ్వాసం పొందడానికి ప్రయత్నించారు. ఆ ప్రయత్నమే ఈ సామెత.

నారు పోసిన తరువాత మొలకల పెరుగుదల కోసం రైతు శ్రద్ధగా మడికి నీరు కట్టి, కలుపుమొక్కలను పీకి పాటుపడతాడు. ఆ విధంగానే మనుషులను కలుపు మొక్కలను సృష్టించిన దేవుడు జీవనాధారం కల్పించక పోడని అర్థం.

"నీటి కొలది తామర" తామర తూడు నీటిలో ఎదుగు తుంది. నీరు ఎక్కువగా వుండి విశాలంగా పరచుకున్న కొలదీ తామర విస్తరిస్తుంది.

"పది మంది నడిచింది బాట, పది మంది పలికింది మాట"

పది మంది అనేది స్పష్టమయిన అంకె కాదు. ఎక్కువ మంది ఒకే దారిన నడుస్తూ వుంటే ఆ దారిలో గడ్డి మొలవదు. కాలిబాట ఏర్పడుతుంది. అలాగే పది మంది చెప్పిన మాటనే అందరూ అంగీకరిస్తారు. ఇది ఆనాటి సమిష్టి జీవనాన్ని తెలియజేస్తుంది. వారికి వ్యక్తి బ్రతుకులు లేవు. వ్యక్తిగత సమస్యలు లేవు. వారి బ్రతుకులు, సమస్యలు అన్నీ సమిష్టివి. అందుచేత పదిమందీ ఏది నిర్ణయిస్తే అదే అనుసరిస్తారు.

"యదార్థ వాదీ లోకవిరోధి"

యదార్థం చెప్పకపోవడమనేది సామెత స్వభావం కాదు. సత్యాన్ని సూటిగా వెల్లడించడం సామెత లక్షణం గాని అలా వెల్లడించడం వల్ల సత్యం చెప్పినవాడు లోకానికి విరోధి అయిపోతాడు. ఇది కూడా సత్యమే.

"చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవా?"

ఏదయినా ఒక పనిని చేసినప్పుడు ఆ పనిని బట్టే ఫలితం వస్తుందని, కొద్ది పని చేసి అధిక ఫలాన్నాశించ రాదని ఇది తెలియజేస్తోంది.

ఈవిధంగా సామెతలను పరిశీలిస్తే, అన్ని సామెతలు మానవుని జీవితంతో ముడిపడి ఉన్నాయని గ్రహించ వచ్చు. అంతే కాకుండా సమాజపునర్నిర్మాణంలో ఈ సామెతల వెనక ఉన్న సాంఘిక నేపథ్యం ఎంతగానో ఉపయోగపడుతుందని నా అభిప్రాయం.

**ఆధారగ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య చరిత్ర- డా॥ ద్వానా. శాస్త్రి
2. విమర్శా సిద్ధాంతాలు, సూత్రాలు - ఆచార్య వెలమల సిమ్మన్న
3. తెలుగు సామెతలు - పి. రాజేశ్వరరావు
4. జానపద సాహిత్యం మానవతా దృక్పథం - గరికపాటి చంద్రశేఖర్
5. తెలుగు సామెతలు: సాంఘిక చరిత్ర- పి.సరళాదేవి.
6. సాహిత్యం: మానవ సంబంధాలు- డా॥ పులపర్తి శ్రీనివాసరావు.

BHAVAVEENA
VOL. 16, ISSUE. 4, April - 2019.
ISSN NO. : 2456-4702 - RNI NO. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# అక్కమహాదేవి వచనప్రాశస్త్యం

**డాక్టర్ మఠపతి మాంతయ్య,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (తెలుగు)
డాక్టర్ బి.ఆర్.ఆర్. ప్రభుత్వ కళాశాల, జడ్చర్ల.

**ఉపోద్ఘాతము :** యుగయుగాలలో మానవ జీవన విధానములో ఒకజాతి గాని, ఒక వర్గముకాని, ఆధిపత్యధోరణితో మిగతా జాతులను, వర్గములను హీనంగా చూస్తూ, అణచివేత ధోరణతో వ్యవహరించిన వారిని సన్మార్గవర్తకులుగా తీర్చిదిద్దుటకు మహనీయులు, మానవతామూర్తులు ఉద్భవిస్తారు. వారు జీవించినకాలం మానవుల జీవన శైలిని మార్చి తద్వారా సమాజంలో సుఖశాంతులు నెలకొల్పుటకు ప్రయత్నిస్తారు.

పన్నెండవ శతాబ్దంలో సమాజంలోని అసమానతలు రూపుమాపడానికి బసవేశ్వరాది శివశరణులు కారణజన్ములుగా ఉద్భవించారు. వారందరు శ్రమైకజీవన సౌందర్యాన్ని ఆరాదిస్తూ, తాము చేస్తున్న వృత్తులను ఆదరిస్తూ భావితరాలకు పథనిర్దేశ్యం చేశారు. కాయకమే కైలాసమని ప్రభోదించి, ఆనాటి సమాజములోని సోమరితనమును పూర్తిగా తుడిచిపెట్టె ప్రయత్నం చేశారు.

వీరశైవ ధర్మ జాగృతి చైతన్య ప్రదీపకులై వెలుగొందిన బసవేశ్వరాది శిశశరణులే కాకుండా అక్కమహాదేవి వంటి శివశరణీ మణులు కూడా ఉన్నారు. వారందరూ చిరస్మరణీయులే కాదు ప్రాత:స్మరణీయులు కూడా.

అక్కమహాదేవి పన్నెండవ శతాబ్దంలో యావత్ మహిళా ప్రపంచానికి చైతన్య దీప్తిని ప్రభోధించడానికి ఉడుతడిలో జన్మించిన ఉత్తమ వనిత. అక్కమహాదేవి జీవితమంతా స్రీలకు మార్గదర్శనం. పురాణములలో అక్కమహాదేవిని పార్వతీమాత యొక్క చిత్కళగా అభివర్ణించినప్పటికీ, ఆమె దైవీగుణములు కల్గియుండి కూడా, మానవీయ విలువలను వచనాల ద్వారా ప్రభోదించిన మానవతామూర్తి.

అక్కమహాదేవి జీవితము, బాల్యం, కౌశికుని ధిక్కరించుట, వైరాగ్యనిధియై అనుభవమంటపములో అల్లమాప్రభుదేవర అడిగిన ప్రశ్నలకు సమాధ్యానములిచ్చుట, శ్రీశైల క్షత్రములోని కదళీవనములో తపస్సుచేసి, తాను కోరిన చెన్నమల్లికార్జునునిలో ఐక్యమగుట తదితర అనేక విషయములు ఇతర వ్యాసములలో రచయితలు వివరించినందువలన ఈ వ్యాసంలో అక్క మహాదేవి వచనముల విశ్లేషణ, వచనాలలో గల భావ సమృద్ధి తదితరాంశములు చర్చించబడుతుంది.

**భక్తస్థల వచనములు**

1.నేల మరుగుననున్న నిక్షేపమువలె
ఫలము మరుగుననున్న రుచివలె
శిలల మరుగుననున్న హేమమువలె
తిలల మరుగుననున్న తైలమువలె
తరువు మరుగుననున్న తేజమువలె
భావము మరుగునున్న బ్రహ్మమైయున్న
చెన్నమల్లికార్జునుని ఉనికి తెలియరానిది.

2.నిన్ననే నెరుగక మున్ను నీవెందుంటివో తెలుపుమయ్యా
సువర్ణమందలి వర్నమువలె
నాయందు నీవుంటివయ్యా!
అయ్యా! నాయందుండియు
కనిపించని భేదము నీయందుగంటి
కనుమా చెన్నమల్లికార్జునా!

3.పాలయందు నెయ్యివేరు కాగలదా?
సూర్యునికాంతి యందున్న యగ్నినెవరు
వేరుపరచగలరు?
అపారమహిమా, చెన్నమల్లికార్జునా!
నీవునాయందు కూడియున్న విధమును
వేరుగా నిదేజూచి కన్నుదెరచితినయ్యా

పై వచనములను పరిశీలించినచో అక్కమహాదేవి భావనావీచికలు మల్లికార్జునునిపై ఎంత ప్రబలముగా ఉన్నవో విశదమవుతుంది. పాలలో నెయ్యి ఉన్న విధముగా, నేలమరుగులో నిక్షేపములుదాగి ఉన్న విధముగా, సువర్ణములో దాగియున్న వర్ణమువలె తన భావంలో, శరీరంలోని అణువణువులో చెన్నమల్లికార్జునుడే ఉన్నాడని భక్తిభావనతో పలికిన వచనములివి.

అక్కమహాదేవి వచనములో జ్ఞాన సంపద

అక్కమహాదేవి సాంసారిక జీవనమును పరిత్యజించి, చెన్నమల్లికార్జునుడే తన భర్త అని భక్తిభావావేశముతో అనేక వచనములు పలికినప్పటికీ, అందులో జ్ఞాన సంబంధమైన విషయం కోకొల్లలుగా ఉన్నాయి.

ధనమునకాశించి వచ్చువారెల్ల
తియ్యనిమాటలాడుదురేగాని తప్పులదెలుపుదురా?
మనసుపైదీసుకొని నిలిచి కోపించి చెప్పి
సన్మార్గమునుజూపునతడే బంధు
అటులగాక వారిమాటలనే ఔనని
తనకడుపు నింపుకొను కపటవాదుల
మెచ్చునా చెన్నమల్లికార్జునుడు

ఈ వచనంలో లోకవ్యవహారజ్ఞానమెంతగానో కనిపించుచున్నది. కోపించినప్పటికీ, మాట్లాడి, మనల్ని సన్మార్గం వైపు నడిపించేవాడే నిజమైన బంధువు కాని, తనపని పూర్తి చేసుకొని లేదా ధనమును సునాయాసముగా సంగ్రహించడానికి తియ్యగా మాట్లాడి, మనల్ని తప్పుదోవ పట్టించేవాడు నిజమైన బందువు కాడు అనే విషయముపై వచనములో నిబిఢీకృతమైయున్నది.

మరొక వచనములో

పండ్ల తిన్న తదుపరి ఆచెట్టు నెవరు నరికిననేమి?
ఆడదాన్ని విడిచిన పిదప ఆమెనెవరు కూడిననేమి?
సారముడిగిన చేను నెవరుదున్నిననేమి?
చెన్నమల్లికార్జునుని తెలియకున్న
ఆ కాయము నేమి దిన్ననేమి

ఈ వచనములో దర్మగర్భంగా 'మానవ జీవన సారము' వడబోసినట్లుంది. చెన్నమల్లికార్జునుని చేరని శరీరము వృథా అనే వచనము ప్రస్ఫుటంగా తెలియజేస్తుంది.

రేపురానున్నది మనకు నేడేరాని
నేడే రానున్నది మనకిప్పుడేరాని
అప్పుడిప్పుడనకుమా చెన్నమల్లికార్జునా!

అని ధైర్యముగా తన జీవనమును సాఫల్యము చుసుకొన్న ధీరవనిత. వైరాగ్యనిధి, భక్తిజ్ఞానసంపన్నురాలు అక్కమహాదేవి పలికిన ప్రతి వచనం అనుసరణీయం, ఆచరణీయం. అందుకే అక్కమహాదేవిని అల్లమాప్రభు ఈ విధంగా ఒక వచనంలో ప్రస్తుతించాడు.

అంగ గుణము నాస్తియై లింగసంగియైనది
మనోగుణమునాస్తియైనది జ్ఞాన సంగియైనది
భావగుణము నాస్తియై మహాప్రభాతానైనది
నేను నీవను భేదముడిగి మా గుహేశ్వర లింగమందు
స్వయంలింగమైన మహాదేవి అక్క
నిలువునకు శరణనుచుంటిని"

**ముగింపు :** అక్కమహాదేవి వచనములు ఎంతటి శ్రస్తి కలిగినవో చెన్నబసవేశ్వరుని వచనం ద్వారా గమనించవచ్చు.

"ఆద్యుల అరవై వచనములకన్న
దండ నాయకుని ఇరవై వచనములు
దండనాయకు ఇరవైవచనములకన్న
ప్రభుదేవుని పది వచనములు
ప్రభుదేవుని పదివచనములకన్న
అజగన్నగారి ఐదు వచనములు
కూడల చెన్నసంగమయ్యయందు
మహాదేవి అక్కగారి ఒక్క వచనము
నిర్వచనము చూచితివా- సిద్ధరామన్నా" అని

చెన్నబసవేశ్వరుడు అక్కమహాదేవి వచనములను ప్రస్తుతించాడు.

**ఆధారగ్రంథాలు**

1. అక్కమహాదేవి వచనములు - రేకళిగె మఠంవీరయ్య ప్రచురణ: తెలంగాణ సాహిత్య అకాడమీా 1982.
2. అక్క మహాదేవి పలుకు - డా॥ వేంపల్లిగంగాధర్.

★★★

భావ వీణ BHAVA VEENA

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

Journal of Telugu Literary, Culture & Language Study

April 2019

తెలుగు సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక




Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.